

'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 229

గురువారం 10-11-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



పాక్ విజయహాసం

టి20 ప్రపంచకప్ సెమీస్‌లో కివీస్ ఓటమి


7 వికెట్లతో గెలిచిన పాకిస్తాన్ - 12లో



హేమాహేమీల సెమీస్

నేడు ఇంగ్లండ్‌తో భారత్ ఢీ..

జోరుమీదున్న ఇరు జట్లు - 12లో



నీరవ్ అప్పగింతకు గ్రీన్‌సిగ్నల్!

పీఎన్‌బీను మోసగించడంతోపాటు మనీ లాండరింగ్‌కు పాల్పడిన నీరవ్‌ను భారత్‌కు అప్పగించేందుకు యూకే కోర్టు అంగీకరించింది.


వివరాలు 6లో



బ్రిటన్ మంత్రి రాజీనామా

బ్రిటన్ కేబినెట్ మంత్రి సర్ గవిన్ విలియమ్‌సన్‌పై బెదిరింపు ఆరోపణలు వెల్లువెత్తడంతో ఆయన రాజీనామా చేశారు.

వివరాలు 6లో



గవర్నర్ వర్సెస్ ప్రభుత్వం

వర్సిటీల చాన్సలర్ పోస్టు నుంచి కేరళ గవర్నర్‌ను తొలగింపునకు ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

వివరాలు 6లో



తెలుగు మహిళ రికార్డు

అమెరికాలో తెలుగు మహిళ అరుణ మిల్లర్ చరిత్ర సృష్టించారు. మేరీల్యాండ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఎన్నికయ్యారు.

వివరాలు 6లో

ఏది నిజం?

తప్పుడు లెక్కలకే రామోజీ 'పెద్దపీట'

- దీర్ఘకాలంగా పనిచేస్తున్న 53 మంది డీఎస్పీలను బదిలీ చేసిన ప్రభుత్వం
- కానీ 30 మందిలో 11మంది ఒకే సామాజిక వర్గమంటూ 'ఈనాడు' వక్రభాష్యం
- మిగిలిన 20 మందిని కూడా ప్రస్తావిస్తే తమ లెక్కలు తప్పవుతాయనే... కుట్ర
- డీఎస్పీలను ఒకచోటి నుంచి మరో చోటికి బదిలీ చేస్తే... పదోన్నతులిచ్చినట్లు వక్రీకరణ
- ఒక స్థానంలోకి అదే సామాజిక వర్గం వారు వచ్చినా 'పెద్దపీట' అంటూ తప్పుడు రాతలు
- ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు మారినా ప్రాధాన్యం ఇచ్చారంటూ కారుకూతలు

- వివరాలు 4లో

ఢిల్లీలో ఆర్బీకే కియోస్కుల సేవలను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే



దేశ వ్యాప్తంగా ఆర్బీకేలు

దశల వారీగా అమలుకు కేంద్రం చర్యలు

రైతన్నలకు అండగా ఉండేలా ఆర్బీకేలను నెలకొల్పిన సీఎం జగన్

- వీటి ద్వారా వ్యవసాయంలో అన్నదాతకు సహాయ సహకారాలు
- డిజిటల్ కియోస్కుల ద్వారా రైతు ఇంటి ముంగిటకే ఇన్‌పుట్స్
- ఇతరత్రా వ్యవసాయ సేవలూ అందిస్తున్న రైతుభరోసా కేంద్రాలు
- గ్రామాల్లోనే పంట ఉత్పత్తుల కొనుగోలుతో రైతుకు మరింత మేలు
- ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్న వ్యవస్థ.. ఇప్పటికే ఇథియోపియాలో అమలుకు చర్యలు
- ఈ వ్యవస్థ పట్ల పలు రాష్ట్రాల ఆసక్తి
- 5వ ఐఏబీఎస్‌లో ఆర్బీకేలు, డిజిటల్ కియోస్కులే ప్రత్యేక ఆకర్షణ
- దేశవ్యాప్తంగా రైతులకు ఈ సేవలు అందించాలన్న కేంద్రమంత్రి ఫగ్గన్ సింగ్
- డిజిటల్ కియోస్కుల ద్వారా ఇన్‌పుట్స్ బుకింగ్ అద్భుతం.. మధ్యప్రదేశ్‌లోనూ త్వరలో అమలు చేస్తామని వెల్లడి
- డిసెంబరులోగా కియోస్కులు ఏర్పాటు చేయాలని ఆ రాష్ట్ర అధికారులకు ఆదేశం

2లో

మెటాలో 11వేల ఉద్యోగాలు కట్



- టెక్నాలజీ కంపెనీల్లో ఉద్యోగాల కోతలు కొనసాగుతున్నాయి. టెక్ పరిశ్రమకు సవాళ్లు పెరుగుతుండటం, ఆదాయాలు పడిపోతుండటం వంటి పరిణామాల నేపథ్యంలో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా 11,000 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు ప్రకటించింది. మెటా మొత్తం సిబ్బంది సంఖ్యలో ఇది 13 శాతం. ఉద్యోగులకు రాసిన లేఖలో సంస్థ సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ ఈ విషయాలు వెల్లడించారు. ట్విటర్‌లో కోతల పర్వం నడుస్తున్న నేపథ్యంలో మెటాలోనూ ఉద్వాసనలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

13లో

> కోవిడ్ మహమ్మారి తర్వాత కూడా భారీ వృద్ధి ఉంటుందనే అంచనాతో పెద్ద సంఖ్యలో ఉద్యోగులను తీసుకున్నాం. కానీ అనుకున్నట్లు జరగలేదు. ఆర్థిక మందగమనం, పెరిగిన పోటీ, ప్రకటనలు తగ్గడం వంటి కారణాలతో ఆదాయాలు తగ్గాయి. పరిస్థితిని తప్పుగా అంచనా వేశాను. దీనికి బాధ్యుణ్ని నేనే..
>
> - సీఈవో మార్క్ జుకర్‌బర్గ్

జస్టిస్ చంద్రచూడ్‌తో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



సామాన్యుల సేవకే ప్రాధాన్యం

నూతన సీజేఐ జస్టిస్ చంద్రచూడ్

ప్రమాణ స్వీకారం చేయించిన రాష్ట్రపతి

మహాత్మాగాంధీకి నివాళులర్పించి విధుల్లోకి

ప్రధాని మోదీ తదితరుల శుభాకాంక్షలు

2024 నవంబర్ దాకా రెండేళ్లపాటు పదవిలో కొనసాగనున్న జస్టిస్ చంద్రచూడ్

6లో

మాకు ఎవరి సానుభూతి అక్కర్లేదు

ఇప్పటంలో వెలసిన ఫ్లెక్సీలు.. విపక్షాల డ్రామాలతో విసుగెత్తిన గ్రామస్తులు

ప్రభుత్వం మా ఇల్లు కూల్చలేదు. మీ ఎవ్వరి సానుభూతి మాకు అవసరం లేదు. డబ్బులిచ్చి అబద్ధాన్ని నిజం చేయాలని ప్రయత్నించవద్దంటూ ఇప్పటంలో ఇంటికి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



2లో

ఆక్వాలో ఏపీదే అగ్రస్థానం

2019-20లో భారీగా పెరిగిన ఉత్పత్తి విలువ

- దేశంలో రాష్ట్ర ఉత్పత్తి వాటా 38.3%
- 2019-20లో చేపలు, ఆక్వా ఉత్పత్తి విలువ రూ.58,700 కోట్లు
- పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాల వాటా 2011-12తో పోల్చితే 2019-20లో తగ్గుదల
- 2011-12 నుంచి దేశంలో చేపలు, ఆక్వా రంగాల్లో ఉత్పత్తి క్రమంగా పెరిగింది
- కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల మంత్రిత్వ శాఖ నివేదిక వెల్లడి



సాక్షి, అమరావతి : చేపలు, ఆక్వా రంగాల ఉత్పత్తి విలువకు సంబంధించి దేశంలోని టాప్ ఐదు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉంది. 2011-12 నుంచి 2019-20 వరకు రాష్ట్రాల వారీగా చేపలు, ఆక్వా ఉత్పత్తుల విలువ, దేశంలో రాష్ట్రాల వాటాపై కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ ఓ నివేదికను విడుదల చేసింది. దేశంలో చేపలు, ఆక్వా కల్చర్ ఉత్పత్తి 2011-12 నుంచి 2019-20 ఆర్థిక ఏడాది వరకు క్రమంగా పెరుగుతూ వచ్చిందని నివేదిక వెల్లడించింది. రాష్ట్రంలో 2015-16 నుంచి 2019-20 వరకు వాటి ఉత్పత్తి పెరిగితే.. 2019-20లో భారీగా పెరిగినట్లు తెలిపింది. ఇక ఈ ఆర్థిక ఏడాది దేశంలో ఆంధ్రప్రదేశ్ ఉత్పత్తి వాటా 38.3 శాతంగా ఉందని, మిగతా నాలుగు రాష్ట్రాలతో పోలిస్తే ఏపీ వాటా అత్యధికంగా ఉందని పేర్కొంది. అదే 2011-12లో ఆంధ్రప్రదేశ్ వాటా 17.7 శాతం ఉన్నట్లు నివేదిక విశ్లేషించింది. అలాగే, 2018-19 విషయానికొస్తే ఏపీలో చేపలు, ఆక్వా ఉత్పత్తుల విలువ రూ.55,507 కోట్లు ఉండగా.. 2019-20లో రూ.58,700 కోట్లకు పెరిగింది. అయితే..

- పశ్చిమ బెంగాల్ రాష్ట్రం వాటా 2011-12లో 24.6 శాతం ఉండగా అది 2019-20లో 15.9 శాతానికి పడిపోయింది.
- 2011-12లో కేరళ వాటా 5.9 శాతం ఉండగా 2019-20లో 3.2 శాతానికి తగ్గిపోయింది.
- ఒడిశాలో 3.9 శాతం నుంచి స్వల్పంగా 4.9 శాతానికి పెరిగింది.
- అస్సాం వాటా 5.5 శాతం నుంచి 4.4 శాతానికి తగ్గింది.
- తమిళనాడు వాటా 7.1 శాతం నుంచి 5.0 శాతానికి తగ్గింది.

మొత్తం మీద దేశంలో చెరువులు, జలాశయాల్లో చేపలు, సముద్రపు చేపల ఉత్పత్తి విలువ 2011-12 ఆర్థిక ఏడాదిలో రూ.80 వేల కోట్లుండగా.. 2019-20 నాటికి అది రూ.153 వేల కోట్లకు పెరిగినట్లు నివేదిక పేర్కొంది. ఇందులో చెరువులు, జలాశయాల్లో చేపల ఉత్పత్తి విలువ రూ.73 వేల కోట్లుండగా.. సముద్రపు చేపల ఉత్పత్తి విలువ రూ.75 వేల కోట్లని నివేదిక తెలిపింది.

ప్రధాన రాష్ట్రాల్లో చేపలు, ఆక్వా ఉత్పత్తి విలువ పెరుగుదల ఇలా.. (రూ.కోట్లలో)

రాష్ట్రం	2015-16	2016-17	2017-18	2018-19	2019-20	2019-20 వాటా శాతం
ఒడిశా	4,300	5,200	6,100	7,000	7,600	4.9
అస్సాం	5,300	5,500	5,900	6,000	6,800	4.4
కేరళ	5,100	5,100	5,400	6,000	5,000	3.2
తమిళనాడు	6,800	6,300	6,900	7,100	7,700	5.0
ఆంధ్రప్రదేశ్	28,600	36,200	48,100	55,500	58,700	38.3
పశ్చిమ బెంగాల్	22,200	22,500	23,100	24,200	24,300	15.9

మసాలా.. అదిరింది

- రూ.200 కోట్లతో ఐటీసీ గ్లోబల్ స్పైసెస్ పార్కు.. పల్నాడు జిల్లా యడ్లపాడులో 6.2 ఎకరాల్లో ఏర్పాటు
- మిర్చి, సుగంధ ద్రవ్యాల ప్రాసెస్, ఎగుమతి, ఏటా 20వేల టన్నులు సామర్థ్యం
- రేపు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం



సాక్షి, అమరావతి: ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీ ఐటీసీ రాష్ట్రంలో భారీగా విస్తరణ కార్యక్రమాలు చేపడుతోంది. ఇప్పటికే రూ.140 కోట్లతో వెల్‌కమ్ పేరుతో గుంటూరులో ఫైవ్ స్టార్ హోటల్‌ను ఏర్పాటు చేసిన ఈ కంపెనీ.. తాజాగా రూ.200 కోట్లతో అభివృద్ధి చేసిన గ్లోబల్ స్పైసెస్ పార్క్‌ను అందుబాటులోకి తేనుంది. పల్నాడు జిల్లా యడ్లపాడు సమీపంలో సుమారు 6.2 ఎకరాల్లో సుగంధ ద్రవ్యాలను ప్రాసెస్ చేసి, ఎగుమతి చేసే విధంగా గ్లోబల్ స్పైసెస్ పార్క్‌ను

మిగతా 2వ పేజీలో ▶

9 ప్రాజెక్టులు.. రూ. 15,233 కోట్లు



- విశాఖలో ప్రధాని చేతుల మీదుగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- వాటిని జాతికి అంకితం చేయనున్న మోదీ..
- ప్రధాని పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు

2లో

ముందుకొస్తే మీకే ఇస్తాం



- పేదల ఆప్షన్-3 ఇళ్లపై రామోజీకి మంత్రి జోగి రమేశ్ ప్రతిపాదన
- కడుపుమంటతోనే ఈనాడు కథనాలు.. ఆ డబ్బులు చాలవంటారు.. ఎవరైనా చేపడితే సహించలేరు

3లో



పట్టాలు తప్పిన గూడ్స్ రైలు బోగీ

విజయవాడ-విశాఖ మార్గంలో 7 గంటలపాటు రాకపోకలకు అంతరాయం

- తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో బుధవారం గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. దీంతో విజయవాడ-విశాఖ ప్రధాన రైల్వే రహదారిలో ఏడు గంటలపాటు రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

- వివరాలు 14లో



బంగాళాఖాతంలో అల్పపీడనం

- నైరుతి బంగాళాఖాతంలో బుధవారం అల్పపీడనం ఏర్పడింది. దీనికి అనుబంధంగా సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉంది. ఈ ప్రభావంతో గురువారం ఉత్తర కోస్తాలో అక్కడక్కడ, దక్షిణ కోస్తాలో అనేక చోట్ల, రాయలసీమలో కొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. రానున్న 24 గంటల్లో మరింత అల్పపీడనం బలపడనుంది.

2లో

క్లుప్తంగా

సీజేఐకి శ్రీవారి ఆశీస్సులు



తిరుమల: భారత 50వ ప్రధాన న్యాయమూర్తిగా బుధవారం ప్రమాణ స్వీకారం చేసిన జస్టిస్ డీవై చంద్రచూడ్ శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు. న్యూఢిల్లీలో ఆయనకు తిరుమల వేదపండితులు శ్రీవారి ఆశీస్సులను అందించారు. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి కలిసి సీజేఐకి శ్రీవారి తీర్థప్రసాదాలు, టీటీడీ క్యాలెండర్, డైరీ అందించారు.

మాకు ఎవరి సానుభూతి అక్కర్లేదు

- ఇప్పటంలో వెలసిన ఫ్లెక్సీలు

తాడేపల్లి రూరల్: మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఇప్పటంలో ప్రభుత్వం ఇళ్లు కూల్చి వేస్తోందంటూ జనసేన, తెలుగుదేశం నాయకులు వారం రోజులుగా నానా హడావుడి చేశారు. వాస్తవానికి రోడ్డును ఆక్రమించిన వారి ఇళ్లను ప్రభుత్వం ఎక్కడా కూల్చలేదు. కేవలం ప్రహరీ, మెట్లను మాత్రమే తొలగించారు. దీనిని రాజకీయంగా వాడుకుని, లబ్ధి పొందాలని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఇటీవల అక్కడ పర్యటించి హంగామా చేశారు. జనసేన సభకు భూములిచ్చిన వారి ఇళ్లను కూల్చి వేశారంటూ విష ప్రచారం చేశారు. ఆ తర్వాత ఒక్కో ఇంటికి రూ.లక్ష చొప్పున సాయం చేస్తానని ప్రకటించారు. అయితే ఈ వ్యవహారం ఇప్పటం వాసులకు విసుగు తెప్పించింది. 'ప్రభుత్వం మా ఇళ్లను కూల్చ లేదు. మీ సానుభూతి మాకు అవసరం లేదు. డబ్బులు ఇచ్చి అబద్ధాన్ని నిజం చేసే ప్రయత్నం చేయొద్దు' అంటూ బుధవారం ఆయా ఇళ్ల ముందు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

ఇళ్లు కూల్చాం.. తప్పు చేశాం

- మాజీ మంత్రి నారా లోకేశ్



తాడేపల్లి రూరల్: అధికారంలో ఉన్నపుడు తామూ ఇళ్లు కూల్చి తప్పు చేశామని మాజీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. బుధవారం రాత్రి మంగళగిరి – తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఇప్పటంలో ప్రహరీలు కూల్చిన ఇళ్లలోని వారిని పరామర్శించి, బాదుడే బాదుడు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతున్న సమయంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు 2016లో తాడేపల్లి ప్రాంతంలో 235 నివాసాలను తొలగించారని, వారికి ఎటువంటి న్యాయం చేయలేదని ప్రశ్నించగా.. వారికి స్థలం కేటాయించామని సమాధానం ఇచ్చారు. కూల్చివేసిన తరువాత మూడేళ్లు అధికారంలో ఉన్నా వారికి ఎందుకు ఇళ్లు నిర్మించలేదని అడగ్గా.. అది తప్పిదమేనని అన్నారు. ప్రజలకు క్షమాపణ చెబుతున్నానని అన్నారు. 1,500 మంది ఓటర్లు ఉన్న ఈ గ్రామంలో 60, 70 అడుగుల రోడ్డు అవసరమా అని లోకేశ్ అన్నారు. అభివృద్ధి అనేది తెలుగుదేశం ప్రభుత్వంలోనే జరిగిందన్నారు. అభివృద్ధిపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, సైకో ఎమ్మెల్యే సిద్ధంగా ఉన్నారా అంటూ సవాల్ విసిరారు. రాబోయే కాలంలో సైకిల్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, ఆ వెంటనే ఇప్పటం ప్రజలకు ప్రభుత్వం నుండి సహాయం అందజేస్తామని చెప్పారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: నైరుతి బంగాళాఖాతంలో బుధవారం అల్పపీడనం ఏర్పడింది. దీనికి అనుబంధంగా సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉంది. మరోవైపు అల్పపీడన ద్రోణి మధ్య బంగాళాఖాతం నుంచి ఉపరితల ఆవర్తన ప్రాంతం వరకు కొనసాగుతోంది. ఈ అల్పపీడనం రానున్న 24 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉంది. ఇది వాయవ్య దిశగా కదులుతూ 12వ తేదీ వరకు తమిళనాడు, పుదుచ్చేరి తీర ప్రాంతాలకు విస్తరిస్తుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) బుధవారం రాత్రి విడుదల చేసిన బులెటిన్‌లో వెల్లడించింది. ఈ ప్రభావంతో గురువారం ఉత్తర కోస్తాలో అక్కడక్కడ, దక్షిణ కోస్తాలో అనేక చోట్ల, రాయలసీమలో కొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. శుక్ర, శనివారాల్లో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల, ఉత్తర కోస్తాలో కొన్ని ప్రాంతాల్లోనూ మోస్తరు వర్షాలకు ఆస్కారం ఉందని పేర్కొంది. దక్షిణ కోస్తా, రాయలసీమల్లో ఒకట్రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవవచ్చని వివరించింది. అదే సమయంలో ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు కూడా సంభవించే అవకాశం ఉందని తెలిపింది. అల్పపీడనం ప్రభావంతో రానున్న మూడు రోజులు రాష్ట్రంలో తీరం వెంబడి గంటకు 40–45, గరిష్టంగా 55 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, సముద్రం అలజడిగా ఉంటుందని తెలిపింది. తీరాల వెంబడి శనివారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సూచించారు.

మూడు రాజధానులే ముద్దు..

శ్రీకాకుళం జిల్లా టెక్కలి లో భారీ ర్యాలీ



వికేంద్రీకరణకు మద్దతుగా శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండల వాసులు గళమెత్తారు. విశాఖకు పరిపాలన రాజధాని కోరుతూ లింగాలవలస, పోలవరం, రాధావల్లభాపురం, సారవకోట మండలం కేరాసింగి జగన్నాథపురం, కూర్మనాథపురం పంచాయతీలకు చెందిన ప్రజలు భారీ ర్యాలీ నిర్వహించారు. పోలవరం వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఒక్క రాజధాని వద్దు.. మూడు రాజధానులే ముద్దు.. విశాఖ రాజధాని అయితేనే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందంటూ నినదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎంపీపీ సంపతిరావు రాఘవరావుతో పాటు పార్టీ నేతలు, స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు. **- టెక్కలి**

అమెరికాలో లెఫ్టినెంట్ గవర్నర్‌గా కృష్ణాజిల్లా వాసి

వెంట్రప్రగడలో కుటుంబీకుల ఆనందం



వెంట్రప్రగడ (పెదపారుపూడి): కృష్ణాజిల్లా పెదపారుపూడి మండలంలోని వెంట్రప్రగడ గ్రామానికి చెందిన కాట్రగడ్డ అరుణ మిల్లర్ అమెరికాలోని మేరీల్యాండ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఎన్నికయ్యారు. మధ్యంతర ఎన్నికల్లో ఆమె ఘన విజయం సాధించడంతో ఆమె స్వగ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. మిస్సోరీ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో సివిల్ ఇంజనీరింగ్ చదివిన అరుణ మిల్లర్ ట్రాన్స్‌పోర్టేషన్‌లో ఇంజనీరింగ్ స్పెషలిస్ట్. మేరీల్యాండ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా తొలిసారి ఎన్నికైన భారతి సంతతి మహిళగా చరిత్ర సృష్టించారు. అరుణ తండ్రి కాట్రగడ్డ వెంకటరామారావు ఐబీఎంలో పనిచేశారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. వారిలో అరుణ చివరి సంతానం. అరుణ తండ్రి 1972లో అమెరికా వెళ్లారని కుటుంబసభ్యులు తెలిపారు. అరుణ బాబాయి కాట్రగడ్డ నాగేశ్వరరావు ప్రస్తుతం వెంట్రప్రగడ గ్రామంలోనే ఉంటున్నారు.

దేశ వ్యాప్తంగా ఆర్బీకేలు



సాక్షి, అమరావతి: వ్యవసాయంలో రైతన్నలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలందించేందుకు, నాణ్యమైన ఇన్‌పుట్స్, సాగుకు సంబంధించి అన్ని రకాల ఇతర సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన అద్భుత వ్యవస్థ వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకేలు). రాష్ట్ర వ్యవసాయ రంగంలో అత్యున్నత ఫలితాలు ఇస్తున్న ఈ వ్యవస్థ ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలందుకుంటోంది. ఈ వ్యవస్థ ఏర్పాటుకు ఇప్పటికే ఇథియోపియా దేశం రాష్ట్ర అధికారుల సహకారం తీసుకుంటోంది. దేశంలోని పలు రాష్ట్రాలు కూడా ఈ వ్యవస్థ ఏర్పాటుకు ఆసక్తి చూపిస్తున్నాయి. ఆ రాష్ట్రాల అధికార బృందాలు రాష్ట్రానికి వచ్చి ఆర్బీకేలు, డిజిటల్ కియోస్క్‌లపై అధ్యయనం చేశాయి. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం కూడా ఈ తరహా వ్యవస్థను దేశవ్యాప్తంగా నెలకొల్పడానికి చర్యలు చేపట్టింది. బుధవారం న్యూఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐఏఆర్‌ఐ–పూస)లో ప్రారంభమైన మూడు రోజుల 5వ ఇండియా అగ్రి బిజినెస్ సమ్మిట్–2022 సందర్భంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే ఈ విషయం చెప్పారు. సదస్సులో భాగంగా నిర్వహించిన జాతీయ అగ్రి ఎక్స్‌పోలో రాష్ట్ర వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన ఆర్బీకేల నమూనా, డిజిటల్ కియోస్క్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆర్బీకే ద్వారా అందిస్తున్న సేవలు, డిజిటల్ కియోస్క్‌ల పనితీరును కేంద్ర మంత్రి ఫగ్గన్ సింగ్‌తో పాటు ఫిలిప్పైన్స్ వ్యవసాయ శాఖ మాజీ కార్యదర్శి విలియం దార్, రోమస్ ఫోరమ్ ప్రెసిడెంట్ మహారాజ్ ముతూ, ఇండియన్ ఛాంబర్ ఆఫ్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ చైర్మన్ డాక్టర్ ఎంజే ఖాన్, సలహాదారు ఎన్‌కే దడ్లాని, నేషనల్ రెయిన్‌ఫెడ్ ఏరియా అథారిటీ (ఎన్‌ఆర్‌ఏఏ) సీఈవో అశోక్ దాల్వాయి తదితరులు అడిగి తెలుసుకున్నారు. ఆర్బీకేల ద్వారా ఏపీ ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సేవలను తెలుసుకొని ఆశ్చర్యపోయారు. ఆర్బీకే సేవలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని, ఇదే తరహా సేవలను దేశవ్యాప్తంగా గ్రామస్థాయిలో ఏర్పాటు చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని కేంద్ర మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే చెప్పారు. ఆర్బీకేలు, వాటిలోని కియోస్క్‌లు వ్యవసాయ రంగంలో విప్లవం తీసుకొచ్చే వినూత్నమైన పరిజ్ఞానమని ఆయన కొనియాడారు. 'ఏపీ ఆర్బీకేల గురించి చాలా వింటున్నాం. వాటి ద్వారా అందిస్తున్న సేవలు చాలా అద్భుతంగా ఉన్నాయి. ఆర్బీకేల్లో డిజిటల్ కియోస్క్‌ల ద్వారా ఇన్‌పుట్స్ బుకింగ్ విధానం అద్భుతం. వాటిని జాతీయ స్థాయిలో రైతులకు అందుబాటులోకి తేవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. నేను ప్రాతినిధ్యం వహిస్తున్న మధ్యప్రదేశ్ రాష్ట్రంలో త్వరలో వీటిని గ్రామ స్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తా' అని చెప్పారు. ఈ మేరకు కార్యాచరణ సిద్ధం చేయాలని, డిసెంబరుకల్లా డిజిటల్ కియోస్క్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సదస్సుకు వచ్చిన మధ్యప్రదేశ్ వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు కేంద్ర మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

రైతు ముంగిటకే విత్తన సరఫరా భేష్

కేంద్ర మంత్రి సంజీవ్‌కుమార్ బల్యాన్, నీతి ఆయోగ్ సభ్యుడు రమేష్‌చంద్ ప్రశంసలు



అవార్డు అందుకుంటున్న పూనం మాలకొండయ్య, హేమ సుష్మిత, శేఖర్‌బాబు

సాక్షి, అమరావతి: నాణ్యమైన ధ్రువీకరించిన విత్తనాలను గ్రామ స్థాయిలో రైతుల ముంగిటకే అందించడం వినూత్న ఆలోచన అని కేంద్ర మత్స్య, పశు సంవర్థక శాఖల సహాయ మంత్రి సంజీవ్ కుమార్ బల్యాన్, నీతి ఆయోగ్ సభ్యుడు (వ్యవసాయం) రమేష్ చంద్ ప్రశంసించారు. విత్తన పంపిణీలో ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు దేశానికే ఆదర్శమని చెప్పారు. మూడేళ్లలో 50.95 లక్షల మందికి 34.97 లక్షల క్వింటాళ్ల విత్తనాలను అత్యంత పారదర్శకంగా పంపిణీ చేయడం నిజంగా గొప్ప విషయమన్నారు. వ్యవసాయ రంగంలో విశేష ప్రతిభ కనబర్చిన సంస్థలకు ఇండియన్ చాంబర్ ఆఫ్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ (ఐసీఎఫ్ఏ) ఏటా అందించే ఇండియా అగ్రి బిజినెస్ అవార్డుల్లో విత్తన పంపిణీ కేటగిరీలో ఏపీ సీడ్స్‌కు గ్లోబల్ అగ్రి అవార్డును అందించింది. బుధవారం జరిగిన ఇండియా అగ్రి బిజినెస్ సమ్మిట్‌లో ఈ అవార్డును సంజీవ్‌కుమార్ బల్యాన్, రమేష్‌చంద్ చేతుల మీదుగా రాష్ట్ర వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ పూనం మాలకొండయ్య, ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ వి.హేమ సుష్మిత, ఎండీ డాక్టర్ గెడ్డం శేఖర్‌బాబు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విత్తన పంపిణీలో ఏపీ అనుసరిస్తున్న విధానాన్ని జాతీయ స్థాయిలో అమలు చేస్తే రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. ఇదే ఆలోచనతో కేంద్రం పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రాలను తీసుకొచ్చిందని చెప్పారు. మిగతా రాష్ట్రాలు కూడా ఏపీ బాటలోనే విత్తన పంపిణీని గ్రామ స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంకల్పంతోనే..

విత్తు నుంచి విక్రయం వరకు ఆర్బీకేల ద్వారా అందిస్తున్న సేవలను రాష్ట్ర వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ పూనం మాలకొండయ్య సదస్సులో వివరించారు. పౌర సేవలు ప్రజల గుమ్మం వద్ద అందించాలన్న సంకల్పంతో ఏపీ సీఎం వైఎస్ జగన్ సచివాలయ, ఆర్బీకే వ్యవస్థలను తీసుకొచ్చారని చెప్పారు. ఆర్బీకేల్లోని డిజిటల్ కియోస్క్‌ల ద్వారా సర్టిఫై చేసిన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను బుక్ చేసుకున్న గంటల్లోనే రైతుల ముంగిట అందిస్తున్నామని చెప్పారు. ఆర్బీకేలకు అనుబంధంగా యంత్ర సేవా కేంద్రాలు, నియోజకవర్గ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్స్ ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో గోదాములతో పాటు పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ప్రతి ఎకరాలో సాగయ్యే పంటల వివరాలను ఈ–క్రాప్ ద్వారా నమోదు చేయడం, ఈ డేటా ఆధారంగా పైసా భారం పడకుండా పంటల బీమా, పెట్టుబడి రాయితీ, సున్నా వడ్డీ పంట రుణాలు వంటి సంక్షేమ ఫలాలు రైతులకు అందిస్తున్నామని వివరించారు. బ్యాంకింగ్ కరస్పాండెంట్ల ద్వారా ఆర్బీకే స్థాయిలో బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఆర్బీకేలను కొనుగోలు కేంద్రాలుగా కూడా మార్చి, గ్రామస్థాయిలోనే పంట ఉత్పత్తులు కొంటున్నామన్నారు. ఆర్బీకేల సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు పలు రాష్ట్రాలతో పాటు ఇథియోపియా వంటి ఆఫ్రికన్ దేశం కూడా ముందుకొచ్చిందని వివరించారు. ఆసక్తిగా విన్న పలు రాష్ట్రాల ఉన్నతాధికారులు ఆర్బీకేల పని తీరును మరింత లోతుగా రాష్ట్ర అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సదస్సులో ఏపీ సీడ్స్ ఎండీ డాక్టర్ గెడ్డం శేఖర్‌బాబు, మచిలీపట్నం ఎంఏవో జీవీ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆధారాలు ఉన్నందునే ఆక్రమణల తొలగింపు

అన్యాక్రాంతమైన ఏయూ భూములను స్వాధీనం చేసుకోవడం కలకలమా?

వస్తువులు తీసుకుని మధ్యాహ్నానికే వెళ్లిపోయిన దుకాణదారులు

1992లోనే ఏయూకు అనుకూలంగా స్పెషల్ కోర్టు తీర్పు



భూములు తమవేనని ఏయూ గతంలో ఏర్పాటు చేసిన బోర్డు

ఫ్యాక్ట్ చెక్

దొండపర్తి (విశాఖ దక్షిణ): అన్యాక్రాంతమైన భూములను ఆంధ్రా యూనివర్శిటీ తిరిగి స్వాధీనం చేసుకోవడం దారుణమా? ఆక్రమిత భూముల్లో నిర్మించిన దుకాణాలను తొలగించడం కూల్చివేతల కలకలమా? ఏయూ ఆస్తులను కబ్జా చేసి అనుభవిస్తున్న ప్రైవేట్ వ్యక్తులపై టీడీపీ నేతలకు ఎందుకంత ప్రేమ? ఈనాడు ప్రచురించినట్లుగా 16 షాపుల్లో 200 మంది పని చేస్తుంటే అవి చిన్న దుకాణాలా? టీడీపీ నాయకుల డ్రామాలు, ఎల్లో మీడియా కథనాల్లో నిజం ఉందా? కబ్జాదారుల చెర నుంచి తమ భూములను ఆంధ్రా యూనివర్శిటీ స్వాధీనం చేసుకుంటే టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రైవేట్ వ్యక్తులను సమర్థించటాన్ని అంతా తప్పుబడుతున్నారు. ఏయూ స్థలాన్ని ఆక్రమించి షెడ్లు నిర్మించిన వారి వద్ద ఆ స్థలానికి సంబంధించి ఎలాంటి పత్రాలు లేవు. దుకాణదారులంతా తమ వస్తువులు తీసుకొని మధ్యాహ్నానికే అక్కడ నుంచి వెళ్లిపోయారు. చాలా ఏళ్లుగా ఆక్రమణలకు గురైన విలువైన ఏయూ భూములను స్వాధీనం చేసుకోవడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది. ఏయూ పూర్వ విద్యార్థులు, నగరవాసులు దీనిని స్వాగతిస్తున్నారు.

+ విశాఖలో ఆంధ్ర యూనివర్సిటీకి పాత సీబీఐ జంక్షన్ నుంచి పోలమాంబ ఆలయం వరకు సువిశాలమైన భూమి ఉంది. ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ నుంచి పోలమాంబ ఆలయం వరకు రహదారికి ఆనుకుని ఉన్న విలువైన స్థలాన్ని కొందరు ఆక్రమించి అనధికారంగా దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. బడా బాబుల అండదండలతో కార్ షెడ్లు, మాంసం దుకాణాలు, టీ పాయింట్లు, టిఫిన్ సెంటర్లు నిర్వహిస్తూ అద్దెలు వసూలు చేసుకుంటున్నారు. టీడీపీ హయాంలో కబ్జాదారులు దుకాణాలను నిర్మించుకుని నెమ్మదిగా విస్తరించినా కన్నెత్తి కూడా చూడలేదు. తాజాగా ఏయూ అధికారులు మరోసారి జీవీఎంసీకి ఫిర్యాదు చేయడంతో అక్రమ నిర్మాణాలను సోమవారం తొలగించారు.

■ పెదవాల్తేరు పోలమాంబ ఆలయానికి ఆనుకుని ఏయూకు 2.5 ఎకరాల భూమి ఉంది. 1941లోనే దీన్ని నిర్ణీత రుసుము చెల్లించి కొనుగోలు చేసింది. కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం అప్పటి నుంచి ఆ భూమి ఏయూ స్వాధీనంలోనే ఉంది. టౌన్ సర్వే రిజిస్టర్ ప్రకారం ఈ భూములు ఏయూకు చెందినవేనని 1989 నాటి అడంగల్ కాపీలు ఏయూ వద్ద ఉన్నాయి.

■ 1992లో ఈ స్థలాన్ని ఆక్రమించుకోడానికి ప్రయత్నించిన కొందరు కోర్టుకు వెళ్లగా స్పెషల్ కోర్టు ఏయూకు అనుకూలంగా తీర్పునిచ్చింది. 1993 ఫిబ్రవరి 16న తహశీల్దార్ స్వయంగా ఇక్కడ ఉన్న తాటాకు ఇళ్లను తొలగించారు. ఆక్రమణదారులైన కుందం అప్పారావుతో పాటు మరో 13 మంది నుంచి భూమిని స్వాధీనం చేసుకొని ఖాళీ స్థలాన్ని ఏయూకు అప్పగించారు. దీనిపై ఏయూకే సర్వహక్కులు ఉన్నాయంటూ తహశీల్దార్ ఏయూకు లిఖిత పూర్వకంగా ఉత్తర్వులు ఇచ్చారు.

■ పెట్రోల్ బంక్ నుంచి పోలమాంబ ఆలయం వరకు రహదారి విస్తరణకు ఏయూకు చెందిన ఈ స్థలం నుంచే కొంత భూమిని జీవీఎంసీకి అప్పగించింది. దీనికి పరిహారంగా ఏయూకు జీవీఎంసీ ప్రత్యామ్నాయ భూమిని సైతం ఇచ్చింది. అందులోనే ఏయూ అంతర్జాతీయ విద్యార్థినుల హాస్టల్ సముదాయాన్ని నిర్మించింది.

అన్ని ఆధారాలున్నాయి..

ఆక్రమణలు తొలగించిన స్థలం నిస్సందేహంగా ఏయూదే. ఆ పత్రాలన్నీ మావద్ద ఉన్నాయి. గతంలో పనిచేసిన వీసీలు, రిజిస్ట్రార్‌లు కూడా వీటిని స్వాధీనం చేసుకోవాలని ఉత్తర ప్రత్యుత్తరాల రూపంలో అప్పటి ప్రభుత్వాలను కోరారు.

– ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి, వీసీ

మసాలా.. అదిరింది

▶ మొదటి పేజీ తరువాయి

అభివృద్ధి చేసింది. మిర్చితో పాటు పసుపు, అల్లం, ధనియాలు, యాలకులు తదితర సుగంధ ద్రవ్యాలను ప్రాసెస్ చేసి ఎగుమతి చేయనుంది. సుమారు 20,000 టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ఈ గ్లోబల్ స్పైసెస్ పార్క్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ పార్కు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 1,500 మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. గతంలో ఐటీసీ గ్రూపు రాష్ట్రంలో పొగాకు వ్యాపారానికే పరిమితం కాగా, 2004లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చొరవతో గుంటూరు కేంద్రంగా సుగంధ ద్రవ్యాల విభాగంలోకి అడుగు పెట్టింది. ఇందుకోసం ఐటీసీ స్పైసెస్ పేరుతో ప్రత్యేకంగా కంపెనీ ఏర్పాటు చేసి, వేగంగా విస్తరించింది. సుమారు 170 గ్రామాల్లో 10,000 మందికి పైగా రైతులతో 35,000 హెక్టార్లలో వివిధ సుగంధ ద్రవ్యాలను సాగు చేయిస్తోంది. ఆ పంటలను ఈ కంపెనీ నేరుగా కొనుగోలు చేయడం ద్వారా రైతులు మంచి ఆదాయం పొందుతున్నారు. ఐటీసీ గ్రూపు దేశంలో ఆశీర్వాద్ బ్రాండ్ పేరుతో వివిధ సుగంధ ద్రవ్యాల ఉత్పత్తులను విక్రయిస్తున్న సంగతి తెలిసిందే.

పల్నాడు, గుంటూరు జిల్లాల్లో రేపు సీఎం పర్యటన

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం పల్నాడు, గుంటూరు జిల్లాల్లో పర్యటించనున్నారు. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలంలోని వంకాయలపాడు సుగంధ ద్రవ్యాల పార్క్‌లో ఐటీసీ సంస్థ ఏర్పాటు చేసిన గ్లోబల్ స్పైసెస్ ప్రాసెసింగ్ ఫెసిలిటీ యూనిట్‌ను ఉదయం 9.40 - 10.35 గంటల మధ్య ప్రారంభిస్తారు. అనంతరం 11 గంటలకు గుంటూరు నగరంలోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించే మైనార్టీ సంక్షేమ దినోత్సవంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12.30 గంటలకు గుంటూరు మెడికల్ కళాశాలకు చేరుకుంటారు. ఈ కళాశాల ఏర్పాటై 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్లాటినం జూబ్లీ పైలాన్‌ను ఆవిష్కరిస్తారు. అనంతరం 1.30 గంటలకు తిరిగి తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

11న ఉర్దూ అకాడమి అవార్డుల ప్రదానోత్సవం

- హాజరు కానున్న సీఎం జగన్



అవార్డు ప్రదానోత్సవ ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న నదీం అహ్మద్, డైరెక్టర్లు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ప్రతి ఏటా నిర్వహిస్తున్న జాతీయ విద్యా దినోత్సవం, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 11న ఉర్దూ అకాడమి అవార్డులు ప్రదానం చేయనున్నట్లు ఏపీ స్టేట్ ఉర్దూ అకాడమి చైర్మన్ హెచ్ నదీం అహ్మద్ చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఉర్దూ అకాడమీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఉర్దూ భాషాభివృద్ధి కోసం విశేష సేవలందించిన కవులు, మేధావులు, టీచర్స్, ప్రొఫెసర్స్, లెక్చరర్స్, విద్యార్థులకు మౌలానా అబుల్ కలాం ఆజాద్, డాక్టర్ అబ్దుల్ హక్, లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్, బెస్ట్ ఉర్దూ టీచర్, బెస్ట్ ఉర్దూ స్టూడెంట్ అవార్డులను అందించనున్నామని వివరించారు. గుంటూరు వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరుగనున్న ఈ కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారని చెప్పారు. మైనార్టీల సంక్షేమం కోసం ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సీఎం జగనన్న అనేక పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు.

9 ప్రాజెక్టులు.. రూ.15,233 కోట్లు

- విశాఖలో ప్రధాని చేతుల మీదుగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- ప్రధానమంత్రి పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు



సిద్ధమవుతున్న సభా ప్రాంగణం

దొండపర్తి (విశాఖ దక్షిణ): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటనకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. శుక్రవారం సాయంత్రం 7.25 గంటలకు మోదీ విశాఖకు చేరుకోనున్నారు. శనివారం ఉదయం ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో భారీ బహిరంగ సభలో పాల్గొననున్నారు. ఇదే వేదికపై నుంచి రూ.15,233 కోట్లు విలువైన 9 ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

డ్రోన్లపై నిషేధం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా విశాఖ పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే మద్దిలపాలెం జంక్షన్ నుంచి త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే మార్గంలో వాహనాల రాకపోకలను అనుమతించడం లేదు. అలాగే సభ జరిగే ఏయూ మైదానానికి 5 కిలోమీటర్ల పరిధిని 'నో డ్రోన్ జోన్'గా నగర పోలీస్ కమిషనర్ సి.హెచ్.శ్రీకాంత్ ప్రకటించారు. ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు ఈ నిషేధం అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సమయంలో ఎవరైనా డ్రోన్లు ఎగరవేస్తే వారిపై ఎయిర్‌క్రాఫ్ట్ చట్టం 1934 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు.

శంకుస్థాపనల ప్రాజెక్టులు..

రూ.7,614 కోట్లు విలువైన 5 ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. వాటిలో..

- రూ.152 కోట్లతో విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ ఆధునీకరణ.
- రూ.3,778 కోట్లతో రాయ్‌పూర్–విశాఖపట్నం 6 లేన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే, ఎకనామిక్ కారిడార్.
- రూ.566 కోట్లతో కాన్వెంట్ జంక్షన్ నుంచి షీలానగర్‌కు ప్రత్యేకమైన రోడ్డు.
- రూ.460 కోట్లతో విశాఖపట్నం రైల్వేస్టేషన్ అభివృద్ధి.
- రూ.2,658 కోట్లతో 321 కిలో మీటర్ల శ్రీకాకుళం–అంగుల్‌కు గెయిల్ పైప్‌లైన్ ప్రాజెక్టులు ఉన్నాయి.


జాతికి అంకితం చేసే ప్రాజెక్టులు ఇవీ..

రూ.7,619 కోట్లతో పూర్తి చేసిన నాలుగు ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. వాటిలో

- రూ.211 కోట్ల వ్యయంతో పాత పట్నం–నరసన్నపేటను కలుపుతూ నిర్మించిన నూతన జాతీయ రహదారి.
- రూ.2,917 కోట్లతో తూర్పు తీరంలో అభివృద్ధి చేసిన ఓఎన్‌జీసీ యు–ఫీల్డ్.
- రూ.385 కోట్లతో గుంతకల్‌లో ఐవోసీఎల్ గ్రాస్ రూట్ పీవోఎల్ డిపో నిర్మాణం.
- రూ.4,106 కోట్లతో విజయవాడ–గుడివాడ–భీమవరం–నిడదవోలు, గుడివాడ–మచిలీపట్నం, భీమవరం–నరసాపురం (221 కి.మీ.) రైల్వే లైన్ ఎలక్ట్రిఫికేషన్ ఉన్నాయి.

సభ విజయవంతమే అందరి లక్ష్యం

- వైఎస్సార్‌సీపీ నేత విజయసాయిరెడ్డి



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభను విజయవంతం చేయడమే అందరి లక్ష్యం కావాలని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. 12న ప్రధాని సభ ఏర్పాట్లపై బుధవారం ఇక్కడి ప్రభుత్వ అతిథి గృహంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, నాయకులు సమన్వయంతో పని చేసి సభ విజయవంతానికి శాయశక్తులా కృషి చేయాలని చెప్పారు. ఈ సభకు సుమారు 3 లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉందని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రధాని బహిరంగ సభకు వచ్చే గంట ముందుగానే ప్రజలు సభా ప్రాంగణానికి చేరుకునేలా చూసుకోవాలన్నారు. ఈ సభలో ప్రధాని చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో విజయసాయిరెడ్డి సమీక్ష నిర్వహించారు. కాగా, మధ్యాహ్నం ప్రభుత్వ అతిథి గృహంలో ప్రధాని సభ ఏర్పాట్లు, ఇతర అంశాలకు సంబంధించి మంత్రి అమర్‌నాథ్ జీవీఎంసీ అధికారులతో సమీక్షించారు. ఆ తర్వాత ఏయూ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్‌లో బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు.

క్లుప్తంగా

జేసీ ప్రభాకరరెడ్డి చర్యలు గర్హనీయం

ఖండించిన ఐఏఎస్ అసోసియేషన్

సాక్షి, అమరావతి: ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న అనంతపురం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిపై దురుసుగా వ్యవహరించిన తాడిపత్రి మున్సిపల్ జేసీ ప్రభాకరరెడ్డి తీరును ఐఏఎస్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. నీతి నిజాయితీ నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్న కలెక్టర్‌ను అసభ్య పదజాలంతో తూలనాడడాన్ని తప్పుపట్టింది. ఈ మేరకు సివిల్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏపీ ప్రధాన కార్యదర్శి ప్రద్యుమ్న బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఐఏఎస్ వంటి ప్రభుత్వ ఉద్యోగుల పనితీరుపై ఎవరికైనా అభ్యంతరాలుంటే పై అధికారి లేదా సంబంధిత సంస్థల్లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. జేసీ ప్రభాకర రెడ్డి విరుచుకుపడుతున్నా ఎటువంటి ఆవేశాలకు లోనుకాకుండా జాయింట్ కలెక్టర్, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు కలెక్టర్ నాగలక్ష్మికి మద్దతుగా నిలబడడాన్ని అసోసియేషన్ ప్రశంసించింది.

ప్రధాని పర్యటనపై రాష్ట్రవ్యాప్త నిరసనలు

సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు

సాక్షి, అమరావతి: ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా వామపక్షాల తరఫున నిరసన కార్యక్రమాలు చేపడతామని సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు వి. శ్రీనివాసరావు, రామకృష్ణ తెలిపారు. విజయవాడ ఎంబీ భవన్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. మోదీ రాష్ట్రాన్ని అన్ని విధాలా మోసం చేసి, సిగ్గు లేకుండా వస్తున్నారని విమర్శించారు. ప్రత్యేక హోదా, పోలవరం, విభజన హామీలు, రైల్వే జోన్ వంటి అన్ని అంశాల్లో రాష్ట్రాన్ని మోసం చేశారని తెలిపారు. మోదీ మెడలు వంచుతానన్న సీఎం జగన్ ఆయన ముందు తల వంచుతూనే ఉన్నారని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వం ఆధీనంలోనే ఉంచుతామని చెప్పాకే మోదీ రాష్ట్రంలో అడుగు పెట్టాలన్నారు. ప్రజలు నల్ల జెండాలతో నిరసన తెలపాలని కోరారు.

'కుప్పం'లో వైఎస్సార్‌సీపీ జెండాలకు నిప్పు



జాతికర్తనపల్లె వద్ద నిప్పు పెట్టిన పార్టీ జెండా

గుడుపల్లె: వైఎస్సార్‌సీపీ జెండాలకు టీడీపీ శ్రేణులు నిప్పు పెట్టడంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం జాతికర్తనపల్లెలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఇండ్లపై, రోడ్డు పక్కన వైఎస్సార్‌సీపీ జెండాలను ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయాన్నే టీడీపీకి చెందిన కొందరు దుండగులు ఆ జెండాలకు నిప్పుపెట్టారు. జెండాలకు నిప్పు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ధరల స్థిరీకరణ నిధి ఏమైంది?

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు

సాక్షి, అమరావతి: రైతులను ఆదుకునేందుకు ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తామన్న సీఎం జగన్ ఇచ్చిన హామీ ఏమయ్యిందని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నిధికి కేటాయిస్తానన్న రూ.3 వేల కోట్లు ఎటుపోయాయని ధ్వజమెత్తారు. కనీస ధర లేక నష్టపోతున్న టమోటా రైతును ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరారు. కర్నూలు జిల్లా పత్తికొండ మార్కెట్‌లో కిలో టమోటా ధర రూ.3కి పడిపోయి రైతు కంట కన్నీరు తెప్పిస్తుందని తెలిపారు. వినియోగదారులు మాత్రం కిలో రూ.30 పైనే పెట్టి కొనాల్సి వస్తోందని పేర్కొన్నారు.

రెడ్లపై టీడీపీ వైఖరి మార్చుకోవాలి

ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి

కృష్ణలంక(విజయవాడ తూర్పు): రెడ్డి సామాజికవర్గంపై టీడీపీ వైఖరి మార్చుకోకుంటే రానున్న రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రబాబు ద్వితీయ శ్రేణి నాయకులను రెడ్డి సామాజికవర్గంపై ఉసిగొల్పుతూ రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయిస్తున్నారని మండిపడ్డారు. డీఎస్పీ పోస్టుల్లో, నామినేటెడ్ పదవుల్లో రెడ్లకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని సీఎం జగన్‌పై అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. ప్రభుత్వ అధికారులను నియమించే అధికారం ముఖ్యమంత్రికి ఉన్నప్పుడు కులాన్ని అంటగట్టడం సిగ్గుచేటని, సామాజిక న్యాయం పాటించే ముఖ్యమంత్రుల్లో జగన్ ప్రథమ స్థానంలో ఉన్నారని తెలిపారు. నిత్యం రెడ్లను కించపరుస్తూ దూషించే పనిలో కొంతమందిని టీడీపీ ప్రత్యేకంగా నియమించిందని, టీడీపీకి రెడ్లపై వ్యతిరేక ధోరణి శృతిమించడం వల్లే గత ఎన్నికల్లో ఒక్క రెడ్డి ఎమ్మెల్యే కూడా టీడీపీ నుంచి గెలవలేకపోయారని గుర్తు చేశారు. టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు కులపిచ్చితో తన సామాజికవర్గం వారికే అత్యధిక పదవులు కేటాయించడం వల్లే ఆయన ఓటమి పాలయ్యారని స్పష్టం చేశారు.

డామిట్.. రాయి ఎదురు తిరిగింది!

రాళ్ల దాడి అంతా ఉత్తుత్తే..

బెడిసి కొట్టిన చంద్రబాబు పన్నాగం

- అది కట్టుకథేనని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడి
- సానుభూతి కోసమే ఈ డ్రామా
- అంత మంది ఉండీ, రాయి విసిరిన వ్యక్తిని ఎందుకు పట్టుకోలేదు?
- ఇంతకూ ఆ రాయి ఎక్కడికెళ్లినట్లు?

సాక్షి ప్రతినిధి, విజయవాడ: కథ, స్క్రీన్ ప్లే, డైరెక్షన్ బాగున్నప్పటికీ ఒక్కోసారి నటుడి పొరపాట్ల కారణంగా కొన్ని సినిమాలు బాక్సాఫీసు వద్ద చతికిల పడుతుంటాయి. మొన్నటి చంద్రబాబు రోడ్‌షోలోనూ అచ్చంగా ఇదే జరిగింది. చంద్రబాబు అద్భుత నటుడే కానీ, ఎందుకో.. ఏమో ఆ రోజు ఓ పొరపాటు చేసేశారు. ఆ పొరపాటే ఇప్పుడు ఆయన్ను చులకన చేసింది. ఆ ఎపిసోడ్ అంతా ఉత్తుత్తేనని తేల్చేసింది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో రోజు రోజుకూ పట్టుకోల్పోతున్న టీడీపీని గట్టెక్కించేందుకు చంద్రబాబు ఓ పన్నాగం పన్నారు. ఇటీవల నందిగామ పర్యటనలో.. తనపైకి ఎవరో రాయి విసిరారని.. అది అధికార పార్టీ వారి పనేనని రచ్చ రచ్చ చేశారు. అది గురితప్పి తన భద్రతాధికారికి తగిలిందంటూ.. చిన్నపాటి గాయాన్ని చూపించారు. అయితే ఇదంతా పక్కాగా ముందస్తు ప్రణాళికతో నిర్వహించినట్లు తెలుస్తోంది. ఈ పర్యటనలో తమపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలు చేయడానికి ముందుగానే తగిన కసరత్తు చేశారని స్పష్టం అవుతోంది.ఆరోజు చంద్రబాబు భద్రతాధికారి మధుబాబు తనకు గాయం అయ్యిందని, దానిపై తెల్లటి రుమాలు పెట్టుకుని వాహనంపై ఉన్న చంద్రబాబు వద్దకు వచ్చారు. ఆ వెంటనే ఆయనపై దాడి జరిగిందని చంద్రబాబు ప్రకటించేశారు. ఇక ఆ తర్వాత నుంచి చంద్రబాబు అండ్ టీడీపీ గ్యాంగ్ ఆ డ్రామాను రక్తి కట్టించేందుకు పడరాని పాట్లు పడ్డారు.

ఈ ప్రశ్నలకు బదులేదీ?

- ఎవరిపై అయినా దాడి జరిగితే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇస్తారు. సంబంధిత పోలీస్ స్టేషన్లో వెంటనే ఫిర్యాదు చేస్తారు. డీఎస్పీ హోదాలో ఉన్న మధుబాబుకు ఆ మాత్రం తెలీదా? అనే చర్చ మొదలైంది. దీంతో ఆ మరుసటి రోజు కానిస్టేబుల్‌తో ఆయన ఫిర్యాదు పంపారు. పోలీసులు మెడికల్ టెస్ట్‌కు రమ్మని పిలిచినా రాకుండా హైదరాబాద్‌లోనే ఎందుకు ఉండిపోయారు? ఈరోజు, రేపు అంటూ ఇప్పటికీ ఎందుకు కాలయాపన చేస్తున్నారు?
- ఎవరైనా రాయితో దాడి చేస్తే, ఆ రాయిని చూపిస్తూ మాట్లాడతారు. మరి ఆ రోజు ఆ రాయిని చంద్రబాబు ఎందుకు చూపలేదు? ఇక్కడే చంద్రబాబు రాయిని చూపకుండా పొరపాటు చేశారు. ఓ రాయిని ముందే సిద్ధం చేసుకుని ఉండటం మరిచారు కాబోలు! లేదా ఆ రాయి వెంటనే మాయమై పోయిందేమో! మామూలుగా రాయి తగిలితే, తగిలిన చోట వాపు వస్తుంది. మధుబాబుకు అయిన గాయం వద్ద అలాంటి వాపు కనిపించ లేదు.
- ఘటన జరిగినప్పుడు చంద్రబాబు రక్తం అంటిన తెల్ల రుమాలు మాత్రమే చూపారు. రాయి ఎందుకు చూపలేదనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో అది రాయి దాడి కాదని తేటతెల్లం అయ్యింది.
- రోడ్డుషోలో పొరపాటున చెట్టు కొమ్మ కానీ, చైతన్య రథంకు సంబంధించిన పైపులు, బోల్టో, జెండా కర్రో తగిలి రాసుకుపోయి ఉండవచ్చని భావిస్తున్నారు. జనాలు విచ్చల విడిగా పూలు చల్లారు. ఆ పూలలో నుంచి ఏదైనా వస్తువు పొరపాటున వచ్చి తగిలుండొచ్చనే అనుమానాన్ని టీడీపీలోని కొంత మంది నాయకులే వ్యక్తం చేస్తున్నారు.

ఒక్క విజువల్ లేదే!

- రోడ్డుషోను ఆద్యంతం ఇటు పోలీసు వర్గాలు, అటు టీడీపీ వర్గాలు చిత్రీకరించాయి. అలాంటప్పుడు రాయి దాడికి సంబంధించిన ఆధారాలు, వీడియో ఫుటేజీని వారు పోలీసులకు ఎందుకు ఇవ్వలేదు? పోలీసులు తీసిన, చిత్రీకరించిన కెమెరా ఫుటేజీ, డ్రోన్ విజువల్స్‌ను ఇప్పటికే పలుమార్లు పరిశీలించారు. వాటిలో ఎక్కడా రాయి విసిరిన దృశ్యాలు కనిపించలేదు.
- వెంటనే ఫిర్యాదు అందకపోయినా, బాధ్యతాయుతంగా స్పందించి ఇద్దరు సీనియర్ ఐపీఎస్ అధికారులను ఘటన ప్రాంతానికి పంపించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు కోసం ఎస్పీ స్థాయి అధికారి నేతృత్వంలో ప్రత్యేక బృందాలను నియమించారు. అందిన ఫిర్యాదు మేరకు లీగల్ ఓపీనియన్ తీసుకొని పోలీసులు 324 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు.
- దీంతో తమ ఎత్తుగడ ఫలించలేదని భావించిన చంద్రబాబు కొత్త నాటకానికి తెరలేపారు. 'పెట్టి' కేసు లాంటి సెక్షన్ కింద కేసు నమోదు చేశారని, హత్యాయత్నంకు సంబంధించిన సెక్షన్‌లకు మార్చాలంటూ డిమాండ్ చేస్తూ టీడీపీ నేతలను గవర్నర్ వద్దకు పంపారు.
- ఇంతటితో ఆగకుండా మంగళవారం నందిగామలో టీడీపీ నేతలు గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పించి, అక్కడే నిరాహార దీక్ష చేయడం.. సాయంత్రానికి మళ్లీ కొంత మంది నాయకులు వచ్చి దీక్ష విరమింపజేయడం చూస్తుంటే ఈ అంశాన్ని ఎలాగైనా లైవ్‌లో ఉంచి లబ్ధి పొందాలన్నదే వారి లక్ష్యంగా తెలుస్తోంది.
- ఎవరైనా నిజంగా రాయి విసిరివుంటే పెద్ద సంఖ్యలో ఉన్న టీడీపీ క్యాడర్ చూస్తూ ఊరుకునేదా? అతన్ని పట్టుకుని చితకబాదేవారు కాదా? అనే ప్రశ్నకు టీడీపీ నేతలు ఏమని బదులిస్తారని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. తమపై పడ్డ రాయి ఆ రోజు కనిపించలేదని, ఇప్పుడు దొరికిందని వేరే రాయిని తీసుకొచ్చి చూపినా ఆశ్చర్యం లేదని బాబు తత్వం తెలిసిన ఓ నేత వ్యాఖ్యానించారు.

గడువు ముగిసినా గొడవలే..!

కృష్ణా, గోదావరి బోర్డుల నోటిఫికేషన్ల అమలు ప్రశ్నార్థకం



సాక్షి, అమరావతి: కృష్ణా, గోదావరి జలాలపై ఏపీ, తెలంగాణ మధ్య వివాదాలకు చరమగీతం పాడటానికి కృష్ణా, గోదావరి బోర్డుల పరిధిని నిర్దేశిస్తూ కేంద్రం గతేడాది జూలై 15న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ల అమలు ప్రశ్నార్థకంగా మారింది. ప్రాజెక్టుల అప్పగింత, పరిధిపై రెండు రాష్ట్రాలు ఏకాభిప్రాయానికి రాకపోవడంతో నోటిఫికేషన్ అమలును కేంద్రం పొడిగించిన ఆరు నెలల గడువు కూడా జూలై 15కే పూర్తయింది. అయినా రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయాన్ని సాధించడంలో బోర్డులు విఫలమయ్యాయి. దీనిపై బోర్డులు, కేంద్ర జల్ శక్తి శాఖ స్పందించడం లేదు. దాంతో రెండు రాష్ట్రాల మధ్య జలవివాదాలు సద్దుమణగడం లేదు. రెండు బోర్డుల పరిధిని నిర్దేశిస్తూ నోటిఫికేషన్ జారీ చేయాలని 2020 అక్టోబర్ 6న జరిగిన అపెక్స్ కౌన్సిల్ రెండో సమావేశంలో కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను రాష్ట్ర సీఎం వైఎస్ జగన్ కోరారు. గతేడాది శ్రీశైలంలోకి వరద ప్రవాహం లేకున్నా, నీటి నిల్వ కనిష్ట స్థాయిలో ఉన్నా.. దిగువన సాగు, తాగునీటి అవసరాలు లేకున్నప్పటికీ, బోర్డు అనుమతి తీసుకోకుండానే తెలంగాణ విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు నీటిని వదిలేసింది. దీనివల్ల కృష్ణా జలాలు వృథాగా కడలిపాలయ్యాయి. కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను తెలంగాణ సర్కారు హరిస్తుండటంపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దాంతో కేంద్రంలో కదలిక వచ్చింది. కృష్ణా, గోదావరి బోర్డుల పరిధిని నిర్దేశిస్తూ గతేడాది జూలై 15న నోటిఫికేషన్ జారీ చేసింది. నోటిఫికేషన్ షెడ్యూల్-2లో పేర్కొన్న ప్రాజెక్టులను ఆర్నెల్లలో కృష్ణా, గోదావరి బోర్డులకు రెండు రాష్ట్రాలు అప్పగించాలి. అనుమతి లేని ప్రాజెక్టులకు ఆర్నెల్లలో అనుమతి తెచ్చుకోవాలి. లేదంటే ఆ ప్రాజెక్టుల నుంచి నీటి వినియోగానికి అనుమతించరు. కృష్ణా బేసిన్‌లో ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లను బోర్డుకు అప్పగించేందుకు రెండు రాష్ట్రాలు తొలుత అంగీకరించాయి. ఏపీ భూభాగంలోని శ్రీశైలం, సాగర్ విభాగాలను కృష్ణా బోర్డుకు అప్పగిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా, తెలంగాణ సర్కారు దాని పరిధిలోని విభాగాలను అప్పగించబోమని స్పష్టం చేసింది. నోటిఫికేషన్ అమలు గడువు జనవరి 15తో పూర్తయినా, ఏకాభిప్రాయ సాధన కుదరలేదు. దీంతో కేంద్ర జల్‌శక్తి శాఖ ఈ గడువును జూలై 15 వరకు పొడిగించింది. ఈ క్రమంలోనే విభజన చట్టంలో పేర్కొన్న హంద్రీ-నీవా, వెలిగొండ, తెలుగుగంగ, గాలేరు-నగరి, కల్వకుర్తి (పాతది), నెట్టెంపాడు (పాతది) ప్రాజెక్టులకు అనుమతి ఉన్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. మిగతా ప్రాజెక్టులకు అనుమతి తెచ్చుకోవాలని ఆదేశించింది. కేంద్రం పొడిగించిన గడువు కూడా పూర్తయి మూడు నెలలు దాటింది. అయినా తెలంగాణ ప్రభుత్వం కృష్ణా బేసిన్‌లో అనుమతి లేకుండా చేపట్టిన తుమ్మిళ్ల ఎత్తిపోతల, పాలమూరు-రంగారెడ్డి, భక్త రామదాస, మిషన్ భగీరథ తదితర ప్రాజెక్టులకు అనుమతి తెచ్చుకోలేదు. గోదావరి బేసిన్‌లో అనుమతి లేకుండా చేపట్టిన ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వాలని రెండు రాష్ట్రాలు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ)కు డీపీఆర్‌లు సమర్పించాయి. శ్రీశైలం, సాగర్ నిర్వహణకు రిజర్వాయర్ల మేనేజ్‌మెంట్ కమిటీ రూపొందించిన విధి విధానాలను ఏపీ ప్రభుత్వం ఆమోదించగా, తెలంగాణ వ్యతిరేకిస్తోంది. ఇదే అదనుగా తెలంగాణ ఇటీవల వరద తగ్గాక కూడా శ్రీశైలంలో యథేచ్ఛగా విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు నీటిని వదిలేస్తోంది. దీనివల్ల పది రోజుల్లోనే సుమారు 32 టీఎంసీల జలాలు ప్రకాశం బ్యారేజి మీదుగా సముద్రంలో కలిసిపోయాయి. అయినా కేంద్ర జల్‌శక్తి శాఖ గానీ, బోర్డులు గానీ పట్టించుకోవడంలేదు.

అవసరమైతే పక్కగ్రామాల్లో ఇళ్ల పట్టాలు

- భూమి అందుబాటులో లేనప్పుడు అదే ప్రత్యామ్నాయం

సాక్షి, అమరావతి: ఏదైనా గ్రామంలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు అవసరమైన భూమి లేనప్పుడు, చుట్టుపక్కల గ్రామాల్లో ఇళ్ల పట్టాలు ఇవ్వొచ్చని ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకు స్పష్టం చేసింది. 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకం అమలు మార్గదర్శకాలను ఈ మేరకు మారుస్తూ బుధవారం జీవో జారీచేసింది. 30 లక్షల మంది పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసేందుకు 2019 ఆగస్టు 19న ప్రభుత్వం మార్గదర్శకాలు ఇచ్చింది. వీటిప్రకారం భూమి అందుబాటులో లేని గ్రామాల్లో అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చే విషయంలో ఎదురవుతున్న పరిస్థితులపై పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ ఒక నివేదిక ఇచ్చారు. దీన్ని పరిశీలించిన తర్వాత నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు మార్గదర్శకాల్లో క్లాజ్ 6 (హెచ్)ను ప్రభుత్వం చేర్చింది. దీని ప్రకారం ఒకవేళ ఏదైనా గ్రామంలో ఇళ్ల పట్టాల పంపిణీకి భూమి అందుబాటులో లేకుండా, సమీప గ్రామాల్లో భూమి అందుబాటులో ఉంటే ప్రత్యేక పరిస్థితుల్లో అక్కడ అర్హులకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు అనుమతి ఇవ్వొచ్చు. ఈ మార్పుతో భూమి అందుబాటులో లేని గ్రామాల్లోని పేదలకు చుట్టుపక్కల గ్రామాల్లో ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు మార్గం సుగమం కానుంది. వేలాదిమందికి దీనివల్ల లబ్ధికలిగే అవకాశం ఉంది. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా రాష్ట్రంలోని 30 లక్షల మందికి వైఎస్ జగన్ ప్రభుత్వం ఇళ్ల పట్టాలు పంపిణీ చేసింది. ఇంకా ఎవరైనా పేదలు ఇళ్ల పట్టా పొందకుండా మిగిలి ఉంటే నిబంధనల ప్రకారం వారికి పట్టాలిస్తోంది. ఇలాంటివారికి దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లో పట్టా ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే మార్గదర్శకాల్లో స్వల్ప మార్పు చేస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులిచ్చారు.

ముందుకొస్తే మీకే ఇస్తాం

- పేదల ఆప్షన్ 3 ఇళ్లపై రామోజీకి మంత్రి రమేష్ ప్రతిపాదన
- కడుపు మంటతోనే ఈనాడు కథనాలు



సాక్షి, అమరావతి: నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకం కింద ఆప్షన్-3 గృహ నిర్మాణాలను చేపట్టేందుకు ముందుకొస్తే రామోజీ కంపెనీకి అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నామని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ప్రకటించారు. పేదలపై నిజంగా ప్రేమ ఉంటే రామోజీరావు ముందుకు రావాలని సూచించారు. ఇతర పచ్చ పత్రికల యజమానులు కూడా ముందుకు రావచ్చన్నారు. పేదల కోసం 20 లక్షలకుపైగా గృహ నిర్మాణాలను చేపట్టగా సొంతంగా కట్టుకునే అవకాశం లేక మీరే నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతూ 3 లక్షల మంది ఆప్షన్ 3 ఎంచుకున్నారని చెప్పారు. వీరికి సాయపడేందుకు 353 సంస్థలు ముందుకొస్తే బురద చల్లడం సరికాదన్నారు. సానుకూల దృక్పథంతో ఉండాలని, మీరు చూస్తున్న దృష్టి కోణంలోనే లోపం ఉందని రామోజీరావునుద్దేశించి వ్యాఖ్యానించారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి రమేష్ మీడియాతో మాట్లాడారు. పేదలకు పెద్ద ఎత్తున ఇళ్లను నిర్మిస్తుండటం, ప్రభుత్వానికి మంచి పేరు రావటాన్ని చూసి తట్టుకోలేక రామోజీ రోజుకో రకంగా ఆయన మీడియాలో విషం కక్కుతున్నారని ధ్వజమెత్తారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏకంగా 30.2 లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఇతర వర్గాలకు చెందిన అక్కచెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలను తమ ప్రభుత్వం అందించిందని గుర్తు చేశారు. పేదల ఇళ్ల నిర్మాణం ద్వారా రూ.2.50 లక్షల కోట్ల నుంచి రూ.3 లక్షల కోట్ల సంపదను సృష్టిస్తున్నామన్నారు.

స్వచ్ఛందంగా ముందుకొచ్చిన 353 సంస్థలు

పేదల ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం పడుతున్న తాపత్రయాన్ని చూసి 353 సంస్థలు ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణం కోసం ముందుకొచ్చాయని మంత్రి రమేష్ చెప్పారు. వీటిలో రాక్రిట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ సంస్థ కూడా ఉందన్నారు. వీరంతా పేదలకు అండగా నిలిచేందుకు సీఎం జగన్‌కు తోడ్పాటు అందిస్తున్నారన్నారు. ఇందులో ఏం స్కాం జరిగిందో రామోజీనే చెప్పాలని నిలదీశారు. ముందుగా అడ్వాన్స్ ఏమైనా చెల్లించామా? దోపిడీ జరిగిందా? అని ప్రశ్నించారు. అదే ధరకు రామోజీరావు ముందుకు వస్తే ఆయనకే నిర్మాణ బాధ్యతలు అప్పగించడానికి గృహ నిర్మాణ సంస్థ సిద్ధంగా ఉందన్నారు. రాక్రిట్ సంస్థ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డిది కావడంతోనే ఆ సంస్థను టార్గెట్ చేసి ఆరోపణలకు దిగారన్నారు.

ఇప్పటంలో ఒక్క ఇంటినీ కూల్చలేదు

ఇప్పటంలో ఏ ఒక్క ఇల్లూ కూల్చలేదని, ఎక్కడా సెంటు భూమిని కూడా ప్రభుత్వం సేకరించలేదని మంత్రి రమేష్ తెలిపారు.

బురద జల్లడమే పనా?

ప్రభుత్వంపై ఏదో ఒక రకంగా నిత్యం బురద జల్లడమే పనిగా రామోజీరావు వ్యవహరిస్తున్నారని మంత్రి రమేశ్ మండిపడ్డారు. ఒకవైపు ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలు సరిపోవని గతంలో ఈనాడులోనే రాశారన్నారు. మరోవైపు ప్రభుత్వం నిర్దేశించిన ధరకు కొన్ని సంస్థలు ముందుకొచ్చి ఇళ్ల నిర్మాణం చేపడితే ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. 2024 మార్చి నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరుకు చెందిన మహిళకు బిల్లులు రాలేదని గతంలో ఈనాడులో తప్పుడు వార్తలు రాశారన్నారు. ఆ మహిళకు ప్రభుత్వం అప్పటికే రెండు బిల్లులు చెల్లించిందని, రామోజీ తప్పుడు వార్తను లబ్ధిదారురాలు ఖండించారని గుర్తు చేశారు.

పౌరసరఫరాల శాఖ అధికారుల నివాసాల్లో ఏసీబీ సోదాలు

రూ.29.87కోట్ల అవినీతి కేసులో..



నెల్లూరులో సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, నెల్లూరు/ఒంగోలు: ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలో పౌరసరఫరాల శాఖలో రూ.29.87 కోట్ల అవినీతికి పాల్పడిన ఐదుగురు అధికారులు, ఉద్యోగుల నివాసాల్లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) సోదాలు నిర్వహించింది. పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ పి.పద్మ, అసిస్టెంట్ మేనేజర్లు సీహెచ్.చల్లా జయశంకర్, ఎంవీవీడీ శర్మ, రికార్డ్ అసిస్టెంట్ పి.అరుణ కుమారి, డేటా ఎంట్రీ ఆపరేటర్ శివ కుమార్‌లకు విజయవాడ, ఒంగోలు, నెల్లూరుల్లో ఉన్న నివాసాల్లో ఏసీబీ బృందాలు బుధవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు తనిఖీలు కొనసాగించాయి. ఆ అధికారుల ఆస్తుల పత్రాలు, బంగారు, వెండి ఆభరణాలతోపాటు ఇతర విలువైన వస్తువులను ఏసీబీ జప్తు చేసింది. ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలో పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ కార్యాలయంలో ఈ ఏడాది మొదట్లో ఇంటర్నెల్ ఆడిట్ నిర్వహించగా అవినీతి వ్యవహారం బయటపడింది. 2020-21, 2021-22లకు సంబంధించి రూ.29.87 కోట్ల నిధులు దారి మళ్లినట్లు గుర్తించారు. దాంతో పి.పద్మ, చల్లా జయశంకర్, ఎంవీవీడీ శర్మ, టి.అరుణ కుమారి, శివ కుమార్‌లతోపాటు కాంట్రాక్టర్ చేజెర్ల దయాకర్, ప్రైవేటు వ్యక్తులు ఎం.రాడమ్మ, సూరి పవన్, చీపురుపల్లి రాజు, చేజెర్ల కామాక్షి, గరికిపాటి ప్రశాంతిలపై నెల్లూరులోని విద్యాధరపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అనంతరం ఆ కేసును ఏసీబీకి బదిలీ చేశారు. దీంతో వారిపై ఈ నెల 6న కేసు నమోదు చేసిన ఏసీబీ..బుధవారం అధికారులు, ఉద్యోగుల నివాసాల్లో సోదాలు నిర్వహించింది. సోదాలు పూర్తి అయిన తరువాత ఆధారాలను బట్టి తదుపరి చర్యలు తీసుకోనుంది.

6ఏ కేసులను త్వరగా పరిష్కరించాలి

పౌర సరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత, జప్తునకు సంబంధించి 6ఏ కేసులను త్వరగా పరిష్కరించాలని ఆయా జిల్లాల కలెక్టర్లు, జేసీలను పౌర సరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ ఆదేశించారు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి పక్కదారి పట్టిన పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేస్తే.. వాటిని తిరిగి రేషన్ దుకాణాల్లో పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. పీడీఎస్ నుంచి బయటకొచ్చి మార్కెట్‌లో అక్రమ నిల్వలు, లారీల్లో తరలిస్తూ పట్టుబడ్డ బియ్యాన్ని ప్రత్యేక కమిటీ నిర్ణయించిన రేటు ఆధారంగా ప్రతి నెలా మొదటి, మూడో శుక్రవారం లేదా శనివారం బహిరంగ వేలం నిర్వహించాలని సూచించారు. సీజ్ చేసిన బియ్యాన్ని నిల్వ చేయడంలో చాలా సమస్యలు ఎదురవుతున్నాయని.. ముఖ్యంగా గోడౌన్లు ఖాళీ లేకపోవడం, ఎక్కువ కాలం నిల్వ ఉండటంతో బియ్యం పాడవుతున్నాయని అరుణ్‌కుమార్ చెప్పారు.

జూన్ నాటికి పట్టణ సర్వే పూర్తిచేయాలి

- 123 యూఎల్‌బీల్లో రూ.120 కోట్లతో సర్వే
- కోటిన్నర మంది ప్రజలకు ప్రయోజనం
- మంత్రి ఆదిమూలపు సురేష్



సాక్షి, అమరావతి: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం కింద పట్టణ స్థానిక సంస్థ (యూఎల్‌బీ)ల పరిధిలో సర్వే పనుల్ని జూన్ నాటికి పూర్తిచేయాలని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అధికారుల్ని ఆదేశించారు. దాదాపు 15 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 123 పురపాలక సంఘాల పరిధిలో చేపట్టిన ఈ సర్వేని పటిష్టంగా చేయాలని సూచించారు. రూ.120 కోట్లతో చేపట్టిన ఈ సర్వే వల్ల కోటిన్నరమంది ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో తలపెట్టిన సర్వే పనుల ప్రగతిపై ఆయన బుధవారం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చాక పట్టణ ప్రాంత ప్రజలకు మేలు చేకూరే విధంగా వారి భూములు, స్థలాలు, ఆస్తులను పటిష్టంగా సర్వేచేసి సరిహద్దులు ఏర్పాటుచేసి భూహక్కు పత్రాలు ఇచ్చే బృహత్తర కార్యక్రమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని చెప్పారు. దేశంలో ఏ ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో ఇలాంటి పథకాన్ని చేపట్టలేదని, గత వందేళ్లలో ఏ ప్రభుత్వం చేయని సాహసాన్ని సీఎం తలపెట్టారని పేర్కొన్నారు. ఈ సర్వే కోసం రెవెన్యూ, పంచాయతీరాజ్, పురపాలక శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఇప్పటికే వార్డు సచివాలయాల నుంచి అవసరమైన సిబ్బందికి శిక్షణ ఇచ్చామని, డ్రోన్ సర్వేని కూడా ప్రారంభించాలని చెప్పారు. ఈ పథకం సమగ్ర సమాచారంతో ఎస్వోపీ తయారు చేయాలని ఆదేశించారు. సర్వేకు అవసరమైన సాంకేతిక పరికరాలైన రోవర్స్, ట్యాబ్, ప్రింటర్స్ వంటివాటిని తక్షణమే సమకూర్చుకోవాలని సూచించారు. ప్రత్యేక డాష్ బోర్డు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేయాలన్నారు. తద్వారా పథకం పురోగతిని సమీక్షించడంతో పాటు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

నేటి నుంచి యూఎల్బీల్లో డ్రోన్లతో మ్యాపింగ్

సీడీఎంఏ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం సర్వే పనులు చేపడుతున్నామని మంత్రికి చెప్పారు. రాజమహేంద్రవరం, గుంటూరు, అనంతపురం, విశాఖపట్నం రీజియన్లుగా డ్రోన్ ఫ్లయింగ్ షెడ్యూల్ రూపొందించుకున్నట్లు తెలిపారు. రాజమహేంద్రవరం, అనంతపురం, గుంటూరు రీజియన్లలో గురువారం మ్యాపింగ్ పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. అర్బన్ సర్వేపై ఇప్పటికే 20 వేల మంది వార్డు సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చామని, అన్ని యూఎల్‌బీల్లో సర్వేకోసం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశామని ఆయన వివరించారు. ఇప్పటికే సీడీఎంఏలో సెంట్రల్ మానిటరింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసి పనులు ప్రారంభించారు. దాదాపు 40 లక్షల ఆస్తులను సర్వేచేసేందుకు అవసరమైన ప్రణాళికను రూపొందించారు. ఈ సమావేశంలో అర్బన్ సర్వే ప్రత్యేకాధికారి సుబ్బారావు, డీటీసీపీ విద్యుల్లత, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రైతులకు జీపీఏ సర్టిఫికేషన్

నేటినుంచి పొలం బడుల్లో రైతులు, వీపీఏలకు శిక్షణ



జీఏపీ సర్టిఫికేషన్‌పై పొలంబడి శిక్షణ ఇస్తున్న ఎఫ్ఏవో అధికారులు

సాక్షి, అమరావతి: రసాయన అవశేషాలు లేని పంటల ధ్రువీకరణ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటిస్తూ నాణ్యమైన దిగుబడులు సాధించే రైతులకు గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ (జీఏపీ) సర్టిఫికేషన్ ఇచ్చేలా కసరత్తు చేస్తోంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించేలా రైతులను తీర్చిదిద్దేందుకు 2019లో శ్రీకారం చుట్టిన వైఎస్సార్ పొలం బడులను ప్రామాణికంగా తీసుకుని జీఏపీ సర్టిఫికేషన్ జారీ చేయనుంది. సేంద్రియ ధ్రువీకరణ కోసం ఏపీ స్టేట్ సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీకి అనుబంధంగా ఏపీ స్టేట్ ఆర్గానిక్ ప్రోడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ (ఏపీ ఎస్‌వోపీసీఏ)ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కాగా, జీఏపీ సర్టిఫికేషన్ కోసం క్వాలిటీ కంట్రోల్ కమిషన్ ఆఫ్ ఇండియా (క్యూసీఐ) నుంచి, ఆర్గానిక్ సర్టిఫికేషన్ కోసం ప్రాసెస్ చేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధి సంస్థ (ఎపెడా) నుంచి గుర్తింపు రానుంది.

ఎఫ్ఏవో ద్వారా శిక్షణ

వైఎస్సార్ పొలం బడుల్లో మూడేళ్లుగా శిక్షణ పొందుతున్న రైతులకు ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏవో), భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్)తో కలిసి ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలు తుది దశకు చేరుకున్నాయి. అక్టోబర్‌లో రాష్ట్ర , జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. కాగా, ఈ నెల 10వ తేదీ నుంచి నెలాఖరు వరకు క్లస్టర్ పరిధిలో గుర్తించిన రైతులు, ఆర్బీకేల్లో పనిచేస్తున్న వీఏఏలకు శిక్షణ ఇవ్వనున్నారు. చివరగా డిసెంబర్‌లో డివిజన్ స్థాయిలో నాన్‌క్లస్టర్ పరిధిలోని వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఎలకు పొలం బడుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. రబీలో అత్యుత్తమ యాజమాన్య పద్ధతులను పాటించిన రైతులకు వచ్చే ఖరీఫ్ సీజన్‌లో జీఏపీ సర్టిఫికేషన్ జారీ చేయనున్నారు. ఈ సర్టిఫికెట్‌తో రైతులు వారి ఉత్పత్తులను అమెరికా, యూరోపియన్ దేశాల్లోని అంతర్జాతీయ మార్కెట్లలో మంచి ధరకు అమ్ముకునే అవకాశం కలుగుతుంది.

రబీలో 7,991 పొలం బడులు

కాగా, 2022-23 సీజన్‌లో 17 వేల పొలం బడుల ద్వారా 5.10 లక్షల మందికి శిక్షణ ఇవ్వాలని వ్యవసాయ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. గడచిన ఖరీఫ్ సీజన్‌లో 8,509 పొలం బడుల ద్వారా 2.55 లక్షల మందికి శిక్షణ ఇవ్వగా, ప్రస్తుత రబీ సీజన్‌లో 7,991 పొలం బడుల ద్వారా 2.4 లక్షల మందికి శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రధానంగా వరిలో 2,828, అపరాల్లో 2,720, వేరుశనగలో 1,220, మొక్కజొన్నలో 834, నువ్వులులో 223, చిరుధాన్యాల్లో 142, పొద్దుతిరుగుడులో 24 పొలం బడులు నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు.

కుటుంబ కలహాలతో రాజకీయం దారుణం

- చంద్రబాబు, లోకేష్‌లపై కొత్ర రామారావు సోదరుడు కృష్ణారావు మండిపాటు
- టీడీపీ పాలనలోనే అన్యాయం జరిగిందని ఆవేదన



మందస: కుటుంబ కలహాలను టీడీపీ నేతలు చంద్రబాబు, లోకేశ్‌రాజకీయ లబ్ధికి వాడుకుంటున్నారని శ్రీకాకుళం జిల్లా మందస మండలం హరిపురంలో జరిగిన ఘటనకు సంబంధించి కొత్ర రామారావు సోదరుడు కృష్ణారావు ధ్వజమెత్తారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తమ కుటుంబ సమస్యగా ఉన్న భూ తగాదాపై అత్యుత్సాహంతో వారు ట్వీట్లు పెట్టాల్సిన అవసరం ఏమిటని నిలదీశారు. తమ స్థల వివాదం కోర్టులో ఉందని, రాజకీయం చేయవద్దని ఆయన కోరారు. తమ కుటుంబంలో ఆస్తి తగాదాలకు తెలుగుదేశం పార్టీయే మూల కారణమని కృష్ణారావు ఆరోపించారు. తాను గౌరి అనే అమ్మాయిని ప్రేమ వివాహం చేసుకుంటానని చెప్పగా, తన తండ్రి దామోదరరావు వ్యతిరేకించి ఇంటి నుంచి వెళ్లగొట్టాడన్నారు. తండ్రి మరణానంతరం ఆస్తిలో వాటా కావాలని అడిగితే 2016-2018 మధ్య తెలుగుదేశం పార్టీ నాయకుల ద్వారా రికార్డులను మార్చేశారన్నారు. పెద్దల రాజీ కూడా ఫలించలేదని చెప్పారు. ఈ వివాదం ముదిరి పిన తల్లి కొత్ర దాలమ్మ, చెల్లెలు మజ్జి సావిత్రిపై ఘటనా స్థలంలోనే కంకర మట్టి వేశారన్నారు. దీంతో మందస పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.



నిజమైన స్నేహితులను ఆకర్షించే అయస్కాంతం మీ హృదయంలో ఉంది. అదేమిటంటే, నిస్వార్థం. ఎప్పుడు నువ్వు ఇతరుల కోసం జీవించడం మొదలుపెడతావో, అప్పుడు వాళ్లు నీ కోసం జీవిస్తారు.

– పరమహంస యోగానంద

సాక్షి

గురువారం, నవంబర్, 10

సమయానికి దక్కిన సదవకాశం

ఇప్పటికీ వెంటాడుతున్న కరోనా కష్టాలు... పెరుగుతున్న భౌగోళిక- రాజకీయ ఉద్రిక్తతలు... అంతూపొంతూ లేని రష్యా – ఉక్రెయిన్ యుద్ధం... పెరుగుతున్న చైనా దూకుడు... ప్రపంచం సంక్షోభాలతో నిండిన సంధికాలమిది. ఈ సమయంలో అందివచ్చిన అవకాశమంటే ఇదే. అంతర్జాతీయ ఆర్థిక సహకారంలో కీలకమైన 20 దేశాల కూటమి 'జీ20'కి ఏడాది పాటు భారత్ పగ్గాలు చేపట్టనుంది. తొలిసారి దక్కిన పట్టం సంతోషదాయకమే కాక ప్రపంచపటంపై అవిస్మరణీయ నేతగా ఎదుగుతున్న మన సత్తాను చాటేందుకు సరైన సందర్భం. ఏడాదిగా ఇండోనేసియా, ఇప్పుడు ఇండియా, తర్వాత బ్రెజిల్ – మూడు ప్రవర్ధమాన ఆర్థిక వ్యవస్థలు 2022 నుంచి 2024 దాకా జీ20కి సారథ్యం వహిస్తుండడం విశేషం. గ్లోబల్ సౌత్ దేశాల ఆందోళనలను తీర్చడానికి ఇది సదవకాశం.

ప్రపంచంలో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలైన ఈ 20 దేశాల కూటమి 1999లో ఏర్పడింది. భారత్‌తో పాటు చైనా, అమెరికా, రష్యా, బ్రిటన్, ఐరోపా సమాజం, అర్జెంటీనా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇండోనేసియా, ఇటలీ, జపాన్, మెక్సికో, సౌదీ అరేబియా, సౌతాఫ్రికా, టర్కీలు దీనిలో సభ్యదేశాలు. ప్రపంచ జనాభాలో మూడింట రెండు వంతుల మంది ఈ దేశాల ప్రజలే. ప్రపంచ భూభాగంలో 50 శాతం ఈ దేశాల కిందకే వస్తుంది. ప్రపంచ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 80 శాతానికి పైగా ఈ దేశాల వాటాయే. అంతర్జాతీయ వాణిజ్యంలో 75 శాతం వీటిదే. జీ20 కీలకమనేది అందుకే. 2008లో ఆర్థిక మాంద్యం తర్వాత నుంచి ఈ దేశాలు ఏటా సమావేశమవుతూ, వంతుల వారీగా అధ్యక్ష బాధ్యతలు వహిస్తున్నాయి. చర్చల ద్వారా ప్రపంచ ఆర్థిక, అభివృద్ధి ప్రాధాన్యాలను తీర్చిదిద్దే పనిని శక్తిమంతమైన ఈ అంతర్జాతీయ వేదిక భుజానికి ఎత్తుకుంది. అలాగే, వర్తమాన సంక్షోభాలకు పరిష్కారాల దిశగా ప్రయత్నిస్తుంది. ఈ కీలక కూటమికి ఈ డిసెంబర్ 1 నుంచి ఏడాది పాటు భారత్ అధ్యక్షత వహించనుంది.

జీ20 భారత సారథ్యానికి సంబంధించి ప్రధాని మోదీ కమలం చిహ్నాన్నీ, 'వసుధైవ కుటుంబకం' అంటూ 'ఒకే పుడమి, ఒకే కుటుంబం, ఒకటే భవిత' అనే ఇతివృత్తాన్నీ, ప్రత్యేక వెబ్‌సైట్‌నూ మంగళవారం ఆవిష్కరించారు. బీజేపీ ఎన్నికల చిహ్నమైన కమలాన్ని పోలి ఉంటూ, అదే కాషాయ, హరిత వర్ణాలతో ఆ లోగో ఉండడం సహజంగానే ప్రతిపక్షాల విమర్శలకు గురవుతోంది. అది జాతీయ పుష్పమైన కమలమనీ, ఆశావహ దృక్పథానికి గుర్తుగా పెట్టామనీ పాలక వర్గాలు ఎంత సమర్థించుకోవాలని చూస్తున్నా, వాడిన రంగులతో సహా అనేక అంశాల్లో విమర్శలకు తావివ్వకుండా ఉండాల్సింది. కరోనా టీకా సర్టిఫికెట్లపై ఫోటో ప్రచారం, పార్లమెంట్‌పై ఉగ్రసింహాల చిహ్నం లాంటివి ఒక స్థాయికే పరిమితం. కానీ, ప్రపంచవేదికపై దేశ ప్రతిష్ఠను నిలపాల్సిన వేళ చిల్లర రాజకీయాలకు చోటివ్వకపోవడమే ఎవరికైనా శోభస్కరం. నిత్యం మాటల మార్కెటింగ్ కన్నా, నిజానికి జీ20 సారథిగా భారత్‌కు చేయడానికి చాలా పని ఉంది. స్వీయ అధ్యక్షతన దాదాపు 32 రంగాలపై జరిగే 200 సమావేశాలకు స్పష్టమైన లక్ష్యాలు పెట్టుకోవడం కీలకం.

ఈ డిసెంబర్ నుంచి వచ్చే ఏడాది నవంబర్ 30 వరకు జీ20 సారథిగా దక్కిన అవకాశాన్ని భారత్ పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి. ప్రస్తుతం జీ20కి నేతృత్వం వహిస్తున్న ఇండోనేసియా ప్రపంచ ఆరోగ్య నిర్మాణ వ్యవస్థ, డిజిటల్ రూపాంతరీకరణ, సుస్థిర ఇంధన మార్పు అనే మూడింటిని ప్రాధాన్యాలుగా ఎంచుకుంది. రేపు ఆ దేశం నుంచి పగ్గాలు అందుకొనే భారత్ ఆ ప్రాధాన్యాలను కొనసాగేలా చూడాలి. పర్యావరణ పరిరక్షణకు కార్యాచరణ, ఇంధన భద్రత, మరింత పటిష్ఠమైన ప్రజారోగ్య వ్యవస్థలు, ప్రజా శ్రేయానికి సాంకేతిక విజ్ఞానం, 2030 నాటికి నిర్దేశించుకున్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్డీజీల)పై దృష్టి పెట్టాలి. నిర్మాణాత్మకమైన నాయకత్వం అందించాలి. ముఖ్యంగా నవోదయ, పేద దేశాలకు అనుకూల అజెండాను నిర్ణయించేలా తన అధ్యక్ష హోదాను వినియోగించాలి. ప్రత్యేకించి, వ్యవసాయం, ఆహార సబ్సిడీల్లో వర్ధమాన దేశాలకు వ్యతిరేకంగా దీర్ఘకాలంగా ఉన్న వ్యత్యాసాలను సరిదిద్దడానికీ భారత్‌కు ఇదే సువర్ణావకాశం.

జీ20లోని అభివృద్ధి చెందిన దేశాలు సాధారణంగా సబ్సిడీ లాంటి అంశాలపై వర్ధమాన దేశాల్ని ఇరుకునపెడుతుంటాయి. భారత్ వాటికి తమ స్వస్వరూపం తెలిసేలా వాస్తవ దర్పణం చూపాలి. వాతావరణ మార్పు ప్రపంచాన్ని తీవ్రంగా భయపెడుతున్న నేపథ్యంలో కర్బన ఉద్గారాలు, పునరుద్ధరణీయ ఇంధనం విషయంలో పెట్టుకున్న లక్ష్యాలకు కట్టుబడి ఉండేలా, వర్ధమాన ప్రపంచానికి ఇచ్చిన హామీలను నెరవేర్చేలా అభివృద్ధి చెందిన దేశాలపై భారత్ ఒత్తిడి తేవాలి.

అలాగే, రష్యా, ఉక్రెయిన్‌ల యుద్ధం ముగిసేలా మధ్యవర్తిత్వ పాత్ర పోషించవచ్చు. 'నాటో'లో ఉక్రెయిన్ సభ్యత్వ అంశాన్ని ప్రస్తుతానికి ఆపమంటూ పాశ్చాత్య ప్రపంచాన్ని కోరాలి. సేనల్ని ఉపసంహరించుకొని, దౌత్యమార్గంలో సమస్యల్ని పరిష్కరించుకొనేలా రష్యాను అభ్యర్థించాలి. ఇటు రష్యాతో, అటు పాశ్చాత్య ప్రపంచంతో బలమైన సంబంధాలున్న మన దేశం అలా ప్రస్తుత ప్రతిష్టంభనను తొలగించేందుకు తోడ్పడాలి. తాజాగా తన రష్యా సహచరుడితో భేటీలో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ అన్నట్టు ప్రపంచం ఇప్పుడు బహుళ ధ్రువమవుతూ, కొత్త సమతూకం సాధించే దిశగా నడుస్తోంది. ఈ కీలకవేళ జీ20తో పాటు వచ్చే ఏడాది షాంఘై సహకార సంఘం (ఎస్సీఓ) సారథ్యమూ చేపట్టనున్న భారత్ ప్రపంచపటంపై కొత్త చరిత్ర లిఖిస్తే అంతకన్నా ఇంకేం కావాలి!

తప్పుడు లెక్కలకే రామోజీ 'పెద్ద పీట'


- దీర్ఘకాలంగా పనిచేస్తున్న 53 మంది డీఎస్పీలను బదిలీ చేసిన ప్రభుత్వం..
- కానీ 30 మందిలో 11మంది ఒకే సామాజిక వర్గమంటూ 'ఈనాడు' వక్రభాష్యం
- వాళ్లు ఇప్పటిదాకా డీఎస్పీలేగా? ఇపుడు ప్రాధాన్యం ఇచ్చారంటే ఏమిటి అర్థం?..
- ఇప్పటిదాకా వారు ప్రాధాన్యం లేకుండా... వివక్షకు గురయ్యారన్నది నిజమేనా?
- పనితీరు, సమర్థత ఆధారంగానే బదిలీలు చేసిన ప్రభుత్వం..
- టీడీపీ తీరుకు భిన్నంగా పారదర్శకంగా బదిలీలు చేస్తే రాద్ధాంతం చేస్తున్న పచ్చ బ్యాచ్

అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయిన వారికి ఎన్నికల ముందు కీలక పోస్టింగులిచ్చి, పోలీసు వ్యవస్థను భ్రష్టుపట్టించిన చరిత్ర చంద్రబాబుది. దాన్ని చూసి మనోడు కదా అని పెన్నెత్తని బాపతు రామోజీరావు!. వీళ్లంతా కలిసి ఈ రాష్ట్రంలో జరుగుతున్న ప్రతి వ్యవహారానికీ రాజకీయం రంగు పులమటమే ప్రతిరోజూ పచ్చ పత్రికల సాక్షిగా ఆవిష్కారమవుతున్న చిత్రం!!. "డీఎస్పీల బదిలీల్లో ఒక వర్గానికే పెద్దపీట... 30 మందిలో 11 మందిది ఒకే సామాజిక వర్గం" అని బుధవారం 'ఈనాడు' అచ్చేసిన కథనం ఎంత పచ్చి అబద్ధమో చెప్పటానికి కొన్ని ఉదాహరణలు చూద్దాం.

నెల్లూరు రూరల్ డీఎస్పీగా ఇప్పటిదాకా వై.హరినాథ్ రెడ్డి ఉండేవారు. తాజా బదిలీల్లో ఆయన స్థానంలోకి పి.వీరాంజనేయ రెడ్డి వచ్చారు. మరి ఇద్దరూ ఒక సామాజిక వర్గం వారే కదా? కానీ వీరాంజనేయ రెడ్డిని నెల్లూరు రూరల్‌కు బదిలీ చేయటం ద్వారా అయనకు పెద్ద పీట వేశారని 'ఈనాడు' రాసిందంటే ఏమిటర్థం?

అనంతపురం డీఎస్పీగా జి.వీరరాఘవరెడ్డి ఉండేవారు. ఇపుడు ఆ స్థానంలోకి అనంతపురం ట్రాఫిక్ డీఎస్పీగా ఉన్న జి.ప్రసాదరెడ్డి వచ్చారు. ఈ బదిలీ ద్వారా ప్రసాదరెడ్డికి పెద్దపీట వేశారనేది 'ఈనాడు' రాతల పరమార్థం. మరి వీరరాఘవరెడ్డిని వేరేచోటికి మార్చిన విషయం ఎందుకు రాయలేదు? అసలు అనంతపురం డీఎస్పీగా ఇప్పటివరకు అదే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ఉన్నారని ఎందుకు ప్రస్తావించలేదు రామోజీ?

'ఈనాడు' రాతల ప్రకారమే చూసుకున్నా.... నరసాపురం డీఎస్పీగా ఉన్న పి.వీరాంజనేయరెడ్డి నెల్లూరు రూరల్ డీఎస్పీగా బదిలీ అయ్యారు. చిత్తూరు డీఎస్పీగా ఉన్న ఎస్.సుధాకరరెడ్డి పలమనేరు డీఎస్పీగా వెళ్లారు. గూడూరు డీఎస్పీగా ఉన్న ఎం.రాజగోపాలరెడ్డి నాయుడుపేట డీఎస్పీగా... నెల్లూరు రూరల్ డీఎస్పీగా ఉన్న హరినాథ్‌రెడ్డి టెక్కలి డీఎస్పీగా నియమితులయ్యారు. ఒక జిల్లా డీఎస్పీగా ఉండి కొత్తగా ఏర్పడిన మరో సబ్ డివిజన్‌కో, మరో జిల్లాకో డీఎస్పీగా వెళితే అది పెద్దపీట వేయటమా? ఎందుకు రామోజీరావు ఈ దౌర్భాగ్యపు రాతలు? ఇంకెన్నాళ్లీ పనికిమాలిన పాత్రికేయం?



టీడీపీ కార్యాలయం నుంచి వచ్చిన సమాచారాన్ని యథాతథంగా ప్రచురించిందంటే 'ఈనాడు'ను ఏమనుకోవాలి? ఈ వార్తలో నిజానిజాల్ని కాస్తయినా సరి చూసుకోవాలి కదా? అసలు డీఎస్పీల బదిలీల్లో ఎల్లో మీడియా వెళ్లగక్కిన అక్కసంతా అబద్ధమే. ప్రభుత్వం 53 మంది డీఎస్పీలను బదిలీ చేసింది. కానీ చిత్రంగా 'ఈనాడు' మాత్రం 30 మంది డీఎస్పీల పదోన్నతుల్లోనే ఒక సామాజికవర్గానికి పెద్దపీట అంటూ వక్రభాష్యం చెప్పింది. 30 మంది డీఎస్పీల బదిలీలను ప్రస్తావించి అందులో 11 మంది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారంటూ... ఈ వర్గానికి 37 శాతం పోస్టింగులిచ్చారంటూ అడ్డగోలుగా రాసి పారేసింది. నిజానికి ప్రభుత్వం బదిలీ చేసింది 53 మంది డీఎస్పీలను. దాన్ని దాచిపెట్టి తాను చెప్పిందే నిజంగా విషం గక్కే ప్రయత్నం చేశారు రామోజీరావు. అంటే మిగిలిన 23 మంది డీఎస్పీలు కారా? పోలీసు శాఖలో శాంతిభద్రతల విభాగంతోపాటు ఇంటెలిజెన్స్, క్రైమ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్), విజిలెన్స్–ఎన్‌ఫోర్స్‌మెంట్, దిశ వంటి విభాగాలన్నీ కీలకమైనవే. పోలీసులు తమ సర్వీసు కాలంలో ఈ అన్ని విభాగాల్లోనూ విధులు నిర్వహిస్తారు. ఒక విభాగం నుంచి మరో విభాగానికి బదిలీలు చేయడమన్నది సర్వ సాధారణం. ఏ అధికారినీ ఒకే విభాగంలో దీర్ఘకాలం పరిమితం చేయకూడదు. ఇవేవీ 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు, ఆయనకు కొమ్ముకాసే పచ్చ మీడియాకు తెలియనివి కావు. టీడీపీ ప్రతిపక్షంలో ఉంటే... ఎల్లో మీడియాకు అల్జీమర్స్ సోకి చట్టాలు, నిబంధనలు, సర్వీస్ రూల్స్ అన్నీ మర్చిపోతుంది

ఇప్పటిదాకా వాళ్లకు 'పెద్దపీట' లేనట్టేగా రామోజీ?

విచిత్రమేంటంటే 'ఈనాడు' ఒకోసారి తనకు తెలియకుండానే నిజాలను ఒప్పేసుకుంటుంది. ఈ 11 మందికీ వివిధ జిల్లాల సబ్ డివిజన్లకు డీఎస్పీలుగా నియమించటం ద్వారా వారికి పెద్ద పీట వేశారన్నది రామోజీరావు ఆక్రోశం. అంటే... ఇప్పటిదాకా వాళ్లు 'పెద్ద పీట' లేని పోస్టుల్లో ఉన్నారనేనా మీ అర్థం రామోజీ రావు గారూ? వాళ్లను అలాంటి పోస్టుల్లోకి నెట్టేసింది మీ చంద్రబాబు ప్రభుత్వమని మీరు చెప్పకనే చెబుతున్నారా? మీ బాబు సర్కారు వారి విషయంలో వివక్ష చూపించిందని మీరు అంగీకరిస్తున్నారా? అయినా ఒక్కటి నిజం. వాళ్లంతా గతంలోనూ డీఎస్పీలే. ఇప్పుడూ డీఎస్పీలే. వాళ్లకు పదోన్నతులివ్వటమో, వేరే ప్రాంతం నుంచో, వేరే విభాగం నుంచో తీసుకు రాలేదు. రాష్ట్రంలో ఉన్న డీఎస్పీలనే... కొందరిని ఒక చోటి నుంచి మరో చోటికి సాధారణ బదిలీల్లో భాగంగా మార్చారు. దీన్ని పట్టుకుని... దీనిక్కూడా రాజకీయం, కులం అంటగడుతూ విషప్రచారానికి దిగటమంటే మిమ్మల్ని ఏమనుకోవాలి రామోజీ? రానురాను మరీ హద్దుల్లేనట్లుగా ఇంత పాతాళానికి దిగజారిపోతున్నారేంటి? తెలుగుదేశం కోసం... మీ చంద్రబాబు కోసం ఎంతకు దిగజారినా తప్పులేదనే మీ భక్తిప్రపత్తులు మెచ్చుకోదగ్గవే కావచ్చు. కానీ ప్రజా ప్రయోజనాలంటూ కొన్ని ఉంటాయిగా!. ఒక పత్రికాధిపతిగా వాటిని గౌరవించాల్సిన బాధ్యతను అప్పుడప్పుడైనా నెరవేర్చడం మంచిది.

ప్రమాణాలకు అనుగుణంగానే బదిలీలు..

పోలీసు శాఖలో నిర్దిష్ట ప్రమాణాలకు అనుగుణంగానే డీఎస్పీలను ప్రభుత్వం బదిలీ చేసింది. కొత్తగా ఎవరికి డీఎస్పీగా పదోన్నతి కల్పించింది లేదు. అప్పటికే డీఎస్పీలుగా ఉన్నవారిని ప్రధానంగా పనితీరు, సమర్థతతో పాటు దీర్ఘకాలంగా ఉన్న పోస్టు వంటివి పరిగణలోకి తీసుకుంది. జిల్లాల పునర్విభజనకు అనుగుణంగా కొత్త పోలీస్ సబ్ డివిజన్లను ఏర్పాటు చేయటంతో అక్కడ డీఎస్పీలను నియమించాల్సి వచ్చింది. ఈ బదిలీలపై పోలీసు శాఖలో సానుకూల స్పందన వ్యక్తమవుతుండగా... దీన్ని సహించలేని టీడీపీ తమ అనుకూల మీడియాను అడ్డం పెట్టుకుని ప్రభుత్వం బురదజల్లటం అందరికీ తెలుస్తూనే ఉంది.



ఇలా చేయటం తప్పా రామోజీ?

- గూడురు పోలీస్ సబ్ డివిజన్‌ను విభజించి కొత్తగా నాయుడుపేట సబ్ డివిజన్‌ను ఏర్పాటు చేశారు. దాంతో నాయుడుపేటకు కొత్తగా డీఎస్పీని నియమించాల్సి వచ్చింది. అప్పటివరకు గూడూరు డీఎస్పీగా ఉన్న అధికారిని నాయుడుపేటకు కేటాయించి... గూడూరుకు కొత్త డీఎస్పీని బదిలీ చేశారు. కానీ ఆయనకు ఏదో కొత్తగా పోస్టింగు ఇచ్చినట్టుగా వక్రీకరించటం కరెక్టా?
- ఐదారేళ్లుగా పలువురు డీఎస్పీలు శాంతిభద్రతల విభాగంలో కాకుండా పోలీసు శాఖలోని ఇతర విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో వారు ఇతర విభాగాల్లో ఉన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో కూడా మూడేళ్లుగా అవే విభాగాల్లో కొనసాగుతున్నారు. నిబంధనల ప్రకారం వారిని శాంతిభద్రతల విభాగానికి బదిలీ చేయాలి. ఇప్పటివరకు శాంతిభద్రతల విభాగంలో ఉన్నవారిని ఇతర కీలక విభాగాలైన ఇంటెలిజెన్స్, సెబ్ వంటి విభాగాలకు కేటాయించాలి. ప్రభుత్వం అదే చేసింది.
- పనితీరు, సమర్థతలను ప్రభుత్వం ప్రధాన ప్రాతిపదికగా తీసుకుంది. కొత్తగా ఏర్పాటు చేసిన 'సెబ్'లో పలువురు అధికారులు సమర్థంగా పని చేశారు. వారిని ప్రభుత్వం గుర్తించి శాంతిభద్రతల విభాగానికి బదిలీ చేసింది. ఈ నిర్ణయాన్ని కూడా తప్పుబడతారా?
- కొందరు డీఎస్పీలు వ్యక్తిగత కారణాలతో చేసిన విజ్ఞప్తులను ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంది. గర్భిణి అయిన ఓ మహిళా అధికారి తనను కొన్నాళ్లు శాంతిభద్రతల విభాగానికి కేటాయించవద్దని కోరారు. దాంతో ఆమెను ఇతర విభాగానికి బదిలీ చేశారు. దీన్ని కూడా విమర్శిస్తారా?
- ఇక చంద్రబాబు సామాజికవర్గానికి చెందిన ఇద్దరు డీఎస్పీలను ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో కీలకమైన స్థానాల్లో శాంతిభద్రతల విభాగం డీఎస్పీలుగా నియమించారు. దీన్నెందుకు ప్రస్తావించరు రామోజీ?

బరితెగింపు అంతా... బాబు హయాంలోనే

- పచ్చ కామెర్ల రోగికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుంది. 2019 ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడేందుకు టీడీపీ ప్రభుత్వం ఒక పథకం ప్రకారం పోలీసు వ్యవస్థను భ్రష్టుపట్టించింది. తమ అస్మదీయులు, సామాజికవర్గానికి చెందినవారికి ఇష్టానుసారంగా సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతులిచ్చింది. తీవ్ర ఆరోపణలున్న డీఎస్పీలను సస్పెండ్ చేయకుండా కీలక పోస్టింగులిచ్చేసింది.
- ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలో ఓ డీఎస్పీపై తీవ్ర ఆరోపణలు రావడంతో ఆయనపై విచారణ నిర్వహించారు. టీడీపీ సీనియర్ నేత పయ్యావుల కేశవ్‌కు బంధువు అయిన ఆ అధికారికి బాబు ప్రభుత్వం కొమ్ముకాసింది. ఆయనపై చర్యలు తీసుకోకుండా మరో ఉన్నతాధికారిని బాధ్యుడిని చేసి... ఆ డీఎస్పీకి 2019 ఎన్నికల ముందు మంగళగిరి నియోజకవర్గంలో పోస్టింగు ఇచ్చింది. నారా లోకేశ్ పోటీ చేసిన ఆ నియోజకవర్గంలో ఆ అధికారి టీడీపీకి అనుకూలంగా పనిచేశారన్నది బహిరంగ రహస్యం. కర్నూలు జిల్లాలో తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న మరో డీఎస్పీపై కూడా చర్యలు తీసుకోకుండా ఎన్నికల ముందు కీలక స్థానంలో పోస్టింగు ఇచ్చింది. ఇవన్నీ చేశారు కాబట్టే... సహజంగా జరిగిన బదిలీలను కూడా రాజకీయ కోణంలో చూడగలుగుతున్నారు వీరు. అదీ లెక్క.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు
కార్తీక మాసం, **తిథి:** బ.విదియ సా.4.58 వరకు, తదుపరి తదియ
నక్షత్రం: రోహిణి తె.4.31 వరకు (తెల్లవారితే గురువారం), తదుపరి మృగశిర, **వర్జ్యం:** రా.7.57 నుండి 9.37 వరకు
దుర్ముహూర్తం: ఉ.9.52 నుండి 10.36 వరకు, తదుపరి ప.2.23 నుండి 3.06 వరకు, **అమృతఘడియలు:** రా.1.02 నుండి 2.44 వరకు.

సూర్యోదయం : 6.06
సూర్యాస్తమయం: 5.23
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

సోషల్ మీడియా

అభినందనలు



భారత 50వ ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన సందర్భంగా డాక్టర్ జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు హృదయపూర్వక శుభాభినందనలు. సత్వర న్యాయం అందేలా అతి సన్నిహిత సమన్వయంతో పనిచేసేందుకు ఎదురుచూస్తున్నాను. – కిరెన్ రిజిజు, కేంద్ర న్యాయశాఖా మంత్రి

విజయం మనదే



నా పేరు నబీలా సయ్యద్. నేను 23 ఏళ్ల ముస్లిం, ఇండియన్–అమెరికన్ మహిళను. మేము ఇప్పుడే రిపబ్లికన్‌ల చేతిలో ఉన్న సబర్బన్ జిల్లాను చేజిక్కించుకున్నాం. ఇక జనవరిలో, ఇల్లినోయ్ జనరల్ అసెంబ్లీలో అతి పిన్న వయసు సభ్యురాలిని అవుతాను. – నబీలా సయ్యద్, డెమొక్రాట్ అభ్యర్థి (అమెరికా)

అమర్యాద



నాకున్న సమాచారం మేరకు, రాష్ట్రపతి భవన్‌లో భారత ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధాని మోదీ గైర్హాజరీ అహంకారమని అనుకోవాల్సి వస్తుంది. అది భారత రాజ్యాంగానికీ, భారతీయ సంస్కారానికీ తగనిది. వివరణతోనో, క్షమాపణతోనో మోదీ రాకపోతే ఆయన చర్య నిరసించదగినది. – సుబ్రమణియన్ స్వామి, కేంద్ర మాజీ మంత్రి

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

ముస్లింల ప్రాతినిధ్యం పెరగాలి

అభిప్రాయం



ఎమ్‌డీ ఉస్మాన్ ఖాన్

స్వాతంత్ర్యం సిద్ధించి ఏడున్నర దశాబ్దాలైనా దేశంలో అనేక వర్గాలకు అభివృద్ధి ఫలాలు అందని ద్రాక్షలుగానే ఉన్నాయి. అందులో ముస్లింలు ముందు వరుసలో ఉన్నారు. అందుకే జస్టిస్ సచార్ నివేదిక వారిలో చాలా ఆశలు రేపింది. మిగతా వర్గాలతో పోలిస్తే ముస్లిం మైనారిటీల జీవన స్థితిగతులు ఏమాత్రం మెరుగ్గా లేవని నివేదిక తేల్చింది. అనేక వర్గాలు సామాజికంగా, రాజకీయంగా దూసుకుపోతుంటే ముస్లింలు మాత్రం ఈ పరుగు పందెంలో బాగా వెనుకబడ్డారు. పైగా అభద్రతా భావం పెరిగింది. ముస్లిం సమాజంలో పేదరికం కూడా ఎక్కువే. పల్లెటూళ్లలో సెంటు భూమికూడా లేనివారిలో ఎక్కువ మంది ముస్లింలే. దీంతో వారు రోజువారీ కూలీలుగా బతుకుతున్నారు. ఊళ్లలో ఉపాధి అవకాశాలు తగ్గడంతో చాలా మంది దగ్గరలోని నగరాలు, పట్టణాలవైపు వలస బాట పట్టారు. రోడ్ల పక్కన కాయలు, పండ్లు అమ్ముకోవటం, రిపేరింగ్ లాంటి పనులతో సరిపెట్టుకుంటున్నారు.

దేశ జనాభాలో ముస్లింల శాతం 14.9 అయినా ప్రభుత్వ ఉద్యోగాల్లో వాళ్ల శాతం 4.9కి మించిలేదు. కేంద్ర సర్వీసుల్లో మరీ తక్కువ (3.2 శాతం). సచార్ కమిటీ నివేదిక తర్వాత ఏర్పడిన అనేక కమిటీలు కూడా దేశంలోని ముస్లింల స్థితిగతులపై పెదవి విరిచాయి.

ముస్లిం సమాజం ఇప్పటికీ గుర్తింపు సమస్యలోనే కొట్టుమిట్టాడుతోంది. ముస్లిం సమాజంపై ఇప్పటికీ మిగతా సామాజిక వర్గాల్లో కొన్ని అపోహలు ఉన్నాయి. మతోన్మాద శక్తుల ప్రాబల్యం పెరగడంతో నిజాలపై అపోహల ఆధిపత్యం ఎక్కువైంది. దీంతో ముస్లింల సమస్యలు ఇనుమడిస్తున్నాయి.

ఎస్సీ, ఎస్టీలకు అత్యాచార నిరోధక చట్టం ఉన్నట్లుగానే, ముస్లిముల కోసం కూడా అత్యాచార నిరోధక చట్టం తీసుకురావాలి. సబ్ ప్లాన్ అమలు చేయాలి. మైనారిటీ తెలంగాణలో ఉర్దూను రెండవ అధికార భాషగా అమలు చేస్తామన్న వాగ్దానాన్ని కాగితాలకే పరిమితం చెయ్యకుండా ఆచరణలో పెట్టాలి. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి కల్పించిన 4 శాతం రిజర్వేషన్లు 12 శాతానికి పెంచుతానన్న హామీని గురించి కేసీఆర్‌ను నిలదీయాలి. ముస్లిం సముదాయం కూడా ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురుచూడకుండా రాజ్యాంగ ప్రసాదితమైన హక్కుల సాధనకు రాజ్యాంగ బద్ధంగానే పోరాడాలి. పాలక పక్షాలు చురుగ్గా స్పందించేలా దేశంలోని ప్రజాస్వామ్య ప్రియులు, హక్కుల నేతలు, లౌకిక వాదులు, వామపక్షీయులు, బహుజన శక్తులతో కలిసి మైనారిటీలను పట్టించుకోని ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకు రావాలి. మతపరమైన అంశాలను పక్కన పెట్టి అభివృద్ధి దిశగా ముస్లిం సమాజాన్ని నడిపించే బలమైన నాయకత్వం నేటి అవసరం.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
(రేపు జాతీయ మైనారిటీ సంక్షేమ దినోత్సవం)

తెలుగు సాహితికి వెలుగు సూరీడు

సందర్భం




ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి

తెలుగు భాష సాహిత్యం ఈరోజు బతికి బట్టకడుతుందంటే సీపీ బ్రౌన్ నిర్విరామ కృషి, సమర్పణ, తపన, త్యాగం, అంకిత భావమే కారణం. బ్రిటిష్ దంపతులైన డేవిడ్ బ్రౌన్, కౌలీలకు కలకత్తాలో 1798 నవంబర్ 10న బ్రౌన్ జన్మించారు. తండ్రి మతాధికారి. కలకత్తాలోని ఫోర్ట్ విలియం కళాశాలలో బహుభాషాపండితుడు. తండ్రి వద్దే హీబ్రూ, అరబిక్, పర్షియన్, హిందుస్థానీ, సిరియక్, గ్రీకు భాషలు నేర్చారు. బాల్యంలో తండ్రి సేకరించే దేశీయ పుస్తకాలను పరిష్కరించి, శుద్ధ ప్రతులు తయారుచేయటంలో సహాయం చేసేవారు. అది ఉత్తరోత్తరా తెలుగు సాహిత్య ప్రచురణకు దోహదం అయింది. 1817లో మద్రాస్ సివిల్ సర్వీసులో చేరేవరకు ఆయనకు తెలుగు భాష ఒకటి ఉందనే విషయం తెలియదు. మద్రాస్ ఫోర్ట్ సెయింట్ జార్జ్ కళాశాలలో వెలగపూడి కోదండరామ పంతులు దగ్గర అక్షరాభ్యాసం చేశారు.

ఫ్రెంచ్ కాథలిక్ మతగురువు అబెదుబె రాసిన 'హిందూ మేనర్స్ కస్టమ్స్ అండ్ సెర్మనీస్' అనే పుస్తకంలో వేమనను గురించిన వివరాలు తెలుసుకున్నారు. వేమన పద్యంలోని భాష, భావం, వేగం, తీవ్రత, మూఢవిశ్వాసాల వ్యతిరేకత... అన్నీ కలగలిసిన గొప్ప కవి అని బ్రౌన్‌కు అర్థమైంది. అనంతరం వేమన పద్యాలు 2500 వరకు సేకరించారు. వాటిల్లో ఉత్తమమైన 693 పద్యాలను ఎంపికచేసి పరిష్కరించి, ఇంగ్లిష్‌లోకి అనువదించి 'వెర్సెస్ ఆఫ్ వేమన' పేరుతో 1829లో ప్రచురించారు. ఆపై తెలుగులో ఉన్న భారత, భాగవత, రామాయణాలు, కావ్యాలు, చరిత్రలు, జానపద కథలు, శతకాలు మొదలైనవన్నీ సేకరించారు. పరిష్కరణ, శుద్ధప్రతులు తయారు చేయటంకోసం పండితులను, లేఖకులను తన స్వంత డబ్బులతో నియమించుకున్నారు. కడపలో కలెక్టర్‌గా పనిచేసే రోజుల్లో తన బంగళాలోనే తెలుగు గ్రంథ పరిశోధన, పరిష్కరణ చేశారు. అందుకే దాన్ని 'బ్రౌన్ కాలేజి' అని పిలిచేవారు. బ్రౌన్ గ్రంథ రచనల్లో తోడ్పడిన పండితుల్లో జూలూరి అప్పయ్య, వఠ్యం అద్వైత బ్రహ్మయ్య, మన్నెం కనకయ్య, గరిమెళ్ల వెంకయ్య, వారణాసి వీరాస్వామి, తిరుపతి తాతాచార్యులు వంటి వారున్నారు.

కడప, గుంటూరు, మచిలీపట్నం, రాజమండ్రి తదితర ప్రాంతాల్లో బ్రౌన్ వివిధ హోదాల్లో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేశారు. ఈ క్రమంలోనే పేదపిల్లలు కోసం ధర్మబడులను ప్రారంభించారు. 1821లో కడపలో రెండు, 1823లో మచిలీపట్నంలో రెండు, 1844లో మద్రాస్‌లో ఒకటి చొప్పున ధర్మ బడులను తెరచి, కేవలం పేద విద్యార్థులు తెలుగు, ఇంగ్లిష్ నేర్చుకునేలా చేశారు.



సీపీ బ్రౌన్

బ్రౌన్ సేకరించిన గ్రంథాల్లో సంస్కృతం, తెలుగు, హిందీ, కన్నడం, మరాఠి, తమిళ భాషలకు సంబంధించిన మొత్తం 5,751 గ్రంథాలున్నాయి. వీటిలో కేవలం తెలుగు భాషకు చెందినవి 2,440 ఉన్నాయి. ముఖ్యంగా రామాయణం, భారతం, భాగవతం, కావ్యాలు, శతకాలు, వ్యాకరణం, తెలుగు–ఇంగ్లిష్–తెలుగు నిఘంటువులు (బ్రౌణ్య నిఘంటువు) అచ్చువేసి తెలుగు భాష సాహిత్యాన్ని సుస్థిరం చేశారు. భాషలో కొన్ని మార్పులూ చేశారు. సాధు–శకట రేఫల వినియోగం, క్రావడి, వత్రుసుడి, 'చ, జ'ల మార్పులు వంటివి ప్రధానంగా ఉన్నాయి. తెలుగు భాషలో అంతకుముందు లేని విరామ చిహ్నాలు, పేరాల విభజన, పుటల సంఖ్యలను ప్రవేశపెట్టారు.

తెలుగు బైబిలు అనువాదంలో కూడా బ్రౌన్ ముద్ర ఉంది. బాప్టిజం, ఆమెన్, హల్లెలూయ, సబ్బాతు వంటి పదాల ధార్మికార్థం చెడకుండా యథాతథంగా, తత్సమాలుగా చేశారు. ఆలాగే వైన్ అనేది క్రైస్తవులకు పవిత్రమైనది. అది కేవలం పులియని ద్రాక్షరసం. అందుకే ద్రాక్షరసం అని గౌరవపదంగా అనువదించారు. తెలుగు, బైబిల్ లోనూ క్రైస్తవుల వ్యావహారికంలోనూ పలికే సిలువ, పరిశుద్ధాత్మ, స్తోత్రం, స్తుతి, సువార్త, సన్నుతి, కలుగునుగాక, ప్రభువు నామమునకు, నీకు స్తోత్రం లాంటి పదాలు నేటికీ ప్రామాణికంగా నిలిచాయి. తెలుగు బైబిలు అనువదించి, పరిశీలనార్థం లండన్‌కు పంపించారు. ఆ గ్రంథాన్ని గోర్టిన్, ప్రిబెట్ అనేవాళ్లు 1857లోనూ, వార్డ్‌లా, జాన్‌హే అనేవాళ్లు 1860లో తమ పేర్లతో ముద్రించుకున్నారు. ఎక్కడా బ్రౌన్ పేరును ప్రస్తావించనే లేదు.

భారతదేశంలో ఉన్న నలభై ఏళ్లలో తాను పరిష్కరించి, ప్రచురించిన పుస్తకాలను బ్రౌన్ మద్రాస్ గ్రంథాలయానికి ఇచ్చేశారు. ఉద్యోగ విరమణ అనంతరం లండన్‌లో కొంతకాలం తెలుగు ఆచార్యుడిగా పని చేసిన కాలంలోనూ పరిష్కరించిన గ్రంథాలను ఇండియా ఆఫీస్ లైబ్రరీకి బహూకరించారు. బ్రౌన్ రచనలన్నీ రెవరెండ్ టైలర్ 1857, 1860, 1862 సంవత్సరాల్లో మూడు సంపుటాలుగా తయారుచేసి, ఫోర్ట్ సెయింట్ జార్జ్ గెజిట్ ప్రెస్‌లో ముద్రించారు.

ఈ తెలుగు వెలుగుల సూరీడు 1884 డిసెంబరు 12న వెస్ట్‌బార్న్ గ్రోవ్‌లో తుది శ్వాస విడిచారు. ఆయన జన్మించి నేటికి 225 సంవత్సరాలు. ఆయన ఒక్క చేతిమీదుగా తెలుగు సాహిత్య సంపద అంతా రెక్కలు విప్పి విహరించింది... మనకు కీర్తిప్రతిష్ఠలను తీసుకొచ్చింది. తెలుగు ప్రజలకు ఆయన ప్రాతఃస్మరణీయులు.

వ్యాసకర్త ప్రముఖ సాహితీ పరిశోధకులు । 98481 23655
(సీపీ బ్రౌన్ 225వ జయంతి సంవత్సరం)



తిరుపతి ఇందిరానగర్‌లో లబ్ధిదారుకి సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష



కృష్ణా జిల్లా నందిగామలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

మన ప్రభుత్వం




అన్నమయ్య జిల్లా చౌడసముద్రంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి



కాకినాడ జిల్లా కోటనందూరులో మహిళను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి దాడిశెట్టి రాజా

క్లుప్తంగా..

11న తిరుమల ఎస్ఈడీ టికెట్ల కోటా విడుదల



తిరుమల: డిసెంబర్‌కు సంబంధించిన రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం (ఎస్ఈడీ) టికెట్ల కోటాను నవంబర్ 11న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. భక్తులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఆన్‌లైన్‌లో ముందస్తుగా దర్శన టికెట్లను బుక్ చేసుకోవాలని కోరింది.

సర్వ దర్శనానికి 5 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. 2 క్యూ కంపార్ట్‌మెంట్లు నిండాయి. సర్వ దర్శనానికి 5, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 2 గంటలు పడుతోంది.మంగళవారం అర్ధరాత్రి వరకు 22,423 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 9,679 మంది తలనీలాలు సమర్పించారు.

తల్లిదండ్రులకు గుడి కట్టిన తనయుడు



నూతనంగా నిర్మించిన గుడిలో ప్రతిష్ఠించిన తల్లిదండ్రుల విగ్రహాలు

విడవలూరు: తల్లిదండ్రులపై ఉన్న మమకారంతో కుమారుడు తన తల్లిదండ్రులకు గుడి కట్టి అందులో విగ్రహాలను ప్రతిష్ఠించారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని నాగమాంబపురం పంచాయతీ పరిధిలోని కొట్టాలకి చెందిన పుట్టా సుబ్రమణ్యంనాయుడు (జొన్నవాడ ఆలయ చైర్మన్) గ్రామంలో తన సొంత స్థలంలో తల్లిదండ్రులకు గుడి కట్టించాడు. తన తల్లి పుట్టా సుబ్బమ్మ మొదటి వర్ధంతి సందర్భంగా నూతనంగా నిర్మించిన గుడిలో తన తండ్రి పుట్టా రామయ్య, తల్లి పుట్టా సుబ్బమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం గ్రామస్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

టీడీపీ నేతల బాహాబాహీ

- ఉన్నం వర్సెస్ ఉమ వర్గీయులు
- రచ్చకెక్కిన టీడీపీ మండల కన్వీనర్ల ఎంపిక



కుర్చీలతో కొట్టుకుంటున్న టీడీపీ కార్యకర్తలు

అనంతపురం (శ్రీకంఠం సర్కిల్): కళ్యాణదుర్గం టీడీపీ నాయకుల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమామహేశ్వరనాయుడు వర్గీయులు బాహాబాహీకి దిగారు. నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం బుధవారం అనంతపురం శివారులోని ఎంవైఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేయగా.. మాజీ మంత్రులు అమరనాథ్‌రెడ్డి, కాలవ శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని మండల కన్వీనర్ల ఎంపికకు ఉమామహేశ్వరనాయుడు జాబితా సిద్ధం చేయగా.. అదెలా కుదురుతుందని ఉన్నం హనుమంతరాయచౌదరి వర్గం వ్యతిరేకించింది. ఇరువర్గాల నడుమ మాటామాటా పెరిగి ఒకరిపైకి ఒకరు దూసుకొచ్చారు. ఈ క్రమంలో కుర్చీలతో కొట్టుకున్నారు. మాజీ మంత్రులు సర్దిచెప్పేందుకు ప్రయత్నించినా ఎవరూ వినలేదు. చేసేది లేక మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి మండల కన్వీనర్ల ఎంపికను వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు.

యువ ఓటర్లే లక్ష్యం

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా

- రాష్ట్రంలో 18 – 19 వయసున్న యువత సంఖ్య 12 లక్షలు
- ఓటర్ల జాబితాలో నమోదైంది 78 వేల మంది మాత్రమే
- ఓటు హక్కు నమోదుకు ప్రత్యేకంగా అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్
- డిసెంబర్ 8 వరకు ఓటర్ల నమోదు, అభ్యంతరాల స్వీకరణ
- జనవరి 5న తుది ఓటర్ల జాబితా ప్రకటన



ఓటర్ల అవగాహన ర్యాలీలో విద్యార్థులతో కలసి నడుస్తున్న ముఖేష్ కుమార్ మీనా, కలెక్టర్ ఢిల్లీరావు తదితరులు

సాక్షి, అమరావతి: అర్హులైన యువతను ఓటర్లుగా నమోదు చేయడమే లక్ష్యంగా ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. రాష్ట్ర ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసిన అనంతరం బుధవారం ఆయన సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో ఓటరు నమోదుపై కళాశాల విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.ఢిల్లీరావుతో కలసి పాల్గొన్నారు. బాధ్యతగా ఓటు హక్కు వినియోగించుకుంటామంటూ యువతతో ప్రతిజ్ఞ చేయించారు. రాష్ట్రంలో 18 – 19 ఏళ్ల వయసున్న యువత 12 లక్షల వరకు ఉండగా ముసాయిదా ఓటర్ల జాబితాలో 78 వేల మంది మాత్రమే ఉన్నారని ముఖేష్‌కుమార్ మీనా చెప్పారు. ఈ వయసు వారిలో 10 – 11 లక్షల మంది ఓటర్లుగా నమోదయ్యేలా ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకరు చొప్పున ప్రత్యేకంగా అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్‌ను నియమించాలని కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించిందని, ఈ ప్రక్రియ సోమవారం నాటికి పూర్తవుతుందన్నారు.

- ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 3,98,54,093 కాగా ఇందులో అత్యధికంగా 2,01,34,621 మంది మహిళా ఓటర్లున్నారు. 1,97,15,614 మంది పురుష ఓటర్లు, 3,858 మంది థర్డ్ జెండర్ ఓటర్లున్నారు. కాగా ఈ ఏడాది జనవరిలో ప్రకటించిన తుది జాబితా ప్రకారం రాష్ట్రంలో 4,07,36,000 మంది ఓటర్లు ఉన్నారు. మృతులు, మరో ఊరికి వెళ్లిన వారు, డూప్లికేట్ ఓట్లు కలిపి మొత్తం దాదాపు 8.82 లక్షల ఓట్లను తొలగించారు.
- ఓటర్లుగా నమోదు, అభ్యంతరాలు సమర్పించేందుకు ప్రత్యేక సవరణలో భాగంగా డిసెంబర్ 8వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. సీఈవో వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. పరిశీలన పూర్తి చేసిన తరువాత వచ్చే ఏడాది జనవరి 5వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు నవంబరు 19, 20, డిసెంబర్ 3, 4వ తేదీల్లో పోలింగ్ కేంద్రాల స్థాయిలో ప్రత్యేక క్యాంపెయిన్లను నిర్వహిస్తారు.
- ప్రస్తుతం 17 సంవత్సరాల వయసు ఉన్నప్పటికీ వచ్చే ఏడాది ఏప్రిల్ 1వ తేదీ, జూలై 1వ తేదీ, అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే యువతీ యువకులు కొత్తగా ఓటర్లుగా నమోదుకు ఫామ్–6 ద్వారా ముందుగానే దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు.
- డూప్లికేట్ పేర్లను గుర్తించే ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో రాష్ట్రంలో 25 లక్షల పేర్లతో కూడిన జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా పంపింది. దీని ప్రకారం క్షేత్రస్థాయిలో తనిఖీల అనంతరం డూప్లికేట్ పేర్లను ఫొటోలతో సహా గుర్తించి 10,52,326 ఎంట్రీలను తొలగించారు. ఫలితంగా ఈ ఏడాది జనవరిలో ప్రకటించిన జాబితాతో పోలిస్తే ముసాయిదాలో 8.82 లక్షల మంది ఓటర్లు తగ్గారు.
- ఇళ్లు లేని వారు, ఫుట్‌పాత్‌లపై నివసించే నిరాశ్రయులను సైతం ఓటర్లుగా నమోదు చేసేందుకు ఇంటి చిరునామా ధ్రువీకరణ నుంచి కేంద్ర ఎన్నికల సంఘం మినహాయింపు ఇచ్చింది. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి పరిశీలన చేసి అలాంటి వారికి ఓటు హక్కు కల్పిస్తారు.
- మారుమూల గిరిజన గ్రామాల్లో సైతం ప్రత్యేక కార్యక్రమం ద్వారా ఓటర్ల నమోదు చేపడతారు. రాష్ట్రంలో జనాభా ఓటర్ల నిష్పత్తి 70.9 శాతం ఉండాల్సి ఉండగా 72.4 శాతం ఉంది. మిగతా రాష్ట్రాల కన్నా ఏపీలో నిష్పత్తి మెరుగ్గా ఉంది.
- ఏపీలో గతంలోనూ పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఇప్పుడు ప్రతి వెయ్యి మంది పురుష ఓటర్లకు 1,025 మంది మహిళా ఓటర్లున్నారు.

ఆధార్ అనుసంధానం స్వచ్ఛందమే

ఓటర్ల జాబితా విషయంలో అత్యంత పారదర్శకత పాటిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఐదు సూత్రాలను అమలు చేస్తోందని ముఖేష్‌కుమార్ మీనా వెల్లడించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి ముసాయిదా జాబితాలను అందచేస్తామన్నారు. ఓటరు కార్డులతో ఆధార్ అనుసంధానం ఇప్పటికే 60 శాతం పూర్తి కాగా మిగతా 40 శాతం డిసెంబర్ నాటికి పూర్తవుతుందన్నారు. ఫోన్ నంబర్లు కూడా సేకరించాల్సిందిగా సూచించామన్నారు. ఆధార్ అనుసంధానం స్వచ్ఛందమే కానీ తప్పనిసరి కాదన్నారు. ఆధార్ ఇవ్వకున్నా ఇతర సర్టిఫికెట్లు సమర్పించవచ్చన్నారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించాలంటే సంబంధిత ఫామ్ ద్వారా క్షేత్రస్థాయి తనిఖీ ద్వారానే జరగాలని, లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బూత్ స్థాయి అధికారులే ఓటర్ల నమోదు ప్రక్రియ చేపడతారని, వలంటీర్లకు అవకాశం లేదని తెలిపారు. ఏవైనా ఫిర్యాదులు వస్తే విచారించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించామన్నారు. పట్టభద్రులు, టీచర్ల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియపై ఫిర్యాదులు వచ్చాయని, విచారణ జరిపి తప్పుడు ధ్రువీకరణ ఇచ్చే అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ముసాయిదా ఓటర్ల జాబితా ఇలా

సాధారణ ఓటర్లు	పురుషులు	1,96,49,849
	మహిళలు	2,01,32,271
	థర్డ్ జెండర్	3,858
మొత్తం		3,97,85,978
సర్వీస్ ఓటర్లు	పురుషులు	65,765
	మహిళలు	2,350
మొత్తం		68,115
మొత్తం ఓటర్లు	పురుషులు	1,97,15,614
	మహిళలు	2,01,34,621
	థర్డ్ జెండర్	3,858
మొత్తం		3,98,54,093

- 18 ఏళ్లు నిండిన అర్హుల్లో 5,23,580 మంది దివ్యాంగ ఓటర్లున్నారు.
- అత్యధిక ఓటర్లున్న జిల్లాలుగా అనంతపురం (19,13,813), కర్నూలు (19,13,654), శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు (18,99,103) వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. అత్యల్ప ఓటర్లున్న జిల్లాలుగా అల్లూరి సీతారామరాజు (7,15,990), పార్వతీపురం మన్యం (7,70,175), బాపట్ల (12,66,110) జిల్లాలు నిలిచాయి.

వీరాంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించిన స్వాత్మానందేంద్ర



పూజలు నిర్వహించిన స్వాత్మానందేంద్ర

పాత గుంటూరు/మధురానగర్(విజయవాడ సెంట్రల్): విశాఖ శ్రీ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి బుధవారం పాత గుంటూరులోని శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయాన్ని సందర్శించారు. ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దేవాలయంలో వీరాంజనేయస్వామికి స్వాత్మానందేంద్ర ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయంలో జరుగుతోన్న పూజలు, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలను తెలుసుకుని పలు సూచనలు చేశారు. హిందూ ధర్మ గొప్పతనం చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. డిసెంబర్‌లో జరగనున్న ధనుర్మాస పూజలు ఘనంగా నిర్వహించాలన్నారు. అలాగే, ఎన్టీఆర్ జిల్లా విజయవాడ మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయాన్ని కూడా స్వాత్మానందేంద్ర సందర్శించారు. ఆలయంలో స్వామివారికి పూజలు చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

అమరావతి ఉద్యమ అరాచకవాదులకు చెక్

బహుజన పరిరక్షణ సమితి నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: అమరావతి ఉద్యమం పేరుతో రాష్ట్రంలో అరాచకం సృష్టించేందుకు కులవాదులు వేసిన ఎత్తుగడలకు చెక్ పడడంతో వారికి నిద్రపట్టడం లేదని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్‌యాక్సెస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు బుధవారం నాటికి 773వ రోజుకు చేరుకున్నాయి. పలువురు మాట్లాడుతూ రాష్ట్రంలో ఓ సామాజిక వర్గం ఆధిపత్యం కోసం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అధికారం కోసం ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని వీరు చేస్తున్న ఆగడాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వం పేదలకు రాజధాని ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే దానికి అభ్యంతరాలు తెలపడం దారుణమన్నారు.

నా బిడ్డ ప్రాణం నిలిపినందుకు.. థాంక్యూ సీఎం సర్

- తిరుమలకు పాదయాత్ర చేస్తున్న హనీ తండ్రి
- చిన్నారి వైద్యానికి రూ.కోటి మంజూరు చేసిన సీఎం జగన్



తిరుపతికి వెళుతున్న రాంబాబు, ప్రసాద్

అమలాపురం టౌన్ : తన కుమార్తె హనీకి వచ్చిన అరుదైన గాకర్స్ వ్యాధి చికిత్సకు రూ.కోటి మంజూరు చేసి ప్రాణం నిలిపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి బాలిక తండ్రి కొప్పాడి రాంబాబు విభిన్న పద్ధతిలో కృతజ్ఞతలు చెబుతున్నాడు. గత జూలై 26న కోనసీమ వరద ప్రభావిత ప్రాంతాల పర్యటనకు సీఎం జగన్ వచ్చారు. ఆ సమయంలో రాంబాబు తన కుమార్తె వైద్యం కోసం అత్తవారి ఊరు కోనసీమ జిల్లా అల్లవరం మండలం నక్కా రామేశ్వరంలో ఉన్నాడు. హనీ అరుదైన వ్యాధి విషయం గురించి తెలుసుకుని సీఎం జగన్ చలించిపోయారు. హనీ వైద్య సాయం కోసం కలెక్టర్ హిమాన్షు శుక్లాకు ఆదేశాలిచ్చారు. అంతేకాదు బాలిక వైద్యానికి రూ.కోటి కేటాయించడంతో పాటు తొలి విడతగా అమెరికా నుంచి రూ.10 లక్షలతో బాలికకు అవసరమైన ఇంజెక్షన్లు తెప్పించి వైద్యం చేయించారు. ఈ నేపథ్యంలో రాంబాబు తన బావమరిది సంగాడి ప్రసాద్‌తో కలిసి.. సొంతూరు అయిన పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలం అయోధ్యలంక నుంచి ఈ నెల 7న తిరుమలకు పాదయాత్రగా బయలుదేరాడు. వీరు ధరిస్తున్న టీ షర్టులపై ముందు వెనుకా కూడా సీఎం జగన్ చిత్రాలు ముద్రించారు. సీఎం జగన్‌తో తాను, తన కుమార్తె హనీ తీసుకున్న ఫొటోతో పాటు, జగనన్న సీఎంగా ఉండటం మన అదృష్టం.. పేదలకు వరం.. థాంక్యూ సీఎం సర్.. అని రాయించాడు. ప్రస్తుతం పాదయాత్ర కృష్ణా జిల్లాలో కొనసాగుతోంది. తిరుపతి చేరేందుకు మరో 12 రోజులు పడుతుందని రాంబాబు తెలిపాడు.

• తెలంగాణ

నా ఫోన్లనూ ట్యాప్ చేస్తున్నారు!

తెలంగాణ ప్రభుత్వంపై గవర్నర్ తమిళిసై సంచలన ఆరోపణలు



సాక్షి, హైదరాబాద్: 'నా వద్ద ఏడీసీగా పని చేసిన తుషార్ భాసన్ పేరును, రాజ్‌భవన్‌ను 'టీఆర్ఎస్ న్యూస్' అనే అధికారిక ట్విటర్ హ్యాండిల్ ద్వారా ఎమ్మెల్యేల కొనుగోళ్ల వ్యవహారంలోకి లాగారు. అందులో రాజ్‌భవన్ పాలుపంచుకుందని ఆరోపణలు చేశారు. నా ఫోన్లనూ ట్యాప్ చేస్తున్నారు. తుషార్ కొద్ది రోజుల కిందట హైదరాబాద్‌కు వచ్చి నన్ను కలవాలని రెండు మూడు రోజులు కాల్ చేశారు. ఇలా నాకు ఎవరెవరు కాల్ చేస్తున్నారో వాళ్లు (రాష్ట్ర ప్రభుత్వం) కనుక్కున్నారు. నా వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించారు. రాష్ట్రంలో అప్రజాస్వామిక పరిస్థితులు నెలకొని ఉన్నాయి' అని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సంచలన ఆరోపణలు చేశారు. రాజ్‌భవన్ పారదర్శకమైన కార్యాలయమని, తాను అలాంటి కార్యకలాపాల్లో పాల్గొనలేదని స్పష్టం చేశారు. కావాలంటే తన ఫోన్ ఇచ్చేస్తానని, చూసుకోవచ్చని..అంతా పారదర్శకంగా వ్యవహరిస్తానని చెప్పారు. బుధవారం గవర్నర్ రాజ్‌భవన్‌లో మీడియాతో మాట్లాడారు. యూనివర్సిటీల బోర్డు బిల్లును రెండు మూడు రోజుల్లో ఆమోదించకుంటే రాజ్‌భవన్‌ను ముట్టడిస్తామని విద్యార్థి జేఏసీ ప్రకటించిందని, రాజ్‌భవన్ తలుపులు అందరి కోసం తెరిచి ఉంటాయని వివరించింది.

తెలంగాణలో 'గ్రానైట్'పై ఈడీ, ఐటీ దాడి!

తెలంగాణ మంత్రి గంగుల కమలాకర్, పలువురు వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/ సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం కరీంనగర్ జిల్లాలో గ్రానైట్ మైనింగ్, ఎగుమతుల్లో అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు రావడంతో పలు గ్రానైట్ కంపెనీల కార్యాలయాలు, వ్యాపారుల నివాసాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), ఆదాయ పన్ను (ఐటీ) శాఖ అధికారులు బుధవారం పెద్ద ఎత్తున దాడులు చేశారు. కరీంనగర్, హైదరాబాద్‌లో మంత్రి గంగుల కమలాకర్, ఆయన సోదరుడు గంగుల వెంకన్న, మరికొందరు సన్నిహితుల నివాసాలు, కార్యాలయాల్లో సోదాలు చేశారు. సుమారు 30 బృందాలతో ఉదయం 7 గంటల నుంచి రాత్రి వరకు సోదాలు జరిగాయి. మంత్రి కమలాకర్ ఇంటి తాళాలు పగలగొట్టి మరీ తనిఖీలు చేశారు. దాడుల నేపథ్యంలో దుబాయ్ విహార యాత్రలో ఉన్న మంత్రి గంగుల సాయంత్రానికి రాష్ట్రానికి తిరిగి వచ్చారు. హైదరాబాద్ పంజాగుట్టలోని పీఎస్ఆర్ గ్రానైట్స్, హైదరగూడలోని జనప్రియ అపార్ట్‌మెంట్స్, , సోమాజీగూడ, కరీంనగర్‌లోని మంకమ్మతోట, కమాన్ ప్రాంతంలోని మహావీర్, ఎస్వీఆర్ గ్రానైట్స్, మంత్రి గంగుల కమలాకర్ ఇంటిపై, కరీంనగర్‌లోని కార్యాలయాలపై ఈడీ, ఐటీ బృందాలు దాడులు చేశాయి. గంగాధర్‌రావు, అరవింద్ వ్యాస్ ఇళ్లల్లోనూ దాడులు చేసి పలు కీలక పత్రాలు, విదేశీ సంస్థలతో నెరపిన లావాదేవీల ఫైళ్లను కూడా స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఖమ్మం నగరంలోని మూడు ప్రైవేట్ ఆసుపత్రుల్లోనూ ఐటీ అధికారులు దాడులు చేశారు.

చంద్రబాబు అంటేనే మోసం

- వైఎస్ జగన్ అంటే సంక్షేమం
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి విడదల రజని

గుంటూరు మెడికల్/యడ్లపాడు: టీడీపీ అధినేత చంద్రబాబు అంటేనే మోసం అని.. రాష్ట్ర ప్రజలు ఆయనపై పూర్తిగా నమ్మకం కోల్పోయారని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని విమర్శించారు. ఈ నెల 11న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో 75 వసంతాల పైలాన్ ఆవిష్కరణ మహోత్సవానికి, యడ్లపాడు మండలం మైదవోలు–వంకాయలపాడు గ్రామాల పరిధిలోని స్పైసెస్ పార్క్‌కు విచ్చేస్తున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లపై బుధవారం సమీక్షించి అధికారులకు సూచనలు చేశారు. అనంతరం గుంటూరు, మైదవోలులో మీడియాతో మంత్రి రజని మాట్లాడుతూ.. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా జగనన్న పారదర్శక పాలన సాగిస్తున్నారన్నారు. ఇతర రాష్ట్రాల్లోని నాయకులు సీఎం జగనన్నను అభినందిస్తూ.. ఆదర్శంగా ఆయా పథకాలను తమ ప్రాంతాల్లో అమలు చేసేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. దీనిని చూసి ఓర్వలేక చంద్రబాబు నిత్యం ప్రభుత్వంపై బురదచల్లే పనిలో పడ్డారని, అందుకు పచ్చమీడియా ఊతం అందిస్తోందని విమర్శించారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో ప్రజలను మోసం చేశారని, మళ్లీ మోసం చేయడానికే ఆయన ప్రజల ముందుకు వస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు హయాంలో వైద్య, ఆరోగ్య రంగానికి తీరని అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. ఆయన హయాంలో ఒక్క ఆస్పత్రికి కూడా మరమ్మతులు చేసిన పాపాన పోలేదని దుయ్యబట్టారు. వైఎస్సార్ తనయుడిగా జగనన్న ప్రజలకు మరింత మేలు చేసేలా అడుగులు ముందుకు వేస్తున్నారని, ఏకంగా రూ.16వేల కోట్లతో వైద్య, ఆరోగ్య రంగంలో వసతులను పూర్తిస్థాయిలో పెంచుతున్నారని తెలిపారు. మంత్రి వెంట ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు ముస్తఫా, మద్దాళి గిరి, మేయర్ కావటి మనోహర్‌నాయుడు, సీఎం కార్యాలయం స్పెషల్ సెక్రటరీ డాక్టర్ హరికృష్ణ, వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, డీఎంఈ వినోద్‌కుమార్, ఏపీ ఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధర్‌రెడ్డి, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజాసింగ్‌పై పీడీ యాక్ట్ కొట్టివేత

సాక్షి, హైదరాబాద్/కుషాయిగూడ/అబిడ్స్: పీడీ యాక్ట్ కేసులో ఆగస్టు 25న అరెస్టయిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను విడుదల చేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని బుధవారం ఆదేశించింది. ఆయనపై నమోదు చేసిన కేసును ఎత్తివేయడంతోపాటు పలు ఆంక్షలు విధించింది. 'మతపరంగా అభ్యంతరకర, రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు చేయొద్దు. జైలు నుంచి విడుదలయ్యే సమయంలో ర్యాలీలు నిర్వహించొద్దు. న్యాయవాది, పిటిషనర్‌తోపాటు నలుగురు కుటుంబ సభ్యులు మాత్రమే జైలుకు వెళ్లాలి. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు ఎలాంటి ఇంటర్వ్యూ ఇవ్వకూడదు' అని న్యాయమూర్తులు జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డి, జస్టిస్ జె.శ్రీదేవి ధర్మాసనం బుధవారం ఆదేశించింది. ఈ షరతులతో పాటు క్రైం నంబర్ 261/2022లో కిందికోర్టు ఇచ్చిన ఆంక్షలు వర్తిస్తాయి. సమాజంలో మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారంటూ రాజాసింగ్‌పై ఆగస్టు 25న పోలీసులు పీడీ యాక్టు నమోదు చేసి అరెస్టు చేశారు. పోలీసులు పీడీ చట్టం నమోదు చేయడాన్ని వ్యతిరేకిస్తూ రాజాసింగ్ భార్య ఉషాభాయి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్, పిటిషనర్ తరఫున న్యాయవాది రవిచందర్ వాదనలు వినిపించారు. కాగా, హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో బుధవారం సాయంత్రం రాజాసింగ్ చర్లపల్లి జైలు నుంచి విడుదలయ్యారు. చర్లపల్లి జైలు వద్దకు కుటుంబసభ్యులు, రాజాసింగ్ తరఫు న్యాయవాదితో పాటు అభిమానులు, కార్యకర్తలు భారీ ఎత్తున చేరుకున్నారు. జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. శాంతి భద్రతల దృష్ట్యా చర్లపల్లి జైలు వద్ద భారీగా పోలీసులు మోహరించారు. రాజాసింగ్ జైలు నుంచి ధూల్‌పేట్‌లోని ఆయన నివాసానికి రావడంతో పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు స్వాగతం పలికి సంబరాలు చేశారు.

సామాన్యుడికే పెద్దపీట

నూతన సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ • 2024 నవంబర్ దాకా రెండేళ్లు పదవిలో • ప్రధాని మోదీ తదితరుల శుభాకాంక్షలు

సాక్షి, న్యూఢిల్లీ: సామాన్యుల సేవే తన తొలి ప్రాథమ్యమని భారత నూతన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధనంజయ యశ్వంత్ చంద్రచూడ్ (62) పేర్కొన్నారు. ''టెక్నాలజీ కావచ్చు, న్యాయ సంస్కరణలు కావచ్చు, ఇంకేమైనా కావచ్చు. ప్రతి అంశంలోనూ సామాన్య పౌరుల ప్రయోజనాల పరిరక్షణకే అగ్రతాంబూలమిస్తా'' అని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు 50వ ప్రధాన న్యాయమూర్తిగా ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రపతి భవన్‌లో నిరాడంబరంగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో పదవీ ప్రమాణం చేయించారు. మంగళవారం సీజేఐగా రిటైరైన జస్టిస్ యు.యు.లలిత్ నుంచి జస్టిస్ చంద్రచూడ్ బాధ్యతలు స్వీకరించారు. దైవసాక్షిగా ఆంగ్లంలో ప్రమాణం చేశారు. కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, పీయూష్ గోయల్, హర్‌దీప్‌సింగ్ పురి, కిరణ్ రిజుజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం భార్య కల్పనా దాస్‌తో కలిసి నూతన సీజేఐ సుప్రీంకోర్టుకు చేరుకున్నారు. కోర్టు ఆవరణలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. దేశ న్యాయ వ్యవస్థకు సారథ్యం వహించడం గొప్ప అవకాశం, బాధ్యత అని అభిప్రాయపడ్డారు. న్యాయవ్యవస్థపై ప్రజల నమ్మకం కొనసాగేలా ఏం చర్యలు తీసుకుంటారని ప్రశ్నించగా చేతల్లో చూపిస్తానని బదులిచ్చారు.

జస్టిస్ చంద్రచూడ్ 2024 నవంబరు 10 దాకా రెండేళ్లపాటు సీజేఐగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. 16వ సీజేఐగా చేసిన ఆయన తండ్రి జస్టిస్ వైవీ చంద్రచూడ్ 1978 నుంచి 1985 దాకా ఏకంగా ఏడేళ్ల పాటు ఆ పదవిలో ఉండటం విశేషం. అత్యధిక కాలం సీజేఐగా ఉన్న రికార్డు ఆయనదే. తర్వాత 44 ఏళ్లకు ఆయన కుమారుడు చంద్రచూడ్ సీజేఐగా బాధ్యతలు చేపట్టారు. తండ్రి కుమారులిద్దరూ సీజేఐ కావడం దేశంలో ఇదే తొలిసారి. జస్టిస్ చంద్రచూడ్‌ను ప్రధాని నరేంద్ర మోదీ, న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు అభినందించారు. ఆయన పదవీకాలం ఫలవంతంగా సాగాలంటూ వారిద్దరూ ట్వీట్ చేశారు.



ప్రమాణస్వీకారం సందర్భంగా రాష్ట్రపతి ముర్ము, ఉపరాష్ట్రపతి దన్‌ఖడ్, మంత్రి రిజిజు, తాజా మాజీ సీజేఐ జస్టిస్ లలిత్‌తో నూతన సీజేఐ జస్టిస్ చంద్రచూడ్

జస్టిస్ చంద్రచూడ్ 1959 నవంబర్ 11న జన్మించారు. బీఏ ఆనర్స్ (ఎకనామిక్స్) అనంతరం ఢిల్లీ వర్సిటీ నుంచి ఎల్ఎల్‌బీ చేశారు. అమెరికాలోని హార్వర్డ్ లా స్కూల్ నుంచి ఎల్ఎల్ఎం, డాక్టరేట్ ఇన్ జ్యూరిడికల్ సైన్సెస్ (ఎస్‌జేడీ) చేశారు. ఆయన ప్రస్థానం 1998లో బాంబే హైకోర్టులో సీనియర్ అడ్వకేట్‌గా మొదలైంది. బాంబే హైకోర్టుతో పాటు సుప్రీంకోర్టులోనూ ప్రాక్టీస్ చేశారు. అదే ఏడాది అదనపు సొలిసిటర్ జనరల్‌గా నియమితులయ్యారు. 2013 నుంచి మూడేళ్లపాటు అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా చేశారు. 2016 నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా కొనసాగుతున్నారు.

చరిత్రాత్మక తీర్పులు

అయోధ్య భూ వివాదం, వ్యక్తిగత గోప్యత హక్కు, శబరిమలకు రుతుక్రమ మహిళల ప్రవేశం, అవివాహితలకూ 24 వారాల దాకా అబార్షన్ హక్కు తదితర కేసుల్లో చరిత్రాత్మక తీర్పులు వెలువరించారు. ఆర్మీలో మహిళా ఆఫీసర్లకు పర్మినెంట్ కమిషన్, కమాండ్‌పోస్టింగులు ఇవ్వాల్సిందేనని ఆయన సారథ్యంలోని ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఇటీవల జస్టిస్ యు.యు.లలిత్ హయాంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల ఎంపికలో కొలీజియం సభ్యుల అభిప్రాయాల సేకరణకు సర్క్యులేషన్లు జారీ చేసే పద్ధతిని వ్యతిరేకించిన ఇద్దరు న్యాయమూర్తుల్లో ఆయన ఒకరు.

అసమ్మతిని స్వాగతిస్తారు

అసమ్మతిని ప్రజాస్వామ్యానికి రక్షణ కవచంగా జస్టిస్ చంద్రచూడ్ అభివర్ణిస్తుంటారు. ఆధార్ చెల్లుబాటును ఆయన చాలా గట్టిగా వ్యతిరేకించిన తీరు చాలాకాలం పాటు వార్తల్లో నిలిచింది. ఆధార్ చెల్లుతుందంటూ ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనంలో మిగతా నలుగురు వెలువరించిన తీర్పుతో తీవ్రంగా విభేదించారు. యునిక్ బయోమెట్రిక్ గుర్తింపు సంఖ్య రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. న్యాయప్రక్రియను డిజిటైజ్ చేయడంలోనూ ఆయనది కీలకపాత్ర. ప్రగతిశీల భావాలున్న న్యాయమూర్తి అని, ఏ అంశం మీదైనా స్పష్టమైన భావాలు కలిగి ఉంటారని, వాటిని అంతే సూటిగా వ్యక్తీకరిస్తారని పేరు.

తొలి రోజు ఇలా...

బుధవారం బాధ్యతలు స్వీకరించాక మధ్యాహ్న వేళ జస్టిస్ చంద్రచూడ్ సుప్రీంకోర్టులోని సీజేఐ కోర్టు గదిలోకి ప్రవేశించారు. ''ప్రమాణ స్వీకారం ఉన్న కారణంగా బహుశా నా కెరీర్లో తొలిసారి ఆలస్యంగా విధులకు వచ్చాను. మళ్లీ ఇలా జరగదనుకుంటున్నా. ఇంతసేపూ లాయర్లు తదితరులందరినీ వేచిచూసేలా చేసినందుకు క్షమాపణలు చెబుతున్నా'' అన్నారు. వాదనలు, కేసుల నిర్వహణల్లో లాయర్లపై ఎలాంటి ఒత్తిడి లేకుండా ఉండేలా చూస్తానన్నారు. భవిష్యత్తులో కూడా బార్ సహకారం కొనసాగాలని కోరారు. సహచర న్యాయమూర్తులు జస్టిస్ హిమా కోహ్లి, జస్టిస్ జేబీ పార్డీవాలాతో కలిసి విచారణలు ప్రారంభించారు. సమాజ్‌వాదీ ఎమ్మెల్యే ఆజం ఖాన్ అనర్హత కేసు సహా తొలి రోజు సీజేఐ ధర్మాసనం ముందు 30 ప్రస్తావనలు జరిగాయి. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తదితర న్యాయవాదులు సీజేఐకి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన రెండేళ్ల పదవీకాలం ఫలవంతంగా సాగాలని ఆకాంక్షించారు.

గవర్నర్ వర్సెస్ ప్రభుత్వం

- కేరళలో వర్సిటీల చాన్సలర్‌గా గవర్నర్ ఆరిఫ్‌కు ఉద్వాసన!
- తమిళనాడు గవర్నర్‌ను తొలగించాలంటూ డీఎంకే సర్కార్ డిమాండ్

తిరువనంతపురం/చెన్నై: పలు రాష్ట్రాల్లో గవర్నర్, ప్రభుత్వాల మధ్య వివాదాలు ముదురుతున్నాయి. గవర్నర్ అధికారాలకు కత్తెర వేసేందుకు కేరళ సర్కార్ పావులు కదుపుతోంది. తమ రాష్ట్ర గవర్నర్‌ను పదవి నుంచి తొలగించాలని తమిళనాడు ప్రభుత్వం కోరడం గమనార్హం. కేరళలో విశ్వవిద్యాలయాల కులపతి(చాన్సలర్) పోస్టు నుంచి గవర్నర్ గవర్నర్ ఆరీఫ్ మొహమ్మద్ ఖాన్‌ను తొలగించి, ప్రముఖ విద్యావేత్తలను నియమిస్తూ ఆర్డినెన్స్ తీసుకురావడానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ఈ మేరకు బుధవారం మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయం(సీఎంఓ) వెల్లడించింది. కేరళలో యూనివర్సిటీల పనితీరు, ఉపకులపతుల(వైస్ చాన్సలర్లు) నియమాకం విషయంలో ప్రభుత్వం, గవర్నర్ నడుమ రగడ జరుగుతోంది. వర్సిటీల చాన్సలర్ పోస్టు నుంచి గవర్నర్‌కు ఉద్వాసన పలకాలంటే విశ్వవిద్యాలయాల చట్టాన్ని సవరించాల్సి ఉంటుంది. చట్టంలోని సంబంధిత సెక్షన్‌ను తొలగించాలి. ఆర్డినెన్స్ ముందుకు కదలాలంటే దానిపై తొలుత గవర్నర్ సంతకం చేయాలి.

తమిళనాడులో..

తమిళనాడు గవర్నర్ ఆర్.ఎస్.రవి రాష్ట్రంలో 'శాంతికి ముప్పుగా' పరిణమించారని, ఆయనను తక్షణమే పదవి నుంచి తొలగించాలని కోరుతూ డీఎంకే ప్రభుత్వం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు విజ్ఞాపన పత్రం సమర్పించింది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం ప్రజలకు సేవ చేయకుండా గవర్నర్ అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించింది. అంతేకాకుండా ప్రజల నడుమ మతపరమైన విద్వేషాలను రెచ్చగొడుతున్నారని విమర్శించింది. విజ్ఞాపన పత్రంపై డీఎంకేతోపాటు మిత్రపక్షమైన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సంతకాలు చేశారు.

నీరవ్ అప్పగింతకు బ్రిటన్ గ్రీన్‌సిగ్నల్!



లండన్: పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి రూ.13,000 కోట్ల మేర రుణం తీసుకొని మోసగించడంతోపాటు మనీ లాండరింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణల ఎదుర్కొంటున్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీకి యునైటెడ్ కింగ్‌డమ్(యూకే)లోని లండన్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. మనీ లాండరింగ్ సహా ఇతర కేసుల్లో విచారించడానికి గాను ఆయనను భారత్‌కు అప్పగించేందుకు అడుగు ముందుకు పడింది. మానసిక అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నానని, తనను భారత్‌కు అప్పగించవద్దని కోరుతూ ఆయన దాఖలు చేసిన అప్పీల్‌ను లండన్ హైకోర్టు తిరస్కరించింది. ఈ అప్పీల్‌పై జస్టిస్ జెరిమీ స్టువార్ట్-స్మిత్, జస్టిస్ రాబర్ట్ జేతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. అతడిని భారత్‌కు అప్పగించడం అన్యాయమని, అణచివేతకు గురిచేస్తుందని భావించడం లేదని పేర్కొంది. ఆత్మహత్య ప్రమాదం అప్పగింతను నిరోధించలేదని పేర్కొంది.

క్లుప్తంగా...

త్రిపుర తాత్కాలిక సీజేగా జస్టిస్ అమర్‌నాథ్ గౌడ్



సాక్షి, న్యూఢిల్లీ: త్రిపుర హైకోర్టు తాత్కాలిక న్యాయమూర్తిగా జస్టిస్ తొడుపునూరి అమర్‌నాథ్ గౌడ్ నియమితులయ్యారు. ఆయన నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారు. నవంబరు 11 నుంచి ఆయన తాత్కాలిక సీజేగా కొనసాగుతారంటూ కేంద్ర న్యాయ శాఖ బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. జస్టిస్ అమర్‌నాథ్ 1965లో హైదరాబాద్‌లో జన్మించారు. 2017 సెప్టెంబర్ 21న ఉమ్మడి ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2021 అక్టోబర్ 28న త్రిపుర హైకోర్టుకు బదిలీ అయ్యారు.

బ్రిటన్ మంత్రి రాజీనామా

లండన్: బ్రిటన్లో ప్రధాని రిషి సునాక్ కేబినెట్ నుంచి గవిన్ విలియమ్సన్ రాజీనామా చేశారు. తోటి ఎంపీలపై నోరుపారేసుకుంటారని, ప్రభుత్వ ఉద్యోగులను బెదిరిస్తారని ఆయనపై గతంలోనే విమర్శలు ఉన్నాయి. తాజా మాజీ కన్జర్వేటివ్ పార్టీ మహిళా చీఫ్ విప్ వెండీ మోర్టాన్‌ను ఆయన బెదిరించారని ఆరోపణలున్నాయి. మాజీ మహిళా ప్రధాని లిజ్ ట్రస్‌కు సాయపడలేదని, బ్రిటన్ రాణి ఎలిజబెత్ అంత్యక్రియలకు తనను ఆహ్వానించలేదని తిడుతూ వెండీకి విలియమ్‌సన్ చేసిన మెసేజ్‌లు ఇటీవల మీడియాలో బహిర్గతమవడం తెల్సిందే.



మూడేళ్లక్రితం రక్షణమంత్రిగా ఉన్న కాలంలో ఉద్యోగులను నాలుక చీలుస్తానని, కోపంతో కిటికీ నుంచి బయటకు విసిరేస్తానని అరిచేవారని వార్తలొచ్చాయి. ఈ ఆరోపణలు, రాజీనామాపై సునాక్ విచారం వ్యక్తంచేశారు. విలియమ్సన్‌ను గతంలోనూ రెండుసార్లు పదవి నుంచి తప్పించారు.

నేపాల్‌లో భూకంపం

కఠ్మాండు: పశ్చిమ నేపాల్‌లోని పర్వతప్రాంతాల్లో బుధవారం 6.6 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఈ ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల కోసం ఆ దేశ ప్రధాని షేర్ బహదూర్ దూబే ప్రచారంలో పాల్గొన్న ధన్‌గాధీ జిల్లానూ భూకంపం కుదిపేసింది. కానీ, ఆయన సురక్షితంగా ఉన్నారు. దోటి జిల్లాలోని ఖప్తాద్ జాతీయ అరణ్య ప్రాంతంలో భూకంప కేంద్రస్థానాన్ని కనుగొన్నారు. రాత్రి రెండుగంటల ప్రాంతంలో భూకంపం రావడంతో జనం ఏం జరుగుతుందో తెలీక భయంతో పరుగులుపెట్టారు. పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఆరుగురు మరణించారని, మరికొందరి జాడ గల్లంతైందని దేశ హోం శాఖ అధికార ప్రతినిధి ఫణీంద్ర తెలిపారు. రంగంలోకి దిగిన సైన్యం సహాయక చర్యల్లో నిమగ్నమైంది. 2015 ఏప్రిల్‌లో 7.8 తీవ్రతతో సంభవించిన భారీ భూకంపం ధాటికి ఏకంగా 9,000 మంది ప్రాణాలు కోల్పోయారు. 22,000 మంది గాయాలపాలయ్యారు. 8,00,000 ఇళ్లు నేలమట్టమయ్యాయి.

అభివృద్ధికి శత్రువు కాంగ్రెస్: మోదీ

చాంబీ/సుజన్‌పూర్: అభివృద్ధికి శత్రువు అయిన కాంగ్రెస్, మిత్రుడైన బీజేపీ మధ్య హిమాచల్‌ప్రదేశ్‌లో ఎన్నికల పోరాటం సాగుతోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. బుధవారం పలుచోట్ల ప్రచార సభల్లో ప్రసంగించారు. బీజేపీని మళ్లీ గెలిపించి డబుల్ ఇంజన్ ప్రభుత్వంతో డబుల్ ప్రయోజనాలు పొందాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌తో అస్థిరత, అవినీతి, కుంభకోణాలు తప్ప ఒరిగేదేమీ ఉండదన్నారు.



మంగళవారం జెనీవాలో క్రిస్టీస్ సంస్థ నిర్వహించిన వేలంపాటలో రికార్డుస్థాయిలో దాదాపు రూ.231 కోట్ల ధర పలికిన అత్యంత అరుదైన రత్నమిది. దీని పేరు ఫార్చ్యూన్ పింక్. ఆసియాకు చెందిన ఒక వ్యక్తి దీనిని సొంతంచేసుకున్నారు.

రౌత్ అరెస్ట్ చట్టవ్యతిరేకం

- బెయిల్ ఇచ్చిన ప్రత్యేక కోర్టు
- ప్రధాన నిందితులను ఎందుకు అరెస్ట్ చేయలేదంటూ ఈడీకి ప్రశ్న

ముంబై: ముంబైలోని గోరేగావ్‌లో పాత్రా ఛావల్(సిద్దార్థ్ నగర్) పునర్‌నిర్మాణాభివృద్ధి ప్రాజెక్టులో మనీ లాండరింగ్ అభియోగాలపై అరెస్టయి కారాగారంలో గడుపుతున్న శివసేన ఎంపీ సంజయ్ రౌత్‌కు ఎట్టకేలకు బెయిల్ లభించింది. కేసు వాదనల సందర్భంగా ముంబైలోని ప్రత్యేక కోర్టు జడ్జి ఎంజీ దేశ్ పాండే.. కేసును దర్యాప్తుచేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. ' ఈడీ ముందు హాజరయ్యేందుకు రౌత్ సమయం కావాలన్నారు. అంతలోపే అరెస్ట్‌చేయడం చట్టవ్యతిరేకం. ప్రధాన నిందితులైన హౌజింగ్ డెవలప్‌మెంట్ ఇన్‌ఫ్రాస్టక్చర్(హెచ్‌డీఐఎల్)కు చెందిన రాకేశ్ వధవాన్, సారంగ్ వధవాన్‌లను ఇంతవరకు ఎందుకు అరెస్ట్‌చేయలేదు? మహారాష్ట్ర హౌజింగ్, ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(ఎంహెచ్ఏడీఏ) అధికారులను ఎందుకు అరెస్ట్‌చేయలేదో కారణం చెప్పలేదు. కేసులో మరో నిందితుడు ప్రవీణ్ రౌత్‌ను ఈ కేసుతో సంబంధం లేకుండా సివిల్ వివాదంలో అరెస్ట్‌చేశారు. సంజయ్ రౌత్‌ను ఎలాంటి కారణం లేకుండా అరెస్ట్‌చేశారు' అని జడ్జి వ్యాఖ్యానించారు. తర్వాత సంజయ్, ప్రవీణ్‌లకు బెయిల్ మంజూరుచేస్తూ ఉత్తర్వులిచ్చారు. దీంతో బుధవారం రాత్రి సంజయ్ ముంబైలోని ఆర్థర్ రోడ్ జైలు నుంచి విడుదలయ్యారు. కోర్టు ఉత్తర్వులను బాంబే హైకోర్టులో సవాల్ చేయాలని ఈడీ భావిస్తోంది.

ఈ వాయిదాలు ఇబ్బందికరం

నోట్ల రద్దు కేసులో కేంద్రం తీరుపై సుప్రీంకోర్టు ధర్మాసనం అసహనం

న్యూఢిల్లీ: 2016 నాటి నోట్ల రద్దు వ్యవహారంలో అఫిడవిట్ల దాఖలుకు కేంద్రం మరింత గడువు కోరడం ఇబ్బందికరంగా ఉందంటూ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం బుధవారం అసహనం వ్యక్తం చేసింది. ఉద్ఘాటించింది. రాజ్యాంగ ధర్మాసనం సాధారణంగా విచారణను వాయిదా వేయదని గుర్తుచేసింది. సమగ్ర అఫిడవిట్ దాఖలుకు వారం గడువు కావాలని కేంద్రం తరఫున అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి కోరారు. విచారణ వాయిదా వేయాలని ధర్మాసనాన్ని కేంద్రం కోరడం అసాధారణమని పిటిషనర్ల తరఫు న్యాయవాది అభ్యంతరం వెలిబుచ్చారు. చెప్పారు. న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న కూడా అదే అభిప్రాయం వెలిబుచ్చారు. అయినా ఏజీ అభ్యర్థన మేరకు విచారణను ఈ నెల 24వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.

మేరీల్యాండ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా అరుణ

అమెరికాలో కొత్త చరిత్ర సృష్టించిన తెలుగు మహిళ
- ఈ పదవికి ఎన్నికైన తొలి ఇండియన్ అమెరికన్‌గా రికార్డు



వాషింగ్టన్: తెలుగు మహిళ కాట్రగడ్డ అరుణ మిల్లర్ (58) అమెరికాలో చరిత్ర సృష్టించారు. దేశంలో జరుగుతున్న మధ్యంతర ఎన్నికల్లో మేరీలాండ్ రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఎన్నికయ్యారు. ఈ ఘనత సాధించిన తొలి ఇండియన్ అమెరికన్‌గా రికార్డుకెక్కారు. డెమొక్రాటిక్ పార్టీ తరఫున అరుణ రికార్డు మెజార్టీతో గెలిచారు. రిపబ్లికన్ పార్టీ అనుకూల వర్గాలూ ఆమెకే మద్దతివ్వడంతో గెలుపు సులభమైంది. అమెరికాలో రాష్ట్రస్థాయిలో గవర్నర్ తర్వాత లెఫ్టినెంట్ గవర్నర్ పదవి అత్యంత కీలకం.

రవాణా ఇంజనీర్‌గా సేవలు

కాట్రగడ్డ అరుణ మిల్లర్ స్వస్థలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉమ్మడి కృష్ణా జిల్లాలోని పెదపారుపూడి మండలం వెంట్రప్రగడ గ్రామం. ఆమె 1964 నవంబర్ 6న జన్మించారు. తల్లిదండ్రులు, సోదరుడు, సోదరితో కలిసి 1972లో అమెరికా చేరుకున్నారు. తండ్రి కాట్రగడ్డ వెంకటరామారావు ఐబీఎం సంస్థలో మెకానికల్ ఇంజనీర్‌గా పనిచేశారు. న్యూయార్క్‌లో ప్రాథమిక విద్య అనంతరం అరుణ 'మిస్సౌరీ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ'లో సివిల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ పూర్తిచేశారు. 1990లో మేరీల్యాండ్‌లోని మాంట్‌గొమెరీ కౌంటీకి మారారు. అక్కడే తన కళాశాల మిత్రుడు డేవిడ్ మిల్లర్‌ను వివాహం చేసుకున్నారు. వారికి ముగ్గురు కుమార్తెలు మీనా, క్లోయి, సాషా ఉన్నారు. అరుణ ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీర్‌గా పనిచేశారు. 2000లో అమెరికా పౌరసత్వం లభించింది. 2010 నుంచి 2018 దాకా మేరీల్యాండ్ హౌస్ ఆఫ్ డెలిగేట్స్‌లో డిస్ట్రిక్ట్ 15కి ప్రాతినిధ్యం వహించారు. 2018లో అమెరికా పార్లమెంట్(కాంగ్రెస్)కు పోటీపడి ఓడారు. ''మేరీల్యాండ్‌ను అత్యున్నత స్థానంలో నిలబెట్టడానికి నావంతు కృషి చేస్తా. భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రదర్శిస్తూ నన్ను గెలిపించి, ప్రజాస్వామ్య వ్యవస్థలో చిన్న రాష్ట్రం కూడా అద్భుతం సృష్టిస్తుందని ఈ ఎన్నికతో ప్రజలు నిరూపించారు'' అని అరుణ మిల్లర్ చెప్పారు.

రిపబ్లికన్ల ఆధిక్యం

మధ్యంతర ఎన్నికల్లో ప్రతిపక్ష రిపబ్లికన్లు స్వల్ప ఆధిక్యం కనబరుస్తున్నారు. మొత్తం 435 స్థానాలున్న ప్రతినిధుల సభలో కడపటి వార్తలు అందే సమయానికి 202 స్థానాలు గెలుచుకున్నారు. అధికార డెమొక్రటిక్ పార్టీకి 184 స్థానాలు దక్కాయి. మ్యాజిక్ ఫిగర్ 218 సీట్లు. సెనేట్‌లో 35 స్థానాలకు ఎన్నికలు జరగ్గా రిపబ్లికన్లు 19 , డెమొక్రాట్లు 12 సీట్లు నెగ్గారు. కడపటి వార్తలందేసరికి ఈ రెండు పార్టీలకూ సెనేట్లో చెరో 48 సీట్లున్నాయి. 36 గవర్నర్ పదవుల్లో రిపబ్లికన్లకు 16, డెమొక్రాట్లకు 15 దక్కాయి. ఐదింటి ఫలితాలు రావాల్సి ఉంది.


ఐదుగురు భారత అమెరికన్ల విజయం

వాషింగ్టన్: అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ప్రతినిధుల సభకు ఐదుగురు భారత–అమెరికన్లు ఎన్నికయ్యారు. వీరంతా అధికార డెమొక్రాటిక్ పార్టీ తరఫున నెగ్గడం విశేషం. వివిధ రాష్ట్రాల్లో కాంగ్రెషనల్ జిల్లాల నుంచి రాజా కృష్ణమూర్తి, రో ఖన్నా, అమీ బేరా, ప్రమీలా జయపాల్, థానేదార్ ప్రతినిధుల సభలో అడుగు పెట్టనున్నారు.

కొండంత సమస్యలు.. గోరంత హామీలు



హిమాచల్ ప్రదేశ్‌లో అసెంబ్లీ నియోజకవర్గాలు చిన్నవి. సమస్యలు మాత్రం చాలా పెద్దవి. అధికార బీజేపీకి ఈ సమస్యలు వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. గత కొన్ని దశాబ్దాలుగా అయిదేళ్లకొకసారి ప్రభుత్వాన్ని మార్చే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న హిమాచల్ ప్రదేశ్ ఓటరు ఈ సారి ఎటువైపు మొగ్గు చూపుతారా అన్న ఆందోళన నెలకొంది. అయిదు అంశాలు ఈ సారి ఎన్నికల్లో అత్యధికంగా ప్రభావాన్ని చూపించబోతున్నాయి. - సాక్షి, నేషనల్ డెస్క్



సమస్యలివీ...

నిరుద్యోగం



రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య దారుణంగా ఉంది. జాతీయ స్థాయిలో నిరుద్యోగం రేటు 7.6% ఉంటే హిమాచల్ ప్రదేశ్‌లో 8.6 నుంచి 9.2 శాతం వరకు ఉంది. రాష్ట్రంలో నిరుద్యోగ యువత 15 లక్షల మంది వరకు ఉంటే, వారిలో 8.77 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్‌లో పేర్లు నమోదు చేసుకున్నారు.

యాపిల్ రైతుల దుస్థితి



దేశంలో 24 లక్షల మెట్రిక్ టన్నుల వార్షిక యాపిల్ ఉత్పత్తిలో 26% వాటా హిమాచల్‌దే. గిట్టుబాటు ధర లేక రైతులు నిరసన బాట పట్టారు. సాగు ఖర్చు పెరగడం, వాతావరణ మార్పులు కుంగదీస్తున్నాయి. దీనికి తోడు యాపిల్స్‌ను రవాణ కోసం వాడే కార్టన్లపై జీఎస్టీని 12 నుంచి 18 శాతానికి పెంచడం రైతుపై మరింత భారాన్ని పెంచింది

రోడ్డు కనెక్టివిటీ




కొండ ప్రాంతం కావడంతో రాష్ట్రంలో ఏకంగా 39% గ్రామాలకు రోడ్డు కనెక్టివిటీ లేదు! ఇవన్నీ అటవీ ప్రాంతంలోని గ్రామాలు కావడంతో రోడ్లు నిర్మించాలంటే సుప్రీంకోర్టు అనుమతి తప్పనిసరి. ఇతర ప్రాంతాలతో సంబంధాలు లేక వీరంతా ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 3,125 కి.మీ. రోడ్ల పునరుద్ధరణకు బీజేపీ ప్రభుత్వం పనులు మొదలు పెట్టింది.

అగ్నిపథ్



త్రివిధ బలగాల్లో కాంట్రాక్ట్ నియామకానికి కేంద్రం తెచ్చిన అగ్నిపథ్ పథకం మంచుకొండల్లో మంటలు రాజేసింది. 70 లక్షల హిమాచల్ జనాభాలో ఏకంగా 10 శాతం పని చేస్తున్న, లేదా రిటైర్డ్ సైనికులే ఉన్నారు. ఎందరో యువకులు సైన్యంలో చేరాలని ఆశతో శిక్షణ పొందుతున్న సమయంలో బీజేపీ తెచ్చిన పథకం వారిని నిరాశలో ముంచింది.

ఓపీఎస్



ఓల్డ్ పెన్షన్ స్కీమ్ కూడా ఎన్నికల్లో అత్యంత ప్రభావిత అంశంగా మారింది. 2004లో నాటి బీజేపీ ప్రభుత్వం దీన్ని నిలిపివేసింది. పాత పెన్షన్ పథకం ప్రకారం ఉద్యోగులు ఆఖరిగా తీసుకున్న జీతంలో 50 శాతం పెన్షన్‌గా ఇస్తారు. కొత్త స్కీమ్‌లో ఉద్యోగుల జీతం నుంచి 10%, ప్రభుత్వ వాటాగా 14% ఇస్తారు. కాంగ్రెస్, ఆప్ పాత పథకం తెస్తామంటున్నాయి.

పార్టీల హామీలివీ...

బీజేపీ

- ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని జాతీయ స్థాయిలో పునరుద్ధరిస్తాం
- రాష్ట్రంలో 8 లక్షల ఉద్యోగాల కల్పన
- మౌలికసదుపాయాలు, రహదారులు, రవాణ అభివృద్ధి కోసం శక్తి అనే కార్యక్రమం
- యాపిల్ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తీర్చేందుకు ప్యాకేజింగ్‌పై 12% పన్నుల రాయితీ
- స్టార్టప్‌లతో యువతకి ఉపాధి కల్పించడానికి రూ.900 కోట్లతో కార్పస్ ఫండ్
- మహిళలకి ప్రత్యేక మేనిఫెస్టో. ప్రభుత్వ ఉద్యోగాల్లో 33% రిజర్వేషన్లు
- నిరుపేద మహిళలకి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, బాలికలకు సైకిళ్లు, కాలేజీ యువతులకి స్కూటీలు, 5 వేల మంది టాపర్ అమ్మాయిలకు నెలకి రూ.2,500 స్కాలర్‌షిప్

కాంగ్రెస్

- ఓల్డ్ పెన్షన్ స్కీమ్ పునరుద్ధరణ. దీంతో ప్రభుత్వ ఉద్యోగుల్లో 1.5 లక్షల మందికి లబ్ధి
- అధికారంలోకి వస్తే మొదటి కేబినెట్ సమావేశంలో లక్ష ఉద్యోగాల కల్పనపై సంతకం, ఆ తర్వాత 5 లక్షల ఉద్యోగాలు
- యువతకు విద్య, ఉపాధి అవకాశాల కోసం యూత్ కమిషన్
- గృహాలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్
- 18–60 ఏళ్ల మధ్య వయసున్న మహిళలకు నెలకి రూ.1500 ఆర్థిక సాయం
- స్టార్టప్ యూనిట్ల స్థాపన కోసం ఒక్కో నియోజకవర్గానికి ప్రత్యేకంగా రూ.10 కోట్ల నిధులు
- గ్రామాల్లో పర్యాటకం అభివృద్ధి స్మార్ట్ విలేజ్ ప్రాజెక్టు , సీనియర్ సిటిజన్లకు ఉచితంగా తీర్థయాత్ర

ఆమ్‌ఆద్మీ పార్టీ

- పాత పెన్షన్ స్కీమ్ పునరుద్ధరణ
- నిరుద్యోగులకు నెలకి రూ.3,000 అలవెన్స్
- అధికారుల అవినీతి అరికట్టడానికి వ్యాపారం, పర్యాటక రంగాల్లో సంప్రదింపుల బోర్డు
- సీనియర్ సిటిజన్లకు ఉచితంగా తీర్థయాత్ర
- పంచాయతీల అభివృద్ధి రూ.10 లక్షల గ్రాంట్. పంచాయితీ అధ్యక్షులకి నెలకి రూ.10 వేల వేతనం
- రాష్ట్రంలో పండే పంటలన్నింటికీ కనీస మద్దతు ధర, ఎరువులు, పురుగుల మందులపై సబ్సిడీ
- ఢిల్లీ తరహాలో ఉచిత విద్య, 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్
- 18 ఏళ్ల వయసు పైబడిన మహిళలకు రూ.వెయ్యి ఆర్థిక సాయం

సాక్షి విజయనగరం

గురువారం । 10 । నవంబర్ । 2022

28 నుంచి సువార్త ఉజ్జీవ పండగలు

విజయనగరం టౌన్: జీసస్ గ్రేస్ ఫెయిత్ మినిస్ట్రీస్ అధ్వర్యంలో యేసుక్రీస్తు సువార్త ఉజ్జీవ పండగలు ఈ నెల 28, 29, 30 తేదీల్లో కంటోన్మెంట్ సీఎస్ఐ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్టు జిపప్ వి.సత్యరాజ్, కృపాకుమారీలు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య వర్తమానికులుగా ఏలూరు మన్నా చర్చ్ నుంచి పాస్టర్ ఎమ్.జ్యోతిరాజు పాల్గొంటారన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు అరసాడ విద్యార్థులు

వంగర: రాష్ట్రస్థాయి అండర్-14 వాలీబాల్ పోటీలకు అరసాడ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన నవిరి దినేష్‌కుమార్, ఐ.గోవిందదొరలు అర్హతసాధించారు. ఇటీవల శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో రాణించారు. వీరిని హెచ్‌ఎం వి.రాజ్యలక్ష్మి, పీడీ రాములు, ఉపాధ్యాయులు అభినందించారు.

19 నుంచి ఉచిత బియ్యం పంపిణీ

విజయనగరం అర్బన్: జిల్లాలోని తెలుపురేషన్ కార్డు కలిగిన వారికి ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు ప్రధాన మంత్రి గరీబ్‌కల్యాణ్ అన్న యోజన పథకం కింద ఉచిత బియ్యం పంపిణీ చేయనున్నట్టు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. నవంబర్ నెలకు సంబంధించి లబ్ధిదారులకు 5 కిలోల చొప్పున 27 మండలాలకు చెందిన 5,51,066 మంది ఎన్ఎఫ్ఎస్ఏ కార్డుదారులకు అందజేస్తామన్నారు.

న్యూస్‌రీల్

నేడు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సదస్సు

విజయనగరం రూరల్: జిల్లాలోని పారిశ్రామిక, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు జిల్లా కేంద్రంలోని వీటీ అగ్రహారంలో ఉన్న ఏపీఐఐసీ కార్యాలయంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహిస్తామని ఏపీఎస్‌ఎఫ్‌సీ విజయనగరం బ్రాంచి మేనేజర్ ఎం.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఏపీఎస్‌ఎఫ్‌సీ కేంద్ర కార్యాలయం ఏజీఎం రోజేంద్రరెడ్డి హాజరవుతారన్నారు. జిల్లాలోని ఔత్సాహిక, పారిశ్రామికవేత్తలందరూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మల్బరీ సాగు విస్తీర్ణం పెంచాలి

- కలెక్టర్ ఎ.సూర్యకుమారి



పట్టు ఉత్పత్తిపై కలెక్టర్‌కు వివరిస్తున్న ఏడీ సాల్మన్‌రాజు

విజయనగరం రూరల్: జిల్లాలో మల్బరీ సాగు విస్తీర్ణాన్ని పెంచాలని కలెక్టర్ ఎం.సూర్యకుమారి పట్టుపరిశ్రమ శాఖ అధికారులను ఆదేశించారు. విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని వేణుగోపాలపురం పట్టు పరిశ్రమ శాఖ ఏడీ కార్యాలయం వద్ద ఉన్న సిల్క్‌రీలింగ్ యూనిట్, విత్తనాల ఉత్పత్తి క్షేత్రాన్ని కలెక్టర్ బుధవారం సందర్శించారు. పట్టు నాణ్యత, ఉత్పత్తి తదితర అంశాలు తెలుసుకున్నారు. జిల్లాలో పట్టు పరిశ్రమ అభివృద్ధి అవకాశాలపై ఏడీ ఏవీ సాల్మన్‌రాజుతో చర్చించారు. జిల్లాలో ప్రస్తుతం 392 మంది రైతులు 700 ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తున్నట్టు ఆయన వివరించారు. ఇతర పట్టు వెరైటీలకు సంబంధించి టస్సర్ ప్లాంటేషన్‌ను మరింత పెంచేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.

18న విజ్ఞాన ప్రదర్శన

విజయనగరం ఫూల్‌బాగ్: జాతీయ బాలల సైన్సు కాంగ్రెస్ జిల్లా స్థాయి ప్రాజెక్టుల ప్రదర్శన ఈ నెల 18న విజయనగరం ఫూల్‌బాగ్‌లోని శ్రీచలపతి స్కూల్‌లో నిర్వహిస్తామని డీఈఓ కె.వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు మూడు నుంచి ఐదు పాజెక్టులు చొప్పున జిల్లా స్థాయి ప్రదర్శనకు తీసుకురావాలన్నారు. ఒక ప్రాజెక్టుకు ఒక విద్యార్థి, ఒక ఉపాధ్యాయుడిని పంపించాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్:94409 63424 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. జూనియర్స్ (10–14), సీనియర్స్ (14–17 సంవత్సరాల వయస్సు) విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని చెప్పారు.

పర్యవేక్షణే ప్రధానం

- స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆర్‌జేడీ చిన్మయిదేవి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ చిన్మయిదేవి

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ సక్రమంగా చేపట్టాలని స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆర్‌జేడీ జి.చిన్మయిదేవి సూపర్‌వైజర్లను ఆదేశించారు. స్థానిక మహిళా ప్రాంగణంలో తాత్కాలిక సూపర్‌వైజర్లకు ఐదు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులను ఆమె బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం స్త్రీ, శిశు సంక్షేమానికి కోట్లాది రూపాయలు ఖర్చుచేస్తోందని, అవి లబ్ధిదారులకు సక్రమంగా అందేలా చూడాల్సిన బాధ్యత సూపర్‌వైజర్లు, సీడీపీఓలపై ఉందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సమయానికి కేంద్రాలు తెరుస్తున్నదీ లేనిదీ చూడాలన్నారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు సక్రమంగా భోజనం పెట్టేలా పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి బి.శాంతకుమారి, సీడీపీఓ డి.ఉమాభారతి, కె.విజయకుమారి, జి.ప్రసన్న, ప్రాంగణ మేనేజర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: జిల్లా క్షయ నివారణ శాఖలో ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.వి.రమణకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్ వైజర్ పోస్టు-1 (ఓసీ కేటగిరీ), సీనియర్ టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ పోస్టులు -2 (బీసీ-ఏ మహిళ, ఓసీ), ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు-4 (ఓహెచ్ ఓసీ-1, ఓసీ-2, బీసీ-బి మహిళ-1,) పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. దరఖాస్తులను ఈ నెల 17వ తేదీలోగా జిల్లా క్షయ నివారణశాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు విజయనగరం.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ, పాల్గొన్న ప్రజాప్రతినిధులు

ఉత్తరాంధ్ర ప్రజావాణి

వినిపిద్దాం



- 12న విశాఖలో జరిగే ప్రధాని సభకు తరలిరావాలి
- జిల్లాలో అన్ని సీట్లను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనదే
- కేంద్రమంత్రిగా ఉండి జిల్లాకు ఏమి సాధించారో అశోక్ చెప్పాలి
- టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం
- రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ
- వైఎస్సార్‌సీపీలో చేరిన కార్పొరేషన్ 3వ డివిజన్ స్వతంత్ర అభ్యర్థి



విజయనగరం:

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన ఉదయం 10 గంటలకు విశాఖలోని ఏయూ ఇంజినీరింగ్ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహించే ప్రధాని నరేంద్రమోదీ సభలో ఉత్తరాంధ్ర వాణి వినిపించేందుకు ప్రజలంతా తరలిరావాలని రాష్ట విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. నగరంలోని సుజాత కన్వెన్షన్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ విజయనగరం నగర అధ్యక్షుడు ఆశపు వేణు అధ్యక్షతన నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. ముందుగా మంత్రి బొత్సతో పాటు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, విజయనగరం నియోజకవర్గ పరిశీలకుడు నెక్కలనాయుడుబాబు తదితరులు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి బొత్స మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో రూ.10 వేల కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలను ప్రధాని నరేంద్రమోదీ చేపట్టనున్నట్టు వెల్లడించారు. ప్రధానికి మన వాణి వినిపిద్దామన్నారు. 2019 ఎన్నికలు తరువాత కనిపించని పగటి వేషగాలు టీడీపీ ముసుగులో వచ్చి ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తారని, జాగ్రత్తగా ఉండాలని మంత్రి బొత్స దిశానిర్దేశం చేశారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 175 స్థానాలు విజయమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలన్నారు.

విజయనగరం నియోజకవర్గ అభివృద్ధికి అశోక్ గజపతిరాజు ఏనాడైనా పనిచేశారా అన్ని ప్రశ్నించారు. ఒక్క ప్రభుత్వ విద్యా సంస్థనైనా తీసుకువచ్చారా అంటూ నిలదీశారు. రాజులు అనుకునే రోజులు పోయాయని, ప్రజాస్వామ్య పాలనసాగుతోందని గుర్తుచేశారు. విజయనగరంలో జరుగుతున్న అభివృద్ధిపై చర్చకు టీడీపీ నేతలు రావాలని సవాల్ విసిరారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనలోనే విజయనగరం జిల్లాలో అభివృద్ధి పనులు, ప్రాజెక్టులు పూర్తయ్యాయన్నారు. అశోక్ కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు భోగాపురం విమానాశ్రయ పనులు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. రాజుల కుటుంబంలో పుట్టిన అశోక్‌గజపతిరాజుకు పేదవాడి కష్టం తెలీదని మంత్రి బొత్స వాఖ్యానించారు. తమ ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయానికి అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ప్రతీ జిల్లాకు మెడికల్ కళాశాలకు మంజూరు చేసినట్టు వెల్లడించారు. విజయనగరం ప్రజలకు సమృద్ధిగా తాగునీరు సరఫరాకు అనువుగా తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్టుకు పూర్తిచేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. రాష్ట్రంలో, జిల్లాలో అభివృద్ధి, సంక్షేమం ఆగిపోవాలనేది టీడీపీ లక్ష్యమని, పేదవాడికి సహాయం చేయాలనే ఆలోచనతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు.

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రధాని బహిరంగ సభకు భారీ ఎత్తున తరలి వెళ్లాల్సిన ఆవశ్యకత ఉందని, మన ప్రాంత వాణిని, ప్రయోజనాలను సాధించుకునేందుకు ఇదొక చక్కని అవకాశంగా పేర్కొన్నారు. ఉదయం 7 గంటల నుంచి పార్టీ శ్రేణులు వారికి కేటాయించిన బస్సులలో బయలుదేరాలన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు శంకుస్థాపనకు అన్ని అనుమతులు వచ్చాయన్నారు. భోగాపురం విమానాశ్రయం శంకుస్థాపన, ప్రారంభోత్సవం కూడా జగన్ ప్రభుత్వం హయాంలోనే జరుగుతుందని వివరించారు
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల విషయంలో విజయనగరం నియోజకవర్గంలో 17,856 ఓట్లను పార్టీ నాయకులు, పార్టీ ప్రజా ప్రతినిధుల సహకారంతో నమోదు చేసినట్టు వెల్లడించారు. విశాఖలో జరిగే సభకు భారీ ఎత్తున హాజరై జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనకు మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. విజయనగరం నియోజకవర్గానికి 100 బస్సులు కేటాయించినట్టు వెల్లడించారు.
- విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నియోజకవర్గ పరిశీలకుడు నెక్కల నాయుడు బాబు మాట్లాడుతూ విశాఖలో జరిగే ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్‌బాబు మాట్లాడుతూ చంద్రబాబు వృద్ధాప్యంలో ఉన్నారని, ఆయన మాటలు ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు.



సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

వైఎస్సార్‌సీపీలో చేరిన 3వ డివిజన్ కార్పొరేటర్

అనంతరం విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని 3వ డివిజన్ నుంచి స్వతంత్ర్య అభ్యర్థిగా గెలిచిన వజ్రపుసత్యగౌరీ మంత్రి, ప్రజాప్రతినిధుల సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి పార్టీ కండువా వేసి మంత్రి సాదరంగా ఆహ్వానించారు. సమావేశంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్, పార్టీ మండలాధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, విజయనగరం జెడ్పీటీసీ సభ్యుడు కె.శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జిలు కేధారశెట్టి సీతారామమూర్తి, డాక్టర్ వీఎస్ ప్రసాద్, జి.ఈశ్వర్‌కౌశిక్, కె.తవిటిరాజు, బొద్దాన అప్పారావు, ముచ్చు శ్రీనివాసరావు, బోడసింగి ఈశ్వరరావు, రెడ్డి గురుమూర్తి, గుజ్జల నారాయణరావు, అల్లు చాణిక్య, కాళ్ల సూరిబాబు, యవర్ణ కుమారస్వామి, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీలో చేరిన కార్పొరేషన్ స్వతంత్ర అభ్యర్థి

దేశం కోసం బతుకుదాం

- జిల్లా ప్రధానన్యాయమూర్తి సాయికల్యాణ్ చక్రవర్తి



కేజీబీవీలో అన్నంను పరిశీలిస్తున్న ప్రధాన న్యాయమూర్తి కల్యాణచక్రవర్తి

గంట్యాడ: ప్రతి ఒక్కరమూ దేశం కోసం బుతుకుదామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్ చక్రవర్తి పిలుపునిచ్చారు. గంట్యాడ కేజీబీవీని బుధవారం రాత్రి ఆయన సందర్శించారు. విద్యార్థులకు వడ్డించేందుకు వండిన వంటలను పరిశీలించారు. అనంతరం కేజీబీవీలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకుని దేశానికి సేవ చేయాలన్నారు. ధర్మబద్ధంగా బతకడం నేర్చుకోవాలని సూచించారు. తోటి వారికి సహాయం చేసేగుణాన్ని అలవర్చుకోవాలన్నారు. ఎంత సంపాదించమన్నది కాదని, ఏ విధంగా బతికామన్నదే చూడాలన్నారు. ఆధ్యాత్మిక చింతనతో ఒత్తిడిని జయించవచ్చన్నారు.

అన్యాయం జరిగినప్పుడు ధైర్యంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. కోవిడ్ సమయంలో పాశ్చాత్య దేశాల్లో అనేక మంది మరణించారని, మన దేశంలో మరణాలు తక్కువన్నారు. దీనికి మనదేశంలో మానిసిక సమస్యలు తక్కువగా ఉండడమే కారణమన్నారు. పది మందికి మేలు చేయాలని తలస్తే దేవుడు కచ్చితంగా సాయం చేస్తాడని చెప్పారు. 3వ అదనపు న్యాయమూర్తి (ఫ్యామిలీకోర్టు) కె. రాధారత్నం మాట్లాడుతూ మోసపూరిత మాటలు చెప్పేవారిని నమ్మవద్దన్నారు. సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించాలని కోరారు. జీవితాంతం క్రమశిక్షణ నడుచుకోవాలని హితవుపలికారు. 4వ అదనపు న్యాయమూర్తి(ఎస్సీ, ఎస్టీసెల్ కోర్టు) షేక్ సికిందర్ బాషా మాట్లాడుతూ బాలికల మర్మాంగాలను తాకినా లైంగిక వేధింపుల కిందకు వస్తుందన్నారు. బాలికలను కామెంట్ చేసినా లైంగిక వేధింపుల కేసు నమోదు చేయవచ్చని తెలిపారు. డీఆర్వో గణపతిరావు మాట్లాడుతూ చట్టాలను గౌరవించి, వాటిపై అవగాహన కల్పించుకోవాలన్నారు. సదుద్దేశంతో ప్రభుత్వం చేపట్టే భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. మరో వందేళ్ల వరకు ఈ వివరాలే ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి జె.శ్రీనివాసరావు, ఎస్సీ, ఎస్టీసెల్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, సమగ్ర శిక్ష అదనపు కో ఆర్డినేటర్ వేమలి అప్పలస్వామినాయుడు, ఎంఈఓ విజయలక్ష్మి, కేజీబీవీ ప్రిన్సిపాల్ అల్లు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

యువజనోత్సవాలకు వేళాయె

- నేడు సంగీత కళాశాల వేదికగా జిల్లా స్థాయి యువజనోత్సవాలు
- కళా ప్రదర్శనలకు చక్కని అవకాశం
- ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



జానపద నృత్య ప్రదర్శన (ఫైల్)

విజయనగరం: యువ కళాకారులు తమలోని ప్రతిభా పాటవాలను వ్యక్తపరిచేందుకు సమయం ఆసన్నమైంది. జిల్లా స్థాయి యువజనోత్సవాలకు యువజన సర్వీసుల శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. విజయనగరం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సంగీత కళాశాలలో గురువారం ఉదయం 9 గంటల నుంచి యువజనోత్సవ పోటీలు సాగనున్నాయి. కరోనా ప్రభావంతో గత రెండేళ్లుగా యువజనోత్సవాలు నిర్వహించలేదు. ఈ ఏడాది నిర్వహిస్తోన్న పోటీలకు యువత సన్నద్ధమయింది.


వేర్వేరుగా పోటీలు...

యువజనోత్సవాలకు సంబంధించి మొదటిగా డివిజన్ స్థాయిలో పోటీలు నిర్వహించి అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి జిల్లా స్థాయి పోటీలు నిర్వహించేవారు. ఈ ఏడాది నేరుగా జిల్లా స్థాయి యువజనోత్సవాల నిర్వహణకు సెట్విజ్ అధికారులు ఏర్పాట్లు చేశారు. విజయనగరం, పార్వతీపురంమన్యం జిల్లాలకు చెందిన యువతకు వేర్వేరుగా పోటీలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించారు. విజయనగరం జిల్లా యువతకు గురువారం పోటీలు నిర్వహించనున్నారు. 15–29 సంవత్సరాల మధ్య వయసుకలు పోటీకి అర్హులు. జిల్లాస్థాయి విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు, అక్కడి విజేతలను జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తామని సెట్విజ్ సీఈఓ బి.రామానందం తెలిపారు.

జిల్లా స్థాయిలో పోటీ అంశాలు ఇవే...

- 15 నిమిషాల పాటు బృందంగా జానపద నృత్యాలు ప్రదర్శించవచ్చు. బృందంలో గరిష్ఠంగా 20 మంది మాత్రమే పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది.
- 7 నిమిషాల పాటు బృందంగా జానపద గీతాలు పాడవచ్చు. బృందంలో గరిష్ఠంగా వాయిద్య కళాకారులతో సహా 10 మంది మాత్రమే ఉండాలి.
- 15 నిమిషాల పాటు సంప్రదాయ గాత్రము (హిందుస్థానీ/ కర్ణాటక) వ్యక్తిగతంగా ప్రదర్శించవచ్చు.
- 15 నిమిషాల పాటు కర్ణాటక, హిందూస్తానీ బాణీలో 'సితార, పిల్లన గ్రోవి, వీణ తబలా, మృదంగం వాయిద్య ప్రదర్శనకు అవకాశం ఉంది.
- 10 నిమిషాల సమయం లలిత సంగీతం బాణీలో హార్మోనియంతో, గిటార్ (భారత్/ వెస్టర్న్ సంగీతం) ప్రదర్శించవచ్చు.
- వ్యక్తిగతంగా 15 నిమిషాల సమయం మణిపురి, ఒడిస్సీ, భరత నాట్యం, కథక్, కూచిపూడి వంటి సంప్రదాయ నృత్య ప్రదర్శనకు అవకాశం ఉంది.
- 4 నిమిషాల సమయం ఇంగ్లిష్/ హిందీ భాషల్లో వకృత్వ పోటీల్లో ఆసక్తి గల వారు పాల్గొనవచ్చు.

కారుమామిడివలసలో పులి సంచారం



పులివెళ్లే మార్గంలో పాదముద్రలను చూపుతున్న స్థానికుడు

కారుమామిడివలసలో పులి పాదముద్రలు

మెంటాడ: మండలంలోని లోతుగెడ్డ పంచాయతీ పరిధిలోని కారుమామిడివలసలో పులి సంచరించినట్టు అటవీశాఖ సెక్షన్ అధికారి కె.వి.ఎస్.రాజు తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన బుధవారం మాట్లాడారు. గ్రామస్తుల సమాచారం మేరకు పులి పాదముద్రలను పరిశీలించామన్నారు. మండలంలో అమరాయవలస నుంచి మూడపాడు, కారుమామిడివలస, వాణిజ మీదుగా వెదుళ్లవలస, తాడిపూడి డ్యామ్ వెనుక భాగాన ఉన్న పనసలపాడు ప్రాంతాల్లో పులి సంచరిస్తోందని తెలిపారు. స్థానికుల నుంచి దాడి జరగని ప్రాంతాలను పులి ఎంచుకున్నట్టు వెల్లడించారు. పులిని బంధించేందుకు టైగర్ ట్రాకర్లను వాణిజ, కారుమామిడివలస ప్రాంతాలకు పంపించామన్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

విజయనగరం రెవెన్యూ డివిజన్‌లోకి నెల్లిమర్ల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మూడు మండలాలు ప్రస్తుతం ఉన్న రెవెన్యూ డివిజన్ల నుంచి మరో రెవెన్యూ డివిజన్‌లోకి మారనున్నాయి. ఇందుకు సంబంధించిన ప్రాథమిక గెజిట్ నోటిఫికేషన్లను బుధవారం ప్రభుత్వం విడుదల చేసింది. విజయనగరం జిల్లాలోని నెల్లిమర్ల మండలం ప్రస్తుతం చీపురుపల్లి రెవెన్యూ డివిజన్‌లో ఉండగా.. దాన్ని విజయనగరం రెవెన్యూ డివిజన్‌లో చేర్చారు. పల్నాడు జిల్లాలోని బొల్లాపల్లి మండలాన్ని గురజాల రెవెన్యూ డివిజన్ నుంచి నర్సరావుపేట రెవెన్యూ డివిజన్‌లోకి మార్చారు. ఏలూరు జిల్లాలోని గణపవరం మండలాన్ని ఏలూరు రెవెన్యూ డివిజన్ నుంచి పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం రెవెన్యూ డివిజన్‌లోకి మార్చారు. 30 రోజుల అభ్యంతరాలు, పరిశీలనలు పూర్తయిన తర్వాత తుది నోటిఫికేషన్లు జారీ చేయనున్నారు.

ఏఎస్పీ నియామకం

విజయనగరం క్రైమ్: జిల్లా అదనపు ఎస్పీ (ఏఆర్)గా ఎమ్.ఎమ్.సాల్‌మాన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని ఎస్పీ దీపికా ఎం.పాటిల్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన బాధ్యతలు స్వీకరించాల్సి ఉందన్నారు.

క్లుప్తంగా

సారా ప్యాకింగ్ కేంద్రంపై దాడులు

- ఒకరి అరెస్టు


స్వాధీనం చేసుకున్న సారాతో ఎస్‌ఈబీ సిబ్బంది

పార్వతీపురం టౌన్: ఎస్‌ఈబీ బ్యూరో సీఐ ఉపేంద్ర మండలంలోని పనసభద్ర గ్రామంలో సారా ప్యాకింగ్ కేంద్రంపై బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. దాడుల్లో 660 ప్యాకెట్ల సారా, 440 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదే గ్రామానికి చెందిన కె. కృష్ణ ఒడిశా రాష్ట్రం నుంచి సారా రవాణా చేసి ప్యాకెట్లను తయారు చేస్తున్న సమయంలో దాడులు నిర్వహించి అతడ్ని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఈయన ప్యాకింగ్‌కు ఉపయోగించిన ప్యాకింగ్ మిషన్, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈయనకు సారా విక్రయించిన ఒడిశా రాష్ట్రం కలి గ్రామానికి చెందిన సతీష్, సారా అమ్మడానికి సూడిగాం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. క్రిష్ణను రిమాండ్ నిమిత్తం పార్వతీపురం జుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టుకు హాజరు పరిచామని తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐ శేఖరం, సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జి డీపీఓగా కిరణ్‌కుమార్

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లా గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి అధికారిగా డీఆర్‌డీఏ పీడీ పెద్దింటి కిరణ్‌కుమార్‌ను నియమిస్తూ కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఉత్తర్వులను జారీ చేశారు. ప్రస్తుతం పని చేస్తున్న డీపీఓ బి.సత్యన్నారాయణ సెలవుపై వె వెళ్లడంతో డీఆర్‌డీఏ పీడీకి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులను ఇచ్చారు.

అంతర్రాష్ట్ర దొంగల గుట్టు రట్టు

- క్రూడ్ ఆయిల్ చోరీ కేసును ఛేదించిన పోలీసులు
- 20 రోజుల వ్యవధిలో దొంగను పట్టుకున్న వైనం


పోలీసులకు పట్టుబడిన నిందితుడు ఎస్‌కే అహ్మద్

రేగిడి: ఓ లారీని అద్దెకు పెట్టి రూ.లక్షల విలువ చేసే క్రూడాయిల్‌ను చోరీ చేసిన అంతర్రాష్ట్ర దొంగల గుట్టును రేగిడి పోలీసులు ఛేదించారు. 20 రోజుల వ్యవధిలో రాష్ట్ర సరిహద్దులు దాటి వెళ్లిపోయిన దొంగను, లారీని పట్టుకుని అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఎస్‌ఐ శ్రీనివాసరావు బుధవారం మీడియాకు వెల్లడించారు. రాజమండ్రిలో ఓ లారీ సప్లై కార్యాలయాన్ని 20 సంవత్సరాలుగా ఎమ్‌ఏ ఫరూక్ నడుపుతున్నాడు. వివిధ కంపెనీలకు కమీషన్‌పై లారీలను అద్దెకు ఇస్తుంటాడు. కొల్‌కత్తాకు చెందిన ఆసిఫ్ ఇక్బాల్ ఫరూక్‌కు గత నెలలో ఫోన్ చేసి ప్రస్తుతం అద్దె పని మీద విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఉన్నానని, ఏదైనా అద్దె రవాణ కొల్‌కత్తాకు ఉంటే చెప్పాలని కోరాడు. ఫరూక్ అతన్ని నమ్మి రేగిడి మండలంలోని లింగాలవలస వద్ద శ్రీనివాస పామాయిల్ నుంచి క్రూడాయిల్ కొల్‌కత్తాలో ఓ కంపెనీకి వెళ్లాల్సి ఉందని తీసుకువెళ్లాలని అప్పగించాడు. అద్దెకు ఒప్పుకున్న లారీ యజమాని ఇక్బాల్, తన లారీతో పాటు లారీ డ్రైవర్ ఎస్‌కే అహ్మద్‌ను గత నెల 22న లింగాలవలసలోని శ్రీనివాస పామాయిల్ కర్మాగారానికి తీసుకొచ్చాడు. కర్మాగారంలో రూ.22.20 లక్షల విలువ చేసిన 22 మెట్రిక్ టన్నుల క్రూడాయిల్‌ను కొల్‌కత్తాలోని ఓ ప్రైవేటు కంపెనీకి ఇచ్చేందుకు లోడింగ్ చేసి గత నెల 23న బయలుదేరాడు. నాలుగు రోజులైనా సరుకు కంపెనీకి చేరకపోవడంతో అక్కడి కంపెనీ యజమానులు లారీ సప్లై కార్యాలయానికి ఫోన్ చేశారు. వెంటనే ఫరూక్ లారీ ఓనర్‌తో పాటు లారీ డ్రైవర్‌లకు ఫోన్ చేయడం ప్రారంభించాడు. గత నెల 26న ఫోన్ లిఫ్ట్ చేసిన డ్రైవర్ అహ్మద్ తరువాత ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. తరువాత ఫరూక్ కొల్‌కత్తాలోని తనకు తెలిసిన వారిని లారీపై ఆరా తీశాడు. ఎంతకీ ఆచూకీ తెలియకపోవడంతో క్రూడాయిల్ చోరీ జరిగినట్టు గుర్తించాడు. గత నెల 31న రేగిడి పోలీస్‌స్టేషన్‌లో ఫరూక్ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఎస్‌ఐ శ్రీనివాసరావు అదే రోజు రాత్రి మరో కానిస్టేబుల్ శివతో కలిసి కొల్‌కత్తా బయలుదేరి దారిలో టోల్‌గేట్‌లు పరిశీలించారు. కొల్‌కత్తా పోలీసుల సాయంతో అక్కడ వెతకడం ప్రారంభించారు. డ్రైవర్ ఓటరు కార్డు సంపాదించి అక్కడ భూకైలాస్ రోడ్డు సమీపంలో డ్రైవర్ అహ్మద్‌ను పట్టుకుని ఈ నెల 8న రాత్రి ఇక్కడకు తీసుకువచ్చారు. లారీని సీజ్ చేశారు. లారీ ఓనర్‌తో పాటు డ్రైవర్, మరో వ్యక్తి క్రూడాయిల్‌ను చోరీ చేసినట్టు నిర్ధారణకు వచ్చినట్టు వెల్లడించారు. డ్రైవర్‌ను తొలిత అరెస్టు చేసి రాజాం కోర్టుకు తరలించినట్టు ఎస్‌ఐ చెప్పారు. ప్రధాన నిందితుడైన లారీ ఓనర్ ఆసిఫ్ ఇక్బాల్, మరో నిందితుడిని పట్టుకోవాల్సి ఉందని ఎస్‌ఐ తెలిపారు. కేసు ఛేధించడంలో కీలక పాత్ర పోషించిన ఎస్‌ఐ శ్రీనివాసరావును ఎస్పీ ఎం.దీపిక, బొబ్బిలి డీఎస్పీ మోహనరావు, రాజాం రూరల్ సీఐ నవీన్‌కుమార్ అభినందించారు.

ధాన్యం కొనుగోలుకు సన్నద్ధం

- 15లోగా బ్యాంకు గ్యారంటీలను సమర్పించాలి
- కలెక్టర్ సూర్యకుమారి


సమీక్షిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: జిల్లాలో ధాన్యం సేకరణకు సంబంధించి అధికారులంతా సన్నద్ధం కావాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. ఇప్పటికే మెరకముడిదాం, సంతకవిటి, తెర్లాం, వంగర నాలుగు మండలాల్లో కోతలు ప్రారంభం అయ్యాయని ఈ మండలాల్లో కొనుగోలు కోసం ఏర్పాట్లను చేపట్టాలని సూచించారు. తన చాంబర్‌లో ధాన్యం కొనుగోలు బుధవారం ఆమె సమీక్షించారు. మిల్లర్లు ఈ నెల 15లోగా బ్యాంకు గ్యారంటీలను సమర్పించాలని తెలిపారు. కేంద్రాల వద్ద అవసరమైన సంఖ్యలో గన్నీలను, తేమ యంత్రాలను, ఐఈసీ సామగ్రిని, కాటాలను సిద్ధం చేసుకోవాలన్నారు. ఉపాధి హామీలో వంద రోజులు పని పూర్తి చేసుకున్న వేతనదారులను హమాలీలుగా పంపించాలని డ్వామా పీడీకి తెలిపారు. అవసరమైన వాహనాలను సమకూర్చాలని రవాణా అధికారికి సూచించారు. వాహనాలతో పాటు రూట్ ఆఫీసర్లు ఆర్‌బీఏ నుంచి మిల్లుల వరకు పర్యవేక్షిస్తారని తెలిపారు. జిల్లా అంతటా డిసెంబర్ నుంచి కోతలు ప్రారంభం అవుతాయని అధికారులంతా సమన్వయం చేసుకొని లోపాలు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్, డీఎస్‌ఓ మధుసుదన్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ మీనాకుమారి, జెడ్పీ సీఈఓ డాక్టర్ అశోక్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి తారక రామారావు, డ్వామా పీడీ ఉమా పరమేశ్వి, డీసీఓ రవాణా కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ సామగ్రి సరఫరాలో జాప్యం వద్దు

- జేసీ ఆనంద్

పార్వతీపురం: నాడు – నేడు పనులకు సంబంధించి నిర్మాణ సామగ్రి సరఫరాలో జాప్యం కారాదని జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నాడు – నేడు పనుల పురోగతిపై జిల్లా అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో జరుగుతున్న నాడు – నేడు పనులకు బిల్లులు ఎప్పటికప్పుడు మంజూరు చేయడం జరుగుతోందని, పనుల పురోగతి సాధించాలని పేర్కొన్నారు. డీఈఓ అధ్యక్షతన సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, గనుల శాఖ అధికారులు బృందంగా ఏర్పడి ప్రతీ రోజు నాడు – నేడు పనులపై చర్చించి సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని ఆయన సూచించారు. పార్వతీపురం మండలంలో పనులు ఎక్కువగా ఉన్నందున దగ్గరలో ఉన్న క్రషర్ నుంచి మెటల్ కేటాయింపు చేయాలని అధికారులను ఆదేశించారు. క్రషర్‌ల వారీగా జరుగుతున్న సరఫరాల పట్ల నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మెటల్ సప్‌లైల్లో జియ్యమ్మవలస, కురుపాం మండలాలు వెనుకబడి ఉన్నాయని, పురోగతి సాధించాలని ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యాలు కచ్చితంగా పూర్తి చేయవలసిందేనని అధికారులకు స్పష్టం చేశారు. సమావేశంలో డీఈఓ రమణ, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ అధికారి జె. శాంతీశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకరరావు, గనుల శాఖ అధికారి చంద్ర నాయక్, క్రషర్స్ క్వారీల యజమానులు పాల్గొన్నారు.

వైద్యారోగ్య రంగం పనితీరు భేష్

- వైద్య సేవలపై కేంద్ర బృందం సంతృప్తి
- కుటుంబ నియంత్రణపై దృష్టి పెట్టాలని సూచన



కేంద్ర బృందం ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: జిల్లాలో వైద్యారోగ్య రంగం పనితీరును కేంద్ర బృందం ప్రశంసించింది. వైద్యసేవలపై ప్రజలు కూడా సంతృప్తిని వ్యక్తం చేసినట్టు వెల్లడించింది. జాతీయ ఆరోగ్య మిషన్, ఎన్‌హెచ్‌ఆర్‌సీకి చెందిన 15వ కామన్ రివ్యూ మిషన్ ఏడుగురు సభ్యుల బృందం జిల్లాలో నాలుగు రోజుల పాటు పర్యటించింది. క్షేత్ర స్థాయిలో వైద్య రంగంలో పరిస్థితులను క్షుణ్ణంగా అధ్యయనం చేసింది. సంబంధిత అంశాలను కలెక్టరేట్‌లో కలెక్టర్ సూర్యకుమారికి బుధవారం బృందం సభ్యులు వివరించారు. కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ రంజన్ కుమార్ చౌదురి, డాక్టర్ అంకుర్ నాయర్, విశాల్ కటారియా, డాక్టర్ విజయ్ రజనా, డాక్టర్ శ్వేతాశర్మ, డాక్టర్ మోనికాషైనీ, డాక్టర్ కే.శ్రీనివాస్ మాట్లాడుతూ తాము అధ్యయనం చేసిన విషయాన్ని అంశాల వారీగా వివరించారు. క్షేత్రస్థాయిలో ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు, వైద్యులు ప్రజలకు మంచి సేవలను అందిస్తున్నారని చెప్పారు. పర్యవేక్షణ సిబ్బంది కూడా బాగా పనిచేస్తున్నారని అన్నారు. సఖి గ్రూపులు మెరుగైన ఫలితాలను ఇస్తున్నాయని వివిధ ఆరోగ్యపరమైన అంశాలపై అవగాహన కల్పిస్తున్నాయని చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం మంచి ప్రయత్నమని అభినందించారు. జిల్లా సర్వజనాస్పత్రి నుంచి సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు కూడా ప్రజలకు మంచి వైద్య సేవలను అందిస్తున్నాయని చెప్పారు. జిల్లాలో అమలు చేస్తున్న సేఫ్ డెలివరీ క్యాలండర్ విధానాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. రిఫరల్ విధానంలో మార్పులు తేవాల్సి ఉందని కేంద్ర బృందం సూచించింది. కలెక్టర్ సూర్యకుమారి మాట్లాడుతూ బృందం చేసిన సూచనల్లో పలు అంశాలను తాము ఇప్పటికే గమనించామని మార్పులు చేసేందుకు ఇప్పటికే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. సూచనల్లో కొన్నిటిని జిల్లా స్థాయిలో అమలు చేస్తామని, రాష్ట్ర స్థాయిలో చేయాల్సిన అంశాలను ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. వైద్య రంగంలో కేంద్ర బృందం ఆశించిన మార్పులను ఆరు నెలల్లో తీసుకు వచ్చేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో వైద్యారోగ్య శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్, జాయింట్ డైరెక్టర్ అర్జునరావు, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎస్‌వీ రమణకుమారి, డీసీహెచ్ఎస్ డాక్టర్ జి.నాగభూషణరావు, ఇతర వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏడు పదుల వయసులో పతకాల వేట


విశాఖలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో సాధించిన పతకాలతో శంకరరావు

విజయనగరం: తన వయస్సు ఆరు పదులు దాటింది. ఒక్క మాటలో చెప్పాలంటే ఏడు పదులకు రెండేళ్లే తక్కువ. ఈ వయస్సులోనూ క్రీడల పట్ల తనకున్న మక్కువతో నిత్య సాధన చేయటంతో పాటు మాస్టర్స్ విభాగంలో జరిగే అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని సత్తా చాటుతున్నారు నగరానికి చెందిన మజ్జి శంకరరావు. ఇటీవల విశాఖలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొన్న శంకరరావు 5 కిలోమీటర్ల వాకింగ్ పోటీల్లో 65 సంవత్సరాల విభాగంలో పాల్గొని బంగారు పతకం కైవసం చేసుకోగా.... 5 కిలోమీటర్ల పరుగు పోటీలో వెండి పతకాన్ని చేజిక్కించుకున్నారు. 200 మీటర్ల పరుగు పోటీలో మరో వెండి పతకాన్ని కైవసం చేసుకుని ఆసక్తి ఉంటే ఏ రంగంలోనైనా రాణించగలమని నిరూపిస్తూ వర్ధమాన యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. త్వరలో రాష్ట్ర స్థాయిలో జరిగే మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు మజ్జి శంకరరావు ఎంపికైనట్లు కోచ్ ప్రభు తెలిపారు.

7511 లీటర్ల సారా ధ్వంసం


ధ్వంసం చేయబోతున్న సారాను చూపిస్తున్న అధికారులు

సాలూరు: సాలూరు, పాచిపెంట, మక్కువ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో వివిధ కేసుల్లో పట్టుకున్న 7511 లీటర్ల సారాను ధ్వంసం చేసినట్లు రూరల్ ఎస్‌ఐ ప్రయోగమూర్తి తెలిపారు. పట్టణ శివారులో ఎస్‌ఈబీ అధికారిణి శైలజారాణి, పోలీసుల ఆధ్వర్యంలో సారా ధ్వంసం చేసామని అన్నారు. సారా దాడుల్లో పట్టుకుని సీజ్ చేసిన వాహనాలను వేలం వేశామని తెలిపారు.సాలూరు రూరల్ స్టేషన్ పరిధిలో కేసుకు సంబంధించిన 2 బైక్‌లు, పాచిపెంట స్టేషన్ పరిదిలో పట్టుకున్న ఓ బైక్, ఆటోలు వేలం వేశామని తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య


సూర్యనారాయణ మృతదేహం

పాచిపెంట : మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని కొత్తవలస గ్రామానికి చెందిన మల్లూరి సూర్యనారాయణ ఇంటికి మంగళవారం కోటిపల్లి గ్రామానికి చెందిన బంధువు పెంటపాడు నారాయణరావు వచ్చాడు. చిన్నపాటి విషయంలో వీరి మధ్య తగాదా జరిగింది. ఈ వివాదంలో నారాయణరావు తన చెప్పుతో సూర్యనారాయణను కొట్టాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సూర్యనారాయణ పాచిపెంట వచ్చి మద్యంతో పాటు పురుగు మందు తాగి ఇంటికి వెళ్లాడు. అక్కడ వాంతులు చేసుకోవడంతో తన భార్య గమనించి అడగడంతో జరిగిన విషయం చెప్పాడు. వెంటనే స్థానికుల సహాయంతో పీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సాలూరు సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ కపారావు తెలిపారు.

ప్రతీ ధాన్యం గింజ కొనుగోలు చేయాలి

సాలూరు: రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేయాలని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. రాజన్నదొరను ఆయన గృహంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి రాబర్ట్‌పాల్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ క్రమంలో జిల్లాలో వ్యవసాయంపై రాజన్నదొర ఆరా తీశారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అండగా పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు.

ముద్దాయికి జైలుశిక్ష

రాజాం సిటీ: రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారణమైన ముద్దాయికి జైలుశిక్షతో పాటు జరిమానా విధించారు. పాలకొండకు చెందిన పైల పారినాయుడు (55)ను తెట్టంగి గ్రామానికి చెందిన గంటా శ్రీనివాసరావు ద్విచక్ర వాహనంతో 2019లో ఢీకొనడంతో అప్పట్లో మృతి చెందాడు. దీనిపై పాలకొండ స్టేషన్‌లో కేసు నమోదు కాగా బుధవారం రాజాం కోర్టులో వాదోపవాదాలు జరిగాయి. ముద్దాయి నేరం చేసినట్లు రుజువు కావడంతో శ్రీనివాసరావుకు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎం.బాబు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 2వేలు జరిమానా విధించారని పోలీసు వర్గాలు తెలిపాయి.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 435.00
విజయనగరం	రూ. 439.00
శ్రీకాకుళం	రూ. 439.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24సి. 10గ్రా.)	50,200-00
బంగారం(22సి. 10గ్రా.)	46,000-00
వెండి (కిలో)	60,700-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹ 200

క్లుప్తంగా

సీనియర్ పాత్రికేయుడు అప్పారావుకు పురస్కారం

విజయనగరం: ప్రతి ఏటా జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ గ్రంథాలయ సంఘం ప్రదానం చేసే పురస్కారానికి విజయనగరం జిల్లాకు చెందిన సీనియర్ పాత్రికేయుడు పంచాది అప్పారావు ఎంపికైనట్లు ఏపీ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15న పురస్కారం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. 1993 నుంచి పాత్రికేయునిగా సేవలందిస్తున్న అప్పారావు మాస్టర్ డిగ్రీతో పాటు బీఈడీ కూడా పూర్తి చేశారు.

విదేశాల్లో ఉపాధి అవకాశాలు మెండు..



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐప్లెస్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ గ్రంథి ధర్మ

నెల్లిమర్ల రూరల్: ఉన్నత విద్య అభ్యసిస్తున్న వారికి విదేశాలలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని ఐప్లెస్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ గ్రంథి ధర్మచైతన్య తెలిపారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో విద్యార్థులకు విదేశీ విద్య, ఉపాధి అవకాశాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా దేశాల్లో అత్యధిక వేతనంతో కూడిన ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. అతి తక్కువ ఖర్చుతో ఎంబీఏ, ఎంఎస్, పీహెచ్‌డీ, మెడిసిన్ వంటి కోర్సులు చేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు గదల

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడ పంచాయతీ మొయిదపేటలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు బుధవారం శ్రీకారం చుట్టారు. రూ.10 లక్షల ఆర్థిక సంఘ నిధులతో సీసీ రహదారులు, కాలువల నిర్మాణాలకు జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు అక్కోజీ, రాము, నరసయ్య, నాగేంద్ర, యడ్ల గోవింద, తదితరులు పాల్గొన్నారు.

చేపలకంచేరులో పోలీస్ పహారా



చేపలకంచేరులో పహారా కాస్తున్న పోలీసులు

భోగాపురం: మండలంలోని చేపలకంచేరులో పోలీసులు ప్రత్యేక ప్రహారా కాస్తున్నారు. ముక్కాం గ్రామానికి చెందిన యువకుడు వాసుపల్లి ఎల్లాజీ మృతికి కారణమైన చేపలకంచేరు గ్రామానికి చెందిన ఎనిమిది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో రెండు గ్రామాల మధ్య గొడవలు జరిగే అవకాశం ఉందనే అనుమానంతో పోలీసుల పహారా ఏర్పాటు చేసినట్లు ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

13న 'చిట్టి గురువులు' పరీక్ష

విజయనగరం రూరల్: ఈ నెల 13న చిట్టి గురువులు (అక్షరాస్యత) కార్యక్రమానికి సంబంధించిన పరీక్షల విజయవంతానికి అధికారులు కృషి చేయాలని ఎంపీడీఓ జి.వెంకటరావు తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పరీక్షలకు సంబంధించి సన్నాహక సమావేశం నిర్వహించారు. పరీక్షల నిర్వహణ, ప్రేరణ, పరీక్ష సమయం, తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంఎల్ఓ మర్రాపు శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ డి.తిరుపతినాయుడు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గ్రామ సచివాలయ డిజిటల్, విద్య, వెల్ఫేర్ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ జాతర

భోగాపురం రూరల్: మండలంలోని పోలిపల్లిలో బంగారమ్మతల్లి జాతర మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలిపల్లి, బంగార్రాజుపేట, లింగాలవలస గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స, తదితరులు

- ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స

డెంకాడ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని సంక్షేమాంధ్రప్రదేశ్‌గా మార్చారని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని చొల్లంగిపేట పంచాయతీ పరిధిలోని చొల్లంగిపేట, డీఆర్ పాలెం, శేరిపాలెం, నగరపుపేట గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరిందీ వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కుల,మతాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘతన జగనన్నకే దక్కుతుందని చెప్పారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారని కొనియాడారు.ఆర్థిక ఇబ్బందుల వల్ల పేద పిల్లలు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతోనే అమ్మఒడి పథకం అమలు చేస్తున్నట్లు చెప్పారు. డ్వాక్రా మహిళలకు విడతల వారీగా రుణమాఫీ అందిస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి కుటుంబానికీ రూ.లక్ష నుంచి 10 లక్షల రూపాయల వరకు ఆర్థిక ప్రయోజనం కలిగిందన్నారు. ప్రజలకు గ్రామ స్థాయిలోనే ప్రభుత్వ సేవలు అందించాలన్న లక్ష్యంతో గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు, వెల్‌నెస్ సెంటర్ల ద్వారా రోగులకు సేవలు అందిస్తున్నామన్నారు. ఇంతటి సంక్షేమాన్ని అందిస్తున్న జగనన్నను మరోసారి దీవించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బడుకొండ లక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం, చొల్లంగిపేట, డి.కొల్లాం సర్పంచ్‌లు కోరాడ కనకరాజు, అట్టాడ కృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు గుడివాడ కిరణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు బుజ్జిరాజు, కృష్ణంరాజు, తొత్తడి శ్రీను, మహంతి నర్సినాయుడు, సురేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ ఎత్తుకెళ్లిన దొంగలు

- నెల్లిమర్ల పట్టణంలో నిలిచిన తాగునీటి సరఫరా

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి నాయుడు కాలనీలోని తాగునీటి పథకానికి సంబంధించిన విద్యుత్ కేబుల్‌ను దొంగలు ఎత్తుకెళ్లిపోయారు. దీంతో రెండు రోజులుగా పట్టణంలోని పలు ప్రాంతాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. నగర పంచాయతీ అధికారులు అందించిన వివరాల ప్రకారం .. పట్టణంలోని నాయుడు కాలనీలోనున్న తాగునీటి పథకానికి సంబంధించిన విద్యుత్ కేబుల్‌ను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి దొంగిలించుకుపోయారు. 60 మీటర్ల మేర కేబుల్‌ను కట్ చేసి అందులో ఉండే రాగిని ఎత్తుకెళ్లారు. దీంతో పథకానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తద్వారా పట్టణంలోని రామతీర్థం జంక్షన్, నాయుడు కాలనీ, పద్మశాలివీధి, రెల్లివీధి, తదితర ప్రాంతాలకు రెండు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. పథకానికి చెందిన మోటార్ కూడా పాడైనట్లు సంబంధిత సిబ్బంది తెలిపారు. కేబుల్ దొంగతనంపై స్థానిక పోలీస్ స్టేషన్లో సంబంధిత సిబ్బంది ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉంటే గతంలో కూడా నగర పంచాయతీలో ఇటువంటి దొంగతనాలు జరిగాయి. అలాగే స్థానిక పంప్ హౌస్‌ల్లోని పరికరాలను కూడా అపహరించారు. భవిష్యత్‌లో ఇటువంటి దొంగతనాలు జరగకుండా చర్యలు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు. ఈ విషయమై నగర పంచాయతీ కమిషనర్ పి. బాలాజీప్రసాద్ వద్ద ప్రస్తావించగా పంప్‌హౌస్‌కు సంబంధించిన విద్యుత్ కేబుల్‌ను దొంగిలించిన మాట వాస్తవమేనన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

ప్రధానికి ఘన స్వాగతం పలకాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు పావని



పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ అధ్యక్షురాలు రెడ్డి పావని

విజయనగరం గంటస్తంభం: ఈ నెల 11న విశాఖపట్నం వస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఘన స్వాగతం పలకాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి పావని పిలుపునిచ్చారు. విజయనగరం జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ నాయకులతో సమావేశమైన ఆమె మాట్లాడుతూ, ఆ రోజున సుమారు 3 వేల మంది నాయకులు, కార్యకర్తలు వెళ్లేందుకు సన్నాహక ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. నాయకులు, కార్యకర్తలు వెళ్లేందుకు బస్సులు, కార్లు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రతి ఒక్కరూ వచ్చి ఆ రోజున ఘన స్వాగతం పలకడమే కాకుండా 12న జరగనున్న సభలోనూ పాల్గొనాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తీగల హరనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బగ్గం రాజేష్, నాయకులు కుసుమంచి సుబ్బారావు, ఉత్తరావల్లి మోహనరావు, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, పార్టీ మండల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల భాగస్వామ్యం అవసరం



ఫిజియోథెరపీ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా సమన్వయకర్త సూర్యారావు, తదితరులు

పూసపాటిరేగ: సమాజంలో జరిగే అన్ని కార్యక్రమాలలో దివ్యాంగులను భాగస్వాములను చేయాలని జిల్లా సహితవిద్య సమన్వయ అధికారి ఎస్. సూర్యారావు అన్నారు. బుధవారం స్థానిక మండల విద్య వనరుల కేంద్రంలోని నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులను ఇంటా, బయటా జరిగే అన్ని కార్యక్రమాలలో భాగస్వాములు చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. దివ్యాంగులలో కూడా అందరితో సమానమనే భావన ఏర్పడి ఆత్మవిశ్వాసం కలుగుతోందన్నారు. అనంతరం భవితకేంద్రంలో రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి పి.లలితకుమారి, సహిత విద్య ఉపాధ్యాయుడు ఎం. వెంకటేశ్వరరావు, ఫిజియోథెరపిస్టు హిమబిందు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రావాలి

- మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీరాములనాయుడు



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీరాములనాయుడు

విజయనగరం: ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రానివారిని లే ఔట్లకు తీసుకువచ్చి వారిని చైతన్యం చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీరాములనాయుడు తెలిపారు. ఆప్షన్ 1, 2 కింద వచ్చిన వారంతా వచ్చే శనివారం నాటికి కచ్చితంగా పనులు ప్రారంభించాలని.. లేనిఎడల వారి పట్టాలను వెనక్కి ఇవ్వాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో హౌసింగ్ పీడీ రమణమూర్తితో కలిసి గృహాల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, కార్పొరేషన్ పరిధిలో 15,103 ప్లాట్లు, 10,060 గృహాలు మంజూరు చేసినట్లు చెప్పారు. ఇందులో 241 ఇళ్ల పనులు ఇంకా ప్రారంభం కాలేదని, సంబంధిత లబ్ధిదారులను నిర్మాణాలకు ఒప్పించాలన్నారు. బీబీఎల్ స్థాయిలో 8,464 ఇళ్లు ఉన్నాయని, రెండు రోజుల్లో ఇవన్నీ బేస్‌మెంట్ స్థాయికి రావాలని తెలిపారు. బ్యాంక్‌ఖాతాలు లేనివారితో వెంటనే ఖాతాలు ప్రారంభించాలని సూచించారు.

200 టన్నుల ఇసుక సరఫరా

గజపతినగరం: మండలంలోని పలు పాఠశాలల్లో జరుగుతున్న నాడు - నేడు పనులకు ఇంతవరకు 200 టన్నుల ఇసుక ఉచితంగా సరఫరా చేసినట్లు ఎంఆర్‌సీ కార్యాలయం సీఆర్‌పీ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మండలంలోని పాతబగ్గాం, రామన్నపేట, పురిటిపెంట రెగ్యులర్, గజపతినగరం రెగ్యులర్ స్కూళ్లతో పాటు మరుపల్లి జెడ్పీ హైస్కూల్, గజపతినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేపట్టిన పనులకు ఇసుక సరఫరా చేసినట్లు చెప్పారు. పనుల కోసం స్థానిక జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో 225 టన్నుల ఇసుక నిల్వ చేశామన్నారు.

'మోదీ గో బ్యాక్'ను విజయవంతం చేయండి

విజయనగరం ఫూల్‌బాగ్: ప్రధాని మోదీ ఈ నెల 11,12 తేదీల్లో విశాఖ వస్తున్న నేపథ్యంలో ప్రజాసంఘాలు చేపడుతున్న మోదీ గో బ్యాక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు తమ్మినేని సూర్యనారాయణ, ఒమ్మి రమణ పిలుపునిచ్చారు. స్థానిక ఎల్‌బీజీ భవనంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రెడ్డి శంకరరావు, వి.లక్ష్మి పాల్గొన్నారు.


ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

విజయనగరం ఫూల్‌బాగ్: విశాఖ అభివృద్ధికి నాంది పలికిన విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ వెంకటేష్, పి. రామ్మోహనరావు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిర్ణయాన్ని ఉపసంహరించుకున్న తర్వాతే విశాఖలో ప్రధాని అడుగు పెట్టాలని స్పష్టం చేశారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

నెల్లిమర్ల: నగర పంచాయతీకి చెందిన వార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్‌పై దాడి చేసిన సంఘటనలో నీలంరాజుపేట గ్రామానికి చెందిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు నెల్లిమర్ల పోలీసులు తెలిపారు. అలాగే తమపై కౌన్సిలర్ అనుచరులు దాడి చేసినట్లు నీలంరాజుపేట గ్రామానికి చెందిన కొందరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కౌన్సిలర్, అతని అనుచరులపైనా కేసు నమోదు చేశామన్నారు. మంగళవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో పట్టణంలోని రామతీర్థం రహదారిలోనున్న వైన్‌షాపు వద్ద తనపై దాడికి పాల్పడ్డారని ప్రసాద్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడిలో గాయపడిన ఆయన మిమ్స్ అస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. నీలంరాజుపేట గ్రామ పరిధిలోని చంపావతి నదిలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలే ఇరువర్గాల మధ్య వివాదానికి దారితీసినట్లు సమాచారం.

సింహాచలం సేవలు మరువలేనివి



బెల్లాన సింహాచలం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ చంద్రశేఖర్, వంశీకృష్ణ

చీపురుపల్లి: మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ బెల్లాన సింహాచలం అందించిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు అన్నారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జిల్లా నార్కోటిక్స్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెల్లాన రవి తండ్రి బెల్లాన సింహాచలం 21వ వర్ధంతిని బుధవారం స్థానిక శ్రీనివాస మహల్ జంక్షన్ వద్ద నిర్వహించారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఆయన సోదరుడు రవి, తనయుడు వంశీకృష్ణ తదితరులు సింహాచలం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దివంగత సింహాచలం చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్‌తో పాటు ప్రముఖ న్యాయవాదిగా సుదీర్ఘ కాలం ప్రజలకు సేవలందించారని తెలిపారు. ఆయన చూపిన సేవా మార్గంలో తామంతా నడుచుకుంటున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, వార్డు మెంబర్లు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.80 లక్షలతో సీసీ రోడ్డు పనులు

దత్తిరాజేరు: మండలంలోని మర్రివలసలోని జాతీయ రహదారి నుంచి ఆ గ్రామ శ్మశాన వాటికకు నాబార్డు నిధులు రూ.80 లక్షలతో కిలోమీటరు మేర సీసీ రోడ్డు పనులకు ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, పోరలి పీఏసీఎస్ అధ్యక్షుడు సుమల శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

హిజ్రాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి



ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు కోసం డిప్యూటీ స్పీకర్ కోలగట్లకు వినతిపత్రం అందజేస్తున్న హిజ్రాలు

- ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: హిజ్రాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. లిఫ్టింగ్ హ్యాండ్స్ హిజ్రాస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కామాక్షినగర్‌లో ఉన్న కాపు సంక్షేమ భవనంలో బుధవారం జరిగిన పుట్టింటి సారె సమర్పణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జీసస్ క్రీస్ట్ బ్లెస్సింగ్స్ మినిస్ట్రీస్ ప్రతినిధులు నాగేశ్వరరావు, లక్ష్మి దంపతులు హిజ్రాలకు సారె సమర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ, ఏ వర్గమైనా సమాజంలో మంచి కార్యక్రమాలు చేపడితే ప్రజా మన్ననలు ఉంటాయన్నారు. హిజ్రాలకు ఏ సమస్య వచ్చినా నేరుగా తనను సంప్రదించవచ్చని చెప్పారు.లిఫ్టింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ కోరిక మేరకు దుర్గామాత ఆలయ నిర్మాణానికి సహకరించామన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి, హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రాస్ అసోసియేషన్ అధ్యక్షురాలు దవడ మీన, కార్యదర్శి స్రవంతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు సత్కారం



సత్కారం అందుకున్న కన్యాశుల్కం నాటక పాత్రధారులు

విజయనగరం: విజయనగర కీర్తిని ప్రపంచానికి చాటిన మహనీయుడు గురజాడ అప్పారావు అని వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ ముళ్లపూడి సుభద్రాదేవి అన్నారు. పట్టణంలోని గురజాడ స్వగృహంలో వనితా వాకర్స్ క్లబ్ ఫోర్టు శాఖ ఆధ్వర్యంలో కన్యాశుల్కం నాటక పాత్రధారులను బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆనాటి సమాజంలో గల సాంఘిక దురాచారాలను గురజాడ అప్పారావు కన్యాశుల్కం నాటకం ద్వారా కళ్లకు కట్టినట్లుగా వివరించారన్నారు. కన్యాశుల్కం నాటకం ప్రదర్శించి రాష్ట్ర వ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్న నటీమణులు ప్రశంసనీయులని తెలిపారు. ఈ సందర్భంగా విజయ సూర్య ఆర్ట్స్ అసోసియేషన్ డైరెక్టర్ ఈపు విజయకుమార్, భోగరాజు సూర్యలక్ష్మి, సుప్రియ, సామవేదుల గీతారాణి, సుభద్రాదేవి, ఉదయగిరి నీలిమ, విజయలక్ష్మి, సత్యలత, బాలనటి దేదీప్యలను సత్కరించారు.

రూ. 1.20 కోట్లతో అభివృద్ధి పనులు



పార్కును ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, నగర మేయర్

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్‌లో పూర్తయిన పలు అభివృద్ధి పనులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మేయర్ విజయలక్ష్మి బుధవారం ప్రారంభించారు. 29,31,32,33 డివిజన్‌లలో రూ.1.20 కోట్లతో నిర్మించనున్న కాలువలు, కల్వర్టులు, రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేయగా.. నూతనంగా నిర్మించిన పార్కులను ప్రారంభించి, ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ, నిరంతరం నగరాభివృద్ధే ధ్యేయంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శ్రమిస్తున్నారన్నారు. అందులో భాగంగా గతంలో గుర్తించిన ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పారు. 29వ డివిజన్‌లో ప్రజల ఆకాంక్ష మేరకు అనతికాలంలోనే పార్కును నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. అందరి సహకారంతో నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ, తమ డివిజన్‌లో ఇప్పటి వరకు రూ.2.50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గతంలో వార్డు పర్యటనలు, ప్రస్తుతం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పర్యటిస్తూ ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండల డైరెక్టర్ బంగారునాయుడు, జోనల్ ఇన్‌చార్జ్‌లు రెడ్డి గురుమూర్తి, కనకల కృష్ణ, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

లక్కవరపుకోట: సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో మల్లివీడులోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు బుధవారం నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సత్యసాయి ట్రస్టు తమ సేవలు అందించడం శుభపరిణామమన్నారు. ఎస్.కోట మండలం చిన్న ఖండేపల్లి గ్రామ సమీపంలోని 9 ఎకరాల్లో సత్యసాయి ట్రస్టు వారు క్యాన్సర్ ఆస్పత్రి నిర్మించగా...ఈ ఆస్పత్రి నిర్వహణకు ప్రభుత్వం అన్ని అనుమతులు ఇచ్చిందన్నారు. ట్రస్టు సభ్యుడు డాక్టర్ కల్యాణ్ మాట్లాడుతూ ఇప్పటికే ఎస్.కోట మండలంలోని గల 47 పాఠశాలల్లో విద్యార్థులకు ఒక్కొక్కరికి నాలుగు చొప్పున నోట్ పుస్తకాలు అందజేశామన్నారు. ఎల్.కోట మండలంలోని 44 ప్రాథమిక పాఠశాలల్లో సుమారు 2వేల మంది విద్యార్థులకు 8 వేల నోటు పుస్తకాలు అందజేస్తున్నామని చెప్పారు. ఈ నెలాఖరు నుంచి క్యాన్సర్ ఆస్పత్రిలో సేవలు ప్రారంభిస్తామని తెలిపారు. ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, ఎంపీడీఓ కె.రూపేష్, ఎంఈఓ చలుమూరి కూర్మారావు, సర్పంచ్ ఆదిరెడ్డి అర్జున, నాయకులు పెదిరెడ్ల వెంకటేష్, కాటపల్లి శ్రీను, చల్లంనాయుడు, కశిరెడ్డి కృష్ణ పాల్గొన్నారు.

14,15 తేదీల్లో నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలు



గర్భాం ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

మెరకముడిదాం: మండలంలోని గర్భాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 14,15 తేదీల్లో నియోజకవర్గ స్థాయి అండర్ -14, అండర్ 17 క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు తాడ్డి వేణుగోపాలరావు తెలిపారు. ఈ మేరకు గర్భాం పాఠశాలలో నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల పీడీ, పీఈటీలతో ఎంఈఓ ఆధ్వర్యంలో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంత మంది విద్యార్థులు ఏయే క్రీడల్లో పాల్గొంటారు.. చేయాల్సిన ఏర్పాట్లపై ఎంఈఓ రామారావు, పీడీలు, పీఈటీలతో చర్చించారు. పోటీలు సక్రమంగా జరిగేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో గర్భాం మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ తాడ్డి సత్యనారాయణ, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జయలక్ష్మీ బ్యాంకు డైరెక్టర్ అరెస్ట్


చక్రభాస్కరరావు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రజల నుంచి పెద్ద ఎత్తున డిపాజిట్లు సేకరించి కుచ్చుటోపీ పెట్టిన కాకినాడ జయలక్ష్మీ మ్యూచువల్ ఎయిడెడ్ మల్టీ పర్పస్ కో- ఆపరేటివ్ సొసైటీ కుంభకోణం కేసులో ఆ సొసైటీకి సంబంధించిన మరో డైరెక్టర్ సవితాల చక్రభాస్కరరావును దర్యాప్తు అధికారి తేజోవతి అరెస్టు చేశారు. రాజమహేంద్రవరం సీఐడీ రీజనల్ కార్యాలయంలో బుధవారం విలేకరులతో దర్యాప్తు ప్రత్యేక అధికారి రవివర్మ వివరాలు తెలిపారు. ఇప్పటికే జయలక్ష్మీ సొసైటీ వ్యవస్థాపకులు రాయవరపు సీతారామ ఆంజనేయులు, రాయవరపు బద్రి విశాలాక్షి, వారి కుమారుడు రాయవరపు జయదేవ్‌మణిని అదుపులోకి తీసుకున్నామన్నారు. తాజాగా చక్రభాస్కరరావును అరెస్టు చేశామని.. రూ.580 కోట్ల ఈ కుంభకోణం వెనుక ఉన్న వ్యక్తులందరినీ త్వరలోనే అరెస్టు చేస్తామని సీఐడీ అడిషనల్ ఎస్పీ గోపాలకృష్ణ తెలిపారు.

6 నుంచి కడప పెద్దదర్గా ఉరుసు ఉత్సవాలు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా తదితరులు

కడప కల్చరల్: కడప అమీన్‌పీర్ (పెద్ద) దర్గాలో కొలువైన హజరత్ సర్‌మస్తానీ చిల్లకష్ ఖ్వాజా సయ్యద్‌షా ఆరీఫుల్లా మహమ్మద్ మహమ్మదుల్ హుసేనీ చిష్తివుల్ ఖాద్రీ సాహెబ్ ఉరుసు ఉత్సవాలు డిసెంబరు 6 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు దర్గా ముజావర్ అమీర్, మేనేజర్ ఎస్.మహమ్మద్ అలీ బుధవారం తెలిపారు. 7న గంధం, 8న ఉరుసు ఉత్సవం నిర్వహిస్తామని, ఈ ఉత్సవం రాకను తెలియజేస్తూ ఈ నెల 24న నషాన్ జరపనున్నట్లు చెప్పారు. 9న మలంగ్‌దీక్ష విరమిస్తారని తెలిపారు. 10న ఖవ్వాలీ కార్యక్రమం, 11న నగరంలో పీఠాధిపతి ఊరేగింపు ఉంటుందన్నారు. 12న భక్తులు తమ స్వస్థలాలకు వెళ్లనున్నట్లు వివరించారు. అనంతరం ఉరుసు ఉత్సవాల పోస్టర్లను కడప పెద్దదర్గా ఆవరణలో దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్, రాష్ట్ర డిప్యూటీ సీఎం అంజద్ బాషా, అధికారులు ఆవిష్కరించారు.

తాళపత్రం..ఇక సురక్షితం!

సాంకేతికత సాయంతో తాళపత్ర గ్రంథాల కంప్యూటరీకరణ

టీటీడీ వేదిక్ వర్సిటీ ఆధ్వర్యంలో ప్రక్రియ

సాక్షి, అమరావతి: పురాతన సంస్కృతి, వారసత్వ విజ్ఞానానికి ప్రతీకగా నిలిచే తాళపత్ర గ్రంథాల పరిరక్షణకు పురావస్తు శాఖ శ్రీకారం చుట్టింది. టీటీడీ వేదిక్ వర్సిటీ ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర మనుస్క్రిప్ట్ ప్రాజెక్ట్, సనాతన జీవన్ ట్రస్ట్ సంయుక్తంగా డిజిటలైజేషన్ (కంప్యూటరీకరణ) ప్రక్రియను చేపడుతోంది. రాజమహేంద్రవరంలోని రాళ్లబండి సుబ్బారావు, కాకినాడలోని ఆంధ్రసాహిత్య పరిషత్ మ్యూజియాల్లో భద్రపరిచిన సుమారు 6,000 తాళపత్ర గ్రంథాలను సాంకేతికత సాయంతో భవిష్యత్తు తరాలకు అందించనుంది. 18–19వ శతాబ్దం నాటి తాళపత్ర ప్రతులను 1904–1930 మధ్య ఆంధ్ర సాహిత్య పరిషత్ సభ్యులు సేకరించారు. వీటిలో నన్నయ, శ్రీనాథుడు, కాళిదాసు వంటి గొప్ప కవుల కావ్యాలున్నాయి. అభిజ్ఞాన శాకుంతలము, విష్ణు పురాణం, లలిత సహస్రనామం, మేఘసందేశం, కాశీ ఖండం, రామాయణ మహా భారతాలు, జ్యోతిష్య, ఆయుర్వేద, యోగ శాస్త్రాలను తాళపత్రాల్లో నిక్షిప్తం చేశారు. కొన్నింటిలో తెలుగుతో పాటు హిందీ, సంస్కృతం, ఉర్దూ భాషల్లో రాత ప్రతులు ఉండటం విశేషం.

రెండు పద్ధతుల్లో పరిరక్షణ..

తాళపత్ర గ్రంథాలను రెండు విధాలుగా పరిరక్షించే ప్రయత్నం చేస్తున్నారు. మొదట కన్జర్వేషన్ పద్ధతిలో పురాతన ప్రతులను రసాయనాలతో శుద్ధి చేసి వాటి జీవిత కాలాన్ని పెంచుతున్నారు. సురక్షితంగా భద్రపరిచిన తాళపత్రం 100–150 ఏళ్ల వరకు ఉంటుంది. ఆ తర్వాత పెళుసుగా, చిరిగిపోయే స్థితికి చేరుకుంటాయి. ఈ క్రమంలో తొలుత స్పిరిట్‌తో శుభ్రం చేసి, 24 గంటల అనంతరం లెమన్ గ్రాస్ ఆయిల్ ఆపాదించి మృదుత్వాన్ని అందిస్తున్నారు. ఒక రోజంతా ఆరబెట్టిన తర్వాత డిజిటలైజేషన్ చేస్తున్నారు. అక్షరాలు స్పష్టంగా కనిపించేందుకు ప్రత్యేక ద్రావణంలో కలిపిన ఇంక్‌ను తాళపత్రానికి అద్దిన తర్వాత స్కానింగ్ చేస్తున్నారు. ఒక తాళపత్ర గ్రంథం డిజిటలైజేషన్ ప్రక్రియకు చేరుకోవడానికి 4 రోజులు పడుతోంది. నిత్యం 20 తాళపత్ర గ్రంథాల డిజిటలైజేషన్ జరుగుతోంది.


టీటీడీ వేదిక వర్సిటీ ఆధ్వర్యంలో తాళపత్ర ప్రతులను డిజిటలైజ్ చేస్తున్న దృశ్యం

త్వరలో అందుబాటులోకి..

ఒక్కో తాళపత్ర గ్రంథంలో 30 నుంచి 700 వరకు ప్రతుల్లో (తాటి ఆకులు లేదా పేజీలు) రచనలున్నాయి. ఒక ఆకుపై (తాళపత్రం) 24 లైన్ల వరకు రచనలు చేయడం విశేషం. ఇలాంటివి 1,800 వరకు ఉన్నాయి. ఇప్పటి వరకు 1,600–1,700 గ్రంథాలను డిజిటలైజ్ చేశారు. ఇందులో సుమారు లక్షకు పైగా ప్రతులున్నాయి. వీటిని ప్రజలకు అందుబాటులో ఉండేలా పురావస్తు శాఖ తమ వెబ్‌సైట్‌లో త్వరలో పెట్టనుంది.

తాళపత్రాల తయారీ ఇలా..

తాళపత్రాల తయారీకి తాటి ఆకులను వినియోగిస్తారు. ఇందుకోసం 10 నుంచి 15 మీటర్ల ఎత్తు పెరిగే తాటిచెట్ల నుంచి 1 మీటర్ పొడవుతో పొరలు పొరలుగా ఉండే ఆకులను సేకరిస్తారు. రాతకు ఎక్కువ పొరలు ఉన్న ఆకులు అనుకూలంగా ఉంటాయి. వీటిని రెండు పద్ధతుల్లో తయారు చేస్తారు. ముందుగా తాటి ఆకులను నీడలో ఆరబెడతారు. అవి మెత్తగా తయారవడానికి నువ్వుల నూనెను దట్టంగా పట్టిస్తారు.

ఆకులను ఎండబెట్టిన తర్వాత మట్టిలో కానీ, ఇసుకలో కానీ రెండు వారాలు ఉంచుతారు. తర్వాత బయటికి తీసి శుభ్రపరుస్తారు. ఆకులకు చెదలు పట్టకుండా పసుపు రాస్తారు. మరోవైపు తాటి ఆకులు సన్నగా, మృదువుగా మారడానికి వేడినీళ్లలో ఉడికిస్తారు. ఎక్కువ కాలం మన్నేలా ఆ నీటిలో పసుపు వేస్తారు. అనంతరం వాటిని ఎండలో ఆరబెడతారు. అనంతరం వాటిపై సున్నితమైన మొనగలిగిన 'ఘంటం'తో అక్షరాలను చెక్కుతారు.

వారసత్వ సంపదను పరిరక్షిస్తున్నాం

తాళ పత్ర గ్రంథాల్లో మన పూర్వీకులు ఎంతో జ్ఞానాన్ని నిక్షిప్తం చేశారు. ఇవి కాలక్రమంలో చెదలు పట్టడం, చిరిగిపోవడం కారణంగా అక్షరాలు కనిపించడంలేదు. అందుకే తాళపత్రాల్లోని సమాచారాన్ని కంప్యూటరైజ్ చేస్తున్నాం. పాడైన తాళపత్రాలను సైతం నిపుణుల పర్యవేక్షణలో అందులోని సమాచారాన్ని క్రోడీకరించే ప్రయత్నం చేస్తున్నాం.

– జి.వాణీ మోహన్, కమిషనర్, పురావస్తు శాఖ

కనులపండువగా శ్రీనివాస కల్యాణం


శ్రీనివాస కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు. కల్యాణవేదికపై ప్రజాప్రతినిధులు, నేతలు

ఒంగోలులో కిటకిటలాడిన కల్యాణ ప్రాంగణం

సాక్షి ప్రతినిధి ఒంగోలు: ప్రకాశం జిల్లా కేంద్రం ఒంగోలులో బుధవారం రాత్రి నిర్వహించిన దేవదేవుడు శ్రీనివాసుడి కల్యాణం కనులపండువగా జరిగింది. ఒంగోలు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో వెంగముక్కలపాలెం రోడ్డులోని క్విస్ ఇంజినీరింగ్ కళాశాల ఎదురుగా ఉన్న 'శ్రీకరి ఆంఫైర్' ప్రాంగణంలో టీటీడీ వేదపండితులు శ్రీనివాస కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేలాదిమంది భక్తులతో ఆ ప్రాంగణం కిటకిటలాడింది. టీటీడీ ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు అర్చక బృందంతో శ్రీవారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు వేద పండితులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవర్లను కల్యాణవేదిక వద్దకు తీసుకొచ్చారు. రాత్రి 7.32 గంటలకు మంగళసూత్ర ధారణ జరిగింది. పద్మశ్రీ అవార్డు గ్రహీత శోభారాజు, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుడు మధుసూదనరావు బృందం ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు అలరించాయి. బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి, కుమారుడు ప్రణీత్‌రెడ్డి, శ్రీకావ్య, మనుమడు సిద్దాన్‌రెడ్డి ఈ కల్యాణాన్ని జరిపించారు. ఈ కార్యక్రమంలో మంత్రి రజిని, ఎంపీలు మాగుంట శ్రీనివాసులురెడ్డి, బీద మస్తాన్ రావు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, టీటీడీ బోర్డు సభ్యుడు, కనిగిరి ఎమ్మెల్యే మధుసూదన్ యాదవ్, మాజీ మంత్రులు అనిల్ కుమార్ యాదవ్, రాఘవరావు, ఎమ్మెల్యేలు బలరామకృష్ణమూర్తి, సుధాకరబాబు, వేణుగోపాల్, అన్నా రాంబాబు, మేకపాటి విక్రమ్‌రెడ్డి, కోన రఘుపతి దంపతులు, ఎమ్మెల్సీలు పోతుల సునీత, తూమాటి మాధవరావు, కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్, ఎస్పీ మలికాగర్గ్, గుంటూరు డీఐజీ సతీమణి సువర్ణవర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు డీఏ ఇవ్వాలి

ప్రభుత్వ సలహాదారు సజ్జలకు ఉపాధ్యాయ నేతల వినతి

సాక్షి, అమరావతి: ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు రెండు విడతల కరువుభత్యం (డీఏ) నిధులు తక్షణమే విడుదల చేయాలని పలువురు ఉపాధ్యాయ నేతలు డిమాండ్ చేశారు. వారు బుధవారం ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి ఆధ్వర్యంలో తాడేపల్లిలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, గురుకుల, ఎయిడెడ్ ఉపాధ్యాయుల పదవీ విరమణ పెంపునకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రావిడెంట్ ఫండ్, ఏపీ జీఎల్ఐ రుణాలు, పదవీ విరమణ అనంతరం ఫైనల్ పేమెంట్లు, సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లింపులు కొన్ని నెలలుగా జరగలేదని చెప్పారు. వెంటనే వీటిని చెల్లించాలని కోరారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు కమ్యూటేషన్, గ్రాట్యుటీ కూడా వెంటనే చెల్లించాలన్నారు. గురుకుల, ఎయిడెడ్ ఉపాధ్యాయుల పదవీ విరమణ వయసు పెంపునకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ప్రధానోపాధ్యాయులకు, మండల విద్యాశాఖ అధికారులకు జోనల్ సీనియార్టీ ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలని, శాశ్వత బదిలీల కోడ్ తయారు చేయాలని విజ్ఞప్తి చేశారు. సజ్జలను కలిసిన వారిలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పి.శ్యామ్‌సుందర్‌రెడ్డి, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎం.వి.రామచంద్రారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ప్రగతిశీల ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి, ఉపాధ్యాయ నేత పి.వి.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సజ్జలను కలిసిన ఉపాధ్యాయ నేతలు

ప్రతిపక్షాల కుటిల రాజకీయాల్ని తిప్పికొట్టండి

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు మంత్రి బొత్స పిలుపు



విజయనగరం: ప్రభుత్వంపై బురద జల్లేందుకు టీడీపీ, దాని వెనుక ఉన్న కొన్ని పార్టీలు కుటిల రాజకీయాలు చేస్తున్నాయని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలంతా వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. విజయనగరంలో బుధవారం జరిగిన పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి గెలిపించుకోవాలని, అప్పుడే ప్రజలకు సంక్షేమ పాలన అందుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో బోధనపై ఆరోపణలు చేస్తున్న టీడీపీ నాయకులు వారి పిల్లల్ని ఏ మీడియంలో చదివిస్తున్నారో చెప్పాలన్నారు. ఓ విధానపరమైన నిర్ణయం తీసుకుంటే ప్రభుత్వం వేయికళ్లతో పర్యవేక్షిస్తోందని గుర్తు చేశారు. ఉద్యోగుల జీతాల చెల్లింపులో ఒకనెలలో స్వల్ప జాప్యం జరిగితే దానిని రాద్ధాంతం చేస్తున్నారని, గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఈ తరహా జాప్యం జరగలేదా అంటూ ప్రశ్నించారు. కొందరు నాయకులు ఎవరినైనా ఇష్టం వచ్చినట్టు తిడతారని, అసభ్యంగా మాట్లాడతారని, పోలీసులు చర్యలు తీసుకుంటే తప్పంటున్నారని, ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. చట్టం అనేది అందరికీ సమానమేనన్న విషయాన్ని గుర్తించాలన్నారు. నోరుందని.. అనుకూల మీడియా వాటిని ప్రజల్లోకి తీసుకెళ్తుందని ఇష్టారాజ్యంగా మాట్లాడటం సబబు కాదన్నారు. సినిమా యాక్టర్ ప్రజల్లోకి వస్తే ఎగబడి చూడటం ప్రజల నైజమని, కానీ.. ప్రజల కోసం పని చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చిన వారు సంప్రదాయంగా నడుచుకోవాలన్న ఆలోచన లేకపోవడం దురదృష్టకరమని పరోక్షంగా పవన్‌కళ్యాణ్‌ను ఉద్దేశించి అన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి చేటుగా మంత్రి అభివర్ణించారు. సమావేశంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్‌బాబు, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు నెక్కల నాయుడుబాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం


సూర్యకళ దంపతులను సన్మానిస్తున్న ఎంపీడీఓ, తదితరులు

మెంటాడ: ఇటీవల విజయవాడలో గురుపురస్కార్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ వ్యాస రచన (ఏ నేషనల్ ఎస్సే రైటింగ్ కాంటెస్ట్ ఫర్ టీచర్స్) పోటీల్లో పాల్గొని ప్రథమ బహుమతి గెలుచుకున్న సైన్స్ ఉపాధ్యాయురాలు బి.సూర్యకళ పలువురికి ఆదర్శమని ఎంపీడీఓ తివిక్రమ్ అన్నారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సూర్యకళ దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, 22 రాష్ట్రాలకు చెందిన 2 వేల మంది ఉపాధ్యాయులు పోటీలో పాల్గొనగా... సూర్యకళకు ప్రథమ బహుమతి రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అరుణ పాల్గొన్నారు.

నేటి నుంచి క్రీడా పోటీలు

పార్వతీపురం టౌన్: నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు గురువారం నుంచి నిర్వహించనున్నట్టు స్కూల్ గేమ్స్ కార్యదర్శి డీటీ గాంధీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం నియోజకవర్గం స్థాయిలో జరిగే ఈ పోటీల్లో అండర్ 14, 17 బాలబాలికల వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చెస్, బ్యాడ్మింటన్ పోటీలు గురువారం పార్వతీపురం ఆర్‌సీఎం హైస్కూల్ ఆవరణలో నిర్వహిస్తామని తెలిపారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులంతా హాజరు కావాలన్నారు. వివరాలకు 83281 04487 నంబరుకు సంప్రదించాలన్నారు. ఈ నెల 11వ తేదీన బ్యాడ్మింటన్, టెన్నికాయిట్ పోటీలు సీతానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నామని తెలిపారు. వివరాలకు 9618006367 నంబరుకు సంప్రదించాలని సూచించారు. ఈ నెల 12న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిలకలపల్లి గ్రామంలో అథ్లెటిక్స్ క్రీడలను నిర్వహిస్తామని తెలిపారు. వివరాలకు 9182937575 నంబరుకు సంప్రదించాలన్నారు.

వాహనాల వేలం



బొబ్బిలి: వివిధ కేసులలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సీజ్ చేసిన వాహనాలను బుధవారం స్థానిక ఎస్‌ఈబీ కార్యాలయంలో వేలంవేశారు. అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శైలజారాణి ఆధ్వర్యంలో 17 వాహనాలకు వేలం వేయగా... 14 వాహనాలను ఔత్సాహికులు 2,26,540 రూపాయలకు కొనుగోలు చేశారు. మిగిలిన వాహనాలను త్వరలోనే వేలం వేస్తామని ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్ తెలిపారు.

పట్టభద్రుల్లో చైతన్యం

- ఓటరుగా నమోదుకు భారీగా దరఖాస్తులు

మహారాణిపేట(విశాఖ దక్షిణ):



ఓట్ల నమోదులో ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన పట్టభద్రులు చైతన్యం చూపారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక కోసం చేపట్టిన ఓటరు నమోదులో గతంలో కంటే రెట్టింపుగా విద్యావంతులు ఓటర్లుగా దరఖాస్తులు చేసుకున్నారు. అక్టోబర్ 1 నుంచి నవంబర్ 7 వరకు నిర్వహించిన కార్యక్రమాన్ని రాజకీయ పార్టీలన్నీ ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం వల్ల దరఖాస్తుల సంఖ్య భారీగా పెరిగింది. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా చేపట్టిన ఓటరు నమోదులో భారీగా దరఖాస్తులు దాఖలయ్యాయి. ఉత్తరాంధ్ర పరిధిలోని ఆరు జిల్లాల విద్యావంతులు భారీగానే ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు. గడువు ముగిసే సమయానికి శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల నుంచి 2,69,535 దరఖాస్తులు వచ్చాయి. ఈ ఆరు జిల్లాల నుంచి ఆన్‌లైన్‌లో 40 వేల దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను ఆరు జిల్లాల పరిధిలో 119 మంది వరకు తహసీల్దార్లు ఆధ్వర్యంలో పరిశీలన జరుగుతోంది.

అత్యధికంగా విశాఖ జిల్లాలో..

ఉత్తరాంధ్రలో అత్యధికంగా విశాఖపట్నం జిల్లా విద్యావంతులు దరఖాస్తు చేసుకున్నారు. ఆ తర్వాత స్థానంలో విజయనగరం ఉంది.

జిల్లా	వచ్చిన దరఖాస్తులు
శ్రీకాకుళం	48,967
విజయనగరం	59,281
పార్వతీపురం మన్యం	17,351
అల్లూరి సీతారామరాజు	11,591
అనకాపల్లి	42,104
విశాఖపట్నం	90,241

విశాఖపట్నం జిల్లాకు సంబంధించి 11 మంది తహసీల్దార్లు, ఏడుగురు జోనల్ కమిషనర్లు దరఖాస్తుదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పరిశీలన చేస్తున్నారు. ఈ నెల 22వ తేదీ నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ నెల 23న ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా తుది ముసాయిదా ప్రకటన చేస్తారు.

త్వరగా నాడు – నేడు పనులు చేపట్టాలి

పాచిపెంట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నాడు – నేడు పనులు త్వరితగతిన చేపట్టాలని ఎంపీడీఓ లక్ష్మీకాంత్ అన్నారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో లపాఠశాలల ప్రధానోపాధ్యాయులతో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఫేస్ – 2 కింద 47 పాఠశాలల్లో 76 పనులు మంజూరయ్యాయన్నారు. మంజూరైన పనులు సకాలంలో పూర్తి చేసేలా ప్రధానోపాధ్యాయులు పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రతి రోజు సుమారు ఒక్కో పాఠశాలలో మూడు లక్షల రూపాయలు విలువచేసే పనులు చేపట్టాలన్నారు. గిరిశిఖర గ్రామాల పాఠశాలకు చెందిన కొంత మంది ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ గిరిశిఖర గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో మెటీరియల్స్ ప్రజలే నేరుగా మోసుకొని తీసుకెళ్లవలసిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. వాటికి సంబంధించి ప్రత్యేకంగా అదనపు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి ఈ సమస్య తీసుకువెళ్తానని ఎంపీడీఓ తెలియజేశారు. సమావేశంలో ఎంఈఓ పల్లి జోగారావు, సీడీపీఓ అనంతలక్ష్మి ఏపీఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీఓ లక్ష్మీకాంత్

13న బాలసాహిత్య పురస్కారం

పార్వతీపురం: నారంశెట్టి బాలసాహిత్య పీఠం కార్యక్రమాన్ని పట్టణంలోని కళింగ వైశ్య కల్యాణ మండపంలో ఈ నెల 13న నిర్వహించనున్నట్టు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నారంశెట్టి బాలసాహిత్య పురస్కారాలు 2022కు సంబంధించి పార్వతీపురానికి చెందిన బెహరా ఉమామహేశ్వరరావు, హైదరాబాద్‌కు చెందిన కొసరాజు సురేష్‌ను ఎంపిక చేసినట్టు తెలిపారు. ఇదే కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన తొమ్మిది మందిని సత్కరించేందుకు ఎంపిక చేసినట్టు తెలిపారు.

రైతులకు అండగా ఉంటాం..


రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ సూర్యకళ

కొత్తవలస రూరల్: విశాఖ – రాయ్‌పూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి సహకరించిన రైతులకు అండగా ఉంటామని విజయనగరం ఆర్డీఓ ఎంవీ సూర్యకళ అన్నారు. రిలే నిరాహార దీక్షలు చేసున్తన్న ఉత్తరాపల్లి గ్రామానికి చెందిన రైతులతో బుధవారం ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, 45 హెక్టార్లలో ఇంటర్‌చేంజ్ మార్పు చేయాలని కోరగా.. మార్పు చేయడం కుదరదని ఆర్డీఓ స్పష్టం చేశారు. భూములిచ్చిన రైతులకు సాధ్యమైనంత ఎక్కువ ధర లభించేలా కృషి చేయమని రైతు సంఘ జిల్లా కార్యదర్శి రాంబాబు, సహాయ కార్యదర్శి రమణ, గ్రామ నాయకులు సింగంపల్లి గణేష్ కోరారు. దీనికి ఆర్డీఓ స్పందిస్తూ 18న గ్రామసభ నిర్వహించి వీలైనంత ఎక్కువ నష్ట పరిహారం ఇప్పించడానికి కృషి చేస్తానని, స్టోన్ ప్లాంటేషన్‌కు రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ దేవుపల్లి ప్రసాద్‌రావు, ఆర్ఐ దివ్యకిశోర్, వీఆర్ఓ మధు, తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు విస్తృత సేవలు

- ప్రభుత్వ పథకాలతో మేలు
- త్వరలో మరో 7 సంచార పశువైద్యశాలలు
- పశు సంవర్ధక శాఖ జేడీ రమణ


మాట్లాడుతున్న పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ వైవీ రమణ

బొబ్బిలి రూరల్: పాడి రైతులకు మేలు చేసేలా పశుసంవర్ధక శాఖ చర్యలు చేపడుతోందని, ప్రభుత్వం అనేక పథకాల ద్వారా పాడి ఉత్పత్తికి ప్రోత్సాహకం అందిస్తోందని పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ వైవీ రమణ తెలిపారు. స్థానిక పశుసంవర్ధక శాఖ డీడీ కార్యాలయంలో ఆయన విలేకరులతో బుధవారం మాట్లాడారు. జిల్లాలో 1,96,000పశువులకు వ్యాక్సినేషన్ వేయించామని, మరో 80వేల డోసులు తెప్పిస్తున్నామని తెలిపారు. 4 నుంచి 8నెలల ఆడపెయ్యలకు బ్రూసిలోసిస్ వ్యాధి నిరోధక టీకాలు మూడో విడత 20వేల డోసులు నవంబర్ 1 నుంచి 30లోగా వేయిస్తున్నామన్నారు. జిల్లాలో 3,77,960 తెల్ల ఆవులు, 97,845గేదెలు, 4,48,154 గొర్రెలు, 1,56,513 మేకలు, 51,26,764 కోళ్లు ఉన్నాయని, రోజుకు 3,50,000 లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయన్నారు. జిల్లాలో 500 రైతుభరోసా కేంద్రాలు ఉండగా, 474 రైతుభరోసా కేంద్రాలలో వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులు మంజూరయ్యాయని, వీటిలో 370మంది పని చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో 13 అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులలో పూర్తిగా ఏడీలు ఉన్నారని, వెటర్నరీ హెల్త్ క్లినిక్‌లు 65 ఉండగా, 59మంది వైద్యులు పని చేస్తున్నారని, 6ఖాళీలు ఉన్నాయని చెప్పారు. గ్రామీణ పశువైద్యకేంద్రాలు 40ఉండగా, 15పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాలలో 7సంచార పశువైద్యశాలల ద్వారా ప్రతీ రోజూ 50 నుంచి 60కేసులు పరిష్కరిస్తున్నారని, జిల్లాకు మరో ఏడు సంచార పశువైద్యశాలలు రానున్నాయని తెలిపారు. ఏడు నియోజకవర్గాలలో పశువ్యాధి నిర్ధారక కేంద్రాలు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాయన్నారు. ప్రతీ పశువైద్యాధికారి నెలలో 4రోజులు రైతుభరోసా కేంద్రాలను పరిశీలించి, పశువిజ్ఞానబడి కార్యక్రమం నిర్వహిస్తూ, రైతులకు పాడి అభివృద్ధిపై అవగాహన కలిపిస్తున్నారని తెలిపారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా 75శాతం రాయితీపై మొక్కజొన్న, బొబ్బర్లు తదితర విత్తనాలు అందిస్తున్నామని, మిశ్రమదాణా మిశ్రమం 1600టన్నులు అందించామని తెలిపారు. లంపీ స్కిన్ డిసీజ్‌పై అప్రమత్తమై పశురవాణా, సంతలు, క్రయ, విక్రయాలు నిలిపివేసేలా చర్యలు చేపట్టామని చెప్పారు. రామభద్రపురం మండలం తారాపురం వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేశామన్నారు. కనీసం 2పశువులు ఉంటే ఎలాంటి గ్యారంటీ లేకుండా బ్యాంకుల ద్వారా 1,60,000 రూపాయలకు పశు కిసాన్ క్రెడిట్ కార్డులు ఇప్పిస్తున్నామని, జిల్లాలో పావలా వడ్డీ రుణాలు అందించడంపై సెప్టెంబర్ 15నుంచి 2023మార్చి 15వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 5,717మంది లబ్ధిదారులను గుర్తించి, వారిలో 1,409మంది రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా లబ్ధి చేకూర్చామన్నారు. పశుదాణా చట్టం ప్రకారం కల్తీ చేసిన పశుదాణా అమ్మితే కేసులు నమోదు చేస్తామని, ప్రతీ నెలా 5వ తేదీన పశుదాణా విక్రయ దుకాణాలను తనిఖీ చేస్తున్నామన్నారు. గొర్రెలు, మేకలకు శతశాతం నట్టల నివారణ మందులు వేశామని తెలిపారు. హెల్త్‌క్యాంపులు 270నిర్వహించామని, 3,642పశువులకు గర్భకోశ నివారణ చికిత్సలు నిర్వహించామని తెలిపారు. 6వేల పశువులకు నష్టపరిహారం 8కోట్ల రూపాయలు అందించాల్సి ఉండగా, 4కోట్లకు ప్రతిపాదనలు పంపామని, మరో విడతలో 4కోట్లకు ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. ఆయనతో పాటు డీడీ రెడ్డి నీలయ్య ఉన్నారు.

ఏయూ దూరవిద్య పరీక్షల ఫీజు గడువు డిసెంబర్ 5

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం పరిధిలో డిగ్రీ (బీఏ, బీకాం, బీఎస్సీ) ప్రథమ, ద్వితీయ, మూడో సంవత్సరం విద్యార్థులు డిసెంబర్ 5వ తేదీలోగా పరీక్షలకు దరఖాస్తు చేసుకోవాలని దూరవిద్య కేంద్రం సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు తెలిపారు. బ్యాక్‌లాగ్‌లు ఉన్న విద్యార్థులు సైతం పరీక్షలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి పరీక్ష ఫీజును ఆన్‌లైన్ విధానంలో చెల్లించాలని, దరఖాస్తులను ఏయూ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. డిసెంబర్ 12వ తేదీ వరకు రూ.500 అపరాధ రుసుముతో దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు అసైన్‌మెంట్‌లను డిసెంబర్ 12లోగా అందజేయాలని తెలిపారు. తృతీయ సంవత్సరం పరీక్షలు డిసెంబర్ 28 నుంచి ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు డిసెంబర్ 28 నుంచి మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతాయన్నారు. ప్రథమ సంవత్సరం పరీక్షలు జనవరి 20వ తేదీ నుంచి మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతాయి. రాష్ట్ర వ్యాప్తంగా 55 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఇతర సమాచారం కోసం 0891 2844163, 2754966 నంబర్లలో సంప్రదించాలి.

స్త్రీ శక్తి

'అవకాశం అనేది మీ తలుపు తట్టకపోతే కొత్త తలుపు తయారు చేసుకోండి' అనే మాట ఉంది. అవును. కొత్తగా ఆలోచించినప్పుడు మాత్రమే కొత్తశక్తి వస్తుంది. ఆ శక్తి ఈ ముగ్గురు మహిళలలో ఉంది. 'ఆసియాస్ పవర్ బిజినెస్ ఉమెన్' జాబితాలో చోటు సంపాదించిన గజల్ అలఘ్, నమితా థాపర్, సోమా మండల్‌ల గురించి...

పవర్‌కు కేరాఫ్ అడ్రస్


గజల్ అలఘ్


నమితా థాపర్


సోమా మండల్

ఫోర్బ్స్ 'ఆసియాస్ పవర్ బిజినెస్ ఉమెన్' జాబితాలో మన దేశానికి చెందిన గజల్ అలఘ్, నమితా థాపర్, సోమా మండల్‌లు చోటు సంపాదించారు. కోవిడ్ కష్టాలు, నష్టాలను తట్టుకొని తమ వ్యాపార వ్యూహాలతో సంస్థను ముందుకు తీసుకెళ్లిన వారికి ఈ జాబితాలో చోటు కల్పించారు.

'హొనాసా కన్జ్యూమర్' కో–ఫౌండర్ గజల్ అలఘ్ చండీగఢ్‌లోని ఉమ్మడి కుటుంబంలో పెరిగింది. ఆ పెద్ద కుటుంబంలో మహిళల నోట ఉద్యోగం అనే మాట ఎప్పుడూ వినిపించేది కాదు. అయితే తల్లి మాత్రం గజల్‌కు ఆర్థిక స్వాతంత్ర్యం గురించి తరచు చెబుతుండేది. పదిహేడు సంవత్సరాల వయసులో కార్పొరేట్ ట్రైనర్‌గా తొలి ఉద్యోగం చేసిన గజల్ ఆ తరువాత కాలంలో సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్, ఇన్నోవేటర్ అండ్ ఇన్వెస్టర్‌గా పేరు తెచ్చుకుంది. ప్రణాళికాబద్ధంగా పని చేయడం తన విజయరహస్యం. మూడురోజుల తరువాత చేయాల్సిన పని అయినా సరే ఈ రోజే పక్కాగా ప్లాన్ చేసుకుంటుంది. ధ్యానంతో తన దిన చర్య మొదవుతుంది. కోవిడ్ ఉధృతి సమయంలో వ్యాపారం కుప్ప కూలిపోయింది. అందరిలో భయాలు. ఆ భయం ఆఫీసు దాటి ఇంట్లోకి కూడా వచ్చింది. తల్లిదండ్రుల మౌనం పిల్లలపై పడింది. దీంతో వెంటనే మేల్కొంది గజల్. సరదాగా భర్త, పిల్లలతో యూట్యూబ్ వీడియోలు చేయడం మొదలుపెట్టింది. అలా ఇంట్లో మళ్లీ సందడి మొదలైంది. ఆ ఉత్సాహవంతమైన సందడిలో విచారం మాయమై పోయింది. తన సరికొత్త వ్యూహాలతో వ్యాపారం పుంజుకుంది. 'విచారంలో మునిగిపోతే ఉన్న కాస్తో కూస్తో ఆశ కూడా మాయమైపోతుంది. పరిస్థితులు మరింత దిగజారిపోతాయి. ఇలాంటి సమయంలోనే మానసికంగా గట్టిగా ఉండాలి' అంటుంది గజల్.

'ఎమ్‌క్యూర్ ఫార్మా' ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నమితా థాపర్ రచయిత్రి, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కోచ్, యూ ట్యూబ్ టాక్‌షో 'అన్‌కండీషన్ యువర్‌సెల్ఫ్ విత్ నమితా థాపర్' నిర్వాహకురాలు. సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణిస్తున్న నమితా 'థాపర్ ఎంటర్‌ప్రెన్యూర్ అకాడమీ' ద్వారా ఎంతో మంది ఔత్సాహికులకు విలువైన పాఠాలు చెబుతోంది. తన తాజా పుస్తకం 'ది డాల్ఫిన్ అండ్ ది షార్క్: లెస్సెన్స్ ఇన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్'కు మంచి ఆదరణ లభించింది. 'ప్రపంచం కోసం నువ్వు మారాలని ప్రయత్నించకు. నువ్వు నీలాగే ఉంటే ప్రపంచమే సర్దుబాటు చేసుకుంటుంది' 'నిన్ను నువ్వు ప్రేమించుకోవడం ద్వారా మాత్రమే నీలోని శక్తి నీకు కనిపిస్తుంది'...ఇలాంటి ఉత్తేజకరమైన వాక్యాలు ఈ పుస్తకంలో కనిపిస్తాయి. 'మొదట్లో నాలో ఆత్మవిశ్వాసం ఉండేది కాదు. లావుగా ఉండడం వల్ల చిన్నప్పుడు తోటి పిల్లలు వెక్కిరించేవారు. వారి మాటలను సీరియస్‌గా తీసుకొని ఉంటే నిస్పృహ అనే చీకట్లోనే ఉండే దాన్ని. నన్ను నేను తెలుసుకోవడానికి సమయం పట్టింది. ఆ తరువాత మాత్రం ఆత్మ విశ్వాసాన్ని ఎప్పుడూ కోల్పోలేదు' అంటుంది నమితా థాపర్.

భువనేశ్వర్‌కు చెందిన సోమా మండల్ చదువులో ఎప్పుడూ ముందుండేది. తాను ఇంజనీరింగ్‌లో చేరడానికి తండ్రి ఒప్పుకోలేదు. ఇంజనీరింగ్‌లాంటి వృత్తులు అమ్మాయిలు చేయలేరు అని ఆయన అనుకోవడమే దీనికి కారణం. అయితే కుమార్తె పట్టుదలను చూసి తండ్రి తన నిర్ణయాన్ని మార్చుకోక తప్పలేదు. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో పట్టా తీసుకున్న సోమా మండల్ అల్యూమినియం తయారీ సంస్థ 'నాల్కో'లో ట్రైనీగా తన ప్రస్థానాన్ని ప్రారంభించింది. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియాకు తొలి మహిళా ఛైర్‌పర్సన్‌గా చరిత్ర సృష్టించింది. నష్టాల్లో ఉన్న సంస్థను లాభాల బాట పట్టించి జేజేలు అందుకుంది. ●

సైబర్ టాక్



ప్రతీకాత్మక చిత్రం

వివిధ అవసరాలకు స్మార్ట్ ఫోన్ ఎంతగా ఉపయోగపడుతోందో, వివిధ రకాల మోసగాళ్లకు కూడా అంతే ఉపయోగపడుతోంది. ఇలాంటి మోసాలలో ఇటీవల వినిపిస్తున్న మాట స్క్రీన్ షేరింగ్. అత్యంత సులువుగా అనిపించే ఈ ప్రక్రియ ద్వారా బాధితుల సంఖ్యా పెరుగుతోంది. స్క్రీన్ షేరింగ్ ఎలాంటి సమయంలో చేస్తుంటారు, ఎందుకు చేయకూడదు..? అనే విషయాలపై అవగాహన ఉండాలి..

స్క్రీన్‌షేరింగ్ మోసం అనేది ఒక రకమైన సోషల్ ఇంజినీరింగ్ (ఫిషింగ్) మోసం. హ్యాకర్లు బ్యాంక్ లేదా పేమెంట్ యాప్ ఉద్యోగిలా నటించి, రిమోట్ యాక్సెస్ పొందడానికి స్క్రీన్ షేరింగ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయమని అడుగుతారు.

బ్యాంకింగ్ లేదా లోన్ యాప్‌లకు సంబంధించిన సమస్యను త్వరితంగా పరిష్కరించుకోమంటూ ముందు మెసేజ్‌లు, తర్వాత మాటల గారడీతో మోసగాళ్లు అమాయకులను ఇట్టే బుట్టలో వేసుకుంటారు.

స్క్రీన్ షేరింగ్ అప్లికేషన్లలో (ఎ) www.anydesk.com (బి) www.teamviewer.com (సి) www.freeconferencecall.com (డి) www.join.me వంటి కొన్ని ఇతర యాప్‌లు కూడా ఉన్నాయి. (ఇ) విండో రిమోట్ డెస్క్‌టాప్ కనెక్షన్ (ఎఫ్) www.screenleap.com (హెచ్) www.mikogo.com (ఐ) www.splashtop.com జనాదరణ పొందినవి

దశలవారీగా..

● చెల్లింపు యాప్ లావాదేవీ, ఇ కామర్స్ లావాదేవీ లేదా బ్యాంక్ లావాదేవీతో మనకు ఏదైనా సమస్య ఏర్పడినప్పుడు... బాధితుడు కస్టమర్ సేవ కోసం ఇంటర్నెట్‌లో శోధిస్తాడు. (ఇంటర్నెట్ సెర్చ్‌లలో కనిపించే చాలా నంబర్‌లు నకిలీ కస్టమర్ కేర్ నంబర్‌లు ఉంటాయి) ● అది తెలియక, బాధితుడు ఆ నంబర్‌కు కాల్ చేసి సంభాషణ జరుపుతాడు. సాధారణంగా అధికారిక కస్టమర్ కేర్ అనుసరించే ప్రక్రియనే వీరూ అనుకరించడం వలన బాధితుడు మోసాన్ని తొందరగా గుర్తించలేడు. ● మోసగాడు బాధితుడిని సమస్య పరిష్కారానికి స్క్రీన్ షేరింగ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయమని, పాస్ కోడ్‌ను షేర్ చేయమని అడిగి, అవి చెప్పగానే బాధితుల ఫోన్ లేదా కంప్యూటర్ యాక్సెస్‌ను పొందుతారు. ● రిమోట్ యాక్సెస్‌ని పొందిన తర్వాత, అతని/ఆమె సొంత ఖాతాకు డబ్బును బదిలీ చేయడానికి బాధితుడి ఫోన్‌లో ఇప్పటికే ఇన్‌స్టాల్ చేసిన యుపిఐ చెల్లింపు యాప్‌ని ఉపయోగిస్తాడు. ● బాధితులను మాటల్లో పెట్టి లావాదేవీని పూర్తి చేయడానికి ఓటీపీ చెప్పమని లేదా క్యూఆర్ కోడ్ స్కాన్ చేయమని, కేవైసీ వివరాలను ఇమ్మని అడుగుతారు. బాధితులు ఆ వివరాలను అందించగానే మోసగాళ్లు బాధితులను బ్యాంక్ నుండి వచ్చిన నోటిఫికేషన్‌లను చూడనివ్వకుండా మాటల్లో పెడతాడు. బాధితుడు డబ్బు క్రెడిట్ అవుతుందని ఊహిస్తాడు, కానీ బదులుగా డబ్బు డెబిట్ అవుతుంది.

ఇలా గుర్తించండి..

● మీకు తెలియని వ్యక్తులు ఎవరైనా మీ ఫోన్, కంప్యూటర్ వంటి డిజిటల్ పరికరాల్లో దేనినైనా యాక్సెస్ చేయమని అడిగినా, నిర్దిష్ట సాఫ్ట్‌వేర్‌ను డౌన్‌లోడ్ చేయమని కోరినా, మీరు సోషల్ ఇంజినీరింగ్ మోసానికి గురవుతారని గుర్తించాలి. ● స్క్రీన్ షేర్ లేదా మరేదైనా సాఫ్ట్‌వేర్‌ను డౌన్‌లోడ్ చేయమని ఏ బ్యాంక్ లేదా కంపెనీ మిమ్మల్ని ఫోన్ ద్వారా అడగదు. ● మీ డిజిటల్ పరికరాలకు రిమోట్‌గా కనెక్ట్ చేయమని ఎవరైనా అడిగినా, మీ బ్యాంక్ ఖాతాకు లాగిన్ చేయమని అడిగినా, వ్యక్తిగత పాస్‌వర్డ్‌లను అడిగినా లేదా మీ చెల్లింపు యాప్‌లను అన్‌లాక్ చేయమని అడిగినా... వారు మోసగాళ్లు అని గుర్తించాలి. ● మీరు మోసానికి గురవుతున్నట్లు భావిస్తే వెంటనే టెలిఫోన్ సంభాషణను ఆపేసి, మీ డిజిటల్ పరికరాన్ని ఆఫ్ చేయడం ద్వారా అన్ని రిమోట్ సెషన్‌తలను క్లోజ్ చేయవచ్చు.

నివారణ చర్యలు

● ఫోన్ కాల్‌లో ఉన్నప్పుడు యాప్‌లను ఇన్‌స్టాల్ చేయద్దు. అలాగే లావాదేవీలు చేయవద్దు. ● స్మార్ట్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసిన యాప్‌లను పాస్‌వర్డ్‌తో రక్షించుకోవాలి. ● యాప్‌లను డౌన్‌లోడ్ చేయమని లేదా వాటిని అప్‌డేట్ చేయమని అభ్యర్థించే కాల్స్ లేదా సందేశాలను నమ్మద్దు. వాటిలో వచ్చే షార్ట్ లింక్స్‌ను ఓపెన్ చేయద్దు. ● ఓటీపీని షేర్ చేయడం, క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం అంటే మన బ్యాంక్ ఖాతా నుండి డబ్బు డెబిట్ అవుతోందని గ్రహించాలి. షార్ట్ లింక్స్‌ని క్లిక్ చేయవద్దు. ● మీ ఖాతాకు సంబంధించిన సమస్య ఉంటే అధికారిక వెబ్‌సైట్‌ల నుంచి తీసుకున్న నంబర్‌లకు మాత్రమే కాల్ చేయండి. ● యాప్ స్టోర్ లేదా ప్లే స్టోర్ నుండి మాత్రమే యాప్‌లను డౌన్‌లోడ్ చేయండి. ● బ్యాంకింగ్ సేవలకు సంబంధించిన వాటికి ఒక ఫోన్ నెంబర్, సోషల్ మీడియా వినియోగానికి మరో ఫోన్ నెంబర్‌ను ఉపయోగించడం మేలు. ● ఇమెయిల్, వాట్సప్, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో కనిపించే ఉచిత ఆఫర్లు, రివార్డ్ పాయింట్‌లు, లాటరీ ఆఫర్లను నమ్మద్దు.

మోసానికి గురైతే..

● సంబంధిత సర్వీస్ ప్రొవైడర్‌లకు (బ్యాంకర్‌లు, చెల్లింపు యాప్‌లు లేదా ఇ-కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లు) మోసాన్ని తెలియజేయండి. ● ఖాతాల పాస్‌వర్డ్‌లన్నింటినీ వెంటనే మార్చండి. ● స్థానిక సైబర్ క్రైమ్ పోలీసులకు జరిగిన మోసాన్ని తెలియజేయండి. లేదా www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయండి. లేదాటోల్ ఫ్రీ నంబర్ 1930కి డయల్ చేయండి.


ఇన్‌పుట్స్: **అనీల్ రాచమల్ల,** డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్

సినిమా

ఆ విషయంలో మాకు రాజమౌళిగారు స్ఫూర్తి

"కథ పరంగా ఎప్పుడూ కొత్త పాయింట్‌ను ప్రేక్షకులకు చెప్పాలన్నదే మా ఉద్దేశ్యం. అయితే ఆ పాయింట్‌కు ఎమోషన్స్, థ్రిల్ వంటి అంశాలు కూడా ఉండాలి. ప్రతి సీన్‌లో ఎమోషన్స్ ఉంటే ఆడియన్స్ కనెక్ట్ అవుతారని దర్శకులు రాజమౌళిగారు చెబుతుంటారు. ఈ విషయంలో ఆయనే మాకు స్ఫూర్తి. మేం చేసిన మంచి ఎమోషనల్ థ్రిల్లర్ 'యశోద'" అని దర్శక ద్వయం హరి-హరీష్ అన్నారు. సమంత టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'యశోద'. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ నెల 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో హరి-హరీష్ చెప్పిన విశేషాలు... - హరి-హరీష్

● వార్తల్లో చూసిన, చదివిన ఘటల ఆధారంగా 'యశోద' స్క్రిప్ట్ రాసుకున్నాం. అయితే ట్రైలర్‌లో చూపించిన విధంగా సరోగసీ అనేది ఈ సినిమాలో ఒక అంశం మాత్రమే. కొత్త విషయాలు చాలా ఉన్నాయి. మెడికల్ మాఫియా, సర్వైవల్ థ్రిల్లర్ అనుకోవచ్చు. లాక్‌డౌన్ సమయంలో చాలామంది మహిళలు తమ గర్భాన్ని సరోగసీకి ఇచ్చారు. ట్విన్స్ పుడితే వారికి ఎక్కువ డబ్బులు ఇచ్చేవారు. ఇలా గర్భవతుల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. మేం సినిమా కోసం సృష్టించిన ఈవా అనే సరోగసీ ఫెర్టిలిటీ సెంటర్‌లో గర్భవతులకు, వారిలో ఒకరైన యశోదకు ఏం జరిగింది? అన్నదే సినిమా కథ. డిఫరెంట్ షేడ్స్ ఉన్న ఈ కథలో సస్పెన్స్ ఎలిమెంట్స్ జోడించాం.

● సమంతగారు ఎంతటి ఎమోషనల్ సీన్‌ని అయినా ఇట్టే చేస్తారు. గ్లిజరిన్ వాడరు. ఓ రోజు ఓ యాక్షన్ సీక్వెన్స్ షూట్ చేశాం. అయితే ఆ రోజు ప్యాకప్ అయ్యాక సమంతగారు జ్వరంతో బాధపడుతున్న విషయం తెలిసింది. వర్క్ పట్ల ఆమె అంతటి అంకితభావంతో ఉంటారు.

● ఈ సినిమాలో సాంగ్స్ లేవు కానీ ఎమోషనల్‌గా కథను ముందుకు తీసుకుని వెళ్లే బిట్ సాంగ్స్ ఉన్నాయి. మణిశర్మగారు మంచి మ్యూజిక్, ఆర్ ఆర్ ఇచ్చారు. శివలెంక కృష్ణప్రసాద్‌గారి వల్లే 'యశోద' స్థాయి పెరిగింది. మంచి నటీనటులు, సాంకేతిక నిపుణులు కుదిరారు. డైలాగ్స్ రైటర్స్ పులగం చిన్నారాయణ, చల్లా భాగ్యలక్ష్మీ సినిమా ఫ్లో బాగుండేలా చూసుకున్నారు. ఆర్ట్ డైరెక్టర్ అశోక్‌గారు వేసిన ఈవా సెట్ ఓ హైలైట్. నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ గారితో మళ్లీ ఓ సినిమా ఉంటుంది.


● హరీశ్, హరి

నేను కొన్ని సినిమాలకు అసిస్టెంట్‌గా చేశాను. ఎడిటర్‌గా కూడా చేశాను. హరీష్ ఐటీ బ్యాక్‌డ్రాప్ నుంచి వచ్చాడు. ఓ షార్ట్ ఫిలిం కోసం మేం ఇద్దరం కలిశాం. మా అభిప్రాయాలు కలిశాయి. కథా చర్చల్లో మా మధ్య విభేదాలు వస్తుంటాయి. కానీ అవి అవుట్‌పుట్ మరింత బాగా వచ్చేందుకే. – హరి


● రష్మిక

నచ్చనంత మాత్రాన విమర్శిస్తారా?

"నటిగా నేను ఎంచుకున్న జీవితం ప్రత్యేకమైనది. ఇక్కడ (ఇండస్ట్రీ) ఉన్న ప్రతి ఒక్కర్నీ అందరూ ఇష్టపడతారని కచ్చితంగా అనుకోను. నేను మీకు (విమర్శిస్తున్నవారిని ఉద్దేశించి) నచ్చనంత మాత్రాన మీరు నాపై విమర్శలు చేయొచ్చని కాదు. మిమ్మల్ని సంతోషపెట్టడానికి ప్రతిరోజూ కష్టపడి పని (సినిమాలు) చేయడం మాత్రమే నాకు తెలుసు. నా పని వల్ల మీరు ఆనందపడితే నాకు అదే చాలు'' అని రష్మికా మందన్నా అన్నారు. సోషల్ మీడియాలో తనపై వస్తున్న విమర్శల గురించి ఇన్‌స్టాగ్రామ్‌లో రష్మిక ఈ విధంగా షేర్ చేశారు.

''కొన్నేళ్లుగా రెండు విషయాలు నన్ను ఇబ్బంది పెడుతున్నాయి. వాటికి సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చిందనుకుంటున్నాను. నేను నా కోసం మాత్రమే మాట్లాడుతున్నాను. నిజానికి ఇది కొన్ని సంవత్సరాల క్రితమే చేయాల్సింది. నటిగా నా కెరీర్ ప్రారంభించినప్పటి నుంచి చాలామంది నన్ను ద్వేషిస్తున్నారు. విమర్శలు, నెగటివిటీ ఈ రెండు విషయాలతో ఇబ్బందిపెడుతున్నారు. ప్రతికూలత, ద్వేషం వల్ల ఉపయోగం ఏంటి? నేను మాట్లాడని విషయాల గురించి నాపై విమర్శలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం నన్ను చాలా నిరుత్సాహపరుస్తోంది. అవి చదివినప్పుడు నా హృదయం పగిలిపోతోంది. కొన్ని ఇంటర్వ్యూల్లో నేను మాట్లాడిన కొన్ని విషయాలు తప్పుగా రీచ్ అయ్యి.. నాకు వ్యతిరేకంగా మారడాన్ని గుర్తించాను. ఇంటర్నెట్‌లో వస్తోన్న తప్పుడు కథనాలు ఇటు పరిశ్రమలో అటు బయట నాకున్న మంచి రిలేషన్స్‌పై ప్రభావం చూపుతున్నాయి. నాతో పాటు నా సహచరులు కూడా ఇబ్బందిపడుతున్నారు. నన్ను నేను మెరుగుపరచుకోడానికి ఉపయోగపడే సద్విమర్శలను స్వాగతిస్తాను. నాపై వస్తున్న విమర్శలను ఎత్తి చూపడం ద్వారా నేను ఎవరిపైనో గెలవడానికి ప్రయత్నించడం లేదు. అలాగే నాపై వస్తున్న విమర్శల కారణంగా మనిషిగా నేను మారాలనుకోవడం లేదు. నా చుట్టూ ఉన్నవారిపై నాకు అభిమానం, ప్రేమ ఉన్నాయి. మీరందరూ నాపై చూపిస్తున్న ప్రేమ, సపోర్ట్ నన్ను ముందుకు నడుపుతున్నాయి. ఇదిగో ఇలా అందరికీ నా మనసులోని మాటలను చెప్పే ధైర్యాన్ని నాకు ఇచ్చింది అవే. అందరం అందరికీ మంచి చేసేలా కృషి చేద్దాం'' అని పోస్ట్ చేశారు రష్మిక.

యాక్షన్‌తో ఆరంభం

రామ్ పోతినేని హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇందులో శ్రీ లీల కథానాయిక. పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ చిత్రం కొత్త షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. హై వోల్టేజ్ యాక్షన్ సీన్‌తో షూటింగ్‌ను మొదలుపెట్టింది యూనిట్. స్టంట్ శివ నేతృత్వంలో ఈ యాక్షన్ సీక్వెన్స్‌ని చిత్రీకరిస్తున్నారు. బోయపాటి దర్శకత్వం వహిస్తున్న ఈ పాన్ ఇండియా మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమెరా: సంతోష్ డి.


● రామ్

వచ్చే నెల టాప్ గేర్


● ఆది

ఆది సాయికుమార్, రియా సుమన్ జంటగా శశికాంత్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'టాప్ గేర్'. ఆదిత్య మూవీస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సమర్పణలో కేవీ శ్రీధర్ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రాన్ని డిసెంబర్ 30న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ''పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రమిది. ఇందులో ఆది టాక్సీ డ్రైవర్‌గా నటించారు. అన్ని వర్గాల ఆడియన్స్‌కి కనెక్ట్ అయ్యే డిఫరెంట్ పాయింట్‌ని మూవీలో టచ్ చేశాం. పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే ఈ మూవీ నుంచి ఫస్ట్ సింగిల్‌ను రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: సాయి శ్రీరామ్, సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: గిరిధర్ మామిడిపల్లి.

ట్రైలర్ ఆసక్తికరంగా ఉంది - దిల్ రాజు


● తిరువీర్, దిల్ రాజు, రాహుల్ యాదవ్

తిరువీర్, సంగీత, కావ్య కల్యాణ్ రామ్, 'శుభలేఖ' సుధాకర్ ప్రధాన పాత్రల్లో నటించిన హారర్ డ్రామా 'మసూద'. సాయికిరణ్ దర్శకత్వంలో రాహుల్ యాదవ్ నక్కా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాను రిలీజ్ చేస్తున్న నిర్మాత 'దిల్' రాజు మాట్లాడుతూ– ''మళ్ళీ రావా', 'ఏజెంట్ సాయిశ్రీనివాస ఆత్రేయ' సినిమాలను నిర్మించారు రాహుల్. ఆ సినిమాలకు అభిమానిని. రాహుల్ అభిరుచిగల నిర్మాత. రాహుల్ జర్నీ నచ్చి అతను నిర్మించిన ఏదైనా సినిమాను మా సంస్థ ద్వారా రిలీజ్ చేస్తానని మాట ఇచ్చాను. 'మసూద' ట్రైలర్ ఆసక్తికరంగా అనిపించింది. ఫైనల్ కాపీ చూసేందుకు ఎదురు చూస్తున్నాను'' అన్నారు. ''మూడేళ్ల కష్టం ఈ సినిమా. 'దిల్' రాజుగారు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నేను నిలబెట్టుకుంటాననే ఆశ ఉంది. ఇండస్ట్రీకి ఐదుగురు కొత్త దర్శకులను పరిచయం చేస్తానని గతంలో చెప్పాను. 'మళ్ళీ రావా'తో గౌతమ్ తిన్ననూరి, 'ఏజెంట్..'తో స్వరూప్ వచ్చారు. ఇప్పుడు 'మసూద'తో సాయికిరణ్ వస్తున్నాడు'' అన్నారు రాహుల్ యాదవ్ నక్కా. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ పాల్గొన్నారు.

అలాంటి సినిమాలన్నీ హిట్టే!


● ఉదయ్ శంకర్

''చిన్న సినిమా, పెద్ద సినిమా అనే తేడాలు లేవు. కథే హీరో. ప్రేక్షకులను రెండుగంటల పాటు ఎంగేజ్ చేయగలిగే సినిమాలన్నీ హిట్టే'' అని ఉదయ్‌శంకర్ అన్నారు. ఉదయ్‌శంకర్, జెన్నిఫర్ ఇమ్మాన్యుయేల్ జంటగా నటించిన చిత్రం 'నచ్చింది గాళ్ ఫ్రెండూ'. ఆర్. సౌజన్య సమర్పణలో అట్లూరి నారాయణరావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో ఉదయ్‌శంకర్ మాట్లాడుతూ– ''దర్శకుడు గురుపవన్ నాలుగేళ్ల క్రితమే ఈ కథ చెప్పారు. నా రెండో సినిమా ఈ కథతోనే చేయాల్సింది.. కుదర్లేదు. ఇప్పుడు చేశాను. ఇందులో రాజారాం అనే యువకుడి పాత్రలో నటించాను. విశాఖపట్నం బ్యాక్‌డ్రాప్‌లో ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుంది. ఇఫ్ ఐ డై అనే యాప్ ఉండే వాచ్ గురించి ఈ సినిమాలో చర్చించాం. ఎవరైనా తమ చివరి క్షణాల్లో చెప్పాలనుకున్న విషయాలను ఈ యాప్ ద్వారా ఇతరులకు చేరవేసే అవకాశం ఉంటుంది. దేశ సైనికులు వినియోగిస్తుంటారు. ఈ యాప్ ఇంకా ప్రయోగాత్మక దశలోనే ఉంది. అలాగే షేర్ మార్కెట్స్ అంశాల నేపథ్యంలోనూ కథనం ఉంటుంది. లవ్, కామెడీ, యాక్షన్ అంశాలతో పాటు ఓ సామాజిక అంశాన్ని కూడా సినిమాలో చూపించాం. ఇక నటుడు మధునందన్ సోదరుడు మోహన్ దర్శకత్వంలో నా తర్వాతి సినిమా ఉంటుంది'' అని అన్నారు.

క్రైమ్.. థ్రిల్...


● కార్తీక్ రాజు, సిమ్రాన్

కార్తీక్ రాజు, సిమ్రాన్ చౌదరి, ఐరా కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'అథర్వ'. 'ది సీకర్ ఆఫ్ ది ట్రూత్' అన్నది ట్యాగ్ లైన్. మహేష్ రెడ్డి దర్శకత్వం వహించారు. నూతలపాటి నరసింహం, అనసూయమ్మ సమర్పణలో సుభాష్ నూతలపాటి నిర్మించిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ జరుపుకుంటోంది. ఈ సందర్భంగా దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ– ''డిఫరెంట్ కాన్సెప్ట్‌తో క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో నిర్మించాం. ఇప్పటికే రిలీజ్ చేసిన టైటిల్ లోగో, మోషన్ పోస్టర్స్‌కి మంచి స్పందన వచ్చింది. త్వరలోనే చిత్రాన్ని రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల, కెమెరా: చరణ్ మాధవనేని, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: విజయ, ఝాన్సీ.

ఐదు భాషల్లో...


● నిహాల్

దేశంలోనే అతి పెద్ద లాజిస్టిక్ కంపెనీల్లో ఒకటైన వీఆర్‌ఎల్ వ్యవస్థాపకుడు విజయ్ శంకేశ్వర్ బయోపిక్‌గా రూపొందిన చిత్రం 'విజయానంద్'. విజయ్ శంకేశ్వర్ పాత్రలో నిహాల్ నటించిన ఈ చిత్రానికి రిషికా శర్మ దర్శకత్వం వహించారు. ఆనంద్ శంకేశ్వర్ నిర్మించిన ఈ పాన్ ఇండియా మూవీని డిసెంబర్ 9న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ''తన తండ్రిపై ఆధారపడకుండా విజయ్ శంకేశ్వర్ సొంత తెలివితేటలతో లారీల వ్యాపారంలోకి ఎలా ప్రవేశించారు? ఆ తర్వాత క్రమంగా ఎదుగుతూ ఓ పెద్ద లాజిస్టిక్ కంపెనీకి అధినేత ఎలా అయ్యారు? అనే నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: గోపీ సుందర్, కెమెరా: కీర్తన్.



స్వర్ణ పతక పోరుకు లవ్లీనా అర్హత

ఆసియా బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ బాక్సర్, టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లీనా బోర్గోహైన్ (75 కేజీలు) ఫైనల్లోకి దూసుకెళ్లింది. జోర్డాన్‌లో బుధవారం జరిగిన సెమీఫైనల్లో లవ్లీనా 5–0తో సెయోంగ్ సుయోన్ (కొరియా)పై గెలిచింది. భారత్‌కే చెందిన అల్ఫియా (ప్లస్ 81 కేజీలు), మీనాక్షి (52 కేజీలు), పర్వీన్ (63 కేజీలు) కూడా ఫైనల్లోకి ప్రవేశించారు. అంకుశిత (66 కేజీలు), ప్రీతి (57 కేజీలు) సెమీఫైనల్లో ఓడిపోయి కాంస్య పతకాలతో సరిపెట్టుకున్నారు.

హైదరాబాద్‌ను గెలిపించిన యాసిర్



ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో డిఫెండింగ్ చాంపియన్ హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) వరుసగా ఐదో విజయం నమోదు చేసింది. జంషెడ్‌పూర్‌లో బుధవారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ ఎఫ్‌సీ 1–0 గోల్‌తో జంషెడ్‌పూర్ ఎఫ్‌సీ జట్టును ఓడించింది. ఆట 48వ నిమిషంలో మొహమ్మద్ యాసిర్ సాధించిన గోల్‌తో హైదరాబాద్ 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత చివరి వరకు ఈ ఆధిక్యాన్ని కాపాడుకుంది. ఇప్పటివరకు ఆరు మ్యాచ్‌లు ఆడిన హైదరాబాద్ 16 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

హేమాహేమీల సెమీస్

ఇప్పటి వరకు ఒక లెక్క... ఇప్పుడు మరో లెక్క... అవును, లీగ్ దశలో ఎలా ఆడామో, ఏం చేశామో అనేది అనవసరం... మరో రెండు మ్యాచ్‌లు ఈ భారత జట్టు ఘనతను ఎప్పటికీ గుర్తుంచుకునేలా చేస్తాయి... లేదా తేడా వస్తే ఎప్పటికీ మరచిపోలేని వేదనను మిగులుస్తాయి... ఆ రెండింటిలో మొదటి అంకానికి నేడు రంగం సిద్ధమైంది... 2013లో చాంపియన్స్ ట్రోఫీ గెలిచిన తర్వాత ఐదు ఐసీసీ టోర్నీలలో భారత్ నాకౌట్ సమరాల్లో చేతులెత్తేసింది. ఇప్పుడు ఆనందం పంచేందుకు మరో అవకాశం టీమిండియాకు వచ్చింది.

మాజీ చాంపియన్ ఇంగ్లండ్ కూడా ఎక్కడా తగ్గేలా లేదు. మూడేళ్ల వ్యవధిలో ఆ జట్టు రెండో ఐసీసీ టోర్నీ విజయాన్ని ఆశిస్తోంది... అందుకు తగ్గ వనరులు కూడా జట్టు వద్ద ఉన్నాయి కాబట్టి సెమీస్ పోరు హోరాహోరీగా సాగడం ఖాయం. టోర్నీలో వాన కారణంగా ఐర్లాండ్ చేతిలో అనూహ్యంగా ఓడితేనేమి... న్యూజిలాండ్, శ్రీలంకలపై సాధించిన సాధికారిక విజయాలు జట్టు సామర్థ్యాన్ని చూపించాయి. లైనప్‌లో తొమ్మిదో స్థానం వరకు బ్యాటింగ్ చేయగల సత్తా ఉన్న ఆటగాళ్లతో ఆ జట్టు మరింత బలంగా కనిపిస్తోంది.

ఇప్పటికే దాయాది జట్టు తుది పోరుకు అర్హత సాధించి రా రమ్మని మనల్ని పిలుస్తున్నట్లుగా ఉంది... ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానుల కోరిక అయిన భారత్, పాక్ ఫైనల్ జరగాలంటే ఇంగ్లండ్ రూపంలో ఉన్న అడ్డంకిని రోహిత్ సేన తొలగించాల్సిందే!



గత ఐదు ఐసీసీ టోర్నీల్లో నాకౌట్ మ్యాచ్‌ల్లో భారత్ ప్రదర్శన: 2015, 2019 వన్డే వరల్డ్‌కప్‌లలో సెమీఫైనల్లో, 2017 చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో భారత్ ఓడింది. 2014 టి20 ప్రపంచ కప్ ఫైనల్లో, 2016 టి20 ప్రపంచకప్ సెమీఫైనల్లో మన జట్టు పరాజయం పాలైంది.

3 టి20 ప్రపంచకప్‌లో భారత్, ఇంగ్లండ్ మధ్య 3 మ్యాచ్‌లు జరగ్గా, భారత్ 2 గెలిచి, 1 ఓడింది.

12 ఇప్పటివరకు భారత్, ఇంగ్లండ్ మధ్య 22 అంతర్జాతీయ టి20లు జరిగాయి. భారత్ 12 మ్యాచ్‌ల్లో, ఇంగ్లండ్ 10 మ్యాచ్‌ల్లో గెలిచాయి.

- నేడు ఇంగ్లండ్‌తో భారత్ ‘ఢీ’
- గెలిస్తే ఫైనల్లోకి
- జోరు మీదున్న ఇరు జట్లు
- మధ్యాహ్నం గం.1:30 నుంచి స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం

అడిలైడ్: టి20 ప్రపంచకప్‌ను రెండోసారి గెలుచుకోవాలని పట్టుదలగా ఉన్న భారత జట్టుకు సెమీఫైనల్లో ఇంగ్లండ్ రూపంలో బలమైన ప్రత్యర్థి ఎదురుగా నిలిచింది. ఆదివారం జరిగే ఫైనల్ బెర్త్ కోసం నేడు ఇరు జట్లు తలపడనున్నాయి. బలాబలాలపరంగా చూస్తే ఇరు జట్లు సమఉజ్జీలుగానే కనిపిస్తున్నాయి. అయితే నాకౌట్ సమరంలో ఉండే తీవ్ర ఒత్తిడిని అధిగమించి ఏ జట్టు పైచేయి సాధిస్తుందనేది చూడాలి. ఇంగ్లండ్‌తో జరిగిన గత నాలుగు టి20 ద్వైపాక్షిక సిరీస్‌లను కూడా భారతే గెలుచుకోవడం గుర్తు చేసుకోవాల్సిన విషయం. ఇందులో రెండు భారత్‌లో జరగ్గా, మరో రెండు ఇంగ్లండ్‌లో జరగడం చూస్తే భారత్ ఆధిపత్యం ఎలాంటిదో స్పష్టమవుతుంది.

మళ్లీ అదే చర్చ!

భారత తుది జట్టు విషయంలో మొదటి మ్యాచ్ నుంచీ చూస్తే పెద్దగా అనూహ్యాలేమీ జరగలేదు. ఒక మ్యాచ్‌లో అక్షర్ స్థానంలో హుడా, మరో మ్యాచ్‌లో కార్తీక్‌కు బదులుగా పంత్ ఆడటం మినహా అంతా సాఫీగానే సాగిపోయింది. సెమీస్‌లో కూడా ఈ విషయంలోనే టీమ్ మేనేజ్‌మెంట్ ఇంకా స్పష్టమైన నిర్ణయం తీసుకోలేకపోతోంది. బ్యాటింగ్‌లో అదనపు బలమంటూ అశ్విన్, అక్షర్‌లను రెగ్యులర్‌గా ఆడిస్తున్నారు. అక్షర్ పెద్దగా ప్రభావం చూపడం లేదు కూడా. ఒకరిని తప్పించి స్పెషలిస్ట్ లెగ్‌స్పిన్నర్ చహల్‌ను ఆడించేందుకు ఒక ప్రత్యామ్నాయం అయితే ఉంది. కానీ కీలకమైన పోరులో వరల్డ్‌కప్‌లో ఒక్క మ్యాచ్ ఆడకుండా నేరుగా చహల్ బరిలోకి దిగడం కూడా సానుకూలాంశం కాదు. కీపర్ విషయంలో కూడా అదే సందిగ్ధత కొనసాగుతోంది. జింబాబ్వేపై పంత్‌ను ఆడించినా, జట్టు ప్రాధాన్యతల్లో కార్తీక్ ఉన్నట్లుగా కనిపిస్తోంది. అయితే ఓవరాల్‌గా చూస్తే టీమిండియా అన్ని రకాలుగా పటిష్టంగా కనిపిస్తోంది. టోర్నమెంట్ టాప్ స్కోరర్ కోహ్లి (246 పరుగులు) గురించి కొత్తగా చెప్పేదేముంది. అతనికి తోడుగా అగ్నిలా సూర్యకుమార్ (225) దాదాపు 200 స్ట్రయిక్‌రేట్‌తో చెలరేగిపోతున్నాడు. రాహుల్ కూడా కుదురుకోగా, రోహిత్ శర్మ ఫామ్ మాత్రమే కొంత ఇబ్బంది పెడుతోంది. 5 మ్యాచ్‌లలో కలిపి 89 పరుగులే చేసిన రోహిత్ తన స్థాయిని ప్రదర్శించేందుకు సెమీస్‌ను వేదికగా చేసుకుంటే మంచిదేమో. ముగ్గురు పేసర్లు కూడా సమష్టిగా రాణిస్తుండటం శుభసూచకం. భువీ బౌలింగ్‌లో 32 బంతులు ఎదుర్కొన్న బట్లర్ 30 పరుగులు మాత్రమే చేసి 5 సార్లు అవుట్ అయ్యాడంటే ఆరంభంలో పైచేయి చూపించేందుకు భారత్‌కు మరో అవకాశం ఉంది.



ఆల్‌రౌండర్లతో...

స్టోక్స్, వోక్స్, స్యామ్ కరన్, మొయిన్ అలీ, లివింగ్‌స్టోన్...100 శాతం రెండు విభాగాల్లో పనికొచ్చే ఇంగ్లండ్ ఆటగాళ్లు వీరంతా. బ్యాటింగ్‌లో విఫలమైతే బౌలింగ్‌లో, బౌలింగ్‌లో విఫలమైతే బ్యాటింగ్‌లో సత్తా చాటగల సమర్థులు. ఇంగ్లండ్ విజయావకాశాలు వీరి ప్రదర్శనపై ఆధారపడి ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా గాయం నుంచి కోలుకున్న తర్వాత స్యామ్ కరన్ రాటుదేలగా, కీలక మ్యాచ్‌లో ఏమాత్రం ఒత్తిడిని దరి చేరనీయకుండా ఎలా ఆడాలనేది స్టోక్స్‌కు బాగా తెలుసు. ఓపెనర్లుగా బట్లర్, హేల్స్ అందించే దూకుడైన ఆరంభం ఇంగ్లండ్‌ను ముందంజలో నిలపగలదు. హేల్స్ టోర్నీ మొత్తం నిలకడగా ఆడుతుండగా, బట్లర్ అసలు సమయంలో ఫామ్‌లోకి వచ్చాడు. మిడిలార్డర్‌లో లివింగ్‌స్టోన్ కీలకం కాగా, మలాన్ రూపంలో మరో కీలక బ్యాటర్ జట్టుకు దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. గాయంతో బాధపడుతున్న మలాన్ కోలుకోకపోతే సాల్ట్ జట్టులోకి వస్తాడు. బౌలింగ్‌లో కూడా జట్టుకు పెద్ద దెబ్బ పడింది. ఈ టోర్నీలో ఫాస్టెస్ట్ బౌలర్‌గా ఉన్న మార్క్ వుడ్ కూడా గాయపడి కోలుకోలేదు. అతను ఆడలేకపోతే జోర్డాన్‌కు అవకాశం దక్కుతుంది.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), రాహుల్, కోహ్లి, సూర్య, హార్దిక్, కార్తీక్, అక్షర్, అశ్విన్, భువనేశ్వర్, షమీ, అర్ష్‌దీప్.

ఇంగ్లండ్: బట్లర్ (కెప్టెన్), హేల్స్, మలాన్/సాల్ట్, స్టోక్స్, బ్రూక్, లివింగ్‌స్టోన్, అలీ, స్యామ్ కరన్, వోక్స్, జోర్డాన్, రషీద్.

పిచ్, వాతావరణం

సాధారణంగా బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్. బంగ్లాదేశ్‌పై ఇదే మైదానంలో ఆడి భారత్ భారీ స్కోరు సాధించింది. పాక్ కూడా బంగ్లాను ఇక్కడే ఓడించింది. స్క్వేర్‌లెగ్ బౌండరీలు చిన్నవి (గరిష్టంగా 63 మీటర్లు) కాగా, నేరుగా బౌండరీ ఎక్కువ దూరం (80 మీటర్లు) ఉండటం ఈ ఓవల్ మైదానం ప్రత్యేకత. దీనిని బట్టి జట్టు వ్యూహాలు మార్చుకోవాల్సి ఉంటుంది. మ్యాచ్ రోజు వర్ష సూచన లేదు.



“నాకౌట్ మ్యాచ్‌కు ప్రాధాన్యత ఉందనేది వాస్తవమే అయినా అలాంటి ఒక్క మ్యాచ్‌లో ప్రదర్శన ఏ ఆటగాడినీ తక్కువ చేయదు. అది నేనైనా, మరో ఆటగాడైనా సరే. తమ సుదీర్ఘ కెరీర్‌లో దేశం తరఫున వారు ఎలా ఆడారనేది ముఖ్యం. ఎవరైనా ఇలాంటి సమయంలో బాగా ఆడేందుకే ఎంతో శ్రమిస్తారు. కానీ ఫలితం ప్రతికూలంగా వచ్చినా గత కొన్నేళ్లుగా వారు చూపిన ఆటను మరిచిపోవద్దు. బాగా ఆడి లీగ్ దశ దాటాం. సెమీస్ కూడా మరో దశ. గెలిచి మూడో దశ (ఫైనల్)లో అడుగు పెట్టేందుకు ప్రయత్నిస్తాం. ఇంగ్లండ్ జట్టు చాలా ప్రమాదకరమైంది. మేం గెలవాలంటే అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాల్సి ఉంటుంది.

–రోహిత్ శర్మ, భారత్ కెప్టెన్



“సూర్యకుమార్ కళ్లు చెదిరే బ్యాటింగ్‌తో ఆకట్టుకుంటున్నాడు. అతణ్ని ‘బ్యాటర్ ఆఫ్ ద టోర్నమెంట్’ అని చెప్పవచ్చు. అయితే అద్భుతమైన ఫామ్‌లో ఉన్న సూర్యను అవుట్ చేసేందుకు ఒక్క మంచి బంతి చాలు. సూర్యను ఎలా అవుట్ చేయాలనే దానిపై ఆలోచిస్తాం. అయితే కేవలం సూర్యకుమార్ గురించి మాత్రమే మేము ఆలోచించడంలేదు. సూర్యతోపాటు ఇతర ఆటగాళ్లు కూడా ప్రమాదకరమే. భువనేశ్వర్‌తోపాటు ఏ బౌలర్‌కూ నేను భయపడను. ఏ బౌలర్‌ను ఎలా ఎదుర్కోవాలో పక్కప్రణాళికతో సిద్ధమయ్యే క్రీజులోకి వస్తా. మా జట్టులో చాలామందికి అడిలైడ్ మైదానంలో ఆడిన అనుభవం ఉంది. మైదానం కొలతలను బట్టి మా వ్యూహంలోనూ మార్పులు చేసుకుంటాం. పిచ్ గురించి పెద్దగా ఆందోళన చెందడంలేదు. భారత జట్టు అత్యంత పటిష్టంగా కనిపిస్తోంది. టీమిండియాను ఏమాత్రం తక్కువ అంచనా వేయడంలేదు. ముందుగా బ్యాటింగ్ చేస్తే భారత్‌కు భారీ లక్ష్యాన్ని నిర్దేశిస్తాం. ఛేజింగ్‌కు దిగితే ఎంతటి లక్ష్యాన్నైనా అధిగమిస్తామన్న నమ్మకం ఉంది.

–బట్లర్, ఇంగ్లండ్ కెప్టెన్ ”

మళ్లీ గెలిస్తే మెర్సిడెజ్ కొనేస్తా: నిఖత్



న్యూఢిల్లీ: వచ్చే ఏడాది ప్రపంచ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ స్టార్ బాక్సర్, డిఫెండింగ్ చాంపియన్ (ఫ్లయ్ వెయిట్) నిఖత్ జరీన్ టైటిల్ నిలబెట్టుకుంటే ఖరీదైన ‘మెర్సిడెజ్ బెంజ్’ కారు కొంటానని చెప్పింది. అయితే అక్కడే ఉన్న అంతర్జాతీయ బాక్సింగ్ సంఘం (ఐబీఏ) అధ్యక్షుడు ఉమర్ క్రెమ్లెవ్ ఆమె గెలిస్తే కొనాల్సిన అవసరం లేకుండా నిఖత్ కోరుకున్న కారును బహుమతిగా ఇస్తానని చెప్పారు. భారత్‌కు 2023 మహిళల చాంపియన్‌షిప్ ఆతిథ్య హక్కులు కట్టబెట్టిన సందర్భంగా ఈ ఆసక్తికర సంభాషణ చోటు చేసుకుంది. ఈ మేరకు ఐబీఏ చీఫ్ క్రెమ్లెవ్, భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ) అజయ్ సింగ్‌లు ఆతిథ్య హక్కుల ఒప్పందంపై సంతకాలు చేశారు. వచ్చే మార్చి, ఏప్రిల్ నెలల్లో ఈ బాక్సింగ్ మెగా ఈవెంట్ జరగనుంది. తేదీలను తర్వాత ఖరారు చేయనున్నారు. టోర్నీ ప్రైజ్‌మనీ పెరగడంతో విజేతకు రూ. 81 లక్షలు అందజేయనున్నారు. ఈ నేపథ్యంలో డిఫెండింగ్ చాంపియన్ హోదాలో పాల్గొన్న నిఖత్ మాట్లాడుతూ ‘ప్రస్తుత టైటిల్ ప్రైజ్‌మనీతో హైదరాబాద్‌లో ఇల్లు కొనే ప్రయత్నంలో ఉన్నాను. వచ్చే ఏడాది కూడా గెలిస్తే దాంతో బెంజ్ కారు కొంటాను. అందులో క్రెమ్లెవ్‌తో హైదరాబాద్‌లో సిటీ రైడ్‌కు వెళ్తాను’ అని తెలిపింది.

వచ్చే నెల 23న ఐపీఎల్ వేలం



న్యూఢిల్లీ: వచ్చే ఏడాది ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టి20 క్రికెట్ టోర్నీకి సంబంధించిన ఆటగాళ్ల వేలం కార్యక్రమానికి కేరళలోని కొచ్చి నగరం వేదిక కానుంది. డిసెంబర్ 23న ఈ కార్యక్రమం నిర్వహిస్తామని బీసీసీఐ తెలిపింది. ఈసారి మెగా వేలం కాకుండా మినీ వేలం ఉంటుందని, ఈనెల 15వ తేదీలోపు అట్టిపెట్టుకున్న ఆటగాళ్ల వివరాలను సమర్పించాలని ఫ్రాంచైజీలను కోరినట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. టర్కీలోని ఇస్తాంబుల్ నగరంతోపాటు బెంగళూరు, న్యూఢిల్లీ, ముంబై, హైదరాబాద్ నగరాల్లో ఐపీఎల్ వేలం నిర్వహించాలని బీసీసీఐ భావించింది. చివరకు కొచ్చి నగరంలో ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది.

పాక్ విజయహాసం

- న్యూజిలాండ్‌కు పరాభవం
- ఏడు వికెట్లతో గెలిచి ఫైనల్లోకి పాక్
- కట్టడిచేసిన బౌలర్లు
- రాణించిన రిజ్వాన్, బాబర్

‘సూపర్ 12’ తొలి రెండు మ్యాచ్‌ల ఫలితాల తర్వాత పాకిస్తాన్‌కు సెమీస్ చేరడం కష్టమనుకుంటే ఇప్పుడైతే సులువుగా ఫైనల్‌కే దూసుకెళ్లింది. ప్రపంచకప్‌ల చరిత్రలో (వన్డే, టి20) న్యూజిలాండ్‌పై తమ అజేయమైన రికార్డును కొనసాగిస్తూ పాక్ మరో విజయాన్ని సాధించింది. ఈ టోర్నీలోనే అత్యంత పేలవమైన ఓపెనింగ్ చేసిన రిజ్వాన్, బాబర్ ఆజమ్ అసలైన నాకౌట్ (సెమీస్) మ్యాచ్‌లో అర్ధసెంచరీలతో కదంతొక్కారు. గత ప్రపంచకప్‌లో సెమీస్‌తో ఆగిపోయిన పాకిస్తాన్ 13 ఏళ్ల తర్వాత ఈ మెగా ఈవెంట్‌లో మరోసారి ఫైనల్ పోరుకు అర్హత సంపాదించింది. చివరిసారి 2009లో ఫైనల్ చేరిన పాక్ చాంపియన్ కూడా నిలిచింది. భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య నేడు జరిగే రెండో సెమీఫైనల్ విజేతతో ఆదివారం జరిగే టైటిల్ పోరులో పాక్ తలపడుతుంది.


రిజ్వాన్


బాబర్



సిడ్నీ: న్యూజిలాండ్ ఈ టోర్నీలోనే నిలకడైన విజయాలతో ఆరంభం నుంచి లీగ్ టాపర్‌గా ఉన్న జట్టు. అంతెందుకు ఇదే సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో ప్రపంచకప్‌ను మొదలుపెట్టిన కివీస్ ‘సూపర్ 12’ తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్, ఆతిథ్య ఆసీస్‌పై 200 స్కోరు చేసి టోర్నీకే ఘనమైన ఆరంభమిచ్చింది. ఇక్కడ మొదట బ్యాటింగ్ చేసిన జట్టే ఐదింట నాలుగు మ్యాచ్‌ల్లో గెలిచింది. ఏ రకంగా చూసినా... చక్కని బ్యాటింగ్ వికెట్‌పై కివీస్ కీలకమైన సెమీస్‌కు సరిపోని స్కోరు చేసి నిష్క్రమించింది. బుధవారం జరిగిన తొలి సెమీఫైనల్లో నిలకడలేమికి నిదర్శనంగా నిలిచే పాకిస్తాన్ ఊహకందని విధంగా 7 వికెట్ల తేడాతో సునాయాస విజయం సాధించింది. టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. మిచెల్ (35 బంతుల్లో 53 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ విలియమ్సన్ (42 బంతుల్లో 46; 1 ఫోర్, 1 సిక్స్) రాణించారు. తర్వాత పాకిస్తాన్ 19.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 153 పరుగులు చేసింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ రిజ్వాన్ (43 బంతుల్లో 57; 5 ఫోర్లు), బాబర్ ఆజమ్ (42 బంతుల్లో 53; 7 ఫోర్లు) అర్ధసెంచరీలతో గెలిపించారు.

మిచెల్ అర్ధశతకం

బౌండరీతో కివీస్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన అలెన్ (4) షాహీన్ తొలి ఓవర్లోనే వికెట్ల ముందు దొరికిపోయాడు. మరో ఓపెనర్ కాన్వే (20 బంతుల్లో 21; 3 ఫోర్లు) రనౌటయ్యాడు. ఫిలిప్స్ (6) చెత్తషాట్‌ను నవాజ్ రిటర్న్ క్యాచ్ అందుకున్నాడు. 8 ఓవర్లలో కివీస్ స్కోరు 49/3. ఈ దశలో విలియమ్సన్‌కు జతయిన మిచెల్ చకచకా పరుగులు చేస్తూ స్కోరుబోర్డును కదిలించాడు. ఆఖర్లో నీషమ్ (12 బంతుల్లో 16 నాటౌట్; 1 ఫోర్), మిచెల్ చేసిన పరుగులు... బ్యాటింగ్ వికెట్‌పై భారీస్కోరుగా నమోదు కాలేదు.

ఫిఫ్టీ–ఫిఫ్టీతో గట్టి పునాది

పాక్‌కు ఈ టోర్నీలో అదృష్టం కలిసొచ్చినట్లే... ఈ మ్యాచ్‌లోనూ తోడుంది. దీంతో తొలి ఓవర్ నాలుగో బంతికే డకౌటవ్వాల్సిన బాబర్... కీపర్ కాన్వే నేలపాలు చేయడంతో బతికిపోయాడు. తర్వాత కివీస్ పేలవమైన ఫీల్డింగ్ కొనసాగడంతో పదో ఓవర్లో బాబర్ రనౌట్ నుంచి కూడా గట్టెక్కాడు. సాన్‌ట్నర్ సులువైన క్యాచ్ చేజార్చి హారిస్‌కు లైఫ్ ఇవ్వడంతో మ్యాచ్‌లో పాక్ లక్ష్యఛేదన సాఫీగా సాగిపోయింది. ఓపెనర్లు రిజ్వాన్, బాబర్ పవర్‌ప్లేలో దంచేశారు. దీంతో 6 ఓవర్లలో పాక్ 55/0 స్కోరు చేసింది. ఇదే జోరు వంద పైచిలుకు పరుగులదాకా సాగింది. ఎట్టకేలకు 13వ ఓవర్లో బౌల్ట్ అతన్ని అవుట్ చేయడంతో 105 పరుగుల ఓపెనింగ్ వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. అప్పటికే 44 బంతుల్లో 48 పరుగుల సమీకరణం పాక్‌ను లక్ష్యంవైపు నడిపించింది. 36 బంతుల్లో (5 ఫోర్లు) ఫిఫ్టీ పూర్తిచేసుకున్న రిజ్వాన్, లక్ష్యానికి చేరువయ్యాక హారిస్ (26 బంతుల్లో 30; 2 ఫోర్లు, 1 సిక్స్) అవుటైనప్పటికీ... పాక్ ఇంకో 5 బంతులు మిగిలుండగానే విజయం సాధించింది.

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: అలెన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షాహీన్ అఫ్రిది 4; కాన్వే (రనౌట్) 21; విలియమ్సన్ (బి) షాహీన్ అఫ్రిది 46; ఫిలిప్స్ (సి అండ్ బి) నవాజ్ 6; మిచెల్ (నాటౌట్) 53; నీషమ్ (నాటౌట్) 16; ఎక్స్‌ట్రాలు 6; మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 152. **వికెట్ల పతనం:** 1–4, 2–38, 3–49, 4–117.

బౌలింగ్: షాహీన్ అఫ్రిది 4–0–24–2, నసీమ్ షా 4–0–30–0, రవూఫ్ 4–0–32–0, వసీమ్ 2–0–15–0, షాదాబ్ ఖాన్ 4–0–33–0, నవాజ్ 2–0–12–1.

పాకిస్తాన్ ఇన్నింగ్స్: రిజ్వాన్ (సి) ఫిలిప్స్ (బి) బౌల్ట్ 57; బాబర్ (సి) మిచెల్ (బి) బౌల్ట్ 53; హారిస్ (సి) అలెన్ (బి) సాన్‌ట్నర్ 30; షాన్ మసూద్ (నాటౌట్) 3; ఇఫ్తికార్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (19.1 ఓవర్లలో 3 వికెట్లకు) 153. వికెట్ల పతనం:** 1–105, 2–132, 3–151. **బౌలింగ్:** బౌల్ట్ 4–0–33–2, సౌతీ 3.1–0–24–0, ఫెర్గూసన్ 4–0–37–0, సాన్‌ట్నర్ 4–0–26–1, ఇష్ సోధి 4–0–26–0.

తడబడితే తారుమారు

- ఆద్యంతం నిలకడగా రాణిస్తేనే ప్రపంచకప్ బెర్త్
- తేలిగ్గా తీసుకుంటే తప్పదు చుక్కెదురు
- మెగా ఈవెంట్‌కు అర్హత పొందలేకపోయిన మేటి జట్లు



విశ్వవ్యాప్తంగా ఆదరణ ఉన్న ఆట ఫుట్‌బాల్. ఇతర టీమ్ క్రీడల్లో మాదిరిగా ఈ ఆటలో రెండు దేశాల మధ్య ఏడాదికో రెండేళ్లకో ద్వైపాక్షిక సిరీస్‌లు ఉండవు. ఏడాదిలో ఎక్కువ భాగం స్టార్ ఆటగాళ్లందరూ ఆయా దేశాల్లో ప్రొఫెషనల్ లీగ్‌లలో క్లబ్ జట్లకు ఆడుతుంటారు. దేశానికి ప్రాతినిధ్యం వహించాలంటే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీ లేదా యూరో టోర్నీ లేదా కోపా అమెరికా కప్ లేదా కాన్ఫడరేషన్స్ కప్‌లాంటి టోర్నీల కోసం వేచి చూడాల్సి ఉంటుంది. అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) ఆధ్వర్యంలో అప్పుడప్పుడు ఫ్రెండ్లీ మ్యాచ్‌ల్లో బరిలోకి దిగుతారు. దాదాపు మూడేళ్లపాటు కొనసాగే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీలలో ఎంతటి గొప్ప జట్టయినా ఆద్యంతం నిలకడగా రాణిస్తేనే ముందంజ వేస్తాం. కేవలం ప్రధాన టోర్నీకి అర్హత సాధిస్తే భారీ మొత్తంలో ప్రైజ్‌మనీ లభిస్తుంది కాబట్టి ఇలాంటి అవకాశాన్ని చిన్న చిన్న జట్లు కూడా వదులుకోవు. అందుకే ప్రత్యర్థి జట్టుకి ఎంత గొప్ప రికార్డు ఉన్నా ఈ చిన్న జట్లు కడదాకా సంచలనం కోసం పోరాడతాయి. ఈ క్రమంలో కాస్త నిర్లక్ష్యంగా ఉన్నా పెద్ద జట్లకు చుక్కెదురు తప్పదు. మరో పది రోజుల్లో ఖతర్ వేదికగా జరగనున్న 22వ ప్రపంచకప్‌లో కచ్చితంగా అర్హత సాధిస్తాయనుకున్న ఎనిమిది జట్లు (ఇటలీ, స్వీడన్, రష్యా, చిలీ, ఈజిప్ట్, నైజీరియా, కొలంబియా, అల్జీరియా) క్వాలిఫయింగ్‌లోనే నిష్క్రమించి ఆశ్చర్యపరిచాయి. ఈ జాబితాలో అతి ముఖ్యమైన జట్టు ఇటలీ. ప్రపంచకప్‌లో ఇటలీ జట్టుకు గొప్ప చరిత్రనే ఉంది. నాలుగుసార్లు విశ్వవిజేతగా నిలిచిన ఇటలీ వరుసగా రెండోసారి ప్రపంచకప్ టోర్నీకి అర్హత పొందలేకపోయింది. 2018 రష్యాలో జరిగిన ప్రపంచకప్‌కు బెర్త్ దక్కించుకోలేకపోయిన ఇటలీ జట్టు ఈసారి ఖతర్ విమానం కూడా ఎక్కడంలేదు. యూరోప్ దేశాలకు మొత్తం 13 బెర్త్‌లు ఉండగా... గ్రూప్ దశలో పది గ్రూపుల్లో అగ్రస్థానంలో నిలిచిన 10 జట్లు ప్రపంచకప్‌కు అర్హత పొందాయి. గ్రూప్ ‘సి’లో ఇటలీ జట్టు రెండో స్థానంలో నిలిచి నేరుగా కాకుండా రెండో రౌండ్ ద్వారా అర్హత పొందేందుకు రేసులో నిలిచింది. అయితే రెండో రౌండ్‌లో ఇటలీ 0–1తో నార్త్ మెసడోనియా చేతిలో ఓడిపోయి ప్రపంచకప్‌నకు అర్హత పొందే అవకాశాన్ని చేజార్చుకుంది.


ఇటలీ జట్టు

2018 ప్రపంచకప్‌లో క్వార్టర్ ఫైనల్ చేరిన స్వీడన్ ఈసారి క్వాలిఫయింగ్‌ను దాటి ముందుకెళ్లలేకపోయింది. ఉక్రెయిన్‌తో యుద్ధం కారణంగా రష్యా జట్టుపై వేటు వేశారు. దక్షిణ అమెరికా జోన్‌లో ఆరో స్థానంలో నిలిచి కొలంబియా ఈ మెగా టోర్నీకి దూరమైంది. 1962లో ప్రపంచకప్‌కు ఆతిథ్యమివ్వడంతోపాటు మూడో స్థానంలో నిలిచిన చిలీ వరుసగా రెండోసారి ప్రపంచకప్ బెర్త్ సాధించలేకపోయింది. ఆఫ్రికా జోన్ నుంచి చివరి రౌండ్ మ్యాచ్‌ల్లో ఓడి ఈజిప్ట్, నైజీరియా, అల్జీరియా మెగా టోర్నీకి అర్హత పొందలేకపోయాయి. 1938 నుంచి 2002 ప్రపంచకప్ వరకు ఆతిథ్య దేశంతోపాటు డిఫెండింగ్ చాంపియన్‌కు నేరుగా ఎంట్రీ లభించేది. కానీ 2006 ప్రపంచకప్ నుంచి కేవలం ఆతిథ్య జట్టుకే నేరుగా ఎంట్రీ ఇచ్చి డిఫెండింగ్ చాంపియన్ కూడా క్వాలిఫయింగ్ టోర్నీ ద్వారా బెర్త్ సాధించాలని ‘ఫిఫా’ నిర్ణయించింది. –సాక్షి క్రీడావిభాగం

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▼	152	61,034
నిఫ్టీ ▼	46	18,157

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	10,473	▼	143
డోజోన్స్	32,818	▼	348
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,295	▼	11
డాక్స్	13,646	▼	42
షాంఘై	3,064	▼	13
నికాయ్	27,872	▲	344

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	51,514
బంగారం (99.5 స్వచ్ఛత)	51,308
వెండి (కేజీ)	61,550

టాటా మోటార్స్ నష్టాలు తగ్గాయ్

- క్యూ2లో రూ. 945 కోట్లకు పరిమితం
- జేఎల్ఆర్ ఆదాయం 36 శాతం ప్లస్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) రెండో త్రైమాసికంలో టాటా మోటార్స్ ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జులై–సెప్టెంబర్(క్యూ2)లో నికర నష్టాలు భారీగా తగ్గి రూ.945 కోట్లకు పరిమితమయ్యాయి. గతేడాది(2021–22) ఇదే కాలంలో ఏకంగా రూ. 4,442 కోట్ల నష్టం వచ్చింది. ఆదాయం సైతం రూ. 62,246 కోట్ల నుంచి రూ. 80,650 కోట్లకు జంప్‌చేసింది. ఇక స్టాండెలోన్ నికర నష్టాలు సైతం రూ. 659 కోట్ల నుంచి తగ్గి రూ. 293 కోట్లకు పరిమితమయ్యాయి. మొత్తం ఆదాయం రూ. 11,197 కోట్ల నుంచి రూ. 15,142 కోట్లకు ఎగసింది.



జేఎల్ఆర్ జూమ్

ప్రస్తుత సమీక్షా కాలంలో బ్రిటిష్ అనుబంధ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్(జేఎల్ఆర్) ఆదాయం 36% జంప్‌చేసి 5.3 బిలియన్ పౌండ్లను తాకింది. దేశీయంగా టాటా మోటార్స్ వాణిజ్య వాహన అమ్మకాలు 19% వృద్ధితో 93,651 యూనిట్లను తాకగా.. ఎగుమతులు 22% పుంజుకుని 6,771 వాహనాలకు చేరినట్లు కంపెనీ ఈడీ గిరీష్ వాగ్ పేర్కొన్నారు. ఈ కాలంలో 69% అధికంగా 1,42,755 ప్యాసింజర్ వాహనాలు విక్రయించింది. ఎలక్ట్రిక్ వాహన విభాగంలో 326% వృద్ధితో 11,522 యూనిట్లు అమ్ముడయ్యాయి.

ఫలితాల నేపథ్యంలో టాటా మోటార్స్ షేరు నామమాత్ర నష్టంతో రూ. 433 వద్ద ముగిసింది.

ఐఓబీ డిపాజిట్ రేట్ల పెంపు

చెన్నై: ప్రభుత్వ రంగంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) డిపాజిట్ రేట్లను పెంచింది. రిటైల్ టర్మ్ డిపాజిట్ రేట్లు 60 బేసిస్ పాయింట్ల (100 బేసిస్ పాయింట్లు ఒకశాతం) వరకూ పెరిగినట్లు ఒక ప్రకటనలో పేర్కొంది. నవంబర్ 10 నుంచి తాజా రేట్లు అమల్లోకి వస్తాయని తెలిపింది. ప్రకటన ప్రకారం, దేశీయ, నాన్–రెసిడెంట్ డిపాజిటర్లు 444 రోజులు, మూడేళ్లు, ఆపైన డిపాజిట్లపై 7.15 శాతం వరకూ వడ్డీరేటును పొందుతారు. 270 రోజుల నుంచి యేడాది, ఏడాది నుంచి మూడేళ్ల టర్మ్ డిపాజిట్లపై వడ్డీ రేటు 60 బేసిస్ పాయింట్ల వరకూ పెరిగింది.

సావరీన్ గ్రీన్ బాండ్ల జారీకి ఫ్రేమ్‌వర్క్

రూ.16,000 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా సావరీన్ గ్రీన్ బాండ్లను జారీ చేయడానికి ఆర్థిక మంత్రిత్వ శాఖ ఫ్రేమ్‌వర్క్‌ను విడుదల చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధంలో (2022–23 అక్టోబర్–మార్చి) గ్రీన్ బాండ్ల జారీ ద్వారా రూ.16,000 కోట్లను సమీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థం కేంద్ర రుణ సమీకరణలో (రూ.5.92 లక్షల కోట్లు) ఈ నిధులు భాగం కానున్నాయి. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ 2022–23 బడ్జెట్‌లో సావరీన్ గ్రీన్ బాండ్ల జారీ ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. తాజా పరిణామంపై ఆర్థిక మంత్రి




మాట్లాడుతూ, ప్యారిస్ ఒప్పందం లక్ష్యాలపై భారత్ నిబద్ధతను ఈ ఫ్రేమ్‌వర్క్ బలోపేతం చేస్తుందని అన్నారు. అలాగే అర్హతగల గ్రీన్ ప్రాజెక్ట్‌ల్లోకి ప్రపంచ, దేశీయ పెట్టుబడులను ఆకర్షించడానికి ఈ చర్య దోహదపడుతుందని తెలిపారు.

ఫ్రేమ్‌వర్క్‌లో ముఖ్యాంశాలు...

- గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్‌ల అవసరాలకు అనుగుణంగా, ఎకానమీలో కార్బన్ తీవ్రత తగ్గింపు లక్ష్యంగా జారీఅయ్యే ఈ రూపాయి డినామినేటెడ్ బాండ్ల సుదీర్ఘ కాల వ్యవధిని కలిగి ఉంటాయి.
- గ్రీన్ బాండ్ల జారీకి గరిష్ఠంగా 12 నెలల ముందు జరిగిన ప్రభుత్వ వ్యయాలకు ఈ సమీకరణ నిధులు పరిమితమవుతాయి. అలాగే జారీ చేసిన 24 నెలల్లోపు మొత్తం ఆదాయాన్ని ప్రాజెక్టులకు కేటాయించేలా కృషి జరగనుంది.
- గ్రీన్ బాండ్ల జారీ ద్వారా వచ్చే ఆదాయాన్ని శిలాజ ఇంధనాల వెలికితీత, ఉత్పత్తి, పంపిణీ లేదా అణు విద్యుత్ ప్రాజెక్టులకు వినియోగించరాదు.
- అర్హత కలిగిన పెట్టుబడులు, సబ్సిడీలు, గ్రాంట్–ఇన్–ఎయిడ్స్ లేదా పన్ను మినహాయింపులు లేదా ఎంపిక చేసిన కార్యాచరణ ఖర్చుల రూపంలో గ్రీన్ బాండ్ల ప్రభుత్వ వ్యయాలు ఉంటాయి.

జీఆర్‌టీ జ్యువెలర్స్ నుంచి పోల్కి దేవాన్షి ఆభరణాలు



హైదరాబాద్: జీఆర్‌టీ జ్యువెలర్స్ పోల్కి వజ్రాలతో తీర్చిదిద్దిన దేవాన్షి ఆభరణాల శ్రేణిని మార్కెట్లోకి విడుదల చేసింది. చరిత్రలో రాజ కుటుంబీకులు, సంస్థానాధీశులు ధరించిన ఈ వజ్రాభరణాలు నిపుణులైన హస్తకళాకారుల ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్నాయి. ఈ అద్భుత శ్రేణిపై 15% వరకు ప్రత్యేక ఆఫర్ లభిస్తుంది. ప్రత్యేక రూపకల్పన కోరుకునే కస్టమర్ల కోసం సంప్రదాయ, సమకాలిక అంశాలను మేళవించి పోల్కి దేవాన్షి ఆభరణాలను తీసుకొచ్చామని సంస్థ ఎండీ జీఆర్ రాధాకృష్ణన్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-11-2022	
విశాఖ	505–00
చిత్తూరు	533–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	504–00
విజయవాడ	504–00
రిటైల్ ధర (డజను)	78.00
9-11-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	485–00
వరంగల్	487–00
రిటైల్ ధర	5.45

మెటాలో 11వేల ఉద్యోగాలు కట్!

- మొత్తం సిబ్బందిలో 13 శాతం మందికి ఉద్వాసన
- పడిపోతున్న ఆదాయాలే కారణం

న్యూఢిల్లీ: టెక్నాలజీ కంపెనీల్లో ఉద్యోగాల కోతలు కొనసాగుతున్నాయి. టెక్ పరిశ్రమకు సవాళ్లు పెరుగుతుండటం, ఆదాయాలు పడిపోతుండటం వంటి పరిణామాల నేపథ్యంలో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా 11,000 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు ప్రకటించింది. మెటా మొత్తం సిబ్బంది సంఖ్యలో ఇది 13 శాతం. ఉద్యోగులకు రాసిన లేఖలో సంస్థ సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ ఈ విషయాలు వెల్లడించారు. 'కోవిడ్ మహమ్మారి తర్వాత కూడా భారీ వృద్ధి ఉంటుందనే అంచనాతో పెద్ద యెత్తున ఉద్యోగులను తీసుకున్నాం. దురదృష్టవశాత్తు నేను ఊహించిన విధంగా జరగలేదు. ఆన్‌లైన్ కామర్స్ మళ్లీ పాత స్థాయికి వచ్చేసింది. స్థూల ఆర్థిక మందగమనం, పెరిగిన పోటీ, ప్రకటనలు తగ్గడం వంటి కారణాలతో ఆదాయాలు నేను ఊహించిన దానికన్నా తగ్గాయి. నేను పరిస్థితిని తప్పుగా అంచనా వేశాను. దీనికి బాధ్యుణ్ని నేనే' అని ఆయన పేర్కొన్నారు. మైక్రో బ్లాగింగ్ సైట్ ట్విటర్‌లో కూడా కోతల పర్వం నడుస్తున్న నేపథ్యంలో మెటాలోనూ ఉద్వాసనలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సాప్ మొదలైనవి మెటాలో భాగంగా ఉన్నాయి. తీసివేస్తున్న ఉద్యోగులకు ఈమెయిల్స్ వస్తాయని, వారికి కంపెనీ సిస్టమ్స్ ఇక అందుబాటులో ఉండవని జుకర్‌బర్గ్ తెలిపారు. మాజీ ఉద్యోగులకు 16 వారాల బేసిక్ పేతో పాటు కంపెనీలో



పని చేసిన ప్రతి ఏడాదికిగాను 2 వారాల జీతం లభిస్తుంది. 6 నెలల పాటు వారితో పాటు వారి కుటుంబ సభ్యులకూ హెల్త్ ఇన్సూరెన్స్ పని చేస్తుంది.

టెక్ సంస్థలకు సవాళ్లు..

కోవిడ్ సమయంలో లాక్‌డౌన్‌ల వల్ల ఇళ్లకే పరిమితం కావడంతో ప్రజలు సోషల్ మీడియాను గణనీయంగా ఉపయోగించారు. దీంతో ఆయా కంపెనీలకూ భారీగా ఆదాయాలు వచ్చాయి. అయితే, లాక్‌డౌన్‌లు ముగిసి, ప్రజలు తిరిగి దైనందిన జీవితాల్లో పడిపోయిన తర్వాత వాటి ఆదాయాలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. ప్రత్యేకంగా మెటా విషయానికొస్తే.. డిజిటల్ యూనివర్స్ 'మెటావర్స్' పై భారీగా పెట్టుబడులు పెడుతుండటం ఇన్వెస్టర్లను కలవరపరుస్తోంది. అటు టెక్ దిగ్గజం యాపిల్ ప్రైవసీ టూల్స్ సైతం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లకు సమస్యగా మారుతున్నాయి. వీటి వల్ల యూజర్ల అనుమతి లేకుండా వారిని ట్రాక్ చేయడం, ప్రత్యేకంగా టార్గెట్ చేసే ప్రకటనలు చూపడం ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్ లాంటి సంస్థలకు కష్టతరమవుతోంది. అలాగే యువత ఎక్కువగా టిక్‌టాక్ వైపు మళ్లుతుండటం ఇన్‌స్టాగ్రామ్‌పై ప్రతికూల ప్రభావం చూపుతోంది.

భారత్‌లోని ఉద్యోగుల్లో కలవరం..

ఏయే దేశాల్లో ఏ మేరకు కోతలు ఉంటాయనేది తెలియకపోవడంతో భారత్‌లోని మెటా ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లకు సంబంధించి మెటాకు భారత్‌లో 300–400 మంది ఉద్యోగులు ఉన్నారు. వీటిలో 60 మంది సిబ్బంది గల వాట్సాప్ బృందమే చిన్నది. మెటా ఇండియా హెడ్ అజిత్ మోహన్ ఇటీవలే రాజీనామా చేసి పోటీ సంస్థ స్నాప్‌లో చేరారు.

హెచ్1బీ వీసా హోల్డర్లకు సహకారం

ఉద్వాసనకు గురైన వారిలో హెచ్1బీ వీసా హోల్డర్లు ఉంటే ఇమ్మిగ్రేషన్ పరంగా వారికి అవసరమైన పూర్తి సహాయ, సహకారాలను కంపెనీ అందిస్తుందని జుకర్‌బర్గ్ తెలిపారు. తమ దేశంలో పని చేసేందుకు విదేశీయులకు అమెరికా ఈ వీసాలు జారీ చేస్తుంది. అకస్మాత్తుగా ఉద్యోగం పోతే, తమ వీసాను స్పాన్సర్ చేసే మరో కంపెనీలో ఉద్యోగాన్ని 60 రోజుల్లోగా చూసుకోవాల్సి ఉంటుంది. లేకపోతే వీసా గడువు ముగిసిపోతుంది. పలు అమెరికన్ కంపెనీల్లో భారత్, చైనా నుంచి చాలా మటుకు ఉద్యోగులు ఉన్నారు. ప్రధానంగా ఫేస్‌బుక్‌లో వీరి సంఖ్య 15% పైనే. ఉద్యోగాల్లో కోతల వల్ల ఇలాంటి హెచ్1బీ వీసాహోల్డర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారనుంది.

ఆరంభ లాభాలు ఆవిరి

- ప్రపంచ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు
- మెటల్, ఆటో, ఫార్మా షేర్లలో లాభాల స్వీకరణ
- 152 పాయింట్లు పతనమైన సెన్సెక్స్
- నిఫ్టీ నష్టం 46 పాయింట్లు

ముంబై: ఆరంభ లాభాలను కోల్పోయిన సూచీలు బుధవారం స్వల్ప నష్టంతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫారెక్స్ మార్కెట్లోని రూపాయి రికవరీ, విదేశీ కొనుగోళ్లు సూచీల నష్టాలను పరిమితం చేశాయని ట్రేడర్లు తెలిపారు. ఒకరోజు సెలవు తర్వాత సెన్సెక్స్ ఉదయం 119 పాయింట్ల లాభంతో 61,304 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. ఇంట్రాడేలో 542 పాయింట్ల పరిధిలో 61,401 – 60,714 మధ్య కదలాడింది. చివరికి 152 పాయింట్లు నష్టపోయి 61,034 వద్ద ముగిసింది. నిఫ్టీ 85 పాయింట్ల లాభంతో 18,212 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 18,117 వద్ద కనిష్టాన్ని, 18,296 వద్ద గరిష్టాన్ని తాకింది. మార్కెట్ ముగిసే సరికి నిఫ్టీ 46 పాయింట్ల నష్టంతో 18,157 వద్ద నిలిచింది. బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ షేర్లు మాత్రమే రాణించాయి. మెటల్, ఫార్మా, ఆటో షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు అర శాతం చొప్పున నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.387 కోట్ల షేర్లను కొన్నారు. దేశీయ ఇన్వెస్టర్లు రూ.1060 కోట్ల షేర్లను అమ్మేశారు. అగ్రరాజ్యం అమెరికా మధ్యంతర ఎన్నికలు, ద్రవ్యోల్బణ డేటా



విడుదల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

ప్రభుత్వరంగ బ్యాంకుల షేర్లు పరుగులు

ప్రభుత్వరంగ బ్యాంక్ షేర్లు పరుగులు పెట్టాయి. నిఫ్టీ పీఎస్‌యూ ఇండెక్స్ 4% దూసుకెళ్లింది. యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, పీఎన్‌బీ, సెంట్రల్ బ్యాంక్, బీఓబీ, మహారాష్ట్ర బ్యాంక్ షేర్లు 10–5%శాతం ర్యాలీ చేశాయి. యూకో బ్యాంక్, ఐఓబీ, ఎస్‌బీఐ, ఇండియన్ బ్యాంక్, కెనరా బ్యాంక్ షేర్లు 4% నుంచి అరశాతం లాభపడ్డాయి.

రూపాయికి మూడోరోజూ లాభాలే

రూపాయి విలువ మూడోరోజూ బలపడింది. డాలర్ మారకంలో 45 పైసలు పెరిగి 81.47 స్థిరపడింది. ట్రేడింగ్‌లో 81.23 వద్ద గరిష్టాన్ని, 81.62 వద్ద కనిష్టాన్ని నమోదు చేసింది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు దిగి వచ్చాయి.డాలర్ ఇండెక్స్ బలహీనత, దేశీ మార్కెట్లోకి విదేశీ పెట్టుబడుల జోరు రూపాయికి బలాన్నిచ్చాయని విశ్లేషకులు తెలిపారు. గడిచిన మూడు ట్రేడింగ్ సెషన్లో రూపాయి మొత్తం 140 పైసలు ర్యాలీ చేసింది.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలో జూనియర్ అసిస్టెంట్ పోస్టులు

కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విభాగం ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 06
» **పోస్టుల వివరాలు:** జూనియర్ అసిస్టెంట్–01, లాస్ట్ గ్రేడ్ సర్వీస్–05.
» **అర్హత:** ఏడో తరగతి, బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి. వయసు: 18 నుంచి 42ఏళ్ల మధ్య ఉండాలి.
» **జీతం:** నెలకు జేఏ పోస్టులకు రూ.18,500, ఎల్‌డీసీ పోస్టులకు రూ.15,000 చెల్లిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును కమిషనర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ, శాంతినగర్ కాకినాడ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 20.11.2022
» **వెబ్‌సైట్:** eastgodavari.ap.gov.in

చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్‌లో 40 స్టాఫ్ అసిస్టెంట్/క్లర్క్ పోస్టులు

చిత్తూరులోని చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్.. శాశ్వత ప్రాతిపదికన స్టాఫ్ అసిస్టెంట్/క్లర్క్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 40
» **అర్హత:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ఇంగ్లిష్, తెలుగు భాషలు, కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలి. వయసు: 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **జీతం:** నెలకు రూ.17,900 నుంచి రూ.47,920 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ టెస్ట్/ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.11.2022
» **ఆన్‌లైన్ పరీక్ష తేది:** డిసెంబర్ 2022
» **వెబ్‌సైట్:** www.apcob.org

చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్‌లో 15 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

చిత్తూరులోని చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్.. శాశ్వత ప్రాతిపదికన అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 15
» **అర్హత:** 60శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ లేదా 55శాతం మార్కులతో కామర్స్ గ్రాడ్యుయేట్ ఉత్తీర్ణులవ్వాలి. పీజీ(ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్), కంప్యూటర్ పరిజ్ఞానమున్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది.
» **వయసు:** 01.10.2022 నాటికి 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.26,080 నుంచి రూ.57,860 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ టెస్ట్/ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.11.2022
» **ఆన్‌లైన్ పరీక్ష నిర్వహణ తేది:** డిసెంబర్ 2022
» **వెబ్‌సైట్:** www.apcob.org

కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్‌లో 18 స్టాఫ్ అసిస్టెంట్/క్లర్క్ పోస్టులు

కర్నూలులోని కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్.. శాశ్వత ప్రాతిపదికన స్టాఫ్ అసిస్టెంట్/క్లర్క్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 18
» **అర్హత:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ఇంగ్లిష్, తెలుగు భాషలు, కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలి.
» **వయసు:** 01.10.2022 నాటికి 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.17,900 నుంచి రూ.47,920 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ టెస్ట్/ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.11.2022
» **ఆన్‌లైన్ పరీక్ష నిర్వహణ తేది:** డిసెంబర్ 2022
» **వెబ్‌సైట్:** www.apcob.org

ఏలూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్‌లో 95 స్టాఫ్ అసిస్టెంట్/క్లర్క్ పోస్టులు

ఏలూరులోని ఏలూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్.. శాశ్వత ప్రాతిపదికన స్టాఫ్ అసిస్టెంట్/క్లర్క్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 95
» **అర్హత:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ఇంగ్లిష్, తెలుగు భాషలు, కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలి.
» **వయసు:** 01.10.2022 నాటికి 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.17,900 నుంచి రూ.47,920 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ టెస్ట్/ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.11.2022
» **ఆన్‌లైన్ పరీక్ష నిర్వహణ తేది:** డిసెంబర్ 2022.
» **వెబ్‌సైట్:** www.apcob.org

అమెరికా కల.. సాకారమయ్యేలా..!

అమెరికాలో చదువు.. లక్షల మంది విద్యార్థుల స్వప్నం! ముఖ్యంగా ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ కోర్సుల విద్యార్థులు ఫైనల్ ఇయర్‌లో ఉండగానే.. యూఎస్‌లో ఉన్నత విద్యకు సన్నద్ధత ప్రారంభిస్తారు. ఇందుకు అవసరమైన స్టాండర్డ్ టెస్ట్‌లకు హాజరవుతుంటారు. అకడమిక్ అర్హతల తోపాటు పూర్తి అవగాహనతో ప్రయత్నిస్తే.. అమెరికా కల సాకారం చేసుకోవచ్చు. యూఎస్‌లో స్ప్రింగ్ ఇన్‌టేక్ (జనవరిలో ప్రారంభం)కు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ఉపయోగపడేలా.. కాలేజ్ ఎంపిక, అవసరమైన పత్రాలు, స్టాండర్డ్ టెస్టులు తదితర వివరాలు...

» లక్షల మంది విద్యార్థులకు గమ్యంగా యూఎస్ యూనివర్సిటీలు
» సరైన డాక్యుమెంట్లతో సిద్ధం కావాలంటున్న నిపుణులు

విదేశీ విద్యకు వెళ్లాలనుకునే మన దేశ విద్యార్థుల తొలి గమ్యం..అమెరికా. కోవిడ్ కారణంగా గత రెండేళ్లుగా యూఎస్‌కు వెళ్లే వారి సంఖ్య కొంత తగ్గింది. 2020–2021లో 1,67,582 మంది విద్యార్థులు అమెరికాలో అడుగు పెట్టగా..అంతకుముందు సంవత్సరంలో 2,32,851 మంది అక్కడకు వెళ్లారు. కోవిడ్ తగ్గుముఖం పట్టడంతో ఈ ఏడాది మళ్లీ పూర్వ స్థితికి చేరుకుంది. ఫాల్ సెషన్ ప్రవేశాల కోసం గతేడాదితో పోల్చితే రెట్టింపు సంఖ్యలో దరఖాస్తులు వచ్చినట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి.

యూనివర్సిటీ, కాలేజ్ అన్వేషణ

యూఎస్‌కు వెళ్లే మన విద్యార్థుల్లో అధికశాతం మంది ఎంఎస్‌లో చేరడానికి ఆసక్తి చూపుతారు. అలాంటి విద్యార్థులు తొలుత యూనివర్సిటీ ఎంపికపై కసరత్తు చేయాలి. యూఎస్ వర్సిటీల్లో ఫాల్ (సెప్టెంబర్–డిసెంబర్), స్ప్రింగ్(జనవరి–మే), సమ్మర్ (జూన్–ఆగస్ట్) సెషన్లలో ప్రవేశ ప్రక్రియ కొనసాగుతుంది. తాము చేరదలచుకున్న సెషన్‌కు కనీసం 15 నుంచి 18 నెలల ముందుగా కసరత్తు ప్రారంభించాలి. ముందుగా తమకు ఆసక్తి ఉన్న ప్రోగ్రామ్‌లను అందిస్తున్న యూనివర్సిటీల జాబితాను రూపొందించుకోవాలి. సదరు విశ్వవిద్యాలయం పేర్కొన్న అర్హత నిబంధనలు, స్టాండర్డ్ టెస్ట్ స్కోర్‌ల గురించి తెలుసుకోవాలి. ప్రతి యూనివర్సిటీకి సంబంధించి దరఖాస్తు గడువు తేదీలు కూడా వేర్వేరుగా ఉంటాయి. దీన్ని కూడా పరిగణనలోకి తీసుకుని దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించాలి.

రోలింగ్ అడ్మిషన్స్

అమెరికాలోని యూనివర్సిటీలు రోలింగ్ అడ్మిషన్ విధానాన్ని కూడా అమలు చేస్తున్నాయి. దీని ప్రకారం–దరఖాస్తుకు ఎలాంటి గడువు తేదీ ఉండదు. అభ్యర్థులు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు. నిర్దిష్ట సెషన్లలో సీట్లు భర్తీ కాని సందర్భాల్లో రోలింగ్ అడ్మిషన్ విధానంలో దరఖాస్తు చేసుకున్న వారికి అవకాశం కల్పిస్తారు. కాబట్టి విద్యార్థులు తాము చేరాలనుకుంటున్న యూనివర్సిటీలో రోలింగ్ అడ్మిషన్ సెషన్ ఉంటే దానికి కూడా దరఖాస్తు చేసుకోవడం మేలు.

అర్హత నిబంధనలు

అమెరికాలోని అధికశాతం యూనివర్సిటీలు ఎంఎస్ కోర్సులో ప్రవేశానికి తప్పనిసరిగా 16ఏళ్ల (10+2+4) చదివి ఉండాలనే నిబంధన విధిస్తున్నాయి. మరికొన్ని యూనివర్సిటీలు మాత్రం 10+2 తర్వాత మూడేళ్ల వ్యవధిలో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన వారికి కూడా అవకాశం కల్పిస్తున్నాయి. ప్రఖ్యాత యూనివర్సిటీలు (హార్వర్డ్, ఎంఐటీ, యూసీ, కార్నెగీ మిలన్ తదితర) మాత్రం 10+2+4 విధానంలో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన వారినే అర్హులుగా పేర్కొంటున్నాయి.

స్టాండర్డ్ టెస్ట్‌ల స్కోర్లు

- అమెరికాలోని యూనివర్సిటీలు విద్యార్థులకు స్టాండర్డ్ టెస్ట్ స్కోర్లు ఉండాలని పేర్కొంటున్నాయి. ముఖ్యంగా ఎంపిక చేసుకున్న డొమైన్ ఆధారంగా జీఆర్ఈ, జీమ్యాట్, టోఫెల్ స్కోర్లు పొందడం తప్పనిసరి. జీఆర్ఈలో సబ్జెక్ట్ టెస్ట్ స్కోర్లను కూడా అక్కడి ప్రముఖ యూనివర్సిటీలు తప్పనిసరి చేశాయి.
- జీఆర్ఈలో కనీసం 300కుపైగా పాయింట్లు సొంతం చేసుకోవడం వల్ల అవకాశాలు మెరుగవుతాయి.
- జీమ్యాట్‌లో 650కు పైగా స్కోర్ సొంతం చేసుకోవడం మేలు.
- టోఫెల్‌లో కనీసం 100 స్కోర్ సొంతం చేసుకుంటే.. టాప్ యూనివర్సిటీల్లో ప్రవేశం లభించే అవకాశం ఉంటుంది.

అకడమిక్, టెస్ట్ స్కోర్లు ఉన్నా

అకడమిక్‌గా అద్భుతమైన జీపీఏ, టెస్ట్ స్కోర్లు ఉన్నప్పటికీ..లెటర్ ఆఫ్ రికమండేషన్(ఎల్ఓఆర్), స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్(ఎస్ఓపీ) కీలకంగా మారుతున్నాయి. కొన్ని సందర్భాల్లో అకడమిక్, టెస్ట్ స్కోర్లను సైతం కాదని.. ఎల్ఓఆర్, ఎస్ఓపీ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నాయంటే.. వీటి ప్రాధాన్యం అర్థం చేసుకోవచ్చు.

లెటర్ ఆఫ్ రికమండేషన్

అభ్యర్థుల సామర్థ్యాన్ని గుర్తిస్తూ సంబంధిత రంగంలోని నిపుణులైన వ్యక్తులు ఇచ్చే సిఫార్సు లేఖలే.. ఎల్ఓఆర్(లెటర్ ఆఫ్ రికమండేషన్)! అభ్యర్థులు తాము చదువుకున్న యూనివర్సిటీ లేదా ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ప్రొఫెసర్లు, లేదా వర్కింగ్ ఎగ్జిక్యూటివ్స్ అయితే వారి ఉన్నతాధికారులతో ఎల్ఓఆర్‌ను పొందాల్సి ఉంటుంది. తమ గురించి బాగా తెలిసిన వ్యక్తులతో ఈ సిఫార్సు లేఖలు తీసుకోవడం మరింత ఉపయుక్తంగా ఉంటుంది. అమెరికాలోని వర్సిటీలు ప్రస్తుతం కనీసం రెండు ఎల్ఓఆర్‌లను అడుగుతున్నాయి.

స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్

అభ్యర్థులు సదరు యూనివర్సిటీలో ఎందుకు చేరాలనుకుంటున్నారు.. ఆ కోర్సునే ఎంపిక చేసుకోవడానికి కారణాలు.. భవిష్యత్తు లక్ష్యాలు ఏంటి?! అనే వివరాలు పేర్కొంటూ.. నిర్దేశిత పదాల్లో సొంతంగా రాయాల్సిన నివేదిక.. ఎస్ఓపీ(స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్). దీన్ని యూనివర్సిటీ అకడమిక్ నిపుణుల కమిటీ క్షుణ్నంగా పరిశీలిస్తుంది. ఎస్ఓపీలో విద్యార్థి పొందుపర్చిన సమాచారం, నిబద్ధతను పరిగణనలోకి తీసుకుని వర్సిటీలు ప్రవేశం ఖరారు చేస్తున్నాయి.



ఎస్సే

అమెరికాలోని యూనివర్సిటీలు అనుసరిస్తున్న మరో విధానం.. ఎస్సే(వ్యాస రచన) రాయమని అడగడం. దరఖాస్తు సమయంలోనే ఏదైనా ఒక అంశం పేర్కొని.. నిర్దిష్ట పదాల్లో వ్యాసం రాయమని సూచిస్తున్నాయి.

రెజ్యూమే కూడా

దరఖాస్తు ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే ఉంటుంది. అభ్యర్థుల అకడమిక్ అర్హతలు, టెస్ట్ స్కోర్లు పొందుపరిచే విధంగా దరఖాస్తు నమూనా ఉంటుంది. అయినప్పటికీ యూనివర్సిటీలు రెజ్యూమే లేదా సీవీని కూడా అప్‌లోడ్ చేయమని అడుగుతున్నాయి. అభ్యర్థుల అకడెమిక్ అర్హతలతోపాటు ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్‌లో పాల్గొన్న తీరు, ప్రాజెక్ట్ వర్క్స్ వివరాలు తెలుసుకునేందుకు రెజ్యూమెను అప్‌లోడ్ చేయమని సూచిస్తున్నాయి.

వీసాకు దరఖాస్తు

ప్రవేశం ఖరారైతే.. యూనివర్సిటీ ఇచ్చే కన్ఫర్మేషన్ లెటర్ ఆధారంగా ఇమిగ్రేషన్ విభాగంలో.. ఐ–20 ఫామ్‌ను పూర్తి చేసి వీసాకు దరఖాస్తు చేసుకోవాలి. వీటిని పరిశీలించిన ఇమిగ్రేషన్ విభాగం అధికారులు.. సంబంధిత తేదీల్లో ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలియజేస్తారు. ఇంటర్వ్యూ సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. కోర్సు పూర్తయ్యాక స్వదేశానికి తిరిగొచ్చేస్తామనే విధంగానే సమాధానాలు ఇవ్వాలి.

ఓపీటీతో.. ఉద్యోగం దిశగా

అమెరికాలోని యూనివర్సిటీలో చేరి పీజీ కోర్సు ముగిసిన తర్వాత ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రెయినింగ్(ఓపీటీ) పేరుతో అక్కడి సంస్థల్లో 12 నెలలపాటు పని చేసే అవకాశం ఉంది. స్టెమ్(సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్) కోర్సుల అభ్యర్థులు ఈ 12 నెలలకు అదనంగా మరో 24 నెలలు అంటే మొత్తం 36 నెలలు అక్కడి కంపెనీల్లో పని చేసే అవకాశం ఉంటుంది. ఇందుకోసం అభ్యర్థులు ఐ–765 పేరుతో తమను ఓపీటీకి ఎంపిక చేసిన సంస్థల నుంచి ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్‌తో యూఎస్ఐసీఐఎస్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ దరఖాస్తులను ప్రతి ఏటా అక్టోబర్ 1 నుంచి తదుపరి ఏడాది మే 1లోపు అందించాలి.

ఓపీటీ ప్రతిభతో.. హెచ్-1బి

- ఓపీటీ సమయంలో అభ్యర్థులు తమ పనితీరుతో సదరు సంస్థల యాజమాన్యాల నుంచి సానుకూల ఫలితం ఆశించొచ్చు. తద్వారా ఆ సంస్థల్లో శాశ్వత ఉద్యోగం కల్పించే విధంగా హెచ్–1బి పిటిషన్‌కు దరఖాస్తు చేసే మార్గాలు మెరుగుపరచుకోవచ్చు. వాస్తవానికి గత కొన్నేళ్లుగా యూఎస్‌లో దాఖలవుతున్న హెచ్–1బి పిటిషన్ల విషయంలో ఓపీటీ పూర్తి చేసుకున్న వారి సంఖ్యే ఎక్కువగా ఉంటోంది.
- హెచ్–1బీకి పిటిషన్ దాఖలైతే.. అలాంటి అభ్యర్థులు ఓపీటీ ముగిసిన సమయానికి, హెచ్–1బీ వీసా మంజూరుకు మధ్య ఉన్న వ్యవధిలో అమెరికాలోనే నివసించేందుకు అనుమతి లభిస్తుంది. ఈ విషయంలో క్యాప్ గ్యాప్ అనే విధానం అమలవుతోంది.

ఫీజు 30 వేల డాలర్ల నుంచి 50 వేల వరకు

అమెరికాలోని యూనివర్సిటీల్లో ఎంఎస్ ప్రోగ్రామ్ ఫీజులు ఏడాదికి ముప్పై వేల డాలర్ల నుంచి యాభై వేల డాలర్ల మధ్యలో ఉంటున్నాయి. ఇవి..ఆయా యూనివర్సిటీల స్థాయి, విద్యార్థులు ఎంపిక చేసుకున్న స్పెషలైజేషన్‌పై ఆధారపడి ఉంటాయి. హార్వర్డ్, ఎంఐటీ వంటి ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్‌లలో చదవాలంటే.. ఏడాదికి కనీసం యాభై వేల డాలర్ల ఫీజు చెల్లించాల్సిందే.

అవసరమైన డాక్యుమెంట్లు

- అకడమిక్ ట్రాన్స్‌క్రిప్ట్స్(విద్యార్హతల సర్టిఫికెట్లు); జీఆర్ఈ/జీమ్యాట్/టోఫెల్ /ఐఈఎల్‌టీఎస్ తదితర టెస్ట్ స్కోర్లు; లెటర్ ఆఫ్ రికమండేషన్; స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్; వర్క్ ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్; ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్స్(బ్యాంక్ స్టేట్‌మెంట్); రెజ్యూమే/సీవీ.

వీసా మంజూరుకు

- ఐ–20(అడ్మిషన్ కన్ఫర్మేషన్ లెటర్); యాక్సెప్టెన్స్ లెటర్; సెవిస్ రిసిప్ట్ (ఐ–901); వీటితో పాటు ఆర్థిక వనరుల రుజువులు; సిటిజన్ షిప్ పాస్‌పోర్ట్; అపాయింట్‌మెంట్ లెటర్; డిఎస్–160 కన్ఫర్మేషన్ లెటర్.

క్లుప్తంగా

'వైద్య విద్య' వెబ్ ఆప్షన్‌ల నమోదుకు నేడు ఆఖరు

సాక్షి, అమరావతి: వైద్య విద్య పీజీ కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం మాప్-అప్ రౌండ్ కౌన్సెలింగ్‌కు వెబ్‌ఆప్షన్‌ల నమోదు గడువు గురువారం రాత్రి 9 గంటలకు ముగియనుంది. ఈ కౌన్సెలింగ్‌కు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. బుధవారం రాత్రి 9 గంటల నుంచి ఆప్షన్‌ల నమోదు ప్రారంభించారు. https://pgcq.ntruhsadmissions.com వెబ్‌సైట్ ద్వారా అర్హులైన నాన్-సర్వీస్ అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు.

ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా తొలి దశ సీట్ల కేటాయింపు

సాక్షి, అమరావతి: వైద్య విద్య 2022–23 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ కోర్సుల్లో కన్వీనర్ కోటా సీట్లలో తొలి దశ కౌన్సెలింగ్‌లో భాగంగా విద్యార్థులకు కళాశాలలను కేటాయించారు. 3,289 మంది విద్యార్థులకు సీట్లు లభించాయి. వీరి జాబితాను బుధవారం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం విడుదల చేసింది. విద్యార్థులు శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల లోగా తమకు కేటాయించిన కళాశాలలో రిపోర్ట్ చేయాలని స్పష్టం చేశారు.

కర్ణాటకలో టెట్ హాల్ టికెట్‌పై సన్నీ లియోన్ ఫొటో



సన్నీ లియోన్ చిత్రంతో హాల్‌టికెట్

శివమొగ్గ: కర్ణాటకలో నిర్వహించిన ఉపాధ్యాయ అర్హతా పరీక్ష (టెట్) హాల్ టికెట్‌పై అభ్యర్థిని ఫోటోకి బదులు సినీ నటి సన్నీ లియోన్ చిత్రాన్ని ముద్రించడంతో అందరూ అవాక్కయ్యారు. ఈ ఘటనపై శివమొగ్గ నగర సైబర్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఆదివారం రాష్ట్రమంతటా టెట్ పరీక్ష జరిగింది. చిక్కమగళూరుకు చెందిన ఒక విద్యార్థినికి హాల్‌టికెట్ రాగా, అందులో ఆమె ఫోటోకు బదులు సన్నీ లియోన్ అర్ధ నగ్న చిత్రం ఉంది. దీంతో ఆమె గత్యంతరం లేక శివమొగ్గలోని హెచ్ఎస్ రుద్రప్ప కాలేజీ పరీక్షా కేంద్రానికి పరీక్ష రాసేందుకు వచ్చింది. సిబ్బంది తనిఖీల్లో సన్నీ లియోన్ ఫోటో బయటపడింది. తాను తన ఫోటోను పంపించానని, ఏం జరిగిందో తెలియదని విద్యార్థిని చెప్పింది. చివరకు విద్యార్థిని ఆధార్ తదితర గుర్తింపు కార్డులను పరిశీలించి పరీక్ష రాసేందుకు అనుమతించారు. ఈ ఘటన ఎలా జరిగిందో విచారించాలని పోలీసులకు విద్యా శాఖ అధికారులు ఫిర్యాదు చేశారు.

లోక్‌సభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ చైర్మన్‌గా బాలశౌరి



సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ చైర్మన్‌గా వైఎస్సార్‌సీపీ ఎంపీ బాలశౌరి నియమితులయ్యారు. పలు కమిటీలకు చైర్మన్లు, సభ్యులను లోక్‌సభ సభాపతి ఓం బిర్లా నామినేట్ చేయగా.. ఆ వివరాలపై లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఉత్పల్‌కుమార్ బుధవారం బులెటిన్ విడుదల చేశారు. సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీలో టీఆర్ఎస్ సభ్యుడు నామా నాగేశ్వరరావు, పేపర్స్ లెయిడ్ కమిటీలో వైఎస్సార్‌సీపీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, అబ్‌సెన్స్ ఆఫ్ మెంబర్స్ కమిటీలో టీఆర్ఎస్ సభ్యుడు బీబీ పాటిల్, ఎథిక్స్ కమిటీలో కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎంపీ బాలశౌరి, హౌస్ కమిటీలో వైఎస్సార్‌సీపీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణలను సభ్యులుగా నియమించారు.

11 నుంచి రెవెన్యూ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి క్రీడలు


వివరాలు వెల్లడిస్తున్న బొప్పరాజు

ఏఎన్‌యూ: ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రెవెన్యూ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు ఈనెల 11వ తేదీ నుంచి ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ప్రారంభంకానున్నాయని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు బుధవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. మూడు రోజులు జరిగే ఈ పోటీల్లో వీఆర్ఏ నుంచి డిప్యూటీ కలెక్టర్ స్థాయి వరకు రాష్ట్రంలోని 1200 మంది ఉద్యోగులు పాల్గొంటారని చెప్పారు. పోటీల నిర్వహణకు ఆర్థిక సహకారం, ఉద్యోగులకు ప్రత్యేక సెలవులు వంటి అన్ని విధాలా సహకారాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ సమావేశంలో వీఆర్‌వోల సంఘ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోనా ఆంజనేయులు, సాంబశివరావు, ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర కార్యదర్శి ఎం.మాధురి, డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వీఆర్‌వో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో అంతర్జాతీయ విద్య

- 400 ఇంజనీరింగ్, డిగ్రీ కాలేజీలు ఏపీఐటీఏతో అనుసంధానం
- రెండు సాంకేతిక వర్సిటీల్లో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి పరిశోధన కార్యకలాపాలు
- జర్మనీ డీఎస్ఈ కన్సార్టియంతో ఉన్నత విద్యామండలి ఒప్పందం
- స్టెయిన్‌బీస్ వర్సిటీలో ఉద్యోగ ఆధారిత మాస్టర్స్‌లో విద్యార్థులకు అవకాశం
- జర్మనీలో పర్యటించిన ఉన్నత విద్యా మండలి ప్రతినిధి బృందం



సాక్షి, అమరావతి: రాష్ట్ర విద్యార్థులకు అంతర్జాతీయ విద్యావకాశాలు మరింత చేరవవుతున్నాయి. సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో ఉన్నత విద్యాశాఖ, ఉన్నత విద్యామండలి చేపట్టిన పలు కార్యక్రమాలు సాకారమవుతున్నాయి. ఇండో-యూరోపియన్ సింక్రనైజేషన్‌లో భాగంగా జర్మనీకి చెందిన పలు వర్సిటీలతో ఉన్నత విద్యామండలి వర్చువల్ సమావేశాలను నిర్వహించిన సంగతి తెలిసిందే. జర్మనీ వర్సిటీల్లో అందించే పలు అత్యున్నత కోర్సులకు రాష్ట్ర విద్యార్థులను ఎంపిక చేయడం, పరస్పర మార్పిడి లాంటి కార్యక్రమాలపై ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే 400 ఇంజనీరింగ్, డిగ్రీ కాలేజీల విద్యార్థులను ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీతో (ఏపీ ఐటీఏ) అనుసంధానించారు. నైపుణ్యాభివృద్ధి కోసం ఇంటర్న్‌షిప్ తప్పనిసరి చేశారు. ప్రతి నియోజకవర్గానికి ఒక నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించారు. జర్మనీ వర్సిటీల్లోని ఉన్నత విద్యావకాశాలను అందిపుచ్చుకొనేలా ఇండో-యూరోపియన్ సదస్సులను రాష్ట్రం వినియోగించుకుంది.

కీలక మార్పులకు శ్రీకారం

ఎఫ్‌హెచ్ ఆచెన్ యూనివర్సిటీలోని యూరోపియన్ సెంటర్ ఫర్ మెకానిక్స్ రీసెర్చ్ డైరెక్టర్ ప్రొఫెసర్ డా.ఇంగ్ గుంతేర్ స్టార్క్, యూనివర్సిటీ ఆఫ్ కెంప్టెన్ వైస్ ప్రెసిడెంట్ డా.ఇంగ్ డిర్క్ జాకోబ్ (రోబోటిక్స్ ఫ్యాకల్టీ), స్టెయిన్‌బీస్ యూనివర్సిటీ మేనేజింగ్ డైరెక్టర్ డా.బెర్ట్రమ్ లోహమ్ముల్లర్ తదితరులతో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి, ఇతర ప్రతినిధులు గతంలోనే చర్చలు జరిపారు. జేఎన్‌టీయూ(కే), అనంతపురం వీసీలు ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు, ప్రొఫెసర్ రంగ జనార్దన, ఏపీఐటీఏ సీఈవో టి.అనిల్‌కుమార్, ఏపీ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఏజెన్సీ సీఈవో నందకిశోర్‌రెడ్డి తదితరులు సదస్సుల్లో పాల్గొని ఉన్నత విద్యా కార్యక్రమాల్లో పలు మార్పులకు శ్రీకారం చుట్టారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, బ్లాక్ చైన్, రోబోటిక్స్, ఆటోమేషన్ తదితర విభాగాల్లో రాష్ట్ర విద్యార్థులను తీర్చిదిద్దేలా కార్యక్రమాలు అమల్లోకి తెచ్చారు. ప్రాక్టికల్ లెర్నింగ్ పెంచేందుకు ఆన్‌లైన్‌లో ల్యాబ్‌లు, లెక్చరర్లతో బోధన తదితర కార్యక్రమాలతో ముందుకు వెళ్లాలన్న వర్చువల్ సమావేశాల సూచనలను అమలులోకి తెచ్చారు. డిగ్రీ సిలబస్‌ను పూర్తిగా సంస్కరించడం కూడా విద్యార్థులకు కలసి వస్తోంది. మారుతున్న అవసరాలకు అనుగుణంగా మానవ వనరులను సమకూర్చేలా దాదాపు 27 వేల పరిశ్రమలు, ఇతర సంస్థలతో కాలేజీలను అనుసంధానించి ఇంటర్న్‌షిప్ చేపట్టారు. అంతర్జాతీయంగా పలు బహుళ సంస్థలు తమ ఉద్యోగులకు మైక్రో క్రెడెన్షియల్ స్కిల్ ప్రోగ్రామ్‌లను అమలులోకి తేగా వాటిని రాష్ట్ర విద్యార్థులకు ముందుగానే అందించేలా భారత్ స్కిల్స్, ఈ-స్కిల్ ఇండియా, నాస్కామ్ ఫ్యూచర్ స్కిల్స్, ఎన్‌పీటీఐ, స్వయం, స్వయంప్రభ లాంటి వర్చువల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా విద్యార్థులను ప్రభుత్వం తీర్చిదిద్దుతోంది. ఈ కార్యక్రమాల ఫలితంగా జర్మనీ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత కోర్సులను అభ్యసించేందుకు రాష్ట్ర విద్యార్థులకు మార్గం సుగమమైంది.

జర్మనీ పర్యటనలో 'ఉన్నత' బృందం

ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి ఆధ్వర్యంలో 18 మంది సభ్యులతో కూడిన బృందం ఇటీవల జర్మనీలో పర్యటించింది. ఉద్యోగ ఆధారిత మాస్టర్స్ ప్రోగ్రామ్స్‌లో ఏపీ విద్యార్థులను చేర్చుకోవడంపై బెర్లిన్‌లోని స్టెయిన్‌బీస్ వర్సిటీ అధికారులతో బృందం చర్చించింది. గ్రీన్ టెక్నాలజీ కార్యకలాపాలపై సహకరించుకోవడం, హైడ్రోజన్ ఎనర్జీలో పరిశోధనలను ప్రోత్సహించాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని రెండు సాంకేతిక విశ్వవిద్యాలయాల్లో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు డీఎస్ఈ కన్సార్టియంతో ఒప్పందం కుదుర్చుకున్నారు. బాడెన్ వుర్టెంబెర్గ్ ఇంటర్నేషనల్ టాలెంట్ సంస్థ ద్వారా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఇంక్యుబేషన్, స్టార్టప్ సెంటర్ల ఏర్పాటుకు నిర్ణయించారు.

కొనసాగుతున్న ఎంఎల్‌హెచ్‌పీ పోస్టుల భర్తీ ప్రక్రియ

- 1,681 పోస్టుల భర్తీ చేపట్టిన ప్రభుత్వం
- నాలుగు జోన్‌ల్లో ఇప్పటివరకు 1,013 మంది ఎంపిక

సాక్షి, అమరావతి: రాష్ట్ర వైద్య శాఖలో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ) పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌లో సేవలు అందించడానికి 1,681 ఎంఎల్‌హెచ్‌పీ పోస్టుల భర్తీ ప్రక్రియను ప్రభుత్వం చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ పోస్టుల భర్తీ కోసం గత నెలలో ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. సుమారు 12 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 10,790 మంది పరీక్ష రాశారు. ఎంపిక పరీక్షలో వచ్చిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు అనుగుణంగా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ చేపడుతున్నారు. ఇప్పటివరకు నాలుగు జోన్‌లలో 1,013 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. పోస్టులకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. కాగా ఎంపికైన కొందరు అభ్యర్థులు బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసినప్పటికీ సర్టిఫికెట్ ఇన్ కమ్యూనిటీ హెల్త్ (సీపీసీహెచ్) చేయలేదు. ఈ నేపథ్యంలో ఇలాంటి వారికి ఉమ్మడి జిల్లాల్లోని ఇగ్నో శిక్షణ కేంద్రాల్లో మూడు నెలల పాటు సీపీసీహెచ్ శిక్షణ ఇప్పించాలని అధికారులు నిర్ణయించారు. గ్రామ స్థాయిలోనే ప్రజలకు వైద్య సేవలను చేరువ చేయడం కోసం 10,032 విలేజ్ క్లినిక్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. వీటిలో బీఎస్సీ నర్సింగ్ విద్యార్హత కలిగిన వారిని ఎంఎల్‌హెచ్‌పీలుగా నియమిస్తున్నారు. కాగా వీరికి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ (సీహెచ్‌వో)గా ప్రభుత్వం హోదా కల్పించింది.

ఆటలాడి సేదతీరిన న్యాయమూర్తులు

ఎస్‌పీఎఫ్ క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించిన ప్రధాన న్యాయమూర్తి


బ్యాటింగ్ చేస్తున్న సీజే జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా . కీపింగ్ చేస్తున్న న్యాయమూర్తులు జస్టిస్ ప్రవీణ్ కుమార్ జస్టిస్ సోమయాజులు

సాక్షి, అమరావతి: ఎప్పుడూ కేసులతో తనమునకలై క్షణం తీరికలేకుండా గడిపే హైకోర్టు న్యాయమూర్తులు బుధవారం సాయంత్రం కొంత సమయం సేదదీరారు. న్యాయమూర్తులందరూ ఒకచోట కలిసి కాసేపు సరదాగా ఆటలు ఆడారు. ఇందుకు హైకోర్టు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) అభివృద్ధి చేసిన క్రీడాప్రాంగణం వేదిక అయింది. హైకోర్టు, సీఆర్‌డీఏ, కొందరు సీనియర్ న్యాయవాదుల సాయంతో ఆ క్రీడాప్రాంగణాన్ని అభివృద్ధి చేశారు. న్యాయమూర్తులందరూ కాలినడకన ఈ ప్రాంగణానికి చేరుకున్నారు. ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ఈ ప్రాంగణాన్ని బుధవారం రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం సీజే, కొందరు న్యాయమూర్తులు క్రికెట్ ఆడారు. ప్రధాన న్యాయమూర్తి బ్యాటింగ్ చేయగా ఆయనకు అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ బౌలింగ్ చేశారు. జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్, జస్టిస్ డి.వి.ఎస్.ఎస్.సోమయాజులు కీపర్లుగా వ్యవహరించారు. అనంతరం కొందరు న్యాయమూర్తులు బ్యాటింగ్ చేస్తే, మరికొందరు బౌలింగ్ చేసి ఉల్లాసంగా గడిపారు. సీజే కొద్దిసేపు షటిల్ ఆడారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.జానకిరామిరెడ్డి, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ ఎన్.హరినాథ్, న్యాయవాదులు, రిజిస్ట్రార్లతో పాటు ఎస్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ శ్రీనివాసులు, క్రీడాప్రాంగణం అభివృద్ధికి చొరవ తీసుకున్న ఇన్‌స్పెక్టర్లు బాలరాజు, విజయ్‌కుమార్, ఎస్ఐ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్న, ఆయన కుమారులపై దర్యాప్తు కొనసాగించుకోండి

- సీఐడీకి తేల్చి చెప్పిన హైకోర్టు
- ఎన్‌వోసీ వాల్యుబుల్ సెక్యూరిటీ పరిధిలోకి రాదన్న న్యాయమూర్తి

సాక్షి, అమరావతి: నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) ఫోర్జరీ వ్యవహారంలో తమపై సీఐడీ అధికారులు నమోదు చేసిన కేసులో తదుపరి చర్యలన్నీ నిలిపేయాలన్న మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఆయన కుమారులు రాజేష్, విజయ్ చేసిన అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. దర్యాప్తును యథాతథంగా కొనసాగించుకోవచ్చునని సీఐడీకి స్పష్టం చేసింది. ఇంటి నిర్మాణం కోసం అయ్యన్న తదితరులు పొందిన ఎన్‌వోసీ సీఆర్‌పీసీ సెక్షన్ 467 ప్రకారం వాల్యుబుల్ సెక్యూరిటీ నిర్వచన పరిధిలోకి రాదని హైకోర్టు తేల్చి చెప్పింది. ఇది ప్రాథమిక అభిప్రాయం మాత్రమేనంది. అందువల్ల ఈ సెక్షన్ మినహా మిగిలిన సెక్షన్ల కింద దర్యాప్తు కొనసాగించుకోవచ్చని పేర్కొంది. అయితే అయ్యన్న తదితరులకు సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద నోటీసులు ఇవ్వాలని సీఐడీని ఆదేశించింది. అయ్యన్న తదితరులు పొందిన ఎన్‌వోసీ వాల్యుబుల్ సెక్యూరిటీ పరిధిలోకి వస్తుందని సీఐడీ నిరూపించదలచుకుంటే, వారు ఎప్పుడైనా హైకోర్టును ఆశ్రయించవచ్చని తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్ రావు బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. ఎన్‌వోసీ ఫోర్జరీ వ్యవహారంలో తమపై సీఐడీ అధికారులు నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ అయ్యన్నపాత్రుడు, ఆయన కుమారులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అలాగే ఈ కేసులో తదుపరి చర్యలన్నీ నిలిపేయడంతోపాటు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలంటూ రెండు అనుబంధ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ రెండు పిటిషన్లపై గత వారం వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ రఘునందన్‌రావు బుధవారం తన నిర్ణయాన్ని వెలువరించారు. ఎన్‌వోసీ ద్వారా ఆ భూమిపై పిటిషనర్లకు ఎలాంటి చట్టబద్ధమైన హక్కు సంక్రమించదని న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారు. ఎన్‌వోసీ ఆధారంగా పిటిషనర్లు ఇంటిని నిర్మించలేదని, అందువల్ల ఎన్‌వోసీ వాల్యుబుల్ సెక్యూరిటీ పరిధిలోకి రాదని చెప్పారు.

లేపాక్షికి ప్రపంచ వారసత్వ సంపద హోదా తెస్తాం

కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, సాంస్కృతిక శాఖ సహాయమంత్రి అర్జున్ రాం మేఘవాల్


బాపూ మ్యూజియంను సందర్శించిన కేంద్ర మంత్రి అర్జున్ రాం మేఘవాల్

సాక్షి, అమరావతి/గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): 'లేపాక్షి'కి ప్రపంచ వారసత్వసంపద హోదా తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, సాంస్కృతిక శాఖ సహాయ మంత్రి అర్జున్ రాం మేఘవాల్ చెప్పారు. ఆయన బుధవారం విజయవాడలోని బాపూ మ్యూజియాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా అధునాతన టెక్నాలజీతో బాపూ మ్యూజియాన్ని తీర్చిదిద్దారని ప్రశంసించారు. మన సంస్కృతి, చారిత్రక సంపదను పరిరక్షించడంతో పాటు భావితరాలకు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర పురావస్తుశాఖలు సంయుక్తంగా పనిచేయాలని సూచించారు. విశాఖలోని తొట్లకొండలో బౌద్ధస్థూపం అభివృద్ధిలో భాగంగా విపాసన కేంద్రం నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్ర పురావస్తు, ప్రదర్శన శాలల శాఖ కమిషనర్ జి.వాణీమోహన్ బాపూ మ్యూజియంతోపాటు పింగళి వెంకయ్య గ్యాలరీ, 1921 నాటి జాతీయ పతాకం రూపకల్పన విశేషాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పురావస్తుశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరి-కావేరి అనుసంధానంపై కసరత్తు

సాక్షి, న్యూఢిల్లీ: గోదావరి-కావేరి నదుల అనుసంధానం విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పీడ్ పెంచుతోంది. తుపాకులగూడెం ఆనకట్ట నుంచి అనుసంధాన ప్రక్రియ చేపట్టేలా కొత్తగా తెరపైకి తెచ్చిన ప్రతిపాదన ఆధారంగా ముందుకెళ్లే కసరత్తులు చేస్తోంది. దీనిలో భాగంగా ఇప్పటికే గత నెల 18న దక్షిణాది రాష్ట్రాలతో భేటీ నిర్వహించిన జాతీయ జల వనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) గవర్నింగ్ బాడీ మరోమారు ఈ నెల 15న భేటీ నిర్వహించనుంది. కేంద్ర జల శక్తి శాఖ కార్యదర్శి చైర్మన్‌గా ఉండే ఈ గవర్నింగ్ బాడీలో ఆర్థిక శాఖ, విద్యుత్, వ్యవసాయ, పర్యావరణ, అటవీ శాఖల కార్యదర్శులతో పాటు నీతిఆయోగ్, సీడబ్ల్యూసీ అధికారులతో పాటు రాష్ట్రాల అధికారులు ఉంటారు. 15న జరిగే సమావేశంలో తుపాకులగూడెం నుంచి 141 టీఎంసీల గోదావరి జలాలను తరలించే ప్రతిపాదనపై చర్చించనున్నారు. దీనిపై ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు వెలిబుచ్చిన అభిప్రాయాలు, అభ్యంతరాలు, తర్వాతి కార్యాచరణ అంశాలపై మాట్లాడనున్నారు. ఈ భేటీలో వచ్చిన అభిప్రాయాలపై వచ్చే నెల మరోమారు హైదరాబాద్‌లో ఈ అంశంపై సమావేశం నిర్వహించే అవకాశాలున్నాయి. ఈ అనుసంధానంతో నిర్ణీతంగా తరలించే నీటిలో తెలంగాణకు 42.6టీఎంసీ, ఏపీకి 41.8 టీఎంసీ, తమిళనాడుకు 38.6, కర్ణాటకు 9.8, పుదుచ్చేరికి 2.2 టీఎంసీల నీటి వాటాలను ఎన్‌డబ్ల్యూడీఏ ఇది వరకే నిర్ణయించిన సంగతి తెలిసిందే.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు బోగీ

విజయవాడ–విశాఖపట్నం మార్గంలో 7 గంటల పాటు రాకపోకలకు అంతరాయం


బోల్తా పడ్డ రైల్వే బోగీని తరలిస్తున్న రైల్వే అధికారులు,సిబ్బంది

రాజమహేంద్రవరం సిటీ/రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో బుధవారం గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. దీంతో విజయవాడ-విశాఖ ప్రధాన రైల్వే రహదారిలో ఏడు గంటలపాటు రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వలిజాబాద్ నుంచి కిదర్ పోర్ట్ డాక్ యార్డ్‌కు మోటారుకార్లను రవాణా చేస్తోన్న గూడ్స్ రైలు బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ పరిధిలో ఐఎల్టీడీ గేట్ వద్ద ఒక బోగీ పట్టాలు తప్పింది. ఆ సమయంలో ప్రయాణికుల రైళ్లు రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వెంటనే రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు. విజయవాడ నుంచి ఎమర్జెన్సీ వెహికల్‌తో సిబ్బందిని, 2 భారీ క్రేన్‌లను రప్పించారు. ట్రాక్‌పై బోగీ బోల్తా పడటంతో ప్రధాన మార్గంలో నడిచే రైళ్లను ఎక్కడికక్కడే నిలిపివేశారు. బోగీ బోల్తా పడిన తరువాత వచ్చే రైళ్లనీ రాజమహేంద్రవరం అటు వైపు ఇటు వైపు రైల్వే స్టేషన్‌లలో సిగ్నల్ కోసం నిలిపివేశారు. ఉదయం రాకపోకలు సాగించే రత్నాచల్, జన్మభూమి, సింహాద్రి రైళ్లను రద్దు చేశారు. రైళ్ల రద్దు ఆలస్యం కావడంతో రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు సహాయం అందించేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి రద్దైన రైళ్లలో ప్రయాణికులకు టికెట్ ధర మొత్తం చెల్లించే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు. ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. 7 గంటల పాటు కష్టపడిన రైల్వే అధికారులు ఉదయం 10 గంటలకు అక్కడ నుంచి మెమో యార్డ్‌కు తరలించారు. బోగీ తరలింపు పూర్తి కావడంతో రైళ్ల రాకపోకలను రైల్వే అధికారులు పునరుద్ధరించారు. ఈ ఘటన వల్ల సుమారు కోటి రూపాయలు నష్టం వాటిల్లవచ్చునని అధికారుల ప్రాథమిక అంచనా.

రాజధానిలో ఇతర ప్రాంతాల వారికి

స్థలాలివ్వడానికి వీల్లేదు

- ఇతరులకు ఇళ్ల స్థలాలిచ్చి ఆ ప్రాంతాన్ని మురికివాడలా మార్చాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం
- ఇళ్ల స్థలాలు ఇస్తే మా ప్రాంతం వారికే ఇవ్వాలి
- హైకోర్టుకు నివేదించిన రాజధాని రైతులు
- సవరణ చట్టంపై తదుపరి విచారణ నేటికి వాయిదా



సాక్షి, అమరావతి: రాజధాని ప్రాంతంలో ఇతర ప్రాంతాల వారికి ఇళ్లస్థలాలు ఇవ్వడానికి వీల్లేదని రాజధాని రైతులు బుధవారం హైకోర్టుకు నివేదించారు. రాజధాని ప్రాంతంలో ఇతరులకు ఇళ్లస్థలాలు ఇచ్చి ఆ ప్రాంతాన్ని మురికివాడగా చేసి, తద్వారా రాజధానిని అడ్డుకోవాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని రైతుల తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు చెప్పారు. ఇళ్లస్థలాలు ఇస్తే తమ ప్రాంత ప్రజలకే ఇవ్వాలన్నారు. ల్యాండ్‌పూలింగ్ కింద రైతులిచ్చిన భూముల్లో ఇతరులకు ఇళ్లస్థలాలు ఇచ్చే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని తెలిపారు. చట్ట నిబంధనల ప్రకారం రాజధాని అభివృద్ధి కోసం ఇచ్చిన భూములను ప్లాట్లుగా అభివృద్ధి చేసి, అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి, ఆ ప్లాట్లను తిరిగి రైతులకు అప్పగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రైతుల భూములను రాజధాని అభివృద్ధి కోసమే ఉపయోగించాలి తప్ప ఇతర అవసరాలకు వినియోగించరాదని చెప్పారు. రాజధాని ప్రాంతంలో ఇతరులకు ఇళ్లస్థలాలు ఇవ్వడమంటే మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా వ్యవహరించడమేనని, ఇలా చేసే అధికారం సీఆర్‌డీఏకు, ప్రభుత్వానికి లేదని పేర్కొన్నారు. రాజధాని ప్రాంతంలో ఇతర ప్రాంతాల వారికి కూడా ఇళ్లస్థలాలు ఇచ్చేందుకు వీలుగా ప్రభుత్వం తీసుకొచ్చిన సవరణ చట్టం విషయంలో జోక్యం చేసుకోవాలని కోర్టును కోరారు. ఇతర ప్రాంతాల వారికి ఇళ్లస్థలాలు కేటాయించకుండా ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేయాలని కోరారు. రైతుల తరఫున ఆదినారాయణరావు వాదనలను పూర్తిచేయడంతో ప్రభుత్వ వాదనల నిమిత్తం విచారణ గురువారానికి వాయిదా పడింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. రాజధాని ప్రాంతంలో ఇతర ప్రాంతాల వారికి కూడా ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు వీలుగా ప్రభుత్వం సీఆర్‌డీఏ చట్టాన్ని సవరించడాన్ని సవాలు చేస్తూ రాజధాని రైతుపరిరక్షణ సమితి, అమరావతి రాజధాని సమీకరణ రైతు సమాఖ్య, మరికొందరు వేర్వేరుగా హైకోర్టులో దాఖలు చేసిన వ్యాజ్యాలపై బుధవారం జస్టిస్ దుర్గాప్రసాద్ ధర్మాసనం విచారించింది.


ఆ వ్యాజ్యాలన్నీ నిరర్థకం..

రాజధాని ప్రాంతంలో పేదలందరికీ ఇళ్లు పథకం కింద ఇళ్లస్థలాల కేటాయింపునకు రాష్ట్ర ప్రభుత్వం 2020లో జారీచేసిన జీవో 107ను సవాలు చేస్తూ అమరావతి రైతులు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ ఈ నెల 30కి వాయిదా పడింది. రాజధాని ప్రాంతంలో ఇతర ప్రాంతాల వారికి కూడా ఇళ్లస్థలాలు కేటాయించేందుకు వీలుగా ప్రభుత్వం సవరణ చట్టం తీసుకొచ్చిన నేపథ్యంలో జీవో 107ను సవాలు చేస్తూ రైతులు దాఖలు చేసిన వ్యాజ్యాలు నిరర్థకం అవుతాయంటూ ప్రభుత్వం ఓ మెమో దాఖలు చేసింది. ఈ విషయాన్ని ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి బుధవారం ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. రైతుల తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు ఈ మెమోను వ్యతిరేకించారు. తమ వ్యాజ్యాలు నిరర్థకం కావని, అవి మనుగడలోనే ఉంటాయని తెలిపారు. ఇరు వైపుల వాదనలు విన్న హైకోర్టు, ఆ వ్యాజ్యాలు ఏ విధంగా మనుగడలో ఉంటాయో తెలియజేస్తూ కౌంటర్ దాఖలు చేయాలని ఆదినారాయణరావుకు స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తులు జస్టిస్ డి.వి.ఎస్.ఎస్.సోమయాజులు, జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది.

లోకేశ్‌ది మిడిమిడి జ్ఞానం

ఎప్పటినుంచో శాప్‌లో స్టేడియాల లీజు ప్రక్రియ ఉంది

- టీడీపీ హయాంలో కాంట్రాక్టర్ల కోసం శ్మశానాల్లో క్రీడా వికాస కేంద్రాలు కట్టారు
- శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి



సాక్షి, అమరావతి: లోకేశ్ మిడిమిడి జ్ఞానంతో విమర్శలు చేస్తున్నారని, రాష్ట్రంలో క్రీడా వికాస కేంద్రాలను (కేవీకేలను) అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేక పోతున్నారని ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మండిపడ్డారు. బుధవారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో కాంట్రాక్టర్లు, కార్యకర్తలకు లబ్ధి చేకూర్చేందుకే కేవీకేలను గుట్టలు, శ్మశానాల్లో నిర్మించారని చెప్పారు. దొంగ అంచనాలతో రూ.కోటి ఖర్చయ్యే భవనాన్ని రూ.2 కోట్లతో, అదీ నాసిరకంగా నిర్మించి ప్రజా ధనాన్ని దోచేశారని తెలిపారు. చాలా చోట్ల కేవీకేలు ఊరికి దూరంగా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయన్నారు. ఓ అండ్ ఎం కింద ప్రైవేటు వ్యక్తులతో వాటిని వాడుకలోకి తెచ్చేందుకు న్యాయబద్ధంగా టెండర్లు పిలిచామన్నారు. పే అండ్ ప్లే విధానం గత ప్రభుత్వాల నుంచి ఉన్నదేనని చెప్పారు. గతంలోనూ కొన్ని స్టేడియాల్లో క్రీడాకారుల నుంచి ఫీజు వసూలు చేసేవారని, ఆ డబ్బులకు లెక్కలు ఉండేవి కావన్నారు. దానిని స్ట్రీమ్‌లైన్ చేసి సెంట్రలైజ్డ్ అకౌంట్ ద్వారా పారదర్శకంగా ప్రతి రూపాయినీ క్రీడల కోసం ఖర్చు చేస్తున్నామన్నారు. లీజుకు ఇచ్చే కేవీకేల్లో 10% పేద క్రీడాకారులు ఉచితంగా శిక్షణ పొందవచ్చని తెలిపారు. ఎక్కువ మంది సాధన చేసే కేవీకేలు, కోర్టులను ఓ అండ్ ఎం నుంచి మినహాయిస్తున్నామన్నారు. టీడీపీ హయాంలో క్రీడాకారులకు శిక్షణ పేరుతో టెన్విక్ కంపెనీకి రూ.50 కోట్లు దోచిపెట్టారన్నారు. క్రీడా సంఘాల్లో టీడీపీ నాయకులు జోక్యం చేసుకొని క్రీడలను నాశనం చేశారని, ఐదేళ్లలో ఒక్క స్టేడియాన్ని కూడా నిర్మించలేదని చెప్పారు. క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహకాలను కూడా గత ప్రభుత్వం ఎగ్గొట్టిందని, తమ ప్రభుత్వం వాటిని చెల్లించి.. పతకాలకు ఇచ్చే మొత్తాలను కూడా పెంచిందన్నారు.

చరిత్రలో ఎన్నడూ లేదు..

ఏపీ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా 2,500 మందికి సచివాలయాల్లో స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాలు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌దని చెప్పారు. 6 వేల జగనన్న స్పోర్ట్స్ క్లబ్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. శాప్ స్వయం ప్రతిపత్తి సంస్థ అని, ప్రభుత్వ సాయంతో పాటు సొంతంగా ఆదాయాన్ని సమకూర్చుకుంటుందన్నారు. కోచింగ్‌కు అవకాశం లేని చోట మాత్రమే ఓ అండ్ ఎంకు ఇస్తున్నామని, తద్వారా యువతకు కోచ్‌లుగా ఉపాధి దక్కుతుందని శాప్ ఎండీ ప్రభాకరరెడ్డి తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.